ఈనాడు

విజయవాడ 11-11-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 91
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

దిల్లీలో భారీ పేలుడు

ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారులో విస్ఫోటం

9 మంది మృతి.. 20 మందికి గాయాలు

- పలు వాహనాలు దగ్ధం
- ఉలిక్కిపడ్డ దేశ రాజధాని
- రంగంలోకి ఎన్ఐఏ, ఫోరెన్సిక్ దళాలు
- పరిస్థితిపై మోదీ, అమిత్ షా సమీక్ష

అనేక నగరాల్లో రెడ్ అలర్ట్



పేలుడు అనంతరం ఘటనా స్థలంలో చెలరేగిన మంటలు.. సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు



పేలుడు ధాటికి దూరంగా ఎగిరిపడ్డ ఓ కారు భాగం

పేలుడులో గాయపడినవారు చికిత్స పొందుతున్న ఆసుపత్రి వెలుపల మీడియాతో మాట్లాడుతూ రోదిస్తున్న వ్యక్తి

దిల్లీ

చాలా ఏళ్లుగా పేలుడు ఘటనలు లేకుండా ప్రశాంతంగా ఉన్న దేశంలో ఒక్కసారిగా కలకలం. దేశ రాజధాని నడిబొడ్డున.. నిత్యం రద్దీగా ఉండే చారిత్రక ఎర్రకోటకు అతి సమీపంలో సోమవారం సాయంత్రం ఓ కారులో భారీ పేలుడు సంభవించింది. దాని ధాటికి అనేక వాహనాలు బుగ్గిఅయ్యాయి. 9 నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. మరో 20 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఈ ఘటనతో దేశమంతటా రెడ్ అలర్ట్ ప్రకటించారు. పలు నగరాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. పేలుడుపై ప్రధాని నరేంద్రమోదీ ఉన్నతస్థాయిలో సమీక్షించారు. కారు యజమానిని కొన్ని గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. లాల్‌ఖిలా మెట్రోస్టేషన్‌కు చేరువగా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారు నుంచి పేలుడు సంభవించినట్లు గుర్తించారు. క్షతగాత్రులకు ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పేలుడులో ఉగ్రవాదుల పాత్ర, కుట్రకోణం వంటివి ఉన్నాయేమో తెలుసుకునేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఫోరెన్సిక్ విభాగాలు, క్లూస్ బృందాలు రంగంలో దిగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, పరిస్థితిని సమీక్షించారు. దేశంలో భారీ ఉగ్రకుట్రను భద్రతాబలగాలు భగ్నం చేసి, పెద్దఎత్తున (మిగతా 3లో)



పేలుడు చోటుచేసుకున్న ప్రాంతాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఘటనా స్థలానికి సమీపంలో కనిపించిన ఓ తూటా

చెల్లాచెదురుగా శరీర భాగాలు

కార్లు, రోడ్లపై మృతదేహాలు

క్షణాల్లో భారీ మంటలు

దిల్లీ పేలుడుపై ప్రత్యక్ష సాక్షుల కథనం 12లో

ఉగ్ర కుట్ర భగ్నం

8 మంది అరెస్టు.. వారిలో ముగ్గురు వైద్యులు

2,900 కిలోల పేలుడు పదార్థం స్వాధీనం




ముజమ్మిల్ షకీల్ అద్దెకు ఉన్న ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి

మరిన్ని ఆయుధాలూ లభ్యం



ముజమ్మిల్ షకీల్



అదీల్ అహ్మద్

శ్రీనగర్; ఫరీదాబాద్: జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను ఛేదించారు. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం తెలిపారు. వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలోని మహిళా డాక్టర్ షాహిన్ సోమవారం లక్నోలో అరెస్టు కాగా ఆమె కారు నుంచి ఏకే-47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆమెను వాయుమార్గంలో శ్రీనగర్‌కు తరలించారు. అలాగే కశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అమ్మోనియం (మిగతా 3లో)

రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

- ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- భూముల కేటాయింపు, ప్రోత్సాహకాలు అందించాలి
- అమరావతిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులకు అనుమతి
- పలు కీలక నిర్ణయాలు తీసుకున్న మంత్రివర్గం



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి వివిధ రంగాల్లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే విధంగా మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలకు భూముల కేటాయింపు, ప్రోత్సాహకాలు అందించాలన్న ప్రతిపాదనలను ఆమోదించింది. 'ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం-2025-30', 'ఏపీ నైబర్‌హుడ్ వర్క్ సిస్టం విధానం-2025-30' వంటి రెండు కొత్త విధానాలకు (పాలసీలు) మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులకు టెండర్లు, రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కేటాయింపు తదితర ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కె.పార్థసారథి విలేకరులకు వివరించారు. ఆ వివరాలు..

- విశాఖలో ఐటీ, జీసీసీ పాలసీ కింద 3 మిలియన్ అడుగుల విస్తీర్ణంలో.. రూ.2,200 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఐటీ పార్కు అభివృద్ధికి విశాఖ రియాల్టీ లిమిటెడ్‌కు అనుమతి. 30 వేల మందికి ఉపాధి అవకాశాలు.
- కె.రహేజా రియల్‌ఎస్టేట్ సంస్థ విశాఖలో రూ.2,172.26 కోట్లతో 27.10 ఎకరాల్లో ఐటీ సంస్థలకు స్పేస్, ఆవాస ప్రాంతాల అభివృద్ధి. ఆ సంస్థకు ఉపాధి కల్పన షరతులతో ఎకరా 99 పైసలకే భూముల కేటాయింపు. 15 వేల ఉద్యోగాలు కల్పించేందుకు (మిగతా 11లో)

ప్రజల ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్న ఎమ్మెల్యేలు

ఏ పార్టీ ఎమ్మెల్యేలైనా తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించండి

మంత్రివర్గ సమావేశంలో సీఎంను కోరిన పవన్ కల్యాణ్ 11లో

తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సీనియర్లతో శిక్షణ


పార్టీ లైన్‌ను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు

తెదేపా మంత్రులతో అల్పాహార విందు భేటీలో లోకేశ్

దివికేగిన పల్లెపదం

కవిరేడు అందెశ్రీ అస్తమయం

ఘట్‌కేసర్‌లో నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు 14లో



తెలంగాణ ఆత్మగీతాకారుడు.. అందెశ్రీ

సంపాదకీయ పేజీలో

రెండో విడతకు రంగం సిద్ధం

బిహార్‌లో నేడే పోలింగ్ 14లో

తితిదేకు ఐదేళ్లలో 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి

భోలేబాబా ఓరోగానిక్, ఏఆర్, శ్రీవైష్ణవి, మాల్‌గంగా డెయిరీల ద్వారా సరఫరా

నిర్ధారించిన సిట్ 2లో



వందేమాతరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, మంత్రి కందుల దుర్గేష్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మల్లికార్జునరావు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి

ఏడాదిపాటు వందేమాతరం ఉత్సవాలు

- నాలుగు దశల్లో నిర్వహణ
- ప్రతి ఒక్కరూ ఆ గేయం స్ఫూర్తిని భావితరాలకు అందించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వందేమాతరం ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2025 నవంబరు 7 నుంచి 2026 నవంబరు 7 వరకు ఈ వేడుకలు జరుగుతాయన్నారు. నవంబరు 7-14 వరకు, 2026 జనవరి 19-26 వరకు, 2026 ఆగస్టు 7-15 వరకు, 2026 నవంబరు 1-7 వరకు ఇలా నాలుగు దశల్లో ఈ వేడుకల్ని జరుపుకోనున్నామని వివరించారు. ప్రతి భారతీయుడు అనునిత్యం వందేమాతర గేయాన్ని నెమరువేసుకోవాలని, ఆ స్ఫూర్తిని భావితరాలను అందించే బాధ్యత తీసుకోవాలన్నారు. విజయవాడలో సోమవారం '150 వసంతాల వందేమాతరం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలతో కలిసి వందేమాతర గేయం ఆలపించారు. వందేమాతరం ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బంకించంద్ర ఛటర్జీ, సీపీ బ్రౌన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. వందేమాతరం, సీపీ బ్రౌన్ పుస్తకాలను ఆవిష్కరించారు. (మిగతా 3లో)

రూ.750 కోట్లతో అపెక్స్ యోగా అండ్ నేచురోపతి పరిశోధన కేంద్రం 2లో

ఇదీ సంగతి!





అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

రాజుపాలెం, న్యూస్‌టుడే: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. అక్కడున్న సిమెంటు పైపు ఆసరాగా నిలవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన పల్నాడు జిల్లాలోని రాజుపాలెం మండలం రెడ్డిగూడెం వద్ద సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి 10:45 గంటలకు హైదరాబాద్ నుంచి బాపట్లకు బయలుదేరింది. తెల్లవారుజామున 5 గంటల సమయంలో రెడ్డిగూడెం వద్దకు రాగానే వేగంగా ఉన్న బస్సు అదుపుతప్పి రోడ్డు విస్తరణలో భాగంగా తవ్విన గుంతలోకి దూసుకెళ్లింది. కానీ అక్కడ (మిగతా 3లో)

మొంథా తుపాను నష్టం.. రూ.6,384 కోట్లు

తక్షణ సాయం ₹901 కోట్లు ఇవ్వండి

కేంద్ర బృందానికి నివేదించిన రాష్ట్రప్రభుత్వం

- 4.18 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం
- 3,109 గ్రామాలపై ప్రభావం.. నిరాశ్రయులైన వారు 1,11,402 మంది
- ఆర్అండ్‌బీలో 4,794 కి.మీ., పంచాయతీరాజ్‌లో 2,635 కి.మీ. రహదారులు ధ్వంసం

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో వివిధ రంగాలకు రూ.6,384 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. పునరావాసం, పెట్టుబడి రాయితీ, తాత్కాలిక పునరుద్ధరణ పనులకు తక్షణ సాయంగా రూ.901.40 కోట్లు మంజూరు చేయాలని కోరింది. మొంథా తుపాను నష్టాన్ని పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు, వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సంచాలకులు కె.పొన్నుస్వామి నేతృత్వంలోని బృందం.. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో అధికారులతో సమావేశమైంది. రెవెన్యూ (విపత్తుల నిర్వహణ)శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (మిగతా 3లో)



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో నష్టపోయిన పంటను అధికారులకు చూపుతున్న రైతు 3లో

పంట నష్టాలు పరిశీలించిన కేంద్ర బృందం

కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పర్యటన

తితిదేకు ఐదేళ్లలో 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి

• భోలేబాబా ఓర్గానిక్, ఏఆర్, వైష్ణవి, మాల్‌గంగా డెయిరీల ద్వారా సరఫరా
• నిర్ధారించిన సిట్

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): వైకాపా హయాంలో భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ ప్రత్యక్షంగా, పరోక్షంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి (తితిదే) 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి పంపినట్లు సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఇందుకు 57.56 లక్షల కిలోల పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామ్ స్టెరిన్ తదితర రసాయనాలు వినియోగించారని పేర్కొంది. గుజరాత్ రాష్ట్రం ఆనందలోని ఎన్‌డీడీబీ కాఫ్ నెయ్యిని మరోసారి పరీక్షించి ఈ ఏడాది మార్చి 27న కల్తీని ధ్రువీకరించింది సిట్ తెలిపింది. మొత్తం కల్తీ నెయ్యిలో రూ.137.22 కోట్ల విలువైన 37.38 లక్షల కిలోల నెయ్యిని తిరుపతి జిల్లా పునబాకలోని శ్రీవైష్ణవి డెయిరీ ద్వారా భోలేబాబా కంపెనీ పంపింది. తమ నుంచి వైష్ణవి సంస్థ కొనుగోలు చేసినట్లు జైన్ ఆశిష్ అగర్వాల్ అనే వ్యక్తి సూచనతో భోలే బాబా డెయిరీ.. నకిలీ రికార్డులు తయారు చేసినట్లు సిట్ అధికారులు పేర్కొన్నారు. మిగతా కల్తీ నెయ్యిని ఏఆర్ డెయిరీ, మాల్‌గంగా, భోలేబాబా సంస్థలు తితిదేకు విక్రయించాయని, మొత్తంగా నకిలీ నెయ్యి సరఫరా ద్వారా భోలే బాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ రూ.251.53 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించారు. ఈ నెల ఏడున అరెస్టైన ఢిల్లీకి చెందిన అజయ్‌కుమార్ సుగంధ్ రిమాండ్ రిపోర్టులో ఈ వివరాలు ఉన్నాయి. ఇతను నెయ్యి కల్తీకి అవసరమైన రసాయనాలను పొమిల్, విపిన్ జైన్‌లు డైరెక్టర్లుగా ఉన్న హర్ష్ ఫ్రెష్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హర్ష్ ట్రేడింగ్ కంపెనీలకు పంపారని విచారణలో వెల్లడైంది. తద్వారా అజయ్‌కుమార్‌కు రూ.7.94 కోట్లు ముట్టాయి.

నాలుగు ట్యాంకర్లు తిరస్కరిస్తే శ్రీవైష్ణవి ద్వారా పంపి

ఏఆర్ డెయిరీ ద్వారా వచ్చిన నాలుగు ట్యాంకర్ల కల్తీ నెయ్యిని ఒకసారి వెనక్కు పంపగా రంగులోకి దిగిన భోలేబాబా డెయిరీ వాటిని తిరిగి శ్రీవైష్ణవి డెయిరీ పేరుతో సరఫరా చేయగా తితిదే వాటిని అనుమతించినట్లు రిమాండ్ రిపోర్టులో ఉంది. ఈ కేసులో ఇద్దరు తితిదే ఉద్యోగులు ఏ9, ఏ10గా ఉన్నారు.

రూ.750 కోట్లతో అపెక్స్ యోగా అండ్ నేచురోపతి పరిశోధన కేంద్రం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.750 కోట్లతో 'అపెక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి' ఏర్పాటుకు 40 ఎకరాలు కేటాయించాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, నేచురోపతి విభాగం ద్వారా ఏర్పాటుకానున్న ఈ పరిశోధన కేంద్రం 450 పడకలు కలిగి ఉన్న వసతులతో ఏర్పాటు కానుంది. తొలి ఏడాదిలో యూజీ సీట్లు 100, పీజీ సీట్లు 20 చొప్పున అందుబాటులోకి వస్తాయి. పరిశోధనలు, శిక్షణ కేంద్రం ప్రారంభం కానున్నాయి. ఎయిమ్స్ తరహాలో కేంద్రం పర్యవేక్షణలో ఈ సంస్థ నిర్వహించనుంది.

దేశంలోనే తొలిసారిగా..: దేశంలోనే తొలిసారిగా రాష్ట్రానికి అత్యున్నత అపెక్స్ యోగా అండ్ నేచురోపతి రీసెర్చ్ సెంటర్ కేటాయించినందుకు ప్రధాని మోదీకి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కొత్త వైద్యకళాశాల రాకతో ప్రకృతి వైద్యులు పెరిగి, వైద్యం మరింత విస్తరిస్తుందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులు, యునాని వైద్యశాలలతో పాటు ధర్మవరంలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకానున్నట్లు తెలిపారు.

రాజీ కోసమే కేసు తీవ్రతను తగ్గించారా?

• ఎవరి ప్రమేయంతో గిఫ్ట్‌డీడ్‌కు ఒత్తిడి
• ఎన్ని ఆస్తులు గుర్తించారు?
• పరకామణి చోరీ కేసులో ముగ్గురిని విచారించిన సీఐడీ



విచారణకు వస్తున్న అప్పటి వీజీవో గిరిధర్ ★ ఎస్సై లక్ష్మీరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: 'శ్రీవారికి భక్తులు సమర్పించిన కానుకలు కాజేయడం ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కిందకు వస్తుంది. దానికి సంబంధించిన సెక్షన్లతో కేసు నమోదు చేసి ఛార్జిషీట్ వేయకుండా సాధారణ ఇంటి దొంగతనం సెక్షన్లతో కేసు ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది. ఛార్జిషీట్ వేసిన మరుసటి రోజే లోక్ అదాలత్‌లో కేసును రాజీ ఎందుకు చేయాల్సి వచ్చింది. రాజీ కోసమే కేసు తీవ్రతను తగ్గించారని భావించవచ్చా' అంటూ తిరుమల పరకామణి చోరీ కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ బృందం ప్రశ్నల వర్షం కురిపించింది. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణిలో కరెన్సీ చోరీ కేసును సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని 20 మంది బృందం తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో దర్యాప్తు చేస్తోంది. అప్పట్లో కేసు విచారణ జరిపిన సీఐ జగన్‌మోహన్‌రెడ్డి, కేసు నమోదు చేసిన ఎస్సై లక్ష్మీరెడ్డి, అప్పటి తితిదే భద్రతా సంరక్షణ అధికారి(వీజీవో) గిరిధర్ సోమవారం విచారణకు హాజరయ్యారు. వారిని వేర్వేరుగా ప్రత్యేక బృందాలు విచారించాయి. గిరిధర్ గతంలో ఇచ్చిన రిపోర్టు మేరకు విషయాలు వెల్లడించినట్లు సమాచారం. ఏవీఎస్‌వో ఫిర్యాదు, రవి గురించి ఆయనను ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. లోక్ అదాలత్‌లో కేసు రాజీకి ఎవరి నుంచి ఒత్తిళ్లు వచ్చాయి? ఫిర్యాదుపై సెక్షన్లు మీరే పెట్టారా... ఎస్‌హెచ్‌వో సూచించారా? సొమ్ము దుర్వినియోగమైనట్లు గుర్తించి సెక్షన్ 409 పెట్టకుండా 379, 380 సెక్షన్లు ఎందుకు పెట్టారు. దర్యాప్తులో మీరు పూర్తిగా భాగస్వాములు అయ్యారా? అని లక్ష్మీరెడ్డిని అడిగినట్లు తెలిసింది.

ఆస్తులు పక్కదారి పట్టాయా..?

ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు భావిస్తున్న సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని సుమారు నాలుగు గంటల పాటు విచారించారు. తర్వాత ఆయన మీడియాకు కనిపించకుండా వెళ్లిపోయారు. కేసు దర్యాప్తులో ఎవరెవరి భాగస్వామ్యం తీసుకున్నారో ఆయన్ను ఆరా తీశారు. చోరీ కేసులను నిగ్గుతేల్చే క్రైమ్ పోలీసులు అందుబాటులో ఉన్నా ఎందుకు వారిని భాగస్వాములను చేయలేదు? ఇద్దరు ముగ్గురు పోలీసులే నిందితుడి ఆస్తుల పరిశీలనకు వెళ్లడం వెనుక మర్మమేమిటి? నిందితుడు రవికుమార్ కుటుంబ ఆస్తులు ఎక్కడెక్కడ గుర్తించారు? దొంగను దాతగా మార్చేందుకు అనుమతు స్వామికి గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయించడంలో ఎవరైనా సూచనలు చేశారా? మిగిలిన ఆస్తులు ఇప్పుడు ఎవరి ఆధీనంలో, ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఆస్తులు పక్కదారి పట్టాయనే ఆరోపణలపై మీ స్పందనేమిటి? అంటూ నిందితుడికి చెందిన 3.50 ఎకరాల భూమి బదలాయింపు పత్రాన్ని సీఐకి చూపి ప్రశ్నించినట్లు తెలిసింది. సున్నితమైన కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసే విషయమై అప్పటి ఎస్పీకి తెలియజేశారా? కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆధారాల అదృశ్యంపై దర్యాప్తు ఎందుకు జరిపారా? అని ఆరా తీసినట్లు సమాచారం. కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని సీఐడీ బృందం చెప్పినట్లు సమాచారం.

★ నిందితుడు రవికుమార్ ఆస్తుల డాక్యుమెంట్లను సేకరించేందుకు సీఐడీలోని ఓ బృందం చెన్నై వెళ్లింది. పరకామణి చోరీ కేసుకు సంబంధించి మంగళవారం మరికొంత మందిని విచారించే అవకాశం ఉంది.


సభా స్థలంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేడు ప్రకాశం జిల్లాకు సీఎం చంద్రబాబు

50 ఎంఎస్ఎంఈ పార్కులు వర్చువల్‌గా ప్రారంభం

పీసీపల్లి, న్యూస్‌టుడే: చిన్న పరిశ్రమలకు పెద్దపీట వేసే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తొలిదశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుకానున్న 50 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. స్థానిక గూడూరు లింగసముద్రంలో ఎంఎస్ఎంఈ పార్కు.. ఇందులో 20 ఎకరాల్లో రూ.7 కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నా పార్కు ప్రారంభానికి సీఎం వస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలోని ఇతర పార్కులను ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

కల్తీ నెయ్యి టెండర్లకు అప్పటి ఛైర్మన్, ఈవోలే బాధ్యులు

• మంత్రి, గత ప్రభుత్వంలో తితిదే బోర్డు సభ్యుడు పార్థసారథి

ఈనాడు,అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే)లో కల్తీ నెయ్యి టెండర్లకు సంబంధించి వైకాపా ప్రభుత్వంలో అధికారులు వాస్తవాలు దాచిపెట్టి అప్పటి బోర్డు ఆమోదం పొందారని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి, గత ప్రభుత్వంలో తితిదే బోర్డు సభ్యుడిగా ఉన్న కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కల్తీ నెయ్యికి సంబంధించిన విషయాలేవీ అధికారులు అప్పట్లో తమ దృష్టికి తేలేదని ఆయన అన్నారు. సోమవారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి.. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడిన వ్యవహారంపై వైకాపా చేసిన ఆరోపణలు ఖండించారు. 'అప్పట్లో తితిదేలో కీలక నిర్ణయాలన్నీ ఛైర్మన్, కార్యనిర్వాహక అధికారి (ఈవో) తీసుకునేవారు. బోర్డు సభ్యుడిగా నాడు ఎలాంటి తప్పూ చేయలేదు. కల్తీ నెయ్యికి సంబంధించిన టెండర్ల విషయంలోనూ ఏ1, ఏ2 వివరాలు మాత్రమే బోర్డులో పెట్టారు. ఆ రెండు సంస్థలకు సంబంధించిన సమగ్ర వివరాలు ఎజెండాలో ఉండేవికాదు. ఏ1.. ఏ2 కంటే తక్కువ ధరకు నెయ్యి సరఫరాకు ముందుకొచ్చి ఉంటారన్న భావనతో బోర్డు ఆమోదించింది. ఆ సంస్థ పూర్వాపరాలను బోర్డు దృష్టికి తీసుకొచ్చి ఉంటే సభ్యులుగా అభ్యంతరం చెప్పేవాళ్లం. అలాంటి అవకాశమే లేకుండా అరకొర సమాచారం పెట్టి ఆమోదం తీసుకునేవారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి విధానం ఉండేది కాదు. వైకాపా ప్రభుత్వంలో తితిదేలో అనేక పారదర్శక నిర్ణయాలకు తిలోదకాలిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో కల్తీ నెయ్యికి బోర్డు సభ్యులెలా బాధ్యులవుతారు? అప్పటి ఛైర్మన్, ఈవోలే బాధ్యులు' అని మంత్రి పార్థసారథి వివరించారు.

బ్యాంకు లావాదేవీల వివరాలు సిట్‌కు ఇవ్వొచ్చుగా?

• వైవీ సుబ్బారెడ్డిపై కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారంలో మీ ప్రమేయం లేకపోతే సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సిట్ అడిగిన బ్యాంకు ఖాతాలు, లావాదేవీల వివరాలు ఇవ్వకుండా ఎందుకు కోర్టుకు వెళ్లారని తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. కమీషన్ల కక్కుర్తితో కోట్ల మంది హిందువుల మనోభావాల్ని వైకాపా నేతలు దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసింది కాక.. దాన్ని సమర్థించుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "సిట్ అరెస్టు చేసిన సుగంధ ఆయిల్ అండ్ కెమికల్స్ సంస్థ యజమాని అజయ్‌కుమార్(ఏ-16) రిమాండ్ రిపోర్టులో సంచలన వాస్తవాలు బయటపెట్టింది. భోలేబాబా డైరెక్టర్‌కు అజయ్‌కుమార్ అత్యంత సన్నిహితుడు. ఆ నివేదిక ప్రకారం సుగంధ ఆయిల్ అండ్ కెమికల్స్ సంస్థ రూ.8 కోట్లకు పైగా విలువైన రసాయనాల్ని భోలేబాబా డెయిరీకి సరఫరా చేసింది. వీటిని వినియోగించి భోలే బాబా డెయిరీ తితిదేకు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసింది. సుమారు రూ.251 కోట్లు దోచుకుంది. వైకాపా వాళ్లు ఈ అంశాలపై సమాధానం చెప్పాలి" అని పట్టాభిరామ్ డిమాండ్ చేశారు. వైవీ సుబ్బారెడ్డి తితిదే బోర్డు ఛైర్మన్‌గా ఉన్నప్పుడే నెయ్యిలో పామాయిల్ కలిసిందని నివేదికలు వచ్చాయని..అయినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. "భోలేబాబా డెయిరీ యజమానిని హైదరాబాద్‌లో ఎందుకు కలిశారు? చిన్న అప్పన్నని అడ్డంపెట్టుకొని ఆ డెయిరీ డైరెక్టర్లతో రాయబారాలు నడిపింది నిజం కాదా?" అని వైవీ సుబ్బారెడ్డిని నిలదీశారు. కమీషన్లు ముట్టడంతోనే కల్తీ నెయ్యి కాంట్రాక్టును కొనసాగించారని పేర్కొన్నారు.

కారుణ్య మరణానికి అనుమతించాలని ఎలా కోరతారు?

• కోర్టులు అలాంటి అభ్యర్థనలను సమ్మతించవని మీకు తెలుసు కదా
• 'రాయపూడి 5 సెంట్ల భూమి' కేసులో న్యాయవాదికి హైకోర్టు ప్రశ్నలు

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, ఆమె కుమార్తె వెంకాయమ్మ, మనవరాలు శ్యామలల కారుణ్య మరణానికి అనుమతించాలంటూ వారి తరఫున న్యాయవాది వ్యాజ్యంలో పేర్కొనడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. కోర్టులు అలాంటి అభ్యర్థనలను అనుమతించవని మీకు తెలుసుకదా? అని ప్రశ్నించింది. ఒకవేళ పిటిషనర్లు ఒత్తిడి చేసి ఉంటే వ్యాజ్యం దాఖలు చేసేందుకు మీరు నిరాకరించి ఉండాల్సిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని ఉద్దేశించింది వ్యాఖ్యానించింది. ప్రచారం కోసం న్యాయస్థానాలను వేదికగా వినియోగించుకోవద్దని తేల్చిచెప్పింది. మానసిక వైకల్యంతో ఉన్న శ్యామలకు పిటిషన్లో ఏముందో తెలియకుండా ఆమె నుంచి వకాలత్‌పై సంతకం ఎలా తీసుకున్నారని ప్రశ్నించింది. వ్యాజ్యంలో అభ్యర్థనను సవరించాలని న్యాయవాదికి సూచించింది. ప్రస్తుతం పిటిషనర్లు నివాసం ఉంటున్న ఇంటి వద్ద ఏ ప్రాజెక్ట్ రాబోతోంది? ఆ ప్రాజెక్ట్‌కు వారి ఇల్లు ఏమైనా అడ్డుగా ఉందా? తదితర వివరాలను తమ ముందు ఉంచాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించింది. విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

★ నిర్లక్ష్యరాస్యత కారణంగా తమ 5 సెంట్ల స్థలాన్ని పొరపాటున సీఆర్డీఏకు అప్పగించామని, దానిని తిరిగి అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరుజిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు శేషగిరమ్మ, ఆమె కుమార్తె వెంకాయమ్మ(ఇటీవల కన్నుమూశారు), మనవరాలు శ్యామల హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ స్థలాన్ని తిరిగి ఇవ్వడం వీలుకాకుంటే తమకు కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని పిటిషన్లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారించిన న్యాయమూర్తి.. శేషగిరమ్మ, ఆమె మనవరాలు శ్యామల ఏ పరిస్థితుల్లో ఉన్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించి తనకు నివేదించాలని న్యాయవాది రూపేశ్‌ను ఆదేశించారు. తన కారు, డ్రైవర్‌ను ఇచ్చి అప్పటికప్పుడే రాయపూడిలోని పిటిషనర్ల ఇంటికి పంపిన విషయం తెలిసిందే. సోమవారం విచారణ సందర్భంగా న్యాయవాది రూపేశ్ స్పందిస్తూ.. శ్యామలతో మాట్లాడినట్లు న్యాయమూర్తికి వివరించారు. తాను అడిగిన ప్రశ్నలకు కొంతమేర సమాధానం చెప్పగలుగుతున్నారని, పూర్తిస్థాయిలో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు.

సంరక్షణ కేంద్రానికి వెళ్లడానికి నిరాకరించారు

స్త్రీ, శిశు సంక్షేమశాఖ తరఫున ఏజీపీ స్పందిస్తూ.. అధికారులు, గ్రామస్థుల సమక్షంలో పిటిషనర్లను ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తీసుకెళతామని కోరితే అందుకు వారు నిరాకరించారన్నారు. సీఆర్డీఏ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. శేషగిరమ్మ భర్త అరెకరం భూమిని భూసమీకరణ పథకం కింద సీఆర్డీఏకు ఇచ్చారన్నారు. అందుకు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు పొందారని, వాటిని తర్వాత విక్రయించారన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బాల వాదనలు వినిపిస్తూ.. సంరక్షణ కేంద్రానికి వెళ్లేందుకు పిటిషనర్లు ఆసక్తి చూపడం లేదన్నారు. పిటిషనర్ల అభ్యర్థన మేరకే కారుణ్య మరణానికి అనుమతించాలనే విషయాన్ని పిటిషన్లో ప్రస్తావించానన్నారు.

అమరావతిలో ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో 'ఎంఎస్‌కే ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ' నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఇందులో మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పిచుకలపాలెం రెవెన్యూ పరిధిలో 12 ఎకరాల్లో ఈ ప్రపంచ స్థాయి క్రీడా శిక్షణ సముదాయం ఏర్పాటు కానుంది. ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఈ అకాడమీ ద్వారా స్థానిక క్రికెటర్లలో ప్రతిభను పెంపొందించడంతోపాటు అమరావతిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేస్తామన్నారు. ఈ క్రీడా సముదాయంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రికెట్ మైదానం, సాధన మైదానాలు, 400 మంది క్రీడాకారుల సామర్థ్య విశ్లేషణ చేసేలా ట్రైనింగ్ సెంటర్, 1,000 మంది విద్యార్థులు ఉండేలా అంతర్జాతీయ క్రీడా రెసిడెన్షియల్ పాఠశాల, క్రీడాకారులు, సందర్శక జట్ల కోసం వేర్వేరుగా వసతిగృహ సౌకర్యం, అత్యాధునిక వ్యాయామశాలలు, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాలు, ఇండోర్, అవుట్‌డోర్ ట్రైనింగ్ జోన్లు, ఒలింపిక్ ప్రమాణాలతో ఈతకొలను తదితర సదుపాయాలు ఉంటాయని తెలిపారు.


హిడ్మా తల్లి, దేవా మాతృమూర్తులతో హోంమంత్రి విజయశర్మ

హిడ్మా ఇంటికి వెళ్లిన ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి

అతని తల్లితో కలిసి భోజనం

చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా సొంత గ్రామమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని పువర్తిని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయశర్మ సోమవారం సందర్శించారు. హిడ్మా ఇంటికి వెళ్లి అతని తల్లితో మాట్లాడారు. ఆమెతోపాటు.. మొదటి బెటాలియన్ కమాండర్ దేవాల తల్లితో కలిసి భోజనం చేశారు. హిడ్మా, దేవా లొంగిపోయేలా ఒప్పించాలని ఆయన వారిని కోరారు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టుల నుంచి దేశానికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని వివరించారు.

13 నుంచి పది పరీక్ష ఫీజు చెల్లింపు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు ఈ నెల 13 నుంచి 25 వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అపరాధ రుసుము రూ.50తో ఈ నెల 26 నుంచి డిసెంబరు 3, అపరాధ రుసుము రూ.200తో డిసెంబరు 4 నుంచి 10, అపరాధ రుసుము రూ.500తో డిసెంబరు 11 నుంచి 15 వరకు చెల్లించవచ్చు. ఎక్కువ మంది చివరిలో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రయత్నిస్తే సర్వర్ సమస్య తలెత్తే అవకాశం ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు ముందుగానే ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీజును https://bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వరకు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

వాన నీటితో ఆరు రెట్ల ఉత్పాదకత

• కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి: వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటే వివిధ రంగాల్లో ఇప్పుడున్న దాని కంటే ఆరు రెట్ల ఉత్పాదకత సాధించవచ్చని, భూగర్భ జలాల్లో కనీసం మూడు మీటర్ల పెరుగుదల నమోదవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వాటర్ షెడ్ మహోత్సవంపై జాతీయ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ వాటర్‌షెడ్ 2.0ను రూ.13 వేల కోట్లతో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం కింద 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నగరంలోని వెంగళాయపాలెం చెరువును 15 రోజుల్లోనే ఆహ్లాదకరంగా తయారు చేశామని, త్వరలోనే ఈ చెరువును దేశానికి అంకితం చేస్తామన్నారు. వాటర్‌షెడ్ అంటే చెక్‌డ్యామ్ కాదని, గ్రామీణ భారత పునర్నిర్మాణానికి బలమైన ఎకో ఫౌండేషన్ అని మంత్రి పేర్కొన్నారు.

ఐదేళ్లకు కార్యాచరణ ప్రణాళిక

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వచ్చే ఐదేళ్ల కార్యాచరణకు ప్రణాళిక రూపొందిస్తామని కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి తెలిపారు. ఈ పథకాన్ని బాగా అమలు చేస్తున్న రాష్ట్రాలకు మరిన్ని నిధులు అందించడంపైనా చర్చిస్తామన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు లాభాలు వచ్చేందుకు 'మోర్ క్రాప్ ఫర్ డ్రాప్' అనేది వాటర్‌షెడ్ నినాదం కావాలన్నారు. కార్యక్రమంలో 'ఎన్స్యూరింగ్ వాటర్ సెక్యూరిటీ, నర్చరింగ్ వేస్ట్ ల్యాండ్, ఎంపవరింగ్ రూరల్ లైవ్లీ హుడ్స్ రాజస్థాన్' అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీరాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వీవీకే షణ్ముఖ కుమార్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.


'ఎన్స్యూరింగ్ వాటర్ సెక్యూరిటీ, నర్చరింగ్ వేస్ట్ ల్యాండ్, ఎంపవరింగ్ రూరల్ లైవ్లీ హుడ్స్ రాజస్థాన్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. వేదికపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు

రాజధానిలో దసపల్లా హోటల్‌కు నేడు భూమిపూజ

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మరో ప్రముఖ సంస్థ 4 నక్షత్రాల హోటల్ నిర్మాణానికి సన్నద్ధమవుతోంది. శాఖమూరు సమీపంలో దసపల్లా హోటల్ నిర్మాణానికి మంగళవారం ఉదయం 11 గంటలకు భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శుభాకాంక్షలు తెలియజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీఆర్డీఏ అధికారులు హాజరవుతారని వెల్లడించారు.

నేటి నుంచి 'సిక్కోలు పుస్తక మహోత్సవం'

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ నగరపాలక సంస్థ మైదానంలో మంగళవారం నుంచి 20 వరకు 'సిక్కోలు పుస్తక మహోత్సవం' జరగనుంది. పది రోజుల పాటు పుస్తకాల ప్రదర్శనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేయనున్నారు. వంద వరకు ప్రచురణ సంస్థలు పాల్గొననున్నాయి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రవిజ్ఞానం, అంతరిక్షంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిబిరాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలో 100 దత్తత గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

కోరమండల్ సంస్థ ఉన్నతాధికారుల వెల్లడి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కోరమండల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలో 100 గ్రామాలను దత్తత తీసుకున్నట్లు ఆ సంస్థ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ మాధబ్ అధికారి, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ బినయ్‌కుమార్ పరిడా పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గోనేడ గ్రామాన్ని ఆ సంస్థ దత్తత తీసుకుంది. గ్రామంలో విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి వైద్యులతో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించి 550 మందికి వైద్యపరీక్షలు చేశారు. అనంతరం రైతులు, గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో మాధబ్ అధికారి, బినయ్‌కుమార్ పరిడా మాట్లాడారు. తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో ప్రతి రైతు భూమిలో భూసార పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామస్థాయిలో తక్కువ ఖర్చుతో అత్యధిక దిగుబడులు సాధించిన ముగ్గురు రైతులను సన్మానించి, నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు.

చిన్న అప్పన్న కస్టడీ పిటిషన్‌పై నేడు విచారణ

ఈనాడు, తిరుపతి: వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్న కస్టడీ పిటిషన్‌పై మంగళవారం నెల్లూరు ఏసీబీ కోర్టులో విచారణ జరగనుంది. తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యి కాంట్రాక్టును ప్రీమియర్ అగ్రిఫుడ్స్ అనే సంస్థకు కట్టబెట్టడంలో ఇతను కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో గతనెల చివర్లో అరెస్టు చేశారు. కేసులో 24వ నిందితుడిగా పేర్కొన్నారు. రూ.50 లక్షలు ఆ సంస్థ నుంచి తీసుకున్నారని రిమాండ్ రిపోర్టులో తెలిపారు. ఈ నెల 7న అరెస్టు అయిన ఏ16 అజయ్ కుమార్ సుగంధ్‌ను కూడా సిట్ కస్టడీకి ఇవ్వాలని కోరిన సంగతి తెలిసిందే. దీనిపై త్వరలో విచారణ జరిగే అవకాశం ఉంది.

గ్రహం అనుగ్రహం

11-11-2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
షష్ఠి: ఉ. 6-10 తదుపరి సప్తమి తె. 4-55 తదుపరి అష్టమి
పుష్యమి: రా. 12-09 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 9-09 నుంచి 10-42 వరకు; అమృత ఘడియలు: సా.6-27 నుంచి 8-00 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-12 నుంచి 9-06 వరకు తిరిగి రా. 10-27 నుంచి 11-08 వరకు; రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.06; సూర్యాస్తమయం: సా.5.22

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
			కర్నూలు	32.0	19.5
			విజయవాడ	31.8	22.4
			తిరుపతి	31.7	27.9
రాజమహేంద్రవరం	38.0	22.5	ఒంగోలు	31.6	24.2
అనంతపురం	34.6	20.0	విశాఖపట్నం	31.0	22.0
కడప	33.0	22.0	శ్రీకాకుళం	31.0	21.0
నరసాపురం	32.4	24.4	విజయనగరం	30.0	21.0
నెల్లూరు	32.2	24.8	హైదరాబాద్	29.6	15.5
తాడేపల్లిగూడెం	32.0	27.0	గుంటూరు	29.0	23.0

దిల్లీలో భారీ పేలుడు


పేలుడు ధాటికి తీవ్రంగా ధ్వంసమైన వాహనాలు

(మొదటి పేజీ తరువాయి)

మందుగుండును స్వాధీనం చేసుకున్న కొన్ని గంటల్లోనే ఈ పేలుడు ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ఉగ్రనెట్‌వర్క్‌కు, తాజా పేలుడుకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా..! అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

క్షణాల్లో ఇతర వాహనాలకు మంటలు

ఎర్రకోట గేట్ నంబర్ వన్ మెట్రో స్టేషన్ వద్ద సాయంత్రం 6.52 గంటలకు జరిగిన పేలుడు తర్వాత క్షణాల్లో ఇతర వాహనాలకూ మంటలు అంటుకున్నాయి. పలు కార్లు, ఆటోలు, బైక్‌లు కాలిబూడిదయ్యాయి. ఆ వాహనాల్లో ఎవరైనా చిక్కుకున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనేకమంది గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఎర్రకోట సమీపంలో అత్యంత అప్రమత్తత (హైఅలర్ట్) ప్రకటించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు అక్కడకు చేరుకున్నాయి. 10 అగ్నిమాపక శకటాలతో ప్రయత్నించి రాత్రి 7.29 గంటలకు మంటలను అదుపులోకి తీసుకురాగలిగారు. అప్పటికే పలు వాహనాలు నామరూపాల్లేకుండా కాలిపోయాయి. కొన్ని మృతదేహాలు ఛిద్రమైపోయి అక్కడంతా భీతావహ, హృదయవిదారక వాతావరణం నెలకొంది. ఇది ప్రమాదమా, ఉద్దేశపూర్వక విద్రోహ చర్యా అనే వివరాలు తెలియాల్సి ఉంది. భారీ శబ్దాలతో భయాందోళనకు గురయ్యామని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఘటనాస్థలికి 800 మీటర్ల దూరంలో ఉన్న తన దుకాణం కూడా అదిరిందని చాందినీ చౌక్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సంజయ్ భార్గవ్ తెలిపారు.



పేలుడు సంభవించిన ప్రాంతంలో రక్తపు మరకలు

రిమోట్‌తో పేల్చారా?

పేలుడు ధాటికి చుట్టుపక్కల ఉన్న ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో కాలిపోయాయి. కొన్ని మీటర్ల దూరంలో ఉన్న వాహనాల అద్దాలు కూడా పగిలిపోవడం ఈ పేలుడు తీవ్రతను చాటుతోంది. కొన్ని కి.మీ. దూరంలో ఉన్న ఐటీవో వరకు శబ్దం వినిపించింది. కారులో ఉంచిన పేలుడు పదార్థాలను దూరం నుంచి ఎవరైనా రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సోమవారం దిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాద తీవ్రత కొంత తక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పార్కింగ్ ప్రదేశంలో నిలిపిఉంచిన కారులో పేలుడు జరిగినట్లు తొలుత వార్తలు వెలువడ్డాయి. తర్వాత హ్యుందాయ్ ఐ20 కారు దీనికి కారణమని తేలింది. దానిలో ముగ్గురు ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎర్రకోట సమీపంలో సిగ్నల్ వద్ద కారు ఆగుతుండగానే పేలుడు సంభవించిందని అమిత్ షా, దిల్లీ నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. గాయపడిన వారి శరీరంలో ఎక్కడా లోహపు తునకలు గానీ, గాయాలు గానీ కనిపించలేదని, పేలుళ్లలో ఇది అసాధారణమని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రి సీనియర్ అధికారి విశ్లేషించారు. మేకులు, రసాయనాలు, తీగలు వంటి అనుమానిత వస్తువులేమీ కనిపించలేదని, ఎలాంటి గొయ్యి ఏర్పడలేదని చెప్పారు. మహ్మద్ సల్మాన్ పేరిట ఈ కారు హరియాణాలో నమోదైందని తెలిపారు. ఆ వ్యక్తిని గురుగ్రామ్‌లో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఆగ్నేయ దిల్లీలోని ఓఖ్లాలో ఓ వ్యక్తికి తాను ఆ కారు విక్రయించానని, ఆ తర్వాత అంబాలాలోని మరోవ్యక్తి దానిని కొనుక్కున్నట్లు సల్మాన్ చెప్పారని తెలుస్తోంది.

అమిత్‌షాతో మాట్లాడిన మోదీ

పరిస్థితిని ప్రధాని మోదీ సమీక్షించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో, అధికారులతో ఆయన మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. దిల్లీ పోలీసు విభాగాధిపతితో, నిఘా మండలి డైరెక్టర్‌తో అమిత్‌షా మాట్లాడారు. ఘటనాస్థలికి వెళ్లడంతో పాటు ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఏ అవకాశాన్నీ వదిలిపెట్టకుండా ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని, వాస్తవాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. ఇది ఉగ్రదాడి కిందికి వస్తుందా లేదా అనేది వెంటనే చెప్పలేమన్నారు. దర్యాప్తులో సహకరించి, ఆధారాలు సేకరించడానికి నిపుణుల బృందాలను ఘటనాస్థలి వద్దకు పంపాలని ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ అధిపతులను ఆయన ఆదేశించారు. వీరంతా నిపుణులతో అక్కడకు చేరుకున్నారు. సీసీటీవీల్లో నమోదైన దృశ్యాలను, మొబైల్ టవర్ల నుంచి డేటాను, అనుమానిత ఉగ్రవాదుల వివరాలను సేకరించి విశ్లేషిస్తున్నారు. చాందినీ చౌక్ మార్కెట్టును మంగళవారం మూసివేయనున్నారు. అటు ముంబయిలో భారీగా తనిఖీలు చేపట్టారు. కీలకమైన ప్రాంతాల్లో భద్రత పెంచారు.

దిల్లీ పేలుళ్ల నేపథ్యంలో
ఏపీ అంతటా అప్రమత్తం

- బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100, 112కు సమాచారమివ్వాలన్న డీజీపీ

ఈనాడు, అమరావతి: దిల్లీ బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి లాంటి ప్రధాన నగరాలు సహా రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రార్థన మందిరాలు, సందర్శనీయ స్థలాలు, జాతీయ భద్రతాపరంగా సున్నితమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. లాడ్జీల్లో సోదాలు చేపట్టి బస చేసినవారి వివరాలు సేకరించారు. వారిని ప్రశ్నించారు. వాహనాల తనిఖీలు చేపట్టారు. తీరప్రాంతాల్లో నిఘా పెంచారు. అంతకుముందు రాష్ట్రంలోని అన్ని బహిరంగ ప్రదేశాలు, కీలక సంస్థలు, స్థావరాలు, సున్నితమైన ప్రాంతాల్లో వెంటనే భద్రత పెంచాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా జిల్లాల ఎస్పీలు, రేంజి డీఐజీలు, ఐజీలకు ఆదేశాలు జారీచేశారు. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించి, పరిస్థితుల్ని అంచనా వేయాలని ఆదేశించారు. ఎక్కువమంది గుమిగూడే అవకాశమున్న ప్రదేశాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని నిర్దేశించారు. సీసీటీవీ కెమెరాలు, ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే 100 లేదా 112 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమాచారమివ్వాలని ప్రజలను కోరారు.

● దిల్లీ పేలుడుపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించి.. రాష్ట్రంలో అప్రమత్తత ప్రకటించాలని ఆదేశించారు. ఈ నెలలో రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనలు ఉన్నందున భద్రతాపరంగా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

రెండేళ్ల కాలపరిమితితో అక్రెడిటేషన్

'మీడియా రిలేషన్స్ పోర్టల్' ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: రెండేళ్ల కాలపరిమితితో (2026, 2027) మీడియా అక్రెడిటేషన్లు ఇవ్వనున్నట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇందుకోసం రూపొందించిన 'మీడియా రిలేషన్స్ పోర్టల్' వెబ్‌సైట్‌ను సమాచార శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. 'గతంలో జారీ చేసిన అక్రెడిటేషన్ల గడువు ఈ నెల 30తో ముగియనుంది. రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. దీనికి సంబంధించిన విధివిధానాలు మంగళవారం తెలియజేస్తాం' అని వివరించారు.

రబీ పంటల బీమాకు రూ.44.06 కోట్లు

ఈనాడు, అమరావతి: రబీలో ప్రధాన మంత్రి పంటల బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై) అమలుకు ప్రభుత్వం రూ.44.06 కోట్లు విడుదల చేసింది. అడ్వాన్స్ ప్రీమియం కింద రాష్ట్ర వాటాగా ఈ మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేయాలని ఆదేశిస్తూ వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనధికార దాబాల వద్ద వాహనాలతోనే రోడ్డు ప్రమాదాలు

- ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్రం వివరణ కోరిన సుప్రీంకోర్టు
- రాజస్థాన్, తెలంగాణలలో జరిగిన ఘటనలపై సుమోటోగా విచారణ

ఈనాడు, దిల్లీ: ఇటీవల రాజస్థాన్, తెలంగాణల్లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. రోడ్డుపక్క నుంచే దాబాలు, రహదారి నిర్వహణ పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సోమవారం జస్టిస్ జేకేమహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ)ను ఆదేశించింది. "తమకు కేటాయించని స్థలాల్లో చాలా మంది దాబాలు ప్రారంభించి నడుపుతున్నారు. దాని వల్ల వాహనదారులు అక్కడికెళ్లి నిలుపుతున్నారు. రాత్రిపూట ఆ వాహనాలు ఎదురుగా వచ్చే వారికి కనిపించక.. వాటిని ఢీకొంటున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగిన రెండు జాతీయ రహదారుల్లో ఎన్ని అనధికారిక దాబాలు ఉన్నాయన్న దానిపై ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్ర రహదారి, రవాణాశాఖ రెండు వారాల్లోపు సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలి" అని నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వం, హోంశాఖతో పాటు, తెలంగాణ, రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులనూ పార్టీలుగా చేర్చాలంది. నవంబరు 2, 3 తేదీల్లో రాజస్థాన్‌లోని ఫలోది, తెలంగాణలోని హైదరాబాద్-బీజాపుర్ రహదారిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో దాదాపు 40 మంది చనిపోవడంపై సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. రహదారి ప్రమాదాల్లో ఇలా అమాయకులు ప్రాణాలు కోల్పోవడానికి కారణాలేంటో చెప్పాలని కేంద్రాన్ని ప్రశ్నించింది. "వినియోగదారులు టోల్ రుసుము చెల్లిస్తున్నా ఈ జాతీయ రహదారుల తీరు దారుణంగా ఉన్నట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. వీటిపై చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన హోటళ్లు, దాబాల వివరాలివ్వండి" అని పేర్కొంది. ఈకేసులో అమికస్ క్యూరీగా నియమితులైన ఏఎన్ఎస్ నాడకర్ణి జోక్యం చేసుకుంటూ ఈ సుమోటో కేసును తెలంగాణ, రాజస్థాన్‌లకే పరిమితం చేయకుండా అన్ని రాష్ట్రాలకూ విస్తరించాలని కోరారు. అందుకు జస్టిస్ జేకేమహేశ్వరి స్పందిస్తూ "మొదట ఇక్కడ ఏం జరిగిందో చూద్దాం" అని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన దిగ్భ్రాంతిని కలిగించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సోమవారం ఎక్స్ వేదికగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దిల్లీ పేలుడు ఉగ్రదాడైతే.. బాధ్యులపై కఠిన చర్యలు: పవన్‌కల్యాణ్

దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనలో పలువురు సామాన్యులు మృతి చెందడం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'దేశ ఐక్యతను, శాంతిని భంగపరిచేందుకే ఇలాంటి కిరాతక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ఉగ్రదాడి అని నిర్ధారణైతే ప్రధాని మోదీ నాయకత్వంలో దోషులకు కఠిన శిక్షలు తప్పవు' అని సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

క్షతగాత్రులు కోలుకోవాలి: మాధవ్

దిల్లీ పేలుడు ఘటనపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోందని వారంతా త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉగ్ర కుట్ర భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. ఇంకా ఎలక్ట్రానిక్ పరికరాలు, కొన్ని పత్రాలు, భారీగా మందుగుండు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ పేలుడు పదార్థాలతో ఎక్కడెక్కడ విధ్వంసం సృష్టించాలి అన్న వివరాలను పెద్దల్ల నుంచి పొందడం కోసం ఎదురు చూస్తున్నట్లు డాక్టర్ అదీల్, డాక్టర్ ముజమ్మిల్ విచారణలో వెల్లడించారు. దిల్లీ రాజధాని ప్రాంతంలో వైద్యులపై ఎవరికీ అనుమానం ఉండదని పెద్దల్లు తమను ఎంచుకున్నారని వారు వివరించారు. ఈ ప్రాంతంలో మతకల్లోలాలు, పేలుళ్లు సృష్టించాలన్న తాజా కుట్ర పాకిస్థాన్‌లో పురుడుపోసుకుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వైద్యులు హింసావాదం వైపు మళ్లేందుకు ఓ మసీదుకు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ కారణమని వెల్లడించాయి. అతనికి 2019 ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాది జకీర్ ముసాతో సంబంధాలున్నాయని చెప్పాయి.

పోస్టర్లు అంటించి పట్టుబడ్డారు

"శ్రీనగర్‌లో అక్టోబరు 19న బుణ్‌పోర నౌగమ్‌లోని పలు చోట్ల పోలీసులు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. అంతేకాకుండా ఉగ్రవాద మద్దతుదారులు అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పాకిస్థాన్, ఇతర దేశాలకు చెందిన వైట్ కాలర్ ఉగ్రవాదం ఇందులో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. విద్యార్థులు, నిపుణులతో కూడిన ఉగ్ర వ్యవస్థ ఇందులో భాగమైందని తెలిసింది. సామాజిక, ధార్మిక కార్యక్రమాలతో నిధులు సేకరించారు. ఉగ్ర కార్యకలాపాల సమన్వయం కోసం ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను వినియోగించారు" అని సంబంధిత అధికారి తెలిపారు. ఈ కేసులో ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లో అరెస్టయిన కశ్మీర్‌లో కుల్గాం వాన్‌పోరాకు చెందిన వైద్యుడు అదీల్ అహ్మద్‌ను పోలీసులు విచారించగా ఈ భారీ కుట్ర బయటపడింది. జమ్మూకశ్మీర్ పుల్వామాకు చెందిన వైద్యుడు ముజమ్మిల్ షకీల్ హరియాణాలోని ఫరీదాబాద్‌లో అద్దెకు తీసుకున్న రెండు గృహాల్లోని ఓ దాని నుంచి 2,563 కిలోల పేలుడు పదార్థాలను భద్రతాసిబ్బంది సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఎనిమిది రౌండ్ల తూటాలు గల పిస్టోలు, రెండు ఖాళీ కాట్రిడ్జ్‌లు, రెండు మ్యాగజైన్లు, ఎనిమిది పెద్ద.. నాలుగు చిన్న సూట్‌కేసులు, ఓ బకెట్టు దొరికాయి. ఈ గృహం యజమాని ఓ మౌలానా కాగా అతడిని కూడా అరెస్టు చేశారు.

ఆయుధాలపై నంబర్లతో..

షకీల్ మరో అద్దె ఇంటిలో 350 కేజీల పేలుడు పదార్థాలు ఆదివారం దొరికాయి. ఆ సందర్భంగా రిమోట్లు, 20 టైమర్లు, అసాల్ట్ రైఫిళ్లు, హ్యాండ్ గన్‌లు కూడా లభ్యమయ్యాయి. ఫరీదాబాద్‌లోని ధోజ్‌లో గల అల్ ఫలాహ్ యూనివర్సిటీలో షకీల్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. జైషే మహ్మద్ సంస్థతో సంబంధాలపై అనుమానాలతో గత 10 రోజుల క్రితమే షకీల్‌ను అరెస్టు చేశారు. స్వాధీనపరుచుకున్న ఆయుధాలపై ఉన్న నంబర్ల ఆధారంగా వాటిని గతంలో ఏదైనా ఉగ్ర ఘటనలో ఉపయోగించారా అనే అంశంపై ఫోరెన్సిక్ బృందాలు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్ సహా కొన్ని ఇతర దేశాలు కేంద్రంగా హ్యాండ్లర్లు నిర్వహిస్తున్న టెర్రర్ మాడ్యుల్‌లో ఈ ముగ్గురు వైద్యులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

పంట నష్టాలు పరిశీలించిన కేంద్ర బృందం

● కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పర్యటన

ఈనాడు, ఏలూరు, ఈనాడు డిజిటల్-మచిలీపట్నం, న్యూస్‌టుడే-కంకిపాడు: కృష్ణా, ఏలూరు జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. బృందంలో వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ డైరెక్టర్ డా.కె.పొన్నుసామి నేతృత్వంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ శ్రీనివాసు బైరి, విద్యుత్తుశాఖ సీఈఏ, డిప్యూటీ డైరెక్టర్ ఆర్తి సింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా ఉన్నారు. మొదట కంకిపాడు మండలంలోని పునాదిపాడులో ఉప్పులూరు ప్రధాన రహదారి పక్క కౌలురైతులు తుమ్మల శ్రీనివాస్, భరత్ బాబు, కొడాలి మృత్యుంజయరావు సాగు చేసిన వరి పంట నేలవాలిన తీరును బృందం పరిశీలించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్, శాస్త్రవేత్త పి.సత్యనారాయణ పొలంలో పైకి బాగానే కనిపిస్తున్న.. దెబ్బతిన్న కంకులకు మధ్య వ్యత్యాసాన్ని చూపించి, రైతులకు 80-100% నష్టం వాటిల్లిందని వివరించారు. తాను 30 ఎకరాలు వరి సాగుచేస్తే తుపాను కారణంగా 80% పైగా నష్టం వాటిల్లిందని కౌలు రైతు తుమ్మల శ్రీనివాస్ కేంద్ర బృందానికి తెలిపారు. పెట్టుబడి డబ్బులు కూడా రావని ఆవేదనతో తెలిపారు.

రైతులకు మేలు చేయాలి

'విపత్తుల నిర్వహణ సంస్థ చట్టం 2005లోని సెక్షన్ 11, 12ను కేంద్రం ఇటీవల తొలగించింది. సెక్షన్ 61లో నష్ట పరిహారం అనే పదాన్ని కేంద్రం ఎత్తేయడం అన్యాయం. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన అన్నదాత కంటే ప్రైవేటు సంస్థలకే మేలుచేస్తోంది. రైతులకు మేలు జరిగేలా మార్పులు చేయాలి' అని కేంద్ర బృందాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు.

చిత్రాల పరిశీలన

జిల్లాలో తుపాను నష్టంపై గన్నవరంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం పరిశీలించింది. గంటకు 90-100 కి.మీ. వేగంతో గాలులు రావడంతో జిల్లాలో పంట, ఆస్తి నష్టాలు.. అధికారులు చేపట్టిన సహాయక చర్యలపై కలెక్టర్ బాలాజీ వివరించారు. బృందం వెంట పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు తదితరులు ఉన్నారు.

అవును.. రైతుకు నష్టమే

మొంథా తుపాను ప్రభావానికి నేలవాలిన వరిపంట రోజుల తరబడి నీళ్లలో ఉండటంతో ధాన్యం మొలకెత్తడం, తేమ శాతం ఎక్కువగా ఉండటం, రంగు మారడాన్ని కేంద్ర బృందం పరిశీలించి రైతులకు నష్టం వాటిల్లిందని ఓ అంచనాకు వచ్చింది. నలుగురు సభ్యుల కేంద్ర బృందం సోమవారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో పర్యటించింది. ధాన్యం పనలు నీళ్లలో నాని రంగు మారాయని ఓ రైతు చూపించగా వాటిని చేతబట్టుకుని తాలుగింజలే ఎక్కువగా ఉన్నాయని నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా బృందానికి వివరించారు. గాలులకు కింద పడే వరి రకాన్ని ఎందుకు సాగు చేస్తున్నారు? రైతులకు అవగాహన కల్పించలేదా.. అని బృంద సభ్యుడొకరు ప్రశ్నించారు. దీనికి వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఏటా నవంబరులో తుపాన్లు వచ్చి పంటలు నష్టపోతున్నామని రైతులు ఈ ఏడాది 15-20 రోజుల ముందే సాగు చేశారని, అయినా తుపాను ప్రభావానికి గురయ్యారని వివరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను చూసి.. అక్కడ తేమ మీటరు, నూకల శాతాన్ని తెలియజేసే మినీ మిల్లర్ గమనించి తడిసిన ధాన్యంలో తేమ శాతం ఎంత ఉందో కొలిపించారు. రంగుమారిన ధాన్యంలో నూకలు శాతం ఎంత ఉన్నాయో పరీక్షించాలని చెప్పగా వెంటనే పౌరసరఫరాల సంస్థ సాంకేతిక సిబ్బంది వాటిని చూపించారు. ధాన్యంలో తేమ 23%, నూకలు నిర్దేశిత మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. ఇలాంటి ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయరని, ఆ ధాన్యానికి మద్దతు ధర రాదని.. రైతులకు నష్టం వస్తుందని పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు బృందానికి వివరించారు.

అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

(మొదటి పేజీ తరువాయి)

చప్టా నిర్మాణానికి అమర్చిన సిమెంటు పైపును తాకి ఆగిపోయింది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అత్యవసర ద్వారం నుంచి సురక్షితంగా వారు బయటకు వచ్చారు. అనంతరం ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ సాయికిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేణుగోపాల్ తెలిపారు.


సిమెంటు పైపు ఆసరాతో నిలిచిన బస్సు

ఏడాదిపాటు వందేమాతరం ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)





సమావేశానికి హాజరైన వారితో వందేమాతరం నినాదాలు చేయిస్తున్న సీఎం చంద్రబాబు

అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశానికి స్వేచ్ఛను ప్రసాదించిన నినాదం వందేభారతమని తెలిపారు. 'భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచంలోనే భిన్నమైంది. నాడు అందరిలోనూ జాతీయ భావన, ఐకమత్యాన్ని తీసుకొచ్చి ఉద్యమాన్ని నడిపించిన నినాదం వందేమాతరం. ఈ గేయం స్వాతంత్ర్య ఉద్యమాన్నే మలుపుతిప్పింది' అని పేర్కొన్నారు.

ప్రజల హృదయాల్లో ఉద్యమ గేయంగా..

'1875 నవంబర్ 7వ తేదీన బెంగాల్‌లోని కంఠలపారా అనే గ్రామంలో ఈ గేయం పుట్టింది. బంకిం చంద్ర ఛటర్జీ తన కలం ద్వారా దేశాన్ని మేల్కొల్పారు. అది జాతీయ భావానికి తొలి జ్యోతి అయింది. ప్రజల హృదయాల్లోకి వెళ్లి ఉద్యమ గేయంగా మారి కులాలు, మతాలకు అతీతంగా అందరినీ ఏకం చేసింది. లాలాల జపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, భగత్‌సింగ్‌లకు ఈ గేయం ప్రేరణగా నిలిచింది. వారు ప్రజల్లో చైతన్యం తెస్తూ పోరాట స్ఫూర్తిని నింపారు. అది చూసి బ్రిటిష్ వారు భయపడి వందేమాతర గేయాన్ని నిషేధించారు. లాఠీఛార్జీ, అరెస్టులు చేసినా, తూటాలు పేల్చినా ప్రజలు వెనకడుగు వేయలేదు. ఆనందంగా ప్రాణత్యాగం చేశారు. అదీ వందేమాతరం స్ఫూర్తి' అని పేర్కొన్నారు.

దేశ చరిత్రను మోదీ ప్రపంచానికి చాటి చెబుతున్నారు

'ప్రధాని మోదీ ప్రతి భారతీయుడూ గర్వించేలా దేశాన్ని ప్రపంచశక్తిగా మార్చడానికి అనునిత్యం పనిచేస్తున్నారు. సంస్కృతి సంప్రదాయాలను, చరిత్రను ప్రపంచానికి చాటి చెబుతున్నారు. మేకిన్ ఇండియా, యోగాలను ప్రపంచస్థాయికి తీసుకెళ్లారు. ప్రపంచానికి గమ్యస్థానంగా భారతదేశాన్ని మారుస్తున్నారు. చాలా దేశాల్లో మంచి నాయకత్వం లేక సమస్యలొస్తున్నాయి. మన దేశంలో సరైన సమయంలో సమర్థమైన నాయకుడు ప్రధానిగా ఉన్నారు. ఏడాదిలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరించనుంది. ప్రపంచానికి భారతదేశం ఆదర్శమైతే.. అదే ప్రపంచానికి తెలుగు జాతి ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కావాలనేది నా ఆలోచన. ఇది అసాధ్యం కాదు' అని చంద్రబాబు వెల్లడించారు.

భవిష్యత్తులో భారత దేశమే నంబర్-1

'78 ఏళ్ల స్వతంత్ర భారతంలో మన శక్తిని ప్రపంచానికి చాటిచెప్పాం. రాబోయే రోజుల్లో ప్రతి విషయంలో ప్రపంచానికి నంబర్-1గా భారతదేశం ఉంటుంది. అందులో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిలబెట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. సాంకేతికత, అభివృద్ధి, సంక్షేమం ఇలా అన్నింటిలోనూ మనం ముందుంటాం. దీనికి వందేమాతరం స్ఫూర్తిగా నిలవాలి' అని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, సృజనాత్మక సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు తేజస్వి పొడపాటి, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం ₹901 కోట్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ తుపాను నష్టంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నివేదికలో ప్రధాన అంశాలు..

- తుపాను దెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా 4,794 కి.మీ. రహదారులు దెబ్బతిన్నాయి. 311 వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.48.81 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.2,506 కోట్లు కావాలి.
- పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రోడ్లు 2,635 కి.మీ., 354 వంతెనలు ధ్వంసమయ్యాయి. 1,26,647 వీధిదీపాలు, 1,828 కాల్వలు, 201 చెరువులకు నష్టం వాటిల్లింది.
- చిన్న, భారీ, మధ్యతరహా నీటి ప్రాజెక్టులకు భారీ నష్టం జరిగింది. తాత్కాలిక పునరుద్ధరణ పనులకు రూ.369.46 కోట్లు, శాశ్వత పనులకు రూ.932 కోట్లు అవసరం.
- 12,856 విద్యుత్తు స్తంభాలు, 2,398 కి.మీ. విద్యుత్తు తీగలు, 2,318 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.
- 643 చేనేత కుటుంబాల దారం, మగ్గాలు దెబ్బతిన్నాయి. రూ.32.25 కోట్ల నష్టం వాటిల్లింది.

4.18 లక్షల ఎకరాల్లో పంటనష్టం

మొంథా తుపాను ప్రభావంతో 4.18 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, పసుపు, జామ, కొబ్బరి తదితర పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 3.60 లక్షల మంది రైతులు నష్టపోయారు. వీరిలో 84% సన్న, చిన్నకారు రైతులే.

వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టం

విషయం	వ్యవసాయ	ఉద్యాన
దెబ్బతిన్న విస్తీర్ణం	4,02,500	15,625
రైతులు	3,27,000	23,979
పెట్టుబడి రాయితీ (రూ.కోట్లలో)		
(ఎన్‌డీఆర్ఎఫ్-కేంద్ర నిబంధనలు)	255.51	128.75
(ఎస్‌డీఆర్ఎఫ్-రాష్ట్ర నిబంధనలు)	390.03	209.16

- 44 ఎకరాల్లో మల్బరీ తోటలు దెబ్బతిన్నాయి. రూ.1.06 లక్షల పెట్టుబడి రాయితీ అందించాలి.

మత్స్య, పశు సంవర్ధక శాఖ పరిధిలో

- 3,063 చేపల చెరువులు దెబ్బతిన్నాయి. 15 మోటారు పడవలు, 77 నాటు పడవలు, 268 వలలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 304 పడవలు, వలలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. మొత్తం రూ.35.01 కోట్ల నష్టం జరిగింది. ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.2.29 కోట్లు పెట్టుబడి రాయితీగా చెల్లించాలి.
- 101 ఆవులు, గేదెలతోపాటు 408 గొర్రెలు/మేకలు, 100 పైగా ఎద్దులు, 1,275 కోళ్లు చనిపోయాయి. 157 పశువుల పాకలు ధ్వంసమయ్యాయి. రూ.1.15 కోట్ల పెట్టుబడి రాయితీ ఇవ్వాలి.

4,566 ఇళ్లు.. రూ.6.81 కోట్ల సాయం కావాలి


- తుపాను కారణంగా 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 62 పూర్తిగా ధ్వంసమయ్యాయి. రూ.6.81 కోట్ల సాయం కావాలి.
- 1,853 పాఠశాలల పైకప్పు, గోడలు, ప్రహరీలు దెబ్బతిన్నాయి. శాశ్వత పనులకు రూ.111 కోట్లు కావాలి.
- 56 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరణకు రూ.13.51కోట్లు అవసరం.

తుపాను ప్రభావం ఇదీ

ప్రభావిత మండలాలు	443
ప్రభావిత గ్రామాలు	3,109
ప్రభావిత కుటుంబాలు	1,11,402
ముంపు బారిన గ్రామాలు	111
ముంపునకు గురైన పట్టణ ప్రాంతాలు	53
చనిపోయిన వారు	3
నీటమునిగిన ఇళ్లు	9,960

అధిక ప్రభావం: బాపట్ల, ప్రకాశం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి

విద్యార్థుల ప్రాణాలు కాపాడి.. తనువు చాలించి


దండుకూరి నారాయణరాజు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: కళాశాల బస్సు డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో వెంటనే బస్సును నిలిపివేసి 50 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడారు. తాను మాత్రం స్టీరింగ్‌పై పడిపోయి మృతి చెందారు. ఈ ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామం వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకుంది. మడికి గ్రామానికి చెందిన దండుకూరి నారాయణరాజు (65) కొత్తపేట మండలం గంటిలో విద్యార్థులను ఎక్కించుకుని రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలకు బయలుదేరారు. జాతీయ రహదారిపై మడికి గ్రామం వద్దకు వచ్చేసరికి గుండెపోటుకు గురయ్యారు. ఆ పరిస్థితిలో ఉన్నా కానీ బస్సును నిలిపి స్టీరింగ్‌పై పడిపోయి ప్రాణాలొదిలారు.


ఈనాడు

సరిహద్దుల్లో విష భుజంగాలు

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ వ్యాఖ్యానించినట్లు- మన ఇష్టాయిష్టాలను బట్టి స్నేహితులను ఎంచుకోగలం కానీ, ఇరుగుపొరుగులను మనం ఎంపిక చేసుకోలేం! ఆయా రాజ్యాల్లో పరిస్థితులు నానాటికీ అస్థిరమవుతుంటే- అవి మనకు ఏమాత్రం సంబంధం లేని విషయాలని అనుకోలేం! ప్రజాస్వామ్యం మేడిపండు చందమైన సరిహద్దు దేశాల్లో మతతత్వ శక్తులు, ముష్కర మిన్నాగులు జమిలిగా పేట్రేగిపోతుంటే, వాటితో అక్కడి అధికారవర్గాలు బాహాటంగానే భుజంకలిపి తిరుగుతుంటే మనం ప్రశాంతంగా గుండెల మీద చెయ్యి వేసుకుని నిద్రపోలేం! ఇండియాపై ఆజన్మాంత వైరాన్ని వెళ్లగక్కే పాకిస్థాన్ ఇప్పుడు ఆర్థిక దుర్బలత్వం, రాజకీయ క్రమరాహిత్యం, హింసాత్మక తిరుగుబాట్లు, సామాజిక అశాంతిలతో కునారిల్లుతోంది. ఇదే అదనుగా రాజ్యాంగాన్ని తనకనుకూలంగా సవరింపజేసుకుని సర్వంసహాధిపత్యాన్ని గుప్పిట పట్టాలని పాక్ సైన్యాధిపతి ఆసీం మునీర్ తలపోస్తున్నారు. ఇటు బంగ్లాదేశ్‌లో నడమంత్రపు అధికారాన్ని వెలగబెడుతున్న మహమ్మద్ యూనస్ - భారత వ్యతిరేక ఛాందసవర్గాలను చంకనెక్కించుకుని ఊరేగుతున్నారు. ఈశాన్య భారతంపై కన్నేసిన స్వదేశీ అతివాద మూకలకు వంతపాడుతూ వివేకభ్రష్ట విధానాలను అనుసరిస్తున్నారు. పాక్, బంగ్లా పరిణామాలను నిత్యం గమనిస్తూ సరిహద్దులను శత్రుదుర్భేద్యం చేసుకోవడం జాతీయ భద్రత దృష్ట్యా మనకు ప్రాణావసరం!

తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం నేటి బంగ్లాదేశ్ పాలకులకు పరిపాటైంది. 'మా ప్రజల కోసం భారతీయ సైనికులు చేసిన రక్తత్యాగాలను మావాళ్లు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు' అని బంగ్లా జాతిపిత ముజిబుర్ రెహమాన్ కృతజ్ఞత చూపిస్తే- యూనస్ ఏమో ఇండియాతో కోరి కయ్యం పెట్టుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఇతర భారత భూభాగాలతో కూడిన 'గ్రేటర్ బంగ్లాదేశ్' మ్యాపును ముద్రించిన పుస్తకాన్ని ఆయన ఇటీవల పాక్ ఉన్నత సైనికాధికారికి బహుమతిగా ఇచ్చారు. దీనిపై ఇండియాలో పెనువిమర్శలు రేగినా పట్టించుకోకుండా తుర్కియే పార్లమెంటరీ బృందానికి కొద్దిరోజుల క్రితం అదే 'బహుమానాన్ని' అందించారు! చైనా, పాక్‌ల ప్రాపకం కోసం వెంపర్లాడుతున్న ఆయన హసీనా సర్కారు గతంలో ఉక్కుపాదం మోపిన మతతత్వ వర్గాలకు కోరినంత స్వేచ్ఛనిస్తున్నారు. ఇండియాయే లక్ష్యంగా అవి యువతలో విషభావాలు నూరిపోస్తుంటే వేడుక చూస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రబలుతున్న అశాంతి భారతావనికి ప్రమాదకరంగా పరిణమిస్తున్న నేపథ్యంలో సిలిగురి నడవాకు సమీపంలో మన సైన్యం కొత్తగా మూడు స్థావరాలను ఏర్పాటుచేసింది. పాక్ దన్నుతో ఈశాన్య భారతంలో బంగ్లా ఎలాంటి కుతంత్రాలకు తెగబడకుండా నిఘాను ఎప్పటికప్పుడు పటిష్ఠపరచాల్సిందే!

బంగ్లాదేశ్ ద్వారా ఇండియాపై విరుచుకుపడటానికి పథక రచన చేస్తున్నామని లష్కరే తొయిబా నాయకుడు సైఫుల్లా సయీఫ్ ఇటీవల బహిరంగంగానే ప్రకటించాడు. ఇలాంటి ముష్కరులకు స్వర్గధామమైన పాక్‌ను పూర్తిగా గుప్పిట పట్టేందుకు సైన్యాధిపతి మునీర్ ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. తన చేతుల్లోని కీలుబొమ్మ సర్కారు ద్వారా త్రివిధ దళాల అధిపతిగా తనకుతాను పట్టాభిషేకం చేసుకుంటున్నారు. మానసిక స్థిరత్వం లేని నిరంకుశ వ్యక్తిగా ఇమ్రాన్‌ఖాన్ అభివర్ణించిన మునీర్- పాక్ న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసేందుకూ పావులు కదుపుతున్నారు. ఇలాగే సైనిక నియంతలైన ఆయుబ్‌ఖాన్, యాహ్యాఖాన్, జియావుల్ హక్, పర్వేజ్ ముషారఫ్‌లు తమ అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు లోగడ భారత్‌పై విషంకక్కి ఉద్రిక్తతలను రాజేశారు. మునీర్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తారనే నమ్మకం లేదు కాబట్టి ఇండియా అనుక్షణం అప్రమత్తంగా ఉండక తప్పదు!



గాంధీజీ మట్టిని బంగారం చేశారు. అది మరో తరహా రసవాదం. ఆయన నుంచి నేర్చుకున్న సిద్ధాంతాలను సంపూర్ణంగా నమ్ముతాను. మానవాళి సంక్షేమానికి అవి చాలా అవసరమని విశ్వసిస్తాను.

– ఆచార్య జె.బి.కృపలానీ

'నేను' ఎవరు?

నిత్యం మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అసలు దుఃఖం ఘటనలో ఉందా, లేక మనం స్పందించే తీరులో ఉందా? దీనికి జవాబు వెతకాలంటే మనసు లోలోతుల్లో జరిగే స్పందనల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాలి. గతం తాలూకు అనుభవాలు, జ్ఞాపకాలు మనకెన్నో ఉంటాయి. అందులో కొన్ని సుఖాన్నిచ్చినవి, కొన్ని బాధ కలిగించినవి. ఇక ప్రపంచపరంగా చూస్తే నా గుర్తింపు- నా పేరు, కుటుంబం, మతం, దేశం, ఆశలు, ఆదర్శాలు మొదలైనవి. ఈ గుర్తింపు, జ్ఞాపకాల సంపుటి మొత్తం మనసులో 'నేను' అన్న ఆలోచనగా రూపుదిద్దుకుంటుంది. వయసు పెరిగే కొద్దీ అనేక ఇష్టాయిష్టాలతో ఈ 'అహం'కార కేంద్రం బలపడుతూ ఉంటుంది.

బయట ఏదో ఒక సంఘటన జరగ్గానే చటుక్కున ఈ 'నేను' ప్రతిక్రియ మొదలు పెడుతుంది. గతానుభవంతో ఆ ఘటనను గుర్తిస్తుంది. వెంటనే పేర్లు పెట్టి, పోల్చి చూసి, తీర్పులివ్వడం ప్రారంభిస్తుంది. గతానుభవం సుఖాన్నిచ్చినదైతే మళ్లీ మళ్లీ కావాలంటుంది. చేదు జ్ఞాపకమైతే వద్దని ప్రతిఘటిస్తుంది. ఈ ప్రక్రియ ఒక అలవాటుగా, స్వభావంలో భాగమైపోతుంది. అంటే మనలో మనకే తెలియకుండా ఒక 'ఆలోచించేవాడు' నిరంతరం పని చేస్తుంటాడన్నమాట. మన జీవితంలో ప్రతి తాజా క్షణాన్నీ గతానుభవంతో కలిపి మలినం చేస్తుంటాడన్నమాట. ఈ 'నేను' జరిపే ప్రతిక్రియల పరంపరే మనిషి జీవితంలో అశాంతికి ముఖ్య కారణం. మనసు కల్పించిన 'నేను'పై, అది చేసే మాయలపై మనకు సంపూర్ణ అవగాహన కలగాలి. అందుకే- 'నేను' ఎవరు అన్న ప్రశ్నకు సమాధానాన్ని శోధించమని పదే పదే చెబుతారు రమణ మహర్షి లాంటి జ్ఞానులు. అలాంటి స్వీయాన్వేషణ, రావాల్సిన పరివర్తన మనిషి అంతరంగంలోనేనన్నది స్పష్టం. మరి దాన్ని వదిలేసి బయటి విషయాల ద్వారా మనశ్శాంతిని వెతకడం ఏంటి అని ప్రశ్నిస్తారు జిడ్డు కృష్ణమూర్తి లాంటి తాత్వికులు.



అంతర్యామి

ఒక ఘటన జరగ్గానే- దానిపట్ల ఏ గుర్తింపూ, పోలికా, తీర్పూ లేకుండా గమనించగలమా? మనలో జరుగుతున్న స్పందనల పట్ల ఒక సాక్షిగా ఎరుకతో ఉండగలమా? మనసు లోపల చటుక్కున జరిగే ఈ కీలక స్పందన మీదే సర్వం ఆధారపడి ఉంది. చిన్న అణువులో అనంత శక్తి దాగి ఉన్నట్లు ఈ క్షణమాత్రపు 'ఎరుక'లోనే సమస్త ఆధ్యాత్మిక సారం దాగి ఉంది. అంటే ప్రతి క్షణాన్నీ నిత్యనూతనంగా చూడగలగడం. ప్రతి అనుభవాన్నీ గత ప్రమేయం లేకుండా పరికించగలగడం. అలా 'నేను', దాని తాలూకు ప్రతిక్రియల పట్ల ఎరుక పెంచుకోవడమే నిజమైన ఆధ్యాత్మిక సాధన. అదే అసలైన ధ్యానం! దైనందిన జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటననీ, ప్రతి అనుభవాన్నీ ఈ సాధనకు ఒక అవకాశంగా మలచుకోగలిగితే 'నేను' క్రమంగా బలహీనపడిపోతుంది. అహం రాలిపోతుంది. మన నిజ తత్వం బోధపడుతుంది. అప్పుడిక విశ్లేషణలు- తీర్పులు పోయి కేవలం సాక్షీ మాత్రపు 'పరిశీలనే' ఉంటుంది. అదే ధ్యాన ఫలం. అదే జ్ఞానోదయం!

– ఈదర రవికిరణ్

చర్చలతో సరి... చర్యలు ఏవీ?

వాతావరణ మార్పుల నిరోధానికి గడచిన 33 ఏళ్లలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 29 శిఖరాగ్ర సభలు జరిగాయి. కానీ, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. బ్రెజిల్‌లోని బెలెంలో ఈనెల 10-21 తేదీల మధ్య తలపెట్టిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్-30) మహాసభలో ప్రపంచ దేశాల నాయకులు మళ్లీ చర్చోపచర్చలు సాగించనున్నారు. ఈసారైనా కర్బన ఉద్గారాల కట్టడికి సమర్థ కార్యాచరణ చేపడతారేమో చూడాలి.

మానవాళి మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తున్న వాతావరణ మార్పుల నిరోధానికి ఐక్యరాజ్యసమితి దశాబ్దాలుగా కృషి చేస్తోంది. ఆ మేరకు 1997లో క్యోటో ఒప్పందం, 2015లో పారిస్ ఒప్పందం ద్వారా కర్బన ఉద్గారాల కట్టడికి ప్రపంచ దేశాలు సంకల్పం ప్రదర్శించినా ఆచరణలో విఫలమయ్యాయి. 2021 గ్లాస్గో కాప్-26 సభ బొగ్గు వాడకాన్ని పూర్తిగా నిలిపేయాలని తీర్మానించినా అది అటకెక్కింది. 2022 షర్మ్ అల్ షేక్ కాప్-27 సభ వాతావరణ మార్పులవల్ల కలిగే నష్టాలకు పరిహార నిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. 2023 దుబాయ్ కాప్ సభ మొట్టమొదటిసారిగా పునరుత్పాదక ఇంధన వనరులకు మారాలని పిలుపిచ్చింది. ప్రస్తుతం వీటి ద్వారా చేస్తున్న విద్యుదుత్పత్తిని 2030కల్లా మూడు రెట్లకు పెంచాలని పేర్కొంది. కానీ, కాప్ పాత తీర్మానాలన్నీ వట్టి మాటలుగానే మిగిలిపోయాయి. కర్బన ఉద్గారాలు 1995కన్నా ఇప్పుడు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో కార్చిచ్చులు అడవులను దహించేస్తున్నాయి. తుపానులు పదేపదే విరుచుకుపడుతూ తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాలు కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు కొండలా పెరిగిపోయాయని నిరుడు బాకులో జరిగిన కాప్-29 సభలో ఐరాస వాతావరణ వ్యవహారాల విభాగాధిపతి సైమన్ స్టియెల్ హెచ్చరించారు.



నిధులు విదిల్చేందుకు ససేమిరా...

కర్బన ఉద్గారాలను పరిహరించనిదే వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయలేమని కాప్ సభల్లో ప్రపంచ దేశాలు అంగీకరించినా, సంపన్న దేశాలు తమ ఉద్గారాలను తగ్గించడానికి ససేమిరా అంటున్నాయి. అమెరికా అయితే ఏకంగా పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగింది. హరిత వాతావరణ నిధికి ఇవ్వాల్సిన 300కోట్ల డాలర్ల నిధులనూ నిలిపేసింది. ఫలితంగా 2035కల్లా కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలు అదనంగా 180కోట్ల టన్నుల మేర పెరగనున్నాయి. తరవాత అమెరికా మళ్లీ హరిత వాతావరణ నిధిలో చేరినా తాను ఇవ్వాల్సిన 300కోట్ల డాలర్లలో వంద కోట్ల డాలర్లనే విదిల్చింది. ఐరోపా దేశాలు చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాల వాడకానికి సబ్సిడీ ఇస్తూనే ఉన్నాయి. బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడాలదీ అదే వరస. సంపన్న దేశాలు వెదజల్లుతున్న ఉద్గారాలు వాతావరణ మార్పులను మరింత ప్రకోపింపజేస్తున్నాయి. దాని ఫలితాన్ని వరదలు, తుపానులు, మండుటెండల రూపంలో పేద దేశాలు అనుభవిస్తున్నాయి.

భూగోళ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్ దగ్గర పట్టి నిలపాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ, భూమి ఇప్పటికే 1.2 డిగ్రీల సెల్సియస్ మేర అదనంగా వేడెక్కింది. 2023 అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరంగా రికార్డులకెక్కింది. ఆ తరవాత రెండు లేదా మూడో స్థానాన్ని 2025 ఆక్రమించనుందని ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా వెల్లడించింది. మొన్న జనవరి-ఆగస్టు మధ్య సగటు ఉష్ణోగ్రతలు 1.42శాతం అధికంగా నమోదైనట్లు వివరించింది. ఇదే ఒరవడి కొనసాగితే 2100కల్లా భూగోళం అదనంగా 2.5డిగ్రీలు లేదా అంతకన్నా ఎక్కువగానే వేడెక్కుతుంది. అసలు రెండు డిగ్రీలు అదనంగా వేడెక్కితేనే పంట వైఫల్యాలు, వడ దెబ్బలు, పగడాల దిబ్బలు అంతరించిపోవడం వంటివి సంభవిస్తాయి. ఇక 2.6-3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగితే ధ్రువాల్లోని మంచు శాశ్వతంగా కరిగిపోతుంది. అమెజాన్ అడవులు అంతరించిపోతాయి.

శీతల దేశమైన అమెరికాలోని ఫీనిక్స్‌లో ఉష్ణోగ్రత నెల రోజుల పాటు 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పశ్చిమాసియాలో ఉష్ణోగ్రత 60 డిగ్రీలకు చేరింది. కెనడాలో కార్చిచ్చులకు 1.8కోట్ల హెక్టార్ల అడవి బుగ్గి అయింది. 2022లో పాకిస్థాన్‌లో వచ్చిన వరదలకు 1700 మందికిపైగా మరణించారు. 2023లో లిబియాపై విరుచుకుపడిన డేనియల్ తుపానుకు 4వేల మందికిపైగా బలయ్యారు. తూర్పు ఆఫ్రికాలో దుర్భిక్షం వల్ల ఆకలి కేకలు మిన్నంటాయి. ఇలా వాతావరణ మార్పుల వల్ల 2023లో 26,800కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లగా, నిరుడు అది 32వేల కోట్ల డాలర్లకు పెరిగింది. అమెరికాకు 2020-24 మధ్య ఏటా 14,900 కోట్ల డాలర్ల నష్టం సంభవిస్తూ వచ్చింది. భారతదేశానికి 2023లో 1200 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. 2024-25లో ఉత్తర భారతంలో 3,080 మరణాలు సంభవించాయి.

పైరవీలతో నిర్ణయాలకు అడ్డుపుల్ల...

భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్ దగ్గర పట్టి నిలపాలంటే- మరో అయిదేళ్లలో ఉద్గారాలను 45శాతం తగ్గించాలి. కానీ అది జరగడం లేదు. వాతావరణ మార్పుల కట్టడిలో పేద దేశాలకు సాయపడేందుకు ఏటా పదివేల కోట్ల డాలర్ల నిధులిస్తామన్న సంపన్న దేశాల హామీ అరకొరగానే అమలవుతోంది. 2035కల్లా ఈ సాయాన్ని ఏటా 30వేల కోట్ల డాలర్లకు పెంచాలన్న కాప్-29 తీర్మానం అమలుకు నోచుకోవడం అనుమానమే! ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ఒప్పందం కుదుర్చుకోవడంలోనూ ప్రపంచ దేశాలు విఫలమయ్యాయి. అయితే, అంతర్జాతీయ న్యాయస్థానం మాత్రం కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన చట్టపరమైన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని మొన్న జులైలో తెగేసి చెప్పింది. ఈ బాధ్యతను నెరవేర్చకపోతే నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందనీ హెచ్చరించింది. కానీ చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను ఉత్పత్తి చేసే దేశాలూ కంపెనీలూ కాప్ సభలలో నిర్ణయాత్మక పరిష్కారాలు కుదరకుండా పైరవీలు చేస్తున్నాయి. అమెజాన్ అడవులకు నెలవైన బ్రెజిల్‌లో జరుగుతున్న కాప్-30 సభ అడవులు, సముద్రాలు కర్బన ఉద్గారాలను ఇముడ్చుకోవడంలో సాటిలేనివనీ, వాటిని సంరక్షించుకోవాలని పిలుపిస్తోంది. ఈ సభలో నిర్దిష్ట నిర్ణయాలు జరిగి అవి కార్యరూపంలోకి మారతాయని ఆశిద్దాం.



హరికృష్ణ నిబానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్



అందుకున్నా ఆనందం!

ప్రస్తుతం అంతా హైపర్ కనెక్టడ్ సొసైటీ. ఎవరు ఏ వేడుక చేసుకున్నా, ఏ వెకేషన్‌కి వెళ్లినా సోషల్‌మీడియా పుణ్యమా అని ప్రపంచమంతా తెలిసిపోతుంది. దాంతో చాలామందిలో మనం ఆ ఫంక్షన్ చేసుకోలేకపోతున్నామే, ఆ ప్రదేశాలకు వెళ్లలేకపోతున్నామే అన్న మథనం మొదలవుతుంది. వాళ్లలా జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నామన్న ఆందోళన మొలకెత్తుతుంది. ఏదో కోల్పోతున్నామన్న బాధ మనసును తొలిచేస్తుంది. దీనినే 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్(ఫోమో)' అంటున్నారు. ఈ 'ఫోమో' వల్ల ఒత్తిడి, అలజడి, దిగులు వంటి ఎన్నో మానసిక సమస్యలు తలెత్తుతాయని సైకాలజిస్టులు చెబుతున్నారు. అయితే అమెరికాకు చెందిన అనిల్ డాష్ అనే యువ వ్యాపారవేత్త ఈ 'ఫోమో'కు విరుగుడుగా 'జోమో' అన్న పదాన్ని పరిచయం చేశాడు. అంటే జాయ్ ఆఫ్ మిస్సింగ్ అవుట్. అప్పటి వరకు 'ఫోమో'తో అలజడికి గురవుతున్న చాలామందికి 'జోమో' ఓ మంత్రంలా పనిచేస్తోంది. ఆలోచనల దిశ మారుస్తోంది.

అనిల్ డాష్‌కి కొడుకు పుట్టినప్పుడు నెల రోజుల పాటు స్నేహితులతో పార్టీలు, షికార్లు... అన్నీ మిస్సయ్యాడట. అయితే వాటన్నింటినీ కోల్పోయినా, వాటిని మించిన ఆనందం లభించిందని తన అనుభూతిని మిత్రులతో పంచుకున్నాడు. ఆ సంతోషానికే 'జాయ్ ఆఫ్ మిస్సింగ్.. జోమో' అని పేరు పెట్టాడు. కొన్ని కోల్పోయినప్పుడే ఇంకొన్ని కొత్త ఆనందాలు సొంతమవుతాయని గుర్తుచేశాడు. ఉన్న పరిస్థితుల్లోనే తనను తాను ఆనందంగా ఉంచుకోవడం ఎలాగో తెలిసొచ్చిందన్నాడు. అప్పటి వరకు అతడు బయటి సరదాలు, సంబరాల్లో సంతోషాన్ని వెతుక్కున్నాడు. కానీ ఆ నెలరోజులు కొడుకును చూసుకుంటూ, భార్యాబిడ్డలకు సేవలు చేస్తూ అంతకు మించిన మానసిక ఉల్లాసాన్ని అనుభవించాడట. కొన్ని సాధారణమైన సంతోషాలు కోల్పోయినప్పుడే, మరికొన్ని అసాధారణమైన ఆనందాలు లభిస్తాయని అనుభవపూర్వకంగా తెలుసుకున్నానని చెప్పాడు.

జీవితంలో అందరికీ అన్నీ సాధ్యం కాకపోవచ్చు. కొందరికి ఉద్యోగ, వ్యక్తిగత జీవితాల్లోని బరువు బాధ్యతల వల్ల మిగతా వారిలా సరదాలు, సంబరాలు కుదరకపోవచ్చు. అంతమాత్రాన 'ఫోమో'తో కుంగిపోనక్కరలేదు. ఫోమో అనేది పోల్చుకోవడం నుంచి పుట్టే న్యూనతా భావన. ఎవరో ఏదో చేస్తున్నారు, మనమూ అది చేయకపోతే అప్‌డేట్ అవ్వలేదని అనుకుంటారనుకోవడం ఆత్మన్యూనత. పరుగులో వెనకబడి, అందరి దృష్టిలో కనుమరుగైపోతామని అనుకోవడం అంతకు మించిన బలహీనత. ఎవరి అనుకూలతలు, అభిరుచులు వారివి. ఆనందం అనేది మన మానసిక పరిణతిపై ఆధారపడి ఉంటుంది. కొందరు వారాంతంలో కుటుంబంతో కాలనీలోని పార్కుకు వెళ్లినా మరపురాని అనుభూతుల్ని మిగుల్చుకోగలరు. మరికొందరు లక్షలు ఖర్చుపెట్టి నయాగరా జలపాతాన్ని దర్శించినా నీరసంగానే వెనుతిరిగి వస్తారు. అలా అని అన్నీ మిస్ చేసుకుంటూ అందని ద్రాక్ష పుల్లన అని సరిపెట్టుకోనక్కరలేదు. కానీ అందేవరకు అలజడికి లోను కాకుండా, మనసును ఉల్లాసంగానే ఉంచుకోమని చెప్పటమే జాయ్ ఆఫ్ మిస్సింగ్ ఉద్దేశం.

– చైతన్య



చమురే ఆధారం!


భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తాజాగా అంగోలా, బోట్సువానాల్లో పర్యటిస్తున్నారు. అంగోలా నుంచి ఇంధన కొనుగోళ్లకు దీర్ఘకాల ఒప్పందాలు చేసుకునేందుకు మన చమురు-సహజ వాయు సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని ఆమె వెల్లడించారు. గతేడాది అంగోలా నుంచి 356 కోట్ల డాలర్ల విలువైన ముడి చమురును భారత్ దిగుమతి చేసుకుంది. పలు ఆఫ్రికా దేశాలకు ముడి చమురు ఎగుమతులే ప్రధాన ఆదాయవనరు. 2021లో ఆయా దేశాల జీడీపీలో చమురు విక్రయాల వాటాలు... (శాతాల్లో)

లిబియా	56
కాంగో	34
అంగోలా	28
చాద్	17
గబాన్	16
ఈక్వెటోరియల్ గినియా	15
అల్జీరియా	14
నైజీరియా	6.2
ఘనా	4.1

(ఆధారం: ప్రపంచ బ్యాంక్ నివేదిక - 2025)

తెలంగాణ ఆత్మగీతాకారుడు... అందెశ్రీ

ప్రకృతి పాఠశాలలో పాటను దిద్దుకున్న సహజకవి అందెశ్రీ. పరిసరాల్లోని పరిణామాలకు పాటగా పరిఢవిల్లిన ప్రజాకవి ఆయన. పసితనం నుంచే పశువుల కాపరిగా పని చేసినా, రోజువారీ కూలీగా, తాపీ మేస్త్రీగా శ్రమించినా మనసు మాత్రం పదాల చుట్టూ పరిభ్రమించేది. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఊహ తెలియని వయసులో తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథైన ఆయనకు పాట తొలి ఊరటనిచ్చింది. ఏ బడిలో చదువుకోకపోయినా లోకమనే విశ్వవిద్యాలయంలో గాఢమైన తాత్విక విషయాలను అవగాహన చేసుకున్నారు. తొలిదశలో శృంగేరి మఠ పీఠాచార్యులు స్వామి శంకర్ మహరాజ్ ఆశీస్సులతో జీవనోత్సాహాన్ని నింపుకొన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రేమాభిమానాలు పొంది ఆయన మార్గదర్శకత్వంలో సాహిత్య సృజనకు పాదులు తవ్వుకున్నారు.



సాహిత్యంలో వశీకరణ శక్తిని నింపుకొన్న ప్రక్రియ పాట. రాతి హృదయాల్లోనూ చివుళ్లను మొలిపించగల స్పర్శ పాటలో దాగుంది. అది భూప్రకంపనలను మించిన స్పందనల్ని సృష్టిస్తుంది. అందెశ్రీ అటువంటి పాటల సృష్టికర్త. ఆ పాటల ఝరి నిన్న శాశ్వతంగా మూగబోవడం అందరికీ తీరని విషాదం.


పోరాటానికి చిహ్నం

అందెశ్రీ తన ఆరేళ్ల వయసు నుంచే ఆశువుగా పాటల్లడం మొదలుపెట్టారు. తనలోని కవితాత్మను నిదురలేపి సాహితీ జిజ్ఞాసను కలిగించిన గురువులందరినీ తలచుకుంటూ 'పాటల పూదోట' లలిత గీతాల సంపుటిని 1994 అక్టోబరులో వెలువరించారు. అదే సంవత్సరం డిసెంబరులో 'అందెల సందడి' అనే కవితా సంపుటి అందించారు. అందెశ్రీ ఈ రెండు గ్రంథాలకు ప్రముఖ సాహితీవేత్తలు సి.నారాయణరెడ్డి, పేర్వారం జగన్నాథం, రావూరి భరద్వాజ, బోయి భీమన్న తదితరులు ముందుమాటలు రాశారు. వారందరి మాటలను క్రోడీకరిస్తే నిలిచే మాట 'అందెశ్రీని దేశం నిలపకపోతే, కాలం నిలుపుతుంది' అని. నిజంగానే కాలం గుండెల మీద చెరిగిపోని కవితా వాక్యమై ప్రతిధ్వనిస్తుంది అందెశ్రీ పాట.

అందెశ్రీ అనగానే ఎన్నో ప్రజాదరణ పొందిన గీతాలు మనల్ని చుట్టుముడతాయి. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో 'జయ జయహే తెలంగాణ' పాట మార్చ్‌ఫాస్ట్ ఉద్యమ గీతంగా ప్రజానీకాన్ని ముందుకు నడిపించింది. నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా అది విరాజిల్లుతోంది. తెలంగాణ సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అస్తిత్వ వైభవాన్ని కీర్తించిన ఈ గీతం ఎప్పుడు విన్నా గాఢమైన భావోద్వేగాలను అందిస్తూ ఒక చారిత్రక పోరాటాన్ని, విజయాన్ని గుర్తుకు తెస్తుంది. తెలంగాణ ఉద్యమ సందర్భంలో అనేక సభల్లో అందెశ్రీ పాటలు ప్రజలను ఉర్రూతలూపాయి. 'జై బోలో తెలంగాణ/ గళ గర్జనల జడివాన/ జై బోలో తెలంగాణ/ నిలువెల్ల గాయాలవీణ/...' ఇందులో ఒక్కో కవితా పాదంలో ఎంతటి ఉత్ప్రేరక శక్తి కేంద్రీకృతమై ఉందో అందరికీ అనుభవమే. 'పల్లె నీకు వందనాలమ్మో/ నను గన్న తల్లీ నీకు వందనాలమ్మో/ నాకు పాట నేర్పి ఆట నేర్పి బతుకు బాట నేర్పిన/ పల్లె నీకు వందనాలమ్మో' అనే పాటను అందెశ్రీ ఆత్మకథాత్మక గీతంగా చెప్పవచ్చు. ఇక 'కొమ్మ చెక్కితే బొమ్మరా/ కొలిసి మొక్కితే అమ్మరా..' అనే పాట అందెశ్రీలో గ్రామీణ దేవతలపై ఉన్న భక్తితత్వాన్ని ఆవిష్కరిస్తుంది. పల్లెలోని అణువణువులో ఉన్న జానపద సాంస్కృతిక అంశాలను స్మరిస్తుంది.

ఆత్మవిమర్శకు పురిగొల్పే పాట

అందెశ్రీ ఒక ఆధ్యాత్మిక బాటసారి. దారి పొడవునా పాట తోడుగా నడిచి పోయే జానపదుడు. మనిషిని కేంద్రంగా చేసుకుని మానవీయ జీవన విలువల కోసం ఆయన అన్వేషించారు. 'మాయమైపోతున్నడమ్మో మనిషన్నవాడు' పాటలో మానవత్వం పరిమళించే వ్యక్తికోసం భూగోళమంతా ప్రతిధ్వనించేలా తన భావాలను వినిపించారు. అందెశ్రీకి కావాల్సింది కేవలం భౌతికమైన మనుషులే కాదు. ఆ మనుషుల మనసులు మానవత్వంతో నిండిపోవాలి. మరో మనిషి పట్ల ప్రేమతో స్పందించగలగాలి. అలాంటి నిజమైన మనిషి కోసం ఆయన ఆవేదనతో ఆలపించారు. క్షీణిస్తున్న మానవ సంబంధాల పట్ల అందెశ్రీ చేసిన ఈ విలాపం ఇంకా వినబడటమే విషాదం. ప్రతి వ్యక్తినీ ఆత్మవిమర్శకు పురిగొల్పే పాట ఇది. అందెశ్రీ శాశ్వత చిరునామాల్లో ఈ గీతం ప్రథమ శ్రేణిలో నిలబడుతుంది. 'గంగ' అనే సినిమాకు రాసిన పాటల్లో సినీ గీతాలకు తాత్విక కావ్యస్థాయిని చేకూర్చారు. తళుకు బెళుకుల టీవీ సినిమా మాధ్యమాల ఆకర్షణలకు లొంగిపోకుండా తన అస్తిత్వాన్ని ఆయన కాపాడుకున్నారు. తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణ దశలో భాగంగా అందెశ్రీ 1307 పేజీలతో 'నిప్పులవాగు' అనే బృహత్ కవితలు, పాటల సంకలనాన్ని తెచ్చారు. ఈ భూగోళం మీద ప్రవహిస్తున్న అన్ని నదులపై ప్రయాణిస్తూ ఒక బృహత్ నదీకావ్యం రాయాలని స్వప్నించారు. అది సాకారమయ్యే వేళ అందరినీ కన్నీటి నదిలో ముంచేసి వెళ్లిపోయారు. అందెశ్రీ తన 'అందెల సందడి'ని అలిశెట్టి ప్రభాకర్‌కు అంకితమిస్తూ 'ప్రజాకవిగా ప్రభవించిన అజరామరుడు' అని ఆయనను కీర్తించారు. అందెశ్రీ కూడా అలాంటి అజరామర కవే!



డాక్టర్ ఎస్.రఘు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

చకచకా జవాబులు చెప్పి..

హాయ్ బుజ్జీ!!

హాయ్ ఫ్రెండ్స్..! స్కూల్లో టీచర్ హోంవర్క్ ఇస్తే చకచకా చేసేస్తాం. కానీ వాటికి సంబంధించిన ఏవైనా ప్రశ్నలు అడిగితే కొన్నిసార్లు తడబడిపోతుంటాం. కానీ కాస్త పట్టుదలతో కష్టపడితే చక్కగా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పొచ్చు.. బోలెడు బహుమతులూ గెలుచుకోవచ్చు... అని నిరూపిస్తున్నారు ఈ నేస్తాలు!

ఖమ్మం నగరానికి చెందిన తుర్కా దేవిశ్రీ ప్రసన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వరంగల్ జిల్లా కడిపికొండకు చెందిన మాటేటి దీక్షిత ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని. వీళ్లిద్దరూ కిందటి నెలలో నాగాలాండ్‌లో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 'రెడ్ రిబ్బన్ క్విజ్' పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొన్నారు. అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమ స్థానంలో నిలిచి.. రూ.లక్షతో పాటు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అంతకుముందు ఆగస్టులో ఖమ్మంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో దేవిశ్రీ, సమీర్‌పాషా బృందం గెలిచింది. ఆ తరవాత సెప్టెంబరు 2న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లోనూ మొదటి స్థానంలో నిలిచింది. అదే నెల 22న పట్నాలో నిర్వహించిన ప్రాంతీయ క్విజ్ పోటీల్లో దేవిశ్రీ ప్రసన్న బృందంలో సమీర్‌పాషా బదులు దీక్షిత చేరింది. ఈ పోటీల్లో ఎనిమిది రాష్ట్రాల నుంచి ఎనిమిది బృందాలు పాల్గొనగా.. వాళ్లందరినీ దాటుకుని దేవిశ్రీ, దీక్షిత విజయం సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన మన నేస్తాలు 85 మార్కులు సాధించగా రెండో స్థానంలో ఉన్న నాగాలాండ్ బృందం 45 మార్కులే పొందింది. దేవిశ్రీ, దీక్షిత భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆల్ ది బెస్ట్ చెప్పేద్దామా!



– షేక్ లాలా

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి.

1. షర్ట్, గ్లాస్, ఐరన్‌బాక్స్, ప్యాంట్
2. వేరుశనగ, బీట్‌రూట్, ముల్లంగి, క్యాప్సికమ్
3. సీతాకోకచిలుక, పిచ్చుక, బాతు, పావురం

1. గ్లాస్ 2. క్యాప్సికమ్ 3. బాతు

దేశంలోనే మొదట.. బందరు సాయిబాబేనట



దేశవ్యాప్తంగా అనేక సాయిబాబా దేవాలయాలు ఉన్నాయి. కానీ మచిలీపట్నంలోని బాబా అందరి కంటే ప్రత్యేకం. 54 అడుగుల ఎత్తు, 36 అడుగుల వెడల్పులో ఫణీంద్రుని పడగనీడలో సింహాసనంపై కూర్చున్న బాబా విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయితే ఇంత పెద్ద విగ్రహం దేశంలో మొదటిగా నిర్మించింది బందరులోనే. బాబా భక్తుడైన విఠల్‌రావు 1994లో చిన్నపాకలో బాబా విగ్రహాన్ని నెలకొల్పారు. తర్వాత 2007లో ఈ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు దీన్ని పరిశీలించి దేశంలోనే ఎత్తయిన విగ్రహంగా 2011లో ప్రకటించారు. ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో ఇంతకంటే ఎత్తైనవి నిర్మించారు. ఇక్కడి సాయిబాబా విగ్రహాన్ని చూడాలంటే రెండు కళ్లు చాలవు. శిర్డీలో మాదిరిగానే ఇక్కడ సేవలు నిర్వహిస్తారు. ప్రతి గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. వివిధ మత ప్రబోధకుల ప్రతిమలు కూడా ఈ ఆలయంలో కొలువుదీరి ఆలయ ప్రత్యేకతను చాటి చెబుతున్నాయి.

-న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

బడి గంట.. మూడు గ్రామాల్లో ప్రతిధ్వని

నూరేళ్లకు పైగా చరిత్ర ఉన్న తాడంకి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గతంలో బడి గంట మోగితే తాడంకి, మంటాడ, గురజాడ గ్రామాల్లో ప్రతిధ్వనించేదని వృద్ధులైన పాఠశాల పూర్వ విద్యార్థులు చెబుతున్నారు. ఉదయం మొదటి గంట వినబడగానే పరుగున పాఠశాలకు చేరేవారమని నాటి కబుర్లను గుర్తు చేస్తున్నారు. ఆ గంట, దాని ఏర్పాటుకు నిర్మించిన సుమారు 25 అడుగుల ఆర్చి తాము చదువుకునే నాటికే ఉండేదని చెబుతున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఆ గంట పగిలిపోగా ఓ పూర్వ విద్యార్థి మరో దాన్ని ఏర్పాటు చేశారు. అది ఏమైందోనని ఇటీవల జరిగిన పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో పూర్వ విద్యార్థుల మధ్య చర్చకొచ్చింది.



గుర్తుగా మిగిలిన గంట స్తంభం

-న్యూస్‌టుడే, పమిడిముక్కల

నగరంలో రెడ్ అలర్ట్

25 ప్రత్యేక బృందాల ఏర్పాటు

దేశ రాజధాని దిల్లీలో సోమవారం రాత్రి కారు బాంబు పేలుడు ఘటనతో విజయవాడ నగరంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నగరవ్యాప్తంగా రెడ్ ఎలర్ట్ ప్రకటించారు. సీపీ రాజశేఖరబాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో అధికారులకు బందోబస్తుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైల్వే స్టేషన్, బస్టేషన్లను జల్లెడ పట్టారు. ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గమ్మ వారిధి, దుర్గగుడి, బీసెంట్ రోడ్డు, వన్‌టౌన్‌ల్లో తనిఖీలు విస్తృతం చేశారు.



ప్రకాశం బ్యారేజీ వద్ద పోలీసుల తనిఖీలు

అంతా అప్రమత్తం.. దేశంలోనే అతి ముఖ్య రైల్వే కూడళ్లలో విజయవాడ రైల్వేస్టేషన్ ఒకటి. పండిట్ నెహ్రూబస్టేషన్ రాష్ట్రంలోనే అతి పెద్దది. నిత్యం మూడు లక్షల మంది రాకపోకలు సాగిస్తుంటారు. పేలుడు నేపథ్యంలో ఈ రెండు ప్రాంతాల్లో నిఘాను పటిష్ఠం చేశారు. కృష్ణలంక సీఐ నాగరాజు సిబ్బందితో బస్టేషన్‌లో తనిఖీలు చేశారు.

అనుమానమా.. చెప్పండి.. నగరవ్యాప్తంగా లాడ్జిల తనిఖీలకు 15 బృందాలు, వాహన తనిఖీలకు మరో 10 ప్రత్యేక బృందాలను నియమించారు. అనుమానాస్పద వస్తువులు, వాహనాల సమాచారం తక్షణమే పోలీసులకు తెలపాలన్నారు. లాడ్జిల్లో దిగిన వారి వివరాలు, వారి గుర్తింపు కార్డులను పరిశీలించారు.



బస్‌స్టేషన్‌లో బ్యాగులు పరిశీలిస్తూ...

సీఎం పర్యటనపై ఉత్కంఠ.. సీఎం చంద్రబాబు సోమవారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తుండడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఆయన రాకపోకలు సాగించే మార్గంలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. డీసీపీలు, ఏడీసీపీ, ఏసీపీల నేతృత్వంలో కళాక్షేత్రం నుంచి ఉండవల్లికి వెళ్లే మార్గంలో పూర్తి తనిఖీలు నిర్వహించారు. ★ పశ్చిమ ఏసీపీ దుర్గారావు నేతృత్వంలో వన్‌టౌన్ పోలీసులు ప్రకాశం బ్యారేజీ వద్ద ఆకస్మిక తనిఖీలు సోమవారం చేపట్టారు. సీఐ గురుప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయంలో గాలింపు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతా తనిఖీలను సోమవారం ముమ్మరం చేశారు. సీఐఎస్ఎఫ్, ఎస్పీఎఫ్ భద్రతా బృందాలతో విమానాశ్రయ పరిసరాల్లో కదలికలపై అప్రమత్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బందిని ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

- విజయవాడ నేరవార్తలు, విజయవాడ బస్టేషన్, గన్నవరం గ్రామీణం, విద్యాధరపురం, కృష్ణలంక, చిట్టినగర్

మరింత తగ్గిన వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్: ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం సోమవారం మరింత తగ్గింది. సాయంత్రం ఆరు గంటలకు 25 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. 18,125 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 9,462 క్యూసెక్కులు విడుదల చేశారు.

సలహా ఇవ్వొచ్చు.. సాయం పొందొచ్చు

ఈనాడు, అమరావతి



గ్రామీణాభివృద్ధి శిబిరంలో అవగాహన

ఇగ్నైట్ సెల్.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మొదలు.. అభివృద్ధి కార్యక్రమాల వరకు ఎక్కడైనా లోపాలు ఉంటే.. మార్పులు చేయడానికి వేదిక. మీ ఉద్యోగ, వ్యాపార, ఉపాధి అవసరాలకు చేయూతనిచ్చే మార్గదర్శిగా భరోసా. మీ వినూత్న, సృజనాత్మక ఉత్పత్తులకు పెట్టుబడి నుంచి మార్కెటింగ్ వరకు బాసట. కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మరెక్కడా లేని వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు.

అసలేంటీ సెల్...

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో కొద్ది రోజుల కిందట ఇగ్నైట్ సెల్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలు, వైద్య, డీఆర్‌డీఏ, డ్వామా ఇలా అన్ని ప్రధాన శాఖలు రోజుకో శాఖ చొప్పున ఈ సెల్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తోంది. ఏ రోజు ఏ శాఖ శిబిరం ఏర్పాటు చేయాలో కాల పట్టిక రూపొందిస్తున్నారు.
- ఉదాహరణకు వ్యవసాయ శాఖ శిబిరం ఏర్పాటు చేస్తే ప్రజలకు గ్రామస్థాయి వరకు వివిధ మార్గాల్లో సమాచారం అందిస్తారు. అధికారులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. ఆ రోజు వచ్చిన ప్రజలకు సాగు పద్ధతులు, ధాన్యం అమ్మకాల వేళ జాగ్రత్తలు, ప్రకృతి సాగులో మెలకువలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, దరఖాస్తు చేసుకునే తీరుపై అవగాహన కల్పిస్తారు.
- ప్రకృతి సేద్యంతో అద్భుతాలు చేస్తున్న రైతులను తీసుకొచ్చి వారి విజయ ప్రస్థానం గురించి చెప్పిస్తారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచుతారు. ఇలా ప్రతీ శాఖ చేయాల్సిందే.

ప్రత్యేక యాప్‌తో పర్యవేక్షణ...

- ఇగ్నైట్ సెల్‌ను సందర్శించి సమాచారం పొందినా, సలహాలు ఇచ్చినా.. ఉద్యోగం, ఉపాధి అవసరమన్నా వారి వివరాల నమోదుకు ఇగ్నైట్ యాప్ రూపొందించారు. కలెక్టర్ లక్ష్మీశనే నేరుగా ఆ యాప్ ద్వారా కార్యక్రమ పురోగతి పర్యవేక్షిస్తున్నారు.
- ఇప్పటి వరకు 5,000 మంది ఈ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న 1,000 మందికి శిక్షణ ఇస్తున్నారు.
- కొద్ది రోజుల కిందట ధాన్యం కొనుగోలు చేసినా రైతుల బ్యాంకు ఖాతాల్లో సాంకేతిక సమస్యలతో నగదు జమకావడం లేదని పరిష్కరించాలని నమోదు చేశారు. ధాన్యం కొనుగోలు సిబ్బందితో ఖాతాల్లో సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించగా.. రైతులకు ఉపకరించింది.
- వన్ ఫ్యామిలీ.. వన్ ఆంధ్ర ప్రెన్యూర్, విజన్-2047 వంటి ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలను చేరుకునేందుకు ఇగ్నైట్ సెల్‌ను సోపానంగా నిలుస్తోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

చిలకలబోడు.. చివరకు గోడు!

- లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో విచారణ
- బాధ్యులపై ఇంతవరకూ ఏ చర్యలూ లేవు..

"విజయవాడ గ్రామీణంలో కొత్తూరు రిజర్వు ఫారెస్టులో వైకాపా జమానాలో.. మట్టి అక్రమ తవ్వకాలు, అటవీ భూముల ఆక్రమణ విచ్చలవిడిగా జరిగింది. వీటిపై ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. అడవినెక్కలం బీట్, పాతపాడు పరిధి అటవీ భూముల్లో భారీగా మట్టి తవ్వకాలు చేపట్టారు. అడవి హద్దురాళ్ల(కేరిన్స్) పీకేసి మరీ తవ్వేశారు."

"310, 311 హద్దురాళ్లను పీకేసి.. ఏకంగా 70-80 అడుగుల లోతులో భూమిని తొలిచేసి మట్టిని తరలించి రూ.కోట్లు తినేశారు. దీనిపై ఫారెస్టు విజిలెన్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే విచారణ చేపట్టి నివేదించారు. తాజాగా ఫిర్యాదుదారును.. వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. ఈ అక్రమాలపై ఎంతవరకూ చర్యలు చేపట్టారనేది తెలియజేయాలని లోకాయుక్త సూచించింది.'

ఈనాడు - అమరావతి

కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్, అడవినెక్కలం ఫారెస్ట్ బీట్ ప్రాంతాలపై రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్త సర్వే చేసి.. సరిహద్దు పిల్లర్లను వేయాలని విజిలెన్స్ నివేదికలో సూచించినా.. ఎలాంటి సర్వే చేయలేదు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని.. బాధ్యులపై కేసులు పెట్టమని సూచించినా.. అదీ జరగలేదు. డీఎఫ్‌వో విజయవాడ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు.. స్పష్టమైన వివరణ ఇవ్వకపోతే వారిపై వ్యక్తిగత బాధ్యతగా చర్యలు తీసుకుంటామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) కూడా హెచ్చరించారు.

అడిగేదెవరు తవ్వేయ్....

పాతపాడు డంపింగ్‌యార్డు వెనుక ఉన్న అటవీ ప్రాంతంలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిగాయి. ఇక్కడి గ్యాస్ కంపెనీ వెనుక కూడా భారీగా తవ్వేశారు. ❖ వేమవరం పరిధిలో అటవీ భూములను ఆనుకుని తవ్వకాలు జరిగాయి. ❖ వెలగలేరు ఆంజనేయస్వామి గుడి సమీపంలోనూ హద్దు రాళ్లను జరిపేసి తవ్వేశారు. అటవీ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టి. . దర్జాగా మామిడి మొక్కలు వేశారు. ❖ జి.కొండూరు మండలం వెలటూరులో విలువైన వృక్ష సంపదను కొట్టేసి అమ్మేశారు. ❖ జామాయిల్, మామిడి సహా వందల వృక్షాలను కొట్టేశారు. ❖ వెలగలేరు, పాతపాడుల్లో అటవీ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వెళ్లాయి.



చిలకలబోడు కొండ సమీపంలో అటవీ ప్రాంతంలో తవ్వేశారిలా..

లోకాయుక్త ఆదేశాలతో...

సామాజిక కార్యకర్త మెండెం జమలయ్య ఆధ్వర్యంలో లోకాయుక్తకు అక్రమాలపై ఫిర్యాదు చేశారు. వీటిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్)కు లోకాయుక్త సూచించింది. ఫారెస్ట్ విజిలెన్స్-02 ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. చాలాచోట్ల అటవీ భూముల్లో మట్టి తవ్వకాలపై అనుమానాలు ఉన్నాయనీ, అటవీ భూములూ ఆక్రమించారని గుర్తించారు. ❖ విజయవాడ రేంజ్ అటవీ సిబ్బంది నిర్లక్ష్యం ఉందనీ, అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని విజిలెన్స్ నివేదించింది. ❖ ఓ డీఆర్వో, గార్డు మీద చర్యలు చేపట్టినా ఉన్నతాధికారులపై చర్యలు లేవు. అక్రమార్కుల మీద నామమాత్ర కేసులతో సరిపెట్టారు.

వెస్ట్ బైపాస్‌లో... హై టెన్షన్!

- నున్న విద్యుత్తు టవర్ల విషయంలో తెరపైకి కొత్త వివాదం
- కోర్టు తీర్పు రాకుండానే హడావుడిగా టవర్ నిర్మాణం

ఈనాడు, అమరావతి

"వెస్ట్ బైపాస్‌పై ల్యాంకో టవర్ల వివాదం కొలిక్కి వస్తున్న నేపథ్యంలో ఎన్‌హెచ్, ఏపీ ట్రాన్స్‌కో కొత్త వివాదానికి తెరదీశాయి. నున్న టవర్ల వ్యవహారంపై కోర్టులో స్పష్టత రాక ముందే కొత్త ఎలైన్‌మెంట్‌లో టవర్ నిర్మాణం చేపట్టడంతో దుమారం లేచింది. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు చేతులు మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు."

ఇదెక్కడి చోద్యం? పశ్చిమ బైపాస్‌పై రాకపోకలకు జక్కంపూడి, నున్నలో 8 ల్యాంకో విద్యుత్తు టవర్లు ప్రతిబంధకంగా ఉన్నాయి. గతంలో ఎన్‌హెచ్ అధికారులు కొత్త ఎలైన్‌మెంట్‌లో టవర్లు నిర్మించాలని ప్రయత్నించగా.. కొత్త టవర్లు నిర్మించకుండా పాత టవర్ల ఎత్తు పెంచాలని రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తాజాగా జక్కంపూడిలో 5 టవర్ల విషయంలో రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. సోమవారం కోర్టు దీనిపై దాఖలైన 8 పిటిషన్లను సైతం కొట్టేసింది. నున్న టవర్లపై విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే మరోవైపు ఎన్‌హెచ్, ట్రాన్స్‌కో కలిసి ఏకంగా కొత్త ఎలైన్‌మెంట్‌లో అదీ ఓ ప్రైవేటు లేఔట్ పంచాయతీకి దాఖలు చేసిన 80 అడుగుల దారిలో టవర్ నిర్మాణం చేపట్టారు.

ముడుపుల ముచ్చటే కారణమా.? అక్రమంగా టవర్ నిర్మిస్తున్నారని రైతులు, స్థానికులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. కనీసం పంచాయతీలో తీర్మానించకుండా టవర్ ఎలా నిర్మిస్తారని స్థానికులు ప్రశ్నించారు. అవసరమైతే ఆర్టీఐలో అడగండని అధికారులు నిర్లక్ష్యంగా బదులిచ్చారు. పనులకు ఆటంకం కలిగిస్తున్నారని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుత టవర్లను మారిస్తే ఆ భూముల ధర భారీగా పెరుగుతుందని.. టవర్లు మార్చేస్తామని కొందరు ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది రైతుల నుంచి భారీగా ముడుపులు వసూలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే కోర్టు తీర్పు వచ్చేదాక ఆగకుండా కొత్త టవర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.



కొత్తగా నిర్మిస్తున్న టవర్

అంతా మా ఇష్టం.. వారం కిందట ఇదే రహదారి, ఇదే తరహా టవర్ల వ్యవహారంలో పాత ఎలైన్‌మెంట్‌లోనే టవర్ల ఎత్తు పెంచాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ టవర్ల విషయంలోనూ మరో వారంలో దాదాపు అదే తీర్పు రానుంది. ఇంతలోనే కొత్త టవర్ల నిర్మాణం చేపట్టడంపై అనుమానాలు వస్తున్నాయి. జక్కంపూడి తరహాలోనే తీర్పు వస్తే కొత్త టవర్ నిర్మాణానికి పెట్టిన సొమ్ము వృథా అయి.. మళ్లీ పాత ఎలైన్‌మెంట్‌లోనే ఎత్తు పెంచాల్సిందే. ఇదంతా పట్టించుకోకుండా కొత్త టవర్ నిర్మిస్తున్నారు.

విజయవాడ కంటే బందరే పెద్దది!



అప్పట్లో పోర్టుకు సంబంధించిన రేఖాచిత్రం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

చరిత్రాత్మకంగా, సాంస్కృతికంగా ప్రసిద్ధమైన ప్రదేశం..ప్రాచీన, మధ్యయుగ చరిత్రలో ప్రత్యేక స్థానం..ఆంగ్లేయులు, పోర్చుగీసు, డచ్ దేశస్థులకు అధికార కేంద్రం..సాంఘీక సంస్కరణోద్యమాలు..జాతీయోద్యమంలో ప్రథమ స్థానం.. సాంస్కృతిక రాజధానిగా గుర్తింపు ఇలా బందరు ప్రత్యేకత చెప్పాలంటే ఎంతో ఉంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని మసులీపటాం అని బ్రౌన్‌దొర వర్ణించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆనాటి రోమ్, పర్షియా, అరబ్, చైనా దేశాలకు బందరు ఓడరేవు నుంచి వస్త్రాలు ఎగుమతి చేశారు. ఆ రోజుల్లోనే విద్య, వాణిజ్య, సంస్కృతి రంగాల్లో ముందంజలో ఉంటూ గుర్తింపు పొందింది. అలాంటి మసులాపటాం కాలక్రమంలో మచిలీపట్నంగా రూపాంతరం చెందినా ఇప్పటికీ తన ప్రత్యేకత చాటుకుంటోంది.

నగర చరిత్ర ఇది..

దేశంలోనే మచిలీపట్నం మున్సిపాలిటీ మూడవది. రాష్ట్రంలో రెండోది. 1865వ సంవత్సరం దిటౌన్ ఇంప్రూవ్‌మెంట్స్ చట్ట ప్రకారం మసులీపటాం మున్సిపాలిటీగా ప్రకటించారు. 1866లో పురపాలక సంఘంగా ఏర్పడి మచిలీపట్నం ఖ్యాతిని ఆర్జించింది. ఆనాడు మున్సిపాలిటీకి కలెక్టర్ అధ్యక్షుడిగా ఉండేవారు. బందరు పట్టణం, కంటోన్మెంట్ ప్రాంతం, సర్కారుతోట, మాచవరం, చిలకలపూడితో కలిపి 19.46 చదరపు మైళ్ల వైశాల్యంతో మున్సిపాలిటీ ఏర్పాటు అయ్యింది. 1925లో ఏ గ్రేడ్ పురపాలక సంఘంగా గుర్తింపు పొంది అన్ని రంగాల్లో ముందంజలో ఉండి తనదైన ముద్ర వేసుకుంది. అందుకే వ్యాపారానికి అన్ని వసతులు ఉన్న ప్రాంతంగా భావించి ఎంతో మంది ఇతర దేశస్థులు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. 1864లో మచిలీపట్నానికి ఉప్పెన వచ్చినప్పుడు 30 వేల మంది మృతి చెందారు. అప్పుడు విజయవాడ జనాభా 9,336 మంది అంటే బందరు ఎంత పెద్ద పట్టణమో అర్థమవుతోంది.

వైద్యులకు.. తర్ఫీదునిచ్చే బస్సు



సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరుకున్న వాహనం

ఈనాడు, అమరావతి

వైద్యులకు అధునాతన శస్త్రచికిత్సలపై తర్ఫీదు ఇచ్చేందుకు 'జేఅండ్‌జే ఇనిస్టిట్యూట్ ఆన్ వీల్స్' బస్సు విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలకు సోమవారం చేరుకుంది. ఆధునిక శస్త్రచికిత్సలను ల్యాప్రోస్కోపిక్ విధానంలో ఎలా చేయాలనే దానిపై.. సంపూర్ణ అవగాహన, శిక్షణను ఈ బస్సు ద్వారా అందిస్తారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఉండే ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులకు స్కిల్ ల్యాబ్ పేరుతో శిక్షణను ఇవ్వనున్నారు. జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ సామాజిక బాధ్యతగా ఈ బస్సును వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు శిక్షణ అందించేందుకు అందజేసింది. రాష్ట్రంలో ఒక్కో బోధనాసుపత్రి వద్ద రెండు మూడు రోజులు ఈ బస్సును ఉంచి శిక్షణ ఇస్తారు. నాణ్యమైన వైద్య చికిత్సను రోగులకు అందించేందుకు.. కళాశాల స్థాయిలోనే విద్యార్థులు సామర్థ్యం పెంచుకునేందుకే ఈ శిక్షణను ఇస్తున్నారు. డిసెంబర్ 11 వరకు రాష్ట్రంలోని పలు బోధనా వైద్య కళాశాలల వద్ద ఈ బస్సును అందుబాటులో ఉంచుతారు. అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్ ఈ బస్సును సిద్ధార్థ కళాశాల వద్ద సోమవారం ప్రారంభించారు.

ఆధునిక పరిజ్ఞానంతో తయారీ

ఈ బస్సును వైద్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆధునిక పరిజ్ఞానంతో తయారు చేశారు. జనరల్ సర్జరీ, యూరాలజీ, పిడియాట్రిక్, ఆంకాలజీకి సంబంధించిన.. శస్త్రచికిత్సలపై పూర్తి స్థాయి అవగాహనను వైద్య విద్యార్థులకు కల్పిస్తుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల వద్ద 22 రోజులు.. 1300 మందికి శిక్షణ అందించబోతోంది.



అధునాతన శస్త్రచికిత్సలపై అవగాహన పెంచుకుంటున్న వైద్యులు

పారని ఎత్తు.. దాగని మత్తు

ఈనాడు - అమరావతి

- వ్యసనాల బారినపడి.. డ్రగ్స్ పెడ్లర్‌గా మారిన మ్యాడీ
- మూడు నెలలుగా పరారీ.. బెంగళూరులో పట్టివేత...

ఇంజినీరింగ్‌లో చేరాడు.. చదువుపై ఆసక్తి లేక సబ్జెక్టులు తప్పాడు.. అవి పూర్తి చేయలేక ఉపాధి కోసం బెంగళూరు వెళ్లి, వ్యసనాలకు బానిసయ్యాడు. ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తూ.. డ్రగ్స్ పెడ్లర్‌గా మారి, సరఫరా చేస్తున్నాడు.. మూడు నెలలుగా మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ కోసం వెతుకుతున్న విజయవాడ పోలీసులకు ఎట్టకేలకు పట్టుబడ్డాడు. నిందితుడిని టాస్క్‌ఫోర్స్, మాచవరం పోలీసుల బృందం ఆదివారం రాత్రి బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు.

ఇదీ కేసు నేపథ్యం...

గత ఆగస్టులో బెంగళూరులో ఎండీఎంఏ కొని.. విశాఖ తీసుకెళ్తూ 19.1 గ్రాములతో శ్రీవాత్సవ్, హవీలా విజయవాడలో పట్టుబడ్డారు. దీనిపై మాచవరం ఠాణాలో కేసు నమోదవగా ఇప్పటికి ముగ్గురు అరెస్టయ్యారు. నాటి నుంచి స్వరూప్‌రాజ్, మధుసూదన్‌రెడ్డిల కోసం పోలీసులు అన్వేషించగా.. తాజాగా మధుసూదన్‌రెడ్డి దొరికాడు.

ర్యాపిడో డ్రైవర్‌గా మారి...

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం కంబాలపల్లివాసి మధుసూదన్‌రెడ్డి.. 2022లో చెన్నైలో ఇంజినీరింగ్ చదివినా.. పలు సబ్జెక్టులు తప్పడంతో పట్టా చేతికి రాలేదు. తండ్రి రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. చెల్లెలు ఇంజినీరింగ్ చదివి బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. ఇతను ఉపాధి కోసం బెంగళూరు వెళ్లాడు. అక్కడ ఓ ఫైనాన్స్ కంపెనీ, కాల్ సెంటర్ తదితర చోట్ల ఉద్యోగాలు చేశాడు. ఎక్కడా నిలకడలేదు. ప్రస్తుతం ర్యాపిడోలో ద్విచక్ర వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కోరిన వారికి ఎండీఎంఏ సరఫరా చేసేందుకు దీనిని సాధనంగా ఎంచుకున్నాడు.



నిందితుడు మధుసూదన్‌రెడ్డి

మద్యం మత్తులో దొరికి..

మూడు నెలలుగా విజయవాడ పోలీసులు నిందితుడి ఫోన్‌పై నిఘా పెట్టారు. కేసు నమోదైనప్పటి నుంచి ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఇటీవల ఆన్ చేయగా పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం రాత్రి విజయవాడ నుంచి ప్రత్యేక బృందం బెంగళూరు వెళ్లింది. ఆదివారం ఉదయం నుంచి మ్యాడీ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించారు. ర్యాపిడో డ్రైవర్ కావడంతో నిందితుడి సెల్ లొకేషన్ పలు ప్రాంతాల్లో చూపించింది. ఆదివారం రాత్రికి బెంగళూరులో అతను ఉండే హాస్టల్‌కు చేరుకుని.. మద్యం తాగాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని కారులో విజయవాడ తరలించారు.

నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ కొనుగోలు..

బెంగళూరులో పనిచేసేటప్పుడు హైదరాబాద్‌వాసి గురుప్రసాద్ పరిచయం అయ్యాడు. అతని ద్వారా డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. అల్తాఫ్ ద్వారా ఎండీఎంఏ తెప్పిస్తున్నట్లు గురుప్రసాద్ చెప్పాడు. అప్పటి నుంచి ఎండీఎంఏ కొని కొంత వాడి.. మిగిలింది అమ్మేవాడు. రాబడి వస్తుండడంతో పెడ్లర్‌గా మారాడు. ఈక్రమంలో అల్తాఫ్.. డాన్, అమన్, ఫ్లిన్‌జీ, తదితరుల నుంచి కొనేవారు. వీరిలో ఇద్దరు నైజీరియన్లు.

68 రోజులు జైలులో ఉండి..

నిరుడు మార్చిలో ఎండీఎంఏ తీసుకుని.. గురుప్రసాద్, సంతోష్‌లతో కలసి హైదరాబాద్ వెళ్లాడు. కూకట్‌పల్లిలో ఓ హోటల్‌లో దిగాడు. ముందస్తు సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. సుమారు 68 రోజులు జైలులో ఉన్నాడు. తర్వాత బెయిల్‌పై విడుదలై బెంగళూరు వచ్చి డ్రగ్స్ సరఫరా ప్రారంభించాడు.

లింకుల శోధన..

మ్యాడీ మొబైల్‌లో పలువురి యూపీఐ ఖాతాలకు లావాదేవీలను పోలీసులు గుర్తించారు. విజయవాడలో పట్టుబడిన హవీలా నుంచి మధుసూదన్‌రెడ్డికి రూ.4,700 బదిలీని గుర్తించారు. ఇతని కాల్ డేటా విశ్లేషిస్తున్నారు. ఇంకా ఎవరితో లింకులు ఉన్నాయి? ఏ ప్రాంతాలకు సరఫరా చేశాడని విశ్లేషిస్తున్నారు. బెంగళూరు, విశాఖ, హైదరాబాద్‌కు సరఫరా చేసేవాడని ప్రాథమికంగా గుర్తించారు.



కరకట్ట రోడ్డును ఆనుకొని ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు

ఆలోచన వినూత్నం.. ఫలించిన ప్రయత్నం

కృష్ణా జిల్లా యనమలకుదురు నుంచి అవనిగడ్డ కరకట్ట వెంట కాలువ పొడవునా చెత్త పేరుకుని అధ్వానంగా ఉండేది. చుట్టుపక్కల నుంచి వ్యర్థాలు, కళేబరాలను ఇక్కడ పడేసేవారు. దీంతో అటుగా వెళ్లాలంటే దుర్గంధభరితంగా ఉండేది. ప్రస్తుతం కట్ట వెంట నివాసాలు విస్తరించడంతో గ్రామ పెద్దలంతా కలిసి దీనికో పరిష్కారం ఆలోచించారు. కట్ట వెంట కొంత స్థలాన్ని శుభ్రం చేసి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ చెత్త వేయడం మానేశారు. ఇంకొన్నిచోట్ల ఇక్కడ చెత్త వేయరాదని బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆ ప్రదేశమంతా పరిశుభ్రంగా తయారైంది. - ఈనాడు, కృష్ణా

ఉరుసు ఉత్సవాలపై సమీక్ష

పాయకాపురం: కొండపల్లిలోని సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా ఉరుసు మహోత్సవాలు డిసెంబరు 29, 30, 31న జరుగనున్నాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే వసంతలతో సమీక్షించారు. మౌలిక వసతులు, భద్రత తదితరాలపై చర్చించారు. ఆస్థాన పీఠాధిపతులు, సూఫీ అల్తాఫ్ బాబాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మైలవరాల జల్లు

ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన నేడు

మైలవరం, న్యూస్‌టుడే

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి, పరిశ్రమలను ప్రోత్సహించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం మైలవరానికి వరం కానుంది. విశాలమైన నిరుపయోగ భూభాగం ఉన్నా, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో చేయడంతో ఆగిన పారిశ్రామికీకరణ గాడిన పడనుంది. నూతన ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు కార్యరూపం దాల్చడానికి మరో అడుగు దూరంలో ఉంది. త్వరలో వైజాగ్‌లో నిర్వహించనున్న భాగస్వామ్య సమ్మిట్‌లో ప్రదర్శనలో భాగంగా, శంకుస్థాపనకు సిద్ధమవడం, పరిశ్రమల పార్కు ఏర్పాటునకు కార్యాచరణ రూపొందించడంతో నియోజకవర్గానికి మంచి కాలం రానున్నది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుందని భావిస్తున్నారు.

జిల్లాలోనే ప్రథమంగా..

కూటమి ప్రభుత్వ ఆలోచనల్లో ఒకటిగా ఉన్న నియోజకవర్గానికో చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మైలవరం మండలం చంద్రగూడెంలో నిరుపయోగంగా ఉన్న రెవెన్యూ పోరంబోకు భూమిలో పరిశ్రమ పార్కుల ఏర్పాటునకు నేడు ముఖ్యమంత్రి లాంఛనంగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. గతంలో గుట్ట పోరంబోకుగా ఉన్న భూమిని 2020లో గత ప్రభుత్వం సేకరించినా, ప్రయోజనకర కార్యాచరణ రూపొందించలేదు. సుమారు 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు అనుకూలంగా ఉంది. చంద్రగూడెం రిజర్వాయర్ చెరువుకు అనుకుని, గ్రామం నుంచి నేరుగా వెళ్లేందుకు అవకాశం ఉంది. రవాణా సౌకర్యం కొంత మెరుగుపరిస్తే జాతీయ రహదారికి అతి సమీపంలోకి రానున్నది. జిల్లాలోనే ప్రథమంగా శంకుస్థాపన చేసిన ఎంఎస్‌ఎంఈ కానుంది.



ఏపీఐఐసీకి బదలాయించిన భూమి

రూ.14.50 కోట్ల కేటాయింపు

గత ప్రభుత్వ హయాంలో పేదలకు నివేశన స్థలాలను కేటాయించే నిమిత్తం ప్రయత్నాలు చేయగా, స్థానికులు అక్కడకు వెళ్లేందుకు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తదనంతరం పరిశ్రమలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా, కనీస కార్యాచరణ లేకపోవడంతో ఐదేళ్లుగా ఆ భూమి నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా అధికారులు నివేదికను తయారు చేశారు. రెవెన్యూ నుంచి ఆ భూమిని ఇప్పటికే ఏపీఐఐసీకి బదలాయించారు. మంగళవారం ఆ పార్కునకు సంబంధించి ముఖ్యమంత్రి ఫౌండేషన్ వేయనున్న నేపథ్యంలో అందుబాటులోకి రానుంది. ఈ నెలలో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సు ద్వారా పారిశ్రామిక వేత్తలను ఆకర్షించి, పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మౌలిక వసతులు, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అవసరాలను సమకూర్చేందుకు ప్రభుత్వం రూ. 14.50 కోట్లను కేటాయించింది.

పర్యాటక పెట్టుబడులు తీసుకురండి

ఆర్థిక ప్రగతి, ఉపాధి అవకాశాలు కల్పించాలనేది లక్ష్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : పర్యాటక పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తే ప్రభుత్వం తరఫున భరోసా కల్పించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టూరిజం స్టేక్ హోల్డర్స్‌తో చర్చావేదిక గుణదలలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి ప్రాచుర్యం కల్పించడమే లక్ష్యంగా కలిసి దేశ, విదేశాల్లో పర్యటిద్దామని.. తద్వారా పర్యాటక పెట్టుబడులు సాధించి ఆకాశమే హద్దుగా పర్యాటకాభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, పర్యాటక ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ లక్ష్మీశ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, పలువురు పర్యాటక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్.వి. స్వామికి నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఏపీ ఛాంబర్స్ పర్యాటక ఛైర్మన్‌గా ఆర్.వి.స్వామి.. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్‌కు అనుబంధంగా పర్యాటక శాఖ ప్రత్యేక విభాగాన్ని నియమించింది. ఛైర్మన్‌గా ఆర్. వి. స్వామి, ఉపాధ్యక్షుడిగా పి.వి.నరసింహరావు, కో-ఆర్డినేటర్లుగా మూర్తి చిట్టూరి, జి.వెంకటకృష్ణ, ఎక్స్ అఫీషియో సభ్యులుగా తేజస్వి పొడపాటితో పాటు పలువురు సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీరికి మంత్రి నియామక పత్రాలు అందజేశారు.

ఈ నెల 15 నుంచి విజయవాడ- సింగపూర్ విమాన సర్వీస్‌లు.. కార్యక్రమంలో భాగంగా 15న విజయవాడ నుంచి సింగపూర్ ఇండిగో నాన్‌స్టాప్ విమానానికి సంబంధించిన పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఈనెల 15న 6ఈ 1029 నంబరు విమాన సర్వీస్ ఉదయం 10.05కు విజయవాడలో బయలుదేరి, అదే రోజు సాయంత్రం 4.40 గంటలకు సింగపూర్ చేరుతుందన్నారు. అదే రోజు 6ఈ1030 నంబరు గల మరో విమాన సర్వీస్ సింగపూర్ నుంచి అక్కడి కాలమానం ప్రకారం ఉదయం 6.10కు బయలుదేరి 7.45కు విజయవాడ చేరుతుందని చెప్పారు.

సమస్యల పరిష్కారం పక్కాగా ఉండాలి

పాయకాపురం, న్యూస్‌టుడే : అర్జీల పరిష్కారంలో నాణ్యత పెరగాలని, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియాతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో విధానపరమైన లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఫిర్యాదుల ఆడిటింగ్‌ను నిష్పక్షపాతంగా చేయాలని పేర్కొన్నారు. కీలక ప్రగతి సూచికలు, నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కోరారు. మొత్తం 155 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖవే 51ఉన్నాయి. పోలీసు 23, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలకు 20 చొప్పున అందాయి. పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, దేవాదాయశాఖ, గృహ నిర్మాణం, విద్యాశాఖ, జలవనరులశాఖ, సర్వేశాఖలకు సంబంధించిన వినతులు వచ్చాయి.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

యువ మేధకు చుక్కాని.. ఆర్‌టీఐహెచ్

పాయకాపురం, న్యూస్‌టుడే : యువ మేధస్సుకు చుక్కాని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) అని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. పారిశ్రామికవేత్తలను చేయూతనిచ్చి నడిపించేందుకు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ హబ్ స్పోక్ ద్వారా సంకల్పం చొరవ చూపడం జరుగుతుందని చెప్పారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఆర్‌టీఐహెచ్ ఇన్నొవేషన్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఐదు స్టార్టప్‌ల వ్యాపార నమూనాలు ప్రదర్శించారు. .. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆవిష్కరణల రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌టీఐహెచ్ హబ్, స్పోక్‌లు విశేషంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఇలక్కియా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చిత్రకళా సంత


పటమట, న్యూస్‌టుడే : రాష్ట్ర కల్చర్ అండ్ క్రియేటివిటీ కమిషన్ విభాగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ (టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే 4వ చిత్రకళా సంత గోడప్రతులను సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్‌ను టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్. జనరల్ కార్యదర్శి బాలయోగితో పాటు సొసైటీ సభ్యులు కలిశారు. చిత్రకళాకారులకు ప్రోత్సాహంతో పాటు మార్కెట్ కల్పించడానికి చిత్రకళా సంతను డిసెంబర్ 14న బందర్ రోడ్డులోని దూరదర్శన్ అండ్ తితిదే కల్యాణ మండపం రోడ్డులో నిర్వహిస్తున్నట్లు ఎంపీకి తెలిపారు. సామాన్యుల ఇంటిలో కూడా ఒక పెయింటింగ్ ఉండాలనే ధ్యేయంతో చిత్ర కళాకారులు తక్కువ ధరలకే పెయింటింగ్స్ విక్రయాలను చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్ ఉపాధ్యక్షుడు టి.వెంకటరావు, ఎ.రాము, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, కన్వీనర్ మీనాక్షి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంతజయ్ వర్మ పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సురక్ష-360 కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రూ.5లక్షల విరాళం అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, బి.గోపాలరావు, సయ్యద్ ఉస్మాన్, జె.రత్నకుమార్ తదితరులు సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబుని కలిసి చెక్కు అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో రూ.5లక్షలు ఇచ్చిన సంస్థను అభినందించారు. 1,211 చ.కిలోమీటర్ల పరిధిలో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలుండాలన్న లక్ష్యంతో సురక్ష-360 అనే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను అదుపు చేశామని, తక్కువ సమయంలో నేరస్థులను గుర్తించి అరెస్టు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, ఏసీపీలు వంశీధర్‌గౌడ్, శ్రీరామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీ రాజశేఖరబాబుకు, డీసీపీ షిరీన్‌బేగంలకు చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

సీపీ కార్యాలయంలో 88 ఫిర్యాదులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 88 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన 88 ఫిర్యాదుల్లో ఆస్తి, భూ, నగదు లావాదేవీలపై 44, మహిళా సంబంధ నేరాలు 9, దొంగతనాలు 7, కుటుంబ కలహాలు 5, కొట్లాటలు 4, రోడ్డు ప్రమాదాలు 3, ఇతర విభాగాలు 16 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి, సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.



వృద్ధుడి సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా వెంకట రమణి



భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా భవానీపురం 42వ డివిజన్‌కు చెందిన రమణిని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో 42వ డివిజన్ తరఫున తెదేపా అభ్యర్థిగా పోటీ చేశారు. ఆమె భర్త యేదుపాటి రామయ్య గతంలో కార్పొరేటర్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనాచౌదరిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వేద పాఠశాలను అభివృద్ధి చేస్తాం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం స్మార్త, వేద పాఠశాలను సమగ్రాభివృద్ధి చేస్తామని దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. పోరంకిలోని దుర్గగుడి స్మార్త, వేద పాఠశాలను సోమవారం వారిద్దరూ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్, తలుపులకు మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఈ పాఠశాలను తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈ రాంబాబు, ఏఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న దేవస్థానం ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్



భక్తితో నదీ స్నానాలు

కార్తిక సోమవారం సందర్భంగా దుర్గాఘాట్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి జల్లు స్నానాలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. - ఈనాడు అమరావతి

విజయభాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్ నేటికి వాయిదా

ఈనాడు డిజిటల్ - మచిలీపట్నం: మహిళలు.. కూటమి నేతలు.. న్యాయమూర్తులు.. వారి కుటుంబ సభ్యులే లక్ష్యంగా సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్య పోస్టులు పెట్టిన విజయభాస్కర్‌రెడ్డి కేసు వ్యవహారంలో లోతైన విచారణ చేసేందుకు అతడిని కస్టడీకి అనుమతించాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారానికి వాయిదా పడింది. తన తండ్రి పెదకర్మకు వెళ్లేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని నిందితుడు విజయభాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సైతం వాయిదా పడింది. ఈ రెండు పిటిషన్లపై వాదనలు జరగనున్నాయి.

చెవిరెడ్డి వెన్నునొప్పి చికిత్స కోసం..

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన వెన్నునొప్పి చికిత్స పిటిషన్‌పై విచారణ 12వ తేదీకి వాయిదా పడింది. ఉండవల్లిలోని మంతెన ఆశ్రమంలో వెన్నునొప్పికి చికిత్స చేయించుకునేందుకు అనుమతించాలని గత వారం చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

వంశీకి షరతుల సడలింపుపై..

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో వల్లభనేని వంశీ దాఖలు చేసుకున్న బెయిల్ షరతులు సడలింపు పిటిషన్‌పై తీర్పు ఈనెల 12వ తేదీకి వాయిదా పడింది. గత వారం ఈ పిటిషన్‌పై వాదనలు ముగిసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో పరారీలో ఉన్న నిందితులు తేలప్రోలు రాము, యర్రంశెట్టి రామాంజనేయులు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 13వ తేదీకి వాయిదా పడింది. మరో నిందితుడు వజ్రకుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కౌంటరు దాఖలు కోసం ఈనెల 13వ తేదీకి వాయిదా పడింది.

నకిలీ మద్యం కేసులో జోగి రమేష్..

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ బెయిల్ పిటిషన్, సిట్ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. తనకు బెయిల్ మంజూరు చేయాలని జోగి రమేష్ వేసిన పిటిషన్‌పై విచారణను ఈనెల 12వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో కుట్ర కోణం గురించి మాజీ మంత్రిని లోతుగా విచారించాలని సిట్ అధికారులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్ కూడా ఈనెల 12వ తేదీకి వాయిదా పడింది.

నిడిగుంట అరుణ..

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ కస్టడీ పిటిషన్‌ను మంగళవారానికి వాయిదా వేశారు. విజయవాడ, సూర్యారావుపేట పోలీసులు గత నెల 13న నిడిగుంట అరుణపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో పీటీ వారెంట్ వేసి.. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరింత సమాచారం కోసం ఆమెను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సూర్యారావుపేట పోలీసులు నగరంలోని 1వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 4న పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై 10వ తేదీ లోపు కౌంటర్ దాఖలు చేయాలని డిఫెన్స్ న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసు సోమవారం న్యాయస్థానంలో విచారణకు రాగా.. మరింత గడువు కావాలని డిఫెన్స్ న్యాయవాది కోరడంతో మంగళవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

పిన్నమనేని పేరుతో పురస్కారాలు గర్వకారణం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, శాసన సభ్యుడిగా మూడు దశాబ్దాల పాటు కృష్ణా జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన దివంగత పిన్నమనేని కోటేశ్వరరావు పేరుతో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయడం గర్వకారణమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ, జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులకు విశేష సేవలు అందించి, ఉపాధ్యాయ బంధుగా కోటేశ్వరరావు పేరు పొందారని కొనియాడారు. పిన్నమనేని కోటేశ్వరరావు కుమారుడు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా, మండల పరిషత్ ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించే విధానాన్ని తమ తండ్రి కోటేశ్వరరావు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. గుడివాడ అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు పిన్నమనేని పూర్ణ వీరయ్య మాట్లాడుతూ.. విలువలతో కూడిన రాజకీయాలను నడిపిన మహోన్నత నేత కోటేశ్వరరావు అని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2025 సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించిన 142 మంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, జీవీఎస్ పెరుమాళ్ల, పి.నాగరాజు, కోట సుందరరావు, ఎ.శ్రీనివాస్, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్. వేదికపై వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు

రూ.75 లక్షల నగదు స్వాధీనం

పటమట, న్యూస్‌టుడే : ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో సోమవారం రాత్రి సెంట్రల్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని మదర్ థెరెసా విగ్రహం వద్ద రూ.75 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొగల్రాజపురం నుంచి సిద్ధార్థ కళాశాల వైపు వెళుతున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా రూ.75 లక్షల నగదు లభ్యమైంది. ఆధారాలు చూపక పోవడంతో కారు, నగదును సీజ్ చేసి మాచవరం స్టేషన్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ దామోదర్ తెలిపారు. మాచవరం సీఐ ప్రకాష్, ఎస్సై శంకర్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఏసీపీ దామోదర్

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ విజేత కృష్ణా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో మూడు రోజులు నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి అండర్- 17 బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కృష్ణా జట్టు విన్నర్ ట్రోఫీ సాధించింది. అండర్- 17 బాల, బాలికల నెట్‌బాల్ పోటీల్లో విశాఖ, పశ్చిమ గోదావరి జట్లు విజయకేతనం ఎగురవేశాయి. సోమవారం జరిగిన తుది, తృతీయ స్థానం కోసం పోటీలు ఉత్కంఠగా సాగాయి. బాలికల హ్యాండ్‌బాల్‌లో శ్రీకాకుళం ద్వితీయ, విజయనగరం తృతీయ స్థానాలు సాధించాయి.

☛ నెట్‌బాల్ బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి ద్వితీయ, కృష్ణా తృతీయ, బాలికల విభాగంలో విశాఖపట్నం ద్వితీయ, కృష్ణా తృతీయ స్థానాల్లో నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా, ఏఎస్పీడీ ప్రసన్నకుమార్ గౌరవ అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించగా. . పాఠశాల ఇన్‌ఛార్జి ఆర్.రామారావు, ఏఎంసీ ఛైర్మన్ షైజున్నీసా, టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్.దుర్గారావు, పీఈటీ ఎస్.రమేష్, హ్యాండ్‌బాల్ పోటీల పరిశీలకురాలు ఝాన్సీ లక్ష్మి, నెట్‌బాల్ పోటీల పరిశీలకుడు విజయ్‌కుమార్, ఎస్‌పీఈ పీఈ సంఘ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా జట్టుతో ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మైలవరం: 80085 74705 జి.కొండూరు 9063144762

? జాతీయ రహదారి (65) గుంటుపల్లి, తుమ్మలపాలెం వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటి వల్ల వాహనాల వేగం తగ్గుతుందని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఆ ప్రాంతాల్లో అధిక లోడుతో వెళుతున్న కంకర లారీల నుంచి కంకర జారిపడుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - నాగరాజు, ఇబ్రహీంపట్నం

✔ వేగ నియంత్రణకే వాటిని ఏర్పాటు చేశాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సై

– న్యూస్‌టుడే, కొండపల్లి

? వెల్లటూరు గ్రామ శివారు మాలపల్లిలో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నాం. - వై సురేష్, గ్రామస్థుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి మురుగు పారేందుకు చర్యలు చేపడతాం. - మురళి, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం



◆ స్థానిక ఉన్నత పాఠశాల రోడ్డులో కాలువల్లో పూడిక పేరుకుపోయి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, కొండూరు

◆ నరసాపురం ఎన్టీఆర్ కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని మేమున్నాం మీకు తోడుగా ద్వారా నివాసితులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురాగా ఈవో జి.స్వాతి స్పందించి క్లాప్ మిత్రలను పంపించి శుభ్రం చేయించారు. కార్మికులు చెత్తను రిక్షాలో ఎత్తి డంపింగ్ యార్డ్‌కి తరలించారు. కాలనీ నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట



◆ పట్టణంలోని 3వ వార్డులోని డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో మురుగు పారడంలేదని స్థానికుడు అబ్దుల్ రెహ్మాన్ చేసిన ఫిర్యాదుకు శానిటరీ అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని 1వ వార్డులోని కాలువల్లో మట్టి, బురద పేరుకుపోవడంతో మురుగు సక్రమంగా పారడంలేదని స్థానికుడు దినేష్ మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. కార్మికులను పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

15న జాబ్‌మేళా

మైలవరం, న్యూస్‌టుడే: లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న జిల్లా ఉపాధి కల్పన శాఖ, కళాశాల జేకేసీ, డీఆర్డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 99660 90377, 99591 08829, 95027 57755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న సాగర్ జలాల సరఫరా

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొప్పులబంధం వద్ద 72వ కి.మీ నియంత్రిక నుంచి 625 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 371 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమర 30, మధిర 30, నిదానపురం 50 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

గంపలగూడెం: తునికిపాడు సమీపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దాడిలో జూదమాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పీఎస్సై శశిధర్ తెలిపారు. వారి నుంచి రూ.5200 స్వాధీనం చేసుకున్నారు.

కట్లేరుపై వంతెన నిర్మాణానికి వినతి

గంపలగూడెం, న్యూస్‌టుడే: తోటమూల సమీప కట్లేరుపై వంతెన నిర్మించాలని కోరుతూ ప్రజా సంఘాల ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఉదయం కట్లేరు వంతెన వద్ద నిరసన తెలిపారు. ఎం.దానియేలు, కె.దాసు తదితరులు పాల్గొన్నారు.

◆ మొంథా తుపాను సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించి సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకున్న తహసీల్దార్‌ను ఎస్సీ సామాజిక వర్గీయులు సత్కరించారు.

12న ప్రవచనకర్త చాగంటి రాక

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు 12, 13 తేదీల్లో తిరువూరులో పర్యటిస్తారని కార్యక్రమ పర్యవేక్షకుడు, పట్టణానికి చెందిన కంచి కిషోర్ సోమవారం తెలిపారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు తిరువూరు బాలికోన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నారు. గురువారం ఉదయం పట్టణంలోని శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలు, ఆధ్యాత్మిక భావనపై ప్రవచనం చేస్తారని వివరించారు.

కాబోయే అమ్మకు.. రాబోయే భరోసా

గర్భిణులు, బాలింతలకు కూటమి ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే: గర్భిణుల ప్రసవ ఖర్చుల పోషణకు ప్రధానమంత్రి మాతృత్వ యోజన(పీఎంఎంవీవై) పథకం అండగా నిలుస్తోంది. అర్హులైన లబ్ధిదారులు పేర్లను నమోదు చేసుకుంటే వారికి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. గర్భిణులకు మొదటి కాన్పులో రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ అయితే రూ.6 వేలు అందిస్తారు. ఆర్థిక సాయంతో పాటు వీరికి పోషకాహారం, వివిధ పథకాల లబ్ధి అందనుంది.



పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీలదే బాధ్యత

గతంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలయ్యేది. గర్భిణుల నమోదులో ఆరోగ్య, వైద్య కార్యకర్తలు అలసత్వంతో అర్హులైన వారికి ఈ పథకం దూరమవుతూ వచ్చింది. దీంతో ఇటీవల పథకం అమలు బాధ్యతను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించారు. ప్రతి కేంద్రంలో గర్భిణుల పేర్లను నమోదు చేస్తారు. అంగన్‌వాడీ కార్యకర్త లాగిన్ నుంచి పర్యవేక్షకురాలికి పంపిస్తారు. అక్కడ అవసరమైన మార్పులు చేసి ప్రాజెక్టు అధికారికి నివేదిస్తారు. జిల్లా అధికారులకు సమాచారం వెళ్లిన తర్వాత పరిశీలించి పథకం మంజూరు.. తదుపరి చర్యలు తీసుకుంటారు.

మైలవరం నియోజకవర్గ పరిధిలో వివరాలు
అంగన్‌వాడీ కేంద్రాలు : 273
గర్భిణులు : 1,745
బాలింతలు: 1,655
ఆరు నెలల్లోపు శిశువులు : 12,009
ఏళ్లలోపు చిన్నారులు : 25,412

ఈ విధంగా అమలు

గర్భిణులకు, బాలింతలకు ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకం వరిస్తుంది. గతంలో రూ.5 వేలు మూడు విడతలుగా అందించేవారు. ప్రస్తుతం రెండు విడతలుగా అందిస్తున్నారు. గర్భం దాల్చిన వెంటనే పేరు నమోదు చేసుకుంటే రూ.3 వేలు, ప్రసవం అనంతరం మూడు టీకాలు పూర్తయిన తర్వాత మిగిలిన రూ.2 వేలు ఇస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే మూడు టీకాలు వేసుకున్న అనంతరం ఒకేసారి రూ.6 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సీఎంఎం వీవై నమోదు ప్రక్రియ జరుగుతోంది. అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ప్రాజెక్టు సీడీపీవో పుష్పలత సూచించారు.

రేషన్ దుకాణంలో తనిఖీ



అధికంగా ఉన్న చౌక బియ్యం వద్ద విజిలెన్స్ అధికారులు

దుందిరాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని దుందిరాలపాడులో 14వ నంబరు రేషన్ దుకాణంలో విజిలెన్స్ ఎస్సై కృష్ణసాయి, ఏడీఏ కృష్ణకుమార్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణంలో 27 క్వింటాళ్ల చౌక బియ్యం అధికంగా నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు. సదరు రేషన్ డీలర్ రెబ్బమ్మపై చర్యలు నిమిత్తం పౌరసరఫరాల అధికారులకు సమాచారం ఇచ్చారు. తనిఖీలో వీఆర్వో రాణి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ముగ్గురు దాతలు రూ. 3,00,001 విరాళాలు సోమవారం అందజేశారు. గుంటూరుకు చెందిన సిహెచ్. సూర్యతేజ రూ.లక్ష, విజయవాడ పటమటకు చెందిన మనగాల సూరిబాబు రూ.1,00,001, ఇబ్రహీంపట్నానికి చెందిన గరిమెళ్ల వెంకటేశ్వరరావు రూ. లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, జగన్ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



దాత గరిమెళ్ల వెంకటేశ్వరరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ జగన్

సౌకర్యాలు మెరుగు పరచాలి

చంద్రగూడెం(మైలవరం), న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈ పార్కు కింద ఎంపికైన చంద్రగూడెంలోని ప్రభుత్వ భూమిలో కావాల్సిన మేరకు సౌకర్యాలను మెరుగుపరచాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో చంద్రగూడెంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూమిని స్థానిక అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. భూ విస్తీర్ణం, రవాణా సౌకర్యం తదితర అంశాలపై తహసీల్దార్ ఆర్డీవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామం నుంచి ఆ ప్రాంతానికి వచ్చే రహదారిని, శంకుస్థాపన ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని సూచించారు. పరిశ్రమలు ఏర్పాటైతే చాలా ప్రయోజనాలు ఉన్నాయని స్థానికులకు వివరించారు. ఆయన వెంట, ఏపీఐఐసీ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు ఉన్నారు. ఆ ప్రాంతంలో పర్యవేక్షణలో శంకుస్థాపనకు కావాల్సిన పనులను నిర్వహించారు.



చంద్రగూడెంలో భూమి వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

త్వరలో సమస్యలన్నీ తీరుస్తాం..

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. పట్టణ అభివృద్ధి పనులు, వీధి దీపాలు, మొంథా తుపానుతో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు వంటి 55 అంశాలతో సమావేశం సాగింది. వైకాపా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మెయిన్ రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ సమస్యను లేవనెత్తారు. ఇందుకు సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. అన్ని వార్డులకు సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం 18వ వార్డు కౌన్సిలర్ దారా పద్మనీలిమ కౌన్సిలర్ సభ్యత్వానికి రాజీనామా పత్రాన్ని కమిషనర్ కె.మనోజకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా తెదేపా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. రాబోయే రెండు, మూడు నెలల్లో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి జరుగుతుందని, మరో వారం రోజుల్లో రూ.5 కోట్లతో బీపీఎస్ పనులు మొదలుపెట్టడానికి 55 అంశాలతో కూడిన తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు.



పాల్గొన్న కౌన్సిలర్లు

మరమ్మతులు చేపట్టండి సారూ..

జి.కొండూరు నుంచి పినపాక వెళ్లే రహదారిలో కప్పలవాగుపై చప్టా పాక్షికంగా ధ్వంసమై రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. చప్టా మధ్య భాగంలో గుంత ఏర్పడి చువ్వలు బయట పడడంతో ప్రయాణానికి అవస్థలు పడుతున్నామని వాహనదారులు మండిపడుతున్నారు. గతంలో పలుమార్లు పత్రికల్లో సమస్యను ప్రచురించడంతో చప్టాకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన చోట మరలా గుంత ఏర్పడి సమస్య పునరావృతమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చప్టాకు శాశ్వత మరమ్మతులు చేపట్టి వాహనదారుల అవస్థలు తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



పినపాక వెళ్లే రోడ్డులో కప్పలవాగుపై చప్టా దుస్థితి

ఎక్కడివో తెస్తారు.. ఇక్కడే వదిలేస్తారు..

వానరాల సైన్యంతో పురవాసులు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గతంలో కొండ, దిగువ ప్రాంతాలకే పరిమితమైన వానరాలు ఇప్పుడు పురపాలిక వ్యాప్తంగా సంచరిస్తున్నాయి. ఉదయం వేళల్లో చిన్న పిల్లలు, మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితి. వానరాల దాడులకు తట్టుకోలేక ప్రతి ఇంటికీ రక్షణ ఐరన్ మెష్‌లు ఏర్పాటు చేసుకొంటున్నారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కోతులను కొండపల్లి అడవుల్లో వదలడం పరిపాటిగా మారింది. అడవిలో గతంలోలా ఆహారం లేకపోవడంతో అవి అడవి పరిధిని ఆనుకొని ఉన్న కొండపల్లి, ఇబ్రహీంపట్నం, జూపూడి ప్రాంతాల్లోకి వచ్చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, కొండపల్లి



కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వీధిలో ఇలా

ఏళ్లుగా ఇంతే.. అవస్థ తీర్చరంతే

కొండపర్వలో రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానమైన కొండపర్వ రహదారి, కొండపర్వ నుంచి నూజివీడు వెళ్లే మట్టి రోడ్డు గోతులమయమై ప్రజలు అల్లాడుతున్నారు. ఆ గుంతల్లోనే సోమవారం ఓ లారీ కూరుకుపోవడం.. అదే సమయంలో ఓ పాఠశాల బస్సు ఎదురు రావడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు టింబర్ వ్యాపారులు, గుత్తేదారులు ఇష్టానుసారంగా రహదారిపై అడ్డంగా కలపను వదిలేస్తున్నారు. చిత్తపూరు, కొండపర్వ, తుమ్మగూడెం, ఆరుగొలనుపేట, జనార్థనవరం, చాట్రాయి తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, ప్రయాణికులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణానికి ఆటంకాలు కలుగుతున్నా రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

-న్యూస్‌టుడే, విస్సన్నపేట



గుంతల్లో ఇరుక్కుపోయిన లారీ.. నిలిచిన ట్రాఫిక్



రోడ్డుకు అడ్డంగా కలప వదిలేశారిలా...

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు మండలం రోలుపడి కోదండ రామాలయంలో ధ్వజస్తంభం, గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి, నాభిశిల ప్రతిష్ఠోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు, దాతల ఆర్థిక సౌజన్యంతో ముత్యాలమ్మ గుడి నిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. గ్రామ పురోహితులు జక్కేపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిష్ఠా మహోత్సవం, శాంతిహోమం, కల్యాణం నిర్వహించగా, గ్రామస్థులు బోనాలు సమర్పించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా రోలుపడిలో పండగ వాతావరణం నెలకొంది. ఎస్సై కె.సత్యనారాయణ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి సమీప కట్లేరు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో సోమవారం మహాగణపతి, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు అర్చకులు ఎ. అప్పయ్యశాస్త్రి, పి.కోటేశ్వరశర్మ తెలిపారు.

షెడ్డు కూలగొట్టారని ఫిర్యాదు

గొల్లపూడి, న్యూస్‌టుడే: అకారణంగా తనకు సంబంధించిన షెడ్డును కూలగొట్టడంతో రూ.30 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులకు ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు..భవానీపురం మాజేటివారి వీధిలో సిరిగిరి వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతను గొల్లపూడి నల్లకుంట సెంటర్ సమీపంలోని మన్నె చిలకమ్మకు చెందిన ఎకరం 25 సెంట్లు ఖాళీ స్థలాన్ని 15 ఏళ్లకు లీజుకు తీసుకుని షెడ్డు ఏర్పాటు చేసుకుని అందులో నాలుగేళ్లుగా ఫొటోఫ్రేమ్ కంపెనీ నడిపిస్తున్నారు. స్థల యజమాని మన్నె చిలకమ్మకు స్థలం వెంబడి ఉన్న బొమ్మసాని బుల్లికోటయ్యకు మధ్య స్థల వివాదం కొన్నాళ్లుగా నడుస్తోంది. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో బొమ్మసాని బుల్లికోటయ్య, అతని కుమారుడు సాంబశివరావు, మరికొందరు కలిసి తన రేకుల షెడ్డును జేసీబీతో ధ్వంసం చేశారని.. అక్కడ ఉన్న వాచ్‌మెన్‌ను కొట్టడంతో ఫోన్ చేయగా షెడ్డు వద్దకు వెళ్లగా అక్కడ ఎవరూలేరని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.



అస్తవ్యస్తంగా సామగ్రి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఊటుకూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు సిద్ధార్థ విద్యాలయం నుంచి ఇద్దరు బాలికలు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సీహెచ్.కృష్ణారావు సోమవారం తెలిపారు. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14, అండర్-17లో ఎం.ఉమాశ్రీ, ఎస్కే.ఫన్జియాఆలీ సత్తా చాటినట్లు చెప్పారు. విద్యాలయం ఛైర్మన్ జె.వీరబాబు, పీఈటీ బి.చందు సదరు బాలికలను అభినందించారు.



బాలికలతో ఛైర్మన్ వీరబాబు

రెడ్డిగూడెం: అప్సా డెమొక్రటిక్ మైలవరం నియోజకవర్గ స్థాయిలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో రెడ్డిగూడెం గీతాంజలి పాఠశాల విద్యార్థులు 120 జ్ఞాపికలు సాధించి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.మల్లికార్జునరెడ్డి, కరస్పాండెంట్ జి.కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



రెడ్డిగూడెం: గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

పనుల నిర్వహణపై నివేదిక ఇవ్వండి

మైలవరం: ఎన్నెస్పీ ఎడమ కాలువ మూడో జోన్ పరిధిలో గల మైలవరం బ్రాంచి కాలువ, అనుబంధ కాలువల పరిస్థితిపై ఆ శాఖ ఎస్ఈ మొహిద్దీన్, ఈఈ రాందాసులు సోమవారం పరిశీలించారు. బ్రాంచి కాలువ 25.795 కి.మీ. వద్ద ఎస్కేప్ షట్టరు, కుడివైపు గోడ దెబ్బతినడంపై పరిశీలించారు. 22.507 వద్ద యూటీకి పడిన రంధ్రాన్ని పరిశీలించి, డీఈ ప్రభు, చెవుటూరు డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో శ్లాబు 10 మీటర్ల మేరకు కొట్టుకుపోయినట్లు గుర్తించారు. ఆయా పనుల నిర్వహణపై నివేదిక ఇవ్వాలని సూచించారు.



కాలువల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

భూసార పరీక్షపై అవగాహన తప్పనిసరి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : భూసార పరీక్షలపై విద్యార్థులు కనీస అవగాహన కలిగి ఉండాలని భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారిణి సువర్ణ కుమారి సూచించారు. సోమవారం తిరువూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత, అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులకు భూమిలోని పోషకాలు, లోపాలు, పంటలకు అవసరమైన ఎరువుల వినియోగం, మట్టి నమూనా సేకరణ విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ద్వారా రైతులు తమ ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మ, వ్యవసాయ అధికారి సురేష్, కావ్య, సింధు, రైతు సేవా సహాయకురాలు భాగ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న సువర్ణ కుమారి

బాలోత్సవ్‌లో బహుమతులు

తిరువూరు, గంపలగూడెం: జాతీయ స్థాయిలో నంబూరులో నిర్వహించిన బాలోత్సవ్‌లో తిరువూరు శ్రీనిధి విద్యాలయం విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ ఎం.కిషోర్ బాబు, ప్రిన్సిపల్ ఆర్.వి.నారాయణ తెలిపారు. సంప్రదాయ వేషధారణ సబ్‌జూనియర్స్ విభాగంలో సుతారి దీప్తి ద్వితీయ, ఏకపాత్రాభినయంలో నామా అవినాష్ తృతీయ బహుమతి సాధించినట్లు చెప్పారు. వారిని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.74 లక్షలకు ఐపీ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని పాకబండ బజార్ ప్రాంతంలో నివసిస్తున్న షేక్ మదార్‌సాహెబ్ రూ.74 లక్షలకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 20మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జమ్మవరం బోడవాడకు చెందిన పిటిషనర్ మదార్‌సాహెబ్ పదేళ్లుగా సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు, విక్రయాలు చేస్తున్నారు. ఈ వ్యాపారం కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. వివిధ కారణాలతో వ్యాపారంలో నష్టాలు రావటంతో బాకీలు తీర్చే పరిస్థితి లేదని, తనను దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది నేరెళ్ల శ్రీనివాసరావు ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశారు.

అందెశ్రీ మరణం బాధాకరం

గొల్లపూడి: ప్రజాకవి అందెశ్రీ మరణం బాధాకరమని ఏపీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్యలు ఓ ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన పాటలు రాసిన అందెశ్రీ మన మధ్య లేకపోవడం విచారకరమని, ఆయన పాటలు సమాజహితం కోరే విధంగా ఉంటాయని కొనియాడారు.

త్రిశూలధారి.. నమఃశివాయ

తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో మహిళలు దీపోత్సవాలు నిర్వహించారు. అర్చకులు శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.



ఎన్టీటీపీఎస్ కాలనీలో సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు



రామలింగేశ్వరస్వామి..



నరసాపురం సూర్య లక్ష్మీనారాయణ ఆలయంలో..



గంపలగూడెంలో దీపోత్సవం



తిరువూరు చంద్రమౌళేశ్వరస్వామి..



మహాలక్ష్మి రవితేజ నిందితుడు శ్రీనివాస్

వాళ్లు దెయ్యాలై మళ్లీ వస్తారేమో!

- అమ్మ, తమ్ముడిని పొడిచి చంపేశా
- హత్య చేసి పోలీసులకు చెప్పిన పెద్ద కుమారుడు
- భీమవరంలో దారుణ ఘటన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తల్లి, తమ్ముడిని ఓ అన్న అత్యంత కిరాతకంగా చాకుతో పొడిచి చంపేశాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని సంజీవ్ నిస్సంకర్ వద్దయ్య వీధిలో ఉంటున్న మహాలక్ష్మి(60)కి రవితేజ (33), శ్రీనివాస్(37) అనే ఇద్దరు కుమారులతో పాటు ఓ కుమార్తె సంతానం. మహాలక్ష్మి భర్త కొవిడ్ సమయంలో మృతి చెందగా, కుమార్తె బెంగళూరులో ఉంటోంది. రవితేజ, శ్రీనివాస్‌లకు ఇంకా వివాహాలు కాలేదు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఇంట్లో ఉన్న తల్లి మహాలక్ష్మి, తమ్ముడు రవితేజలను శ్రీనివాస్ చాకుతో పొడిచి కిరాతకంగా హత్య చేశాడు. అనంతరం నేరుగా పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. "అమ్మ, తమ్ముడు నన్ను ఇంట్లో బంధించారు. నా మనసులో ఏం మాట్లాడుకున్నానో అది వాళ్లిద్దరికీ తెలిసిపోతోంది. వారిని ఎంత పొడిచినా.. రక్తమడుగులో కొట్టుకోవడం చూస్తే వాళ్లు చనిపోయాక కూడా దెయ్యాలై వచ్చి నన్ను వేధించేలా ఉన్నారు" అని శ్రీనివాస్ పోలీసులకు వివరించాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి నిందితుని అదుపులోకి తీసుకున్నారు. రవితేజ మృతదేహంపై 30కి పైగా చాకు పోట్లు, ఆయన తల్లి పొట్టలో నుంచి బయటకు వచ్చిన పేగులను చూసి ఇరుగు పొరుగు చూసి వారు చనిపోయాక కూడా నిందితుడు వారిని గంటల పాటు పొడిచి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాస్‌కు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడమే ఘటనకు కారణమై ఉండొచ్చని వారు ప్రాథమిక విచారణలో తేల్చారు. కాగా.. ఇంట్లోనే తనను బంధించి, చిన్న కుమారుడికి బాధ్యతలు అప్పగించి తనను తక్కువగా చూడటం వల్ల సహించలేకపోయినట్లు నిందితుడు శ్రీనివాస్ పోలీసు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, డీఎస్పీ ఆర్.జి జయసూర్య, సీఐ ఎం.నాగరాజు, స్పెషల్ బ్రాంచి సీఐ కె.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రాష్ట్రపతి, ప్రధాని రాక నేపథ్యంలో.. పుట్టపర్తిలో పటిష్ఠ ఏర్పాట్లు

- భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించండి
- సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఈ నెల 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టపర్తి రానున్న నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాబా శతజయంతి వేడుకలపై ఆయన సోమవారం సచివాలయంలో మంత్రులు, సీఎస్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండటంతో లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం పేర్కొన్నారు. పుట్టపర్తిని సుందరంగా అలంకరించాలని, ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల కమిటీ అక్కడ పర్యటించాలని సూచించారు. ఎంతమంది భక్తులు వస్తారో అంచనా వేసి, తదనుగుణంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. రద్దీ మేరకు ఆర్టీసీ బస్సులు నడిపేలా సన్నాహాలు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం ఉండకూడదని సీఎం పేర్కొన్నారు.



సత్యసాయిబాబా జయంతి వేడుకలపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సవిత, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సీఎస్ విజయానంద్ తదితరులు

65 ప్రత్యేక రైళ్లు

శతజయంతి వేడుకలకు వచ్చే భక్తుల కోసం 65 ప్రత్యేక రైళ్లతో పాటు ఈ నెల 13 నుంచి డిసెంబరు 1 వరకు 682 రైళ్లను రైల్వేశాఖ నడపనుందని అధికారులు సీఎంకు వివరించారు. పుట్టపర్తి బస్టాండ్, రైల్వేస్టేషన్ మధ్య తిరిగేలా 20 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 10 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, పారిశుద్ధ్య నిర్వహణకు 250 మంది సిబ్బంది నియమించామని నివేదించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత తదితరులు పాల్గొన్నారు.

విమానాలపై ఆకతాయి చేష్టలు ఆగవా?

- తాజాగా బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి బాంబు బెదిరింపు
- అయిదు గంటల పాటు ప్రయాణికులకు ఇబ్బందులు

ఈనాడు వాణిజ్య విభాగం: లండన్ నుంచి హైదరాబాద్ వస్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి వచ్చిన బాంబు బెదిరింపు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 2.23 గంటలకు (అక్కడి కాలమానం ప్రకారం) బయలుదేరిన (బీఏ 277) బోయింగ్ 787-8 ట్విన్ జెట్ విమానం, సోమవారం ఉదయం 5.22 గంటలకు (భారత కాలమానం ప్రకారం) హైదరాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ఈ విమానంలో బాంబ్ పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇ-మెయిల్ ద్వారా విమానయాన అధికారులకు బెదిరింపు రావడంతో, హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో ఉత్కంఠ నెలకొంది. 212 మంది ప్రయాణికులతో వచ్చిన ఈ విమానాన్ని పటిష్ఠ భద్రతా ఏర్పాట్ల నడుమ, టెర్మినల్ భవనానికి దూరంగా నిలిపారు. అక్కడకు చేరుకున్న సీఐఎస్ఎఫ్ బాంబ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది కలిసి పూర్తి స్థాయిలో నిశితంగా పరిశీలించేందుకు 5 గంటల సమయం పట్టింది. ఈలోపు తాము పడిన ఇబ్బందులను ప్రయాణికులు 'ఈనాడు'కు వివరించారు.



బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానానికి దూరంగా ప్రయాణికులు, సామగ్రి

ఇంత ప్రక్రియ ఉంటుందా..

విమానం ల్యాండ్ అవ్వగానే, త్వరగా ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకుని.. ఇళ్లకు, ఇతర గమ్యస్థానాలకు చేరదామనుకుంటున్న వారికి భద్రతా హెచ్చరికలు ఖంగు తినిపించాయి. తదుపరి విమానంలోని ప్రయాణికులను 10 మంది చొప్పున క్యాబిన్ బ్యాగేజీతో సహా కిందకు దిగమని సూచించారు. ప్రయాణికులు కిందకు వచ్చేసరికి ఆ సమీపంలోనే ఏడెనిమిది బస్సులు, ఫైర్ ఇంజిన్, పది వరకు అంబులెన్సులు, మొబైల్ స్కానింగ్ యూనిట్, జామర్ వంటివి కనిపించాయి. ఒక్కో ప్రయాణికుడి టికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి, వారి క్యాబిన్ లగేజీని దూరంగా ఉంచారు. తనిఖీలు చేసిన వారిని బస్సుల్లోకి ఎక్కించారు. తదుపరి క్యాబిన్ లగేజీని స్కానర్‌తో తనిఖీ చేశాక, బస్సుల్లోని ప్రయాణికులను వాటిని తెచ్చుకోమన్నారు. అనంతరం విమానంలోని చెక్-ఇన్ లగేజీని తీసి, రోడ్డుమీద వరుసల్లో ఉంచారు. వాటిని కూడా క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు ఏమీ లేదని నిర్ధారించుకున్నాక.. బస్సుల్లో ఉన్న ప్రయాణికులను వాటిని తెచ్చుకునేందుకు అనుమతించారు. 212 మంది ప్రయాణికులు కావడంతో, విడతలుగా ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసేందుకు 5 గంటల సమయం పట్టింది.

కాలకృత్యాలు తీర్చుకునే మార్గమూ లేదు

ఉదయం 5.20 గంటలకు విమానం నుంచి ప్రయాణికులను కిందకు దించడం ప్రారంభించగా, మొత్తం తనిఖీలు పూర్తి చేసి, ఇమిగ్రేషన్ వద్దకు బస్సుల్లో తీసుకెళ్లేసరికి 10.30 అయ్యింది. విమానం నుంచి దించేయడంతో కాలకృత్యాలు తీర్చుకునే మార్గం లేక పిల్లలూ, పెద్దవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాదాపు 3 గంటలపాటు తాగునీరు కూడా ఇవ్వకపోవడంతో, కొందరు ప్రయాణికులు గట్టిగా అడగడంతో అప్పుడు బస్సుల్లోకి సీసాలు అందించారు. ✦ ఆకతాయితనంతో, తమకు ఇష్టంలేని వ్యక్తులు ప్రయాణిస్తున్నారనే భావనతో వారికి అసౌకర్యం కలిగించాలనే ఆలోచనతో, వ్యవస్థలపై ఆగ్రహంతో కొందరు చేస్తున్న బాంబు బెదిరింపుల వల్ల వందలమంది ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురికావాల్సి వస్తోంది. ఇటువంటి బెదిరింపు కాల్స్‌ను నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నామని, అధికార యంత్రాంగం ప్రకటించినా.. ఇంకా ఆగడం లేదు. ✦ బాంబు బెదిరింపు ఉదంతంపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డీటీకి మళ్లీ మంచి రోజులు!

ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తి

ఈనాడు, అనంతపురం: గ్రామీణ పేదల ఆశాదీపం ఆర్డీటీ సంస్థకు మళ్లీ మంచి రోజులు రానున్నాయి. నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఎఫ్‌సీఆర్‌ఏ (విదేశీ విరాళాల నియంత్రణ చట్టం) అనుమతులు త్వరలోనే రానున్నాయి. కొత్త లైసెన్సు జారీకి అవసరమైన ప్రక్రియ దాదాపు పూర్తయింది. అనంతపురం కేంద్రంగా ఏపీతో పాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి సేవలందిస్తున్న ఆర్డీటీ లైసెన్సు నవీకరణను 2021లో కేంద్ర హోంశాఖ నిలిపివేసింది. అప్పటి నుంచి విదేశాల నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి. ఫలితంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు విఘాతం ఏర్పడింది. సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని గత వైకాపా ప్రభుత్వాన్ని ఆర్డీటీ ప్రతినిధులు పలుమార్లు కోరారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు చొరవ చూపించకపోవడంతో ప్రక్రియ ముందుకు కదల్లేదు. ఇంటెలిజెన్స్ బ్యూరో నివేదిక పేరుతో కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో ఆర్డీటీ స్థానిక విరాళాల ద్వారా వచ్చిన నిధులతోనే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చింది.

సీఎం చంద్రబాబు, లోకేశ్ చొరవ..

యువగళం పాదయాత్ర సమయంలో లోకేశ్ ఆర్డీటీ సంస్థను సందర్శించారు. తమ ప్రభుత్వం రాగానే ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే సంస్థ ప్రతినిధులను పిలిపించుకుని మాట్లాడారు. లైసెన్సు పునరుద్ధరణకు కొన్ని సాంకేతిక అంశాలు అడ్డుగా ఉండటంతో కొత్తగా దరఖాస్తు చేయించారు. సీఎం చంద్రబాబు సైతం ఆర్డీటీ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రెండుసార్లు కలిసి ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు.

కొత్త జిల్లాల్లో బ్యాంకు శాఖలు

కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీ, సీఈవో రమేష్‌బాబు

ఈనాడు, విశాఖపట్నం: దక్షిణాదిలో తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో బ్యాంకు సేవలను మరింత విస్తరిస్తామని కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీ, సీఈవో రమేష్‌బాబు తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌పై దృష్టి సారించామన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో, డిమాండ్ ఉన్న చోట కొత్త శాఖలు ప్రారంభిస్తామన్నారు. సోమవారం విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. 'ఐదేళ్ల కిందట బ్యాంకు ఆదాయం రూ.230 కోట్లు ఉండేది. ఇప్పుడు రూ.2 వేల కోట్లకు పెరిగింది. ప్రస్తుతం వ్యవసాయ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు ఇచ్చేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అందుబాటు ధరల గృహ రుణాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. విశాఖలో వృద్ధులకు సేవలందించే ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఒక ఫ్లోర్ నిర్వహణ, వైద్య పరమైన వసతుల కల్పనకు 'కేవీబీ ఆరోగ్య సేవ' కింద చేయూతగా నిధులు ఇస్తున్నాం' అని రమేష్‌బాబు తెలిపారు.

టంగ్‌స్టన్ ఖనిజాన్వేషణకు ప్రాథమిక లైసెన్స్ మంజూరు

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లె మండలం బాలెపాల్యెంలో 308.30 హెక్టార్లలో టంగ్‌స్టన్, దాని అనుబంధ ఖనిజాల అన్వేషణకు హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌కు కాంపోజిట్ (ప్రాథమిక) లైసెన్స్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర గనులశాఖ గత ఏడాది నిర్వహించిన ఈ-వేలంలో హిందుస్థాన్ జింక్ సంస్థ ఎక్కువ మొత్తం కోట్ చేసి, ఈ బిడ్ దక్కించుకుంది. తాజాగా రెవెన్యూ అధికారుల నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం పొందడంతో కాంపోజిట్ లైసెన్స్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చింది. టంగ్‌స్టన్.. క్రిటికల్ మినరల్ కిందకు వస్తుంది. ఇది 3 వేల డిగ్రీల వేడి వద్ద కరుగుతుంది. దీనిని బల్బుల్లోని ఫిల్మెంట్ల తయారీలో, వెల్డింగ్ చేసినప్పుడు జాయింటింగ్‌కు ఉపయోగించే మెటీరియల్‌గా వినియోగిస్తారు.

నిందితుడికి పరిహారంగా రూ.10వేలు చెల్లించండి

విజయవాడ సైబర్ క్రైమ్ ఠాణా ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంపై నమోదు చేసిన కేసులో నిందితుడు తిరుపతి లోకేశ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. 24 గంటల్లోపు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుండా అతని ప్రాథమిక హక్కులను హరించారని హైకోర్టు తప్పుపట్టింది. నష్టపరిహారం కింద లోకేశ్‌కు రూ.10 వేలు చెల్లించాలని విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. సొమ్ము చెల్లించినట్లు రసీదు తీసుకొని, దానిని రిజిస్ట్రార్ జ్యుడిషియల్‌కు అందజేయాలని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టారనే ఆరోపణలతో తన కుమారుడు లోకేశ్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ విశాఖకు చెందిన భారతి గతేడాది నవంబరులో హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన ధర్మాసనం సోమవారం నిర్ణయాన్ని ప్రకటించింది.

ఆలయాల్లో రద్దీ నియంత్రణ పర్యవేక్షణకు మంత్రుల కమిటీ

ఈనాడు, అమరావతి: ఆలయాల్లో తొక్కిసలాటలు వంటి ఘటనలు జరగకుండా తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే 2019-24 మధ్య కాలంలో దేవాలయాలపై జరిగిన దాడుల ఘటనలపై తీసుకుంటున్న చర్యలను ఈ ఉపసంఘం పర్యవేక్షించనుంది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లతో ఈ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. దేవాదాయశాఖ కార్యదర్శి ఈ కమిటీకి కోఆర్డినేటర్‌గా ఉంటారు. అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), దేవాదాయ కమిషనర్ ఈ కమిటీకి సహకారం అందిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జారీచేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

గోదావరి పుష్కరాలపై వ్యూహరచనకు కమిటీ

ఈనాడు,అమరావతి: 2027లో జరిగే గోదావరి పుష్కరాల కోసం వివిధ శాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దేవాదాయ, జలవనరులు, పురపాలక, రెవెన్యూ, యువజన సంక్షేమ-పర్యాటక, రవాణా-ఆర్‌అండ్‌బీ, వైద్యం, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక శాఖ కార్యదర్శులతో పాటు డీజీపీని భాగస్వామిని చేస్తూ కమిటీ ఏర్పాటు చేశారు. పుష్కరాల కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం తీసుకునే నిర్ణయాల అమలుతోపాటు ఈ కార్యక్రమం సాఫీగా, సమర్థంగా నిర్వహించేందుకు ఈ కమిటీ వ్యూహాలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అధికారిగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి.వీరపాండియన్‌ను ప్రభుత్వం నియమించింది.

రూ.1,595 కోట్లతో సిర్మా ఎస్‌జీఎస్ సంస్థ 'పీసీబీ' తయారీ కేంద్రం

ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థ రూ.1,595 కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ) యూనిట్‌ను ఏర్పాటు చేయనుందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,170 మందికి ఉద్యోగాలు రానున్నాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు దార్శనికత, మంత్రి లోకేశ్‌ల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. పెట్టుబడులు రాకుండా మారీచుడిలా జగన్ అడ్డుపడుతున్నారని దుయ్యబట్టారు.

పింగళి వెంకయ్య, బ్రౌన్‌ల జయంతులను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలి

ముఖ్యమంత్రికి ఉప సభాపతి రఘురామకృష్ణరాజు లేఖ

ఈనాడు, అమరావతి: పింగళి వెంకయ్య, సీపీ బ్రౌన్‌ల జయంతులను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. 'జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య స్వాతంత్ర్య ఉద్యమంలో అమూల్యమైన కృషి చేశారు. తెలుగు పునరుజ్జీవనోద్యమ పితామహుడు, తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధికి గొప్ప సేవలందించిన వ్యక్తి బ్రౌన్' అని పేర్కొన్నారు.

బ్రౌన్ నిఘంటువు తెలుగు భాషాభివృద్ధికి పునాది: మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: తెలుగు భాషను ప్రేమించి, సాహిత్యాన్ని ముద్రించి, భద్రపరిచి ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడు సీపీ బ్రౌన్ అని మాజీ సీఎం జగన్ కొనియాడారు. ఆయన సమకూర్చిన నిఘంటువు తెలుగు భాషాభివృద్ధికి శాశ్వతమైన పునాది వేసిందన్నారు. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళులర్పించారు.

అందెశ్రీ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల జగన్ విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ మాండలిక సాహిత్యంలో అందెశ్రీ ప్రత్యేకత చాటారన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి, గొర్రెల కాపరిగా జీవన ప్రస్థానాన్ని ప్రారంభించిన అందెశ్రీ పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారని కొనియాడారు. అందెశ్రీ మృతితో తెలుగు సాహిత్యానికి తీరని లోటుగా అభివర్ణించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పేలుడుతో దిగ్భ్రాంతికి గురయ్యా

దిల్లీ ఎర్రకోట మెట్రోస్టేషన్ వద్ద జరిగిన పేలుడు ఘటన గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని జగన్ అన్నారు. పేలుడులో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు సోమవారం ఎక్స్ వేదికగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన 3.0పై చర్చ

- గుంటూరులో వాటర్‌షెడ్ మహోత్సవ్ జాతీయ సదస్సు

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, జిల్లా పరిషత్తు: దేశంలో అమలవుతున్న వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్-ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0 అమలు, పురోగతిపై గుంటూరులో నిర్వహిస్తున్న వాటర్‌షెడ్ మహోత్సవ్ జాతీయ సదస్సు చర్చించింది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వివిధ రాష్ట్రాల ప్రతినిధులు సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై 3.0 కార్యాచరణ ప్రణాళికపైనా చర్చించారు. ఈ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, భూ వనరులశాఖల అధికారులు పాల్గొన్నారు.

✦ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఓ రైతు సాగు నీటి సమస్యను పరిష్కరించుకోవడానికి చేసిన కృషిని దృశ్య మాధ్యమంగా ప్రదర్శించారు. ఆ రైతు సమీపంలోని వాగుల నుంచి కాలువ తవ్వి ఆ నీటిని పొలంలోని కుంటలోకి వచ్చేలా చేసుకున్నారు. అలా నిల్వ చేసిన నీటితో ఎక్కువ పంటలు పండించి లాభాలు ఆర్జించారు. బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ ఆ రైతు కృషిని తెలుసుకుని అభినందించారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

✦ మహారాష్ట్రకు చెందిన ప్రతినిధి బాలాజీ మాట్లాడుతూ తమ గ్రామంలో నీటి కొరతతో అనేక సమస్యలు ఎదుర్కొన్నామని, యువతకు వివాహాలు జరగని పరిస్థితి ఎదురవడంతో ఆచార్య వినోభా బావే భూదానోద్యమం స్ఫూర్తితో రూ.46 లక్షల విలువైన పనులకు శ్రమదానం చేసి 14 ఎకరాలకు నీటి వసతి సమకూర్చుకున్నామన్నారు.

✦ కేంద్రం ఇచ్చిన నిధులు బాగా ఖర్చు చేసిన ఐదు రాష్ట్రాలు, అట్టడుగున ఉన్న రాష్ట్రాల వివరాలు ప్రదర్శించి పలు అంశాలను చర్చించారు.

✦ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీలో 'ఎకోసిస్టమ్ రెస్టొరేషన్ త్రూ ల్యాండ్‌స్కేప్ అండ్ రిసోర్స్ కన్జర్వేషన్' అంశాన్ని హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌కు చెందిన డాక్టర్ రమేష్ సింగ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 'భారతదేశంలో సంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతులు' అంశంపై దిల్లీలోని ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ గోపాల్‌కుమార్ ప్రసంగించారు.

✦ ఆంగ్రూ ప్రధాన శాస్త్రవేత్త ఎ.సాంబయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంతాన్ని కూడా వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ పరిధిలోకి తీసుకు రావాలని సూచించారు. కోస్తా తీరంలో ఉప్పు, చౌడు, ఉరకలెత్తిన భూముల పునరుద్ధరణకు, తీరంలో భూగర్భ ఉప్పునీటి లవణ శాతాన్ని తగ్గించేందుకు ప్రాజెక్టులు చేపట్టాల్సిందిగా కోరారు.

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.3.24 కోట్లు

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఒల్లూరులోని రాయలచెరువుకు గండి పడటంతో నీటమునిగిన కళత్తూరు ఎస్సీకాలనీ, ఎస్ఎల్ పురం, పాతపాలెం గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నిత్యావసరాలు, చనిపోయిన పశువులకు పరిహారంగా రూ.3.24 కోట్లు మంజూరు చేసింది. 960 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామోలిన్, కిలో ఉల్లి, కిలో బంగాళదుంప, కిలో పంచదార అందిస్తారు. వరద కారణంగా చనిపోయిన 1,100 పశువులకు పరిహారంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.83.50 లక్షలు అందించేందుకు అనుమతించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైవీ సుబ్బారెడ్డి బ్యాంకు ఖాతా వివరాలు సిట్‌కి ఎందుకివ్వలేదు?

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: భక్తులు పవిత్రంగా భావించే తిరుమల లడ్డూను కల్తీ చేసి జగన్ అండ్ కో సిగ్గు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. వైకాపా హయాంలో కమీషన్ల కోసం కల్తీ నెయ్యి వినియోగించి శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేయడం వాస్తవం కాదా అని సోమవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 'వైవీ సుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవీ డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్, భోలే బాబా డెయిరీలు సరఫరా చేసిన నెయ్యి నమూనాల్లో పామాయిల్ కలిసిందని నివేదికల్లో తేలినా ఎందుకు పట్టించుకోలేదు? తప్పు చేయబట్టే వైవీ సిట్‌కి తన బ్యాంకు ఖాతా వివరాలు అందించలేదు. దిల్లీలోని ఏపీ భవన్‌లో ఓఎస్డీగా పనిచేసే అధికారితో వైవీ కల్తీ నెయ్యి వ్యవహారం నడిపించడం నిజం కాదా? భోలే బాబా డైరెక్టర్లలో ఒకరైన పొమిల్ జైన్‌ని దిల్లీలో వైవీ ఎందుకు కలిశారు? ఒక్క లీటర్ కూడా పాలు సేకరించని భోలేబాబా దగ్గర నెయ్యి కొనుగోలు చేయాల్సిన అవసరమేంటి' అని ప్రశ్నించారు.

కెనరా బ్యాంక్ అధికారుల సంఘం కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం (మధురవాడ, సాగర్‌నగర్), న్యూస్‌టుడే: ఏఐ టెక్నాలజీ ద్వారా వచ్చే మార్పులకు అనుగుణంగా బ్యాంకు అధికారులు సాంకేతిక అంశాలపై పట్టు పెంచుకోవాలని కెనరా బ్యాంక్ అధికారుల సంఘం (సీబీఓఏ) నూతన ఛైర్మన్ జాకబ్, అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్ నిగం, కె.రవికుమార్ అన్నారు. విశాఖలో మూడు రోజుల పాటు జరిగిన సీబీఓఏ 20వ త్రైవార్షిక సమావేశాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నివేదికను కార్యవర్గ ప్రతినిధులు సభలో ప్రవేశపెట్టారు. గత మూడేళ్లలో సభ్యుల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను నాయకులు వివరించారు. అనంతరం రానున్న మూడేళ్ల కాలానికి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జాతీయ ఛైర్మన్‌గా జాకబ్, అధ్యక్షుడిగా రాజీవ్ నిగంతో పాటు వరుసగా మూడోసారి కార్యదర్శిగా ఎన్నికైన రవికుమార్‌ను కమిటీ ప్రతినిధులు, అధికారులు సత్కరించారు.



మూడోసారి కార్యదర్శిగా ఎంపికైన రవికుమార్‌ను అభినందిస్తున్న అధికారులు

భాగస్వామ్య సదస్సుకు ఐఏఎస్ అధికారుల నియామకం

ఈనాడు, అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు సహకరించేందుకు ప్రభుత్వం ఆరుగురు ఐఏఎస్ అధికారులను డిప్యుటేషన్‌పై నియమించింది. వీరిలో ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కల్పనాకుమారి, ఏపీ మారిటైం బోర్డు సీఈవో అభిషేక్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పార్వతీపురం మన్యం జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఉన్నారు. వీరంతా ఈ నెల 11 నుంచి సదస్సు పూర్తయ్యే వరకు విశాఖలో ఉండి. . విధులు నిర్వహించాలని సీఎస్ విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మాతృశాఖకు స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈఓ

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈఓ సీహెచ్ నరేశ్‌కుమార్‌ను మాతృశాఖకు పంపిస్తూ సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు చెందిన ఆయన ఈ ఏడాది మేలో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈఓగా నియమితులయ్యారు. తనను విధుల నుంచి రిలీవ్ చేయాలని కోరుతూ గత నెల 7న ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణకు 23 మంది ఉద్యోగులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 23 మంది ఉద్యోగులను వారి సొంత రాష్ట్రమైన తెలంగాణ వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్ కేటగిరీ ఉద్యోగులున్నారు. ఏపీకి వచ్చేనాటికి వారు ఏ కేటగిరీ పోస్టుల్లో పనిచేస్తున్నారో అదే కేటగిరీ పోస్టుల్లో చేరేందుకు ఉద్యోగులు అంగీకారపత్రం ఇవ్వాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

'సాంకేతికతతో పరిశోధనల్లో ప్రగతి'

ఈనాడు, అమరావతి: సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనల్లో ప్రగతి సాధించొచ్చని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కొత్త మధుమూర్తి తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్రం విభాగంలో నిర్వహించనున్న 'ఫ్యాకల్టీ కోసం ల్యాబొరేటరీ పరికరాల ఆపరేషన్, మెయింటెనెన్స్' కార్యక్రమ బోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. డిసెంబరు 15 నుంచి 19 వరకు ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "విశ్వవిద్యాలయాల్లో రూ.కోట్ల విలువ చేసే పరిశోధన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. చిన్నపాటి లోపాలతో ఇవి వినియోగంలో లేకుండా పోతున్నాయి. ఈ శిబిరంతో ప్రయోగశాలల పరికరాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది" అని పేర్కొన్నారు. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ విజయభాస్కరరావు పాల్గొన్నారు.

విడుదలైన ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ ఫలితాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు-అక్టోబరులో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. రీటోటలింగ్ కోరే అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.2 వేలు చొప్పున విశ్వవిద్యాలయానికి చెల్లించి, నవంబరు 17లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఫలితాలు విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

తితిదే లడ్డూ తయారీలో నకిలీ నెయ్యి వాడటం క్షమించరాని నేరం

20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ తయారీలో నకిలీ నెయ్యి వాడటం క్షమించరాని నేరమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆధ్యాత్మికతకు భంగం కలిగించిన వారికి ఏ శిక్ష పడుతుందో చరిత్ర చెప్పిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తితిదేను ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా వారి సహచరులకు ఆదాయ వనరులుగా జగన్ ప్రభుత్వం పరిగణించిందని ఆరోపించారు. 2019- 24 మధ్య భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి రూ. 68 లక్షల కిలోల నెయ్యి తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేశారని, ఈ సంస్థ పాలు, వెన్న ఒక్క చుక్క కూడా ఎక్కడి నుంచీ సేకరించలేదని తేలిందని దినకర్ వివరించారు. నకిలీ నెయ్యి తయారు చేయడానికి వాడిన రసాయనాలను సప్లయ్ చేసిన కంపెనీ వివరాలను సిట్ రాబట్టిందని.. తప్పుచేసిన వారికి శిక్ష తప్పదని తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఉరకలెత్తే ఉత్సాహం, అనుకున్నది చేయాలనే తపన... సరదాలు, సంతోషాలు... ఇవే టీనేజీ జీవితం అనుకుంటారు చాలా మంది. కానీ, పెద్ద లక్ష్యాలు, అభిరుచుల్ని ముందుకు తీసుకెళ్లాలన్న ఆసక్తీ తమకు ఎక్కువే అంటోంది ఈతరం. అందుకు ఉదాహరణే హైదరాబాద్‌కి చెందిన వైష్ణవి అనంత.



వైష్ణవి

టైమ్ టేబుల్ వేసుకుని పుస్తకం రాశా...

'అనుభవాలు చిన్నవైనా, పెద్దవైనా జ్ఞాపకాలుగా మారతాయి. ఊహాశక్తిని పెంచుతాయి. అవే నన్ను రచయిత్రిగా మార్చాయి. నాకు పద్నాలుగేళ్లు ఉన్నప్పుడు 'ది జాజ్ గ్యాంగ్' పేరుతో 1,2,3 సిరీస్ పుస్తకాలు రాశా. వాటికి గొప్ప ఆదరణ లభించింది. గతేడాది చెల్లి దీపతో కలిసి 'బ్యూటీ బియాండ్' అనే మరో బుక్ రాశా. ఈ ప్రయాణం కొవిడ్‌లో మొదలైంది. సమయం దొరకడంతో అమ్మ పుస్తకాలు చదివించేది. ముఖ్యంగా మన పురాణాలతో జ్ఞానం సంపాదించుకోవచ్చని చెప్పేది. అయితే, అప్పటికి నాకు మామూలు బుక్స్ చదవడమే కష్టం. అలాంటిది ఏకంగా రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాలు ఎలా చదవగలను అనిపించింది. కానీ, చివరికి చదవడం మొదలుపెట్టా. నాకు ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు లభించాయి. అప్పుడు అమ్మ నువ్వు ఎందుకు ఆ పౌరాణికాలకు మరో రూపం తీసుకురాకూడదని అడిగింది. నాన్నా కొన్ని సలహాలు ఇచ్చారు. కానీ, నాకేమో అసలు పుస్తకాలు చదవడమే బద్ధకం. అలాంటిది పుస్తకాలు రాయడం అంటే చాలా కష్టం. వాళ్లిద్దరూ... రాయడానికి ప్రయత్నించు.. ఎక్కడైనా ఆగిపోవాలనిపిస్తే ఆగిపో అని అన్నారు. అలా మొదట కష్టంగానే ఆరంభించా.

సీత గురించి తెలుసుకోవాలని...

రామాయణం అంటే రాముడు రావణుడిని చంపడం మాత్రమే కాదు. ఎంతో త్యాగం, క్రమశిక్షణ, ప్రేమ, కుటుంబం, జీవితంలోని ఇతర లోతైన అంశాల గురించి బోధిస్తుంది. ఇందులోని ఒక్కో పాత్రకు నా ఆలోచనల్ని కలిపి 'ది జాజ్ గ్యాంగ్' రాశాను. కథంతా ముగ్గురు యువకుల చుట్టూ తిరుగుతుంది. వారు టైమ్ మెషీన్‌ను కనుగొని, రామాయణ యుగాన్ని, ముఖ్యంగా మిథిలను సందర్శించాలని నిర్ణయించుకుంటారు. ఎందుకంటే అనేక మంది పాశ్చాత్య చరిత్రకారులు చెప్పినట్లుగా రామాయణం ఒక పౌరాణిక కథ కాదని నిరూపించడానికి వారు ప్రయత్నిస్తారు. రాముడి గురించి చాలా విషయాలు తెలుసు కానీ సీతాదేవి గురించి అంతగా తెలియని వాస్తవాలు ఉన్నాయి. కాబట్టి వారు మిథిలను ఎంచుకుని అక్కడ సీతాదేవి చుట్టూ జరిగిన సంఘటనలను తెలుసుకుంటారు. రామాయణం అనేక పుస్తకాల్లో వివిధ రూపాల్లో రచించారు. కాబట్టి, నేను నా రచనలలో సాహసం, థ్రిల్‌ను చేర్చాను. ఓపక్క దేశ సంస్కృతి, సందేశాలకు ప్రాధాన్యం ఇస్తూనే, పాఠకులను కట్టిపడేసేలా రామాయణంలోని భిన్నమైన అంశాలను చెప్పడానికి ప్రయత్నించాను. పురాణాల గురించి తక్కువ తెలిసిన నాలాంటి పిల్లలు, యువతకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. నా పుస్తకంలోని ప్రధాన పాత్రల (జే, ఆర్చీ, జెనీషా) ఇనీషియల్స్ ఆధారంగా దీనికి 'ది జాజ్ గ్యాంగ్' అనే పేరు పెట్టా. నిజానికి పుస్తక రచన అనుకున్నంత సులువేం కాదు... ఓ వైపు చదువుకుంటూనే దీనికి సమయం కేటాయించాలి. అందుకే, రోజూ టైమ్ టేబుల్ వేసుకుని మరీ రాసేదాన్ని. నాకు ఇష్టమైన రచయిత్రి సుధామూర్తి. నాకు తైక్వాండోలోనూ ప్రవేశం ఉంది. ఈ మధ్య జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బ్లాక్ బెల్ట్ సాధించా. చారిత్రక ప్రదేశాల్ని సందర్శించడం, బొమ్మలు గీయడం, ఈత కొట్టడం, పుస్తకాలు చదవడం అంటే నాకెంతో ఇష్టం. త్వరలో మరో రెండు పుస్తకాలను విడుదల చేయనున్నా.

– చింతలపాటి రామాంజనేయులు, హైదరాబాద్



బ్రేక్ తీసుకోండి!

భార్యాభర్తలన్నాక పొరపొచ్చాలు సహజమే! గిల్లికజ్జాలు పెట్టుకున్నంత మాత్రాన ఒకరి మీద మరొకరికి ప్రేమ లేదనీ చెప్పలేం. సమస్యల్లా ఆ సమయంలోనే! ఒక చిన్న మనస్పర్థ రావడం ఆలస్యం... దాని గురించి గొడవపడుతూ మాటకు మాట అనేసుకుంటారు. అది ఏ ఒక్కరి మనసుకి గాయం చేసినా ఆ ప్రభావం త్వరగా మానదు. ఈ ఇబ్బందులన్నీ మాకొద్దు అనుకుంటున్నారు నవతరం జంటలు. అందుకు వాళ్లు ఎంచుకుంటున్న మార్గం... బ్రేక్ తీసుకోవడం. అలాగని అలిగి పుట్టింటికి వెళ్లడాలూ, ఇక నీతో నాకు సంబంధం లేదు అని విడిపోవడాలూ ఉండవీ విరామంలో. భార్యాభర్తల బాధ్యతల నుంచి కాస్త పక్కకువెళ్లి తమకు నచ్చినవి చేయడమ్మీద దృష్టి పెడతారంతే. కాస్త నెమ్మదించాక తిరిగి ఒకటవుతారు. దీనివల్ల లాభమేంటి? అనుకుంటున్నారా? ముందు ధ్యాస మళ్లుతుంది. నచ్చిన పనులే చేస్తారు కాబట్టి, మనసూ నెమ్మదిస్తుంది.

ఇద్దరూ ఎవరిపాటికి వాళ్లు తమకు నచ్చినవి చేసుకుంటూ సాగితే ఎలా? ఇద్దరి మధ్యా దూరం పెరిగితే! అంటారా? ఈ తిప్పలన్నీ ఉండొద్దంటే కొన్ని నియమాలు పెట్టుకోవాలి. ఈ బ్రేక్ ఎన్నిరోజులు? ఈ సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఎలా మాట్లాడుకోవాలి? పనులు పంచుకోవడం... ఇలా కొన్ని నియమాలు పెట్టుకోవాలి. తరవాత పాత గొడవను పక్కనపెట్టి తిరిగి ప్రేమగా సాగాలి. మరి సమస్య అలాగే ఉంటుంది కదా? అంటే... అందుకే ఈ సమయంలో దాని గురించి ఆలోచించాలి. తగాదాలు ఉండవు కాబట్టి, సమస్యను నింపాదిగా భిన్నకోణాల్లో చూసే అవకాశం ఉంటుంది. అప్పుడు ఇద్దరూ మార్పులు చేసుకోవాల్సిన అంశాల గురించీ ఆలోచించుకుంటే సరి. ఒక రకంగా ఇద్దరూ ఒక అడుగు వెనక్కి వేయడం అన్నమాట. ఈ క్రమంలో మానసిక గాయాలుండవు, బంధమూ బలపడుతుంది. సరిగా ప్లాన్ చేసుకుంటే లాభమే. ఈ బ్రేక్ బాగుందిగా మరి!

చిన్న నిప్పురవ్వ... కారు చీకటిని సైతం పారదోలగలదు... సాయం అందించే చేయి... కష్టాలూ, కన్నీళ్లే జీవితంగా గడిపే వారి జీవితాల్లో వెలుగులు నింపగలదు... ప్రస్తుతం అలాంటి సాయమే అందిస్తోంది గుంతకల్లులోని 'అభయ విద్యా నిధి సొసైటీ'. మేడమ్ నాకు డిగ్రీలో మంచి మార్కులొచ్చాయి. ఆర్థిక స్థోమత లేక పై చదువులు చదవలేకపోతున్నా. సాయం చేస్తారా? అని ఏ అమ్మాయైనా సొసైటీని ఆశ్రయిస్తే కాదనకుండా ఆర్థికసాయం అందిస్తోంది. ఫండింగ్ కోసం హుండీలను ఏర్పాటుచేసి మరీ విరాళాలను సేకరిస్తుంది. అలా ఇప్పటివరకూ వందలమంది జీవితాల్లో చదువుల వెలుగులు నింపిన ఈ సొసైటీని నడుపుతున్నదీ మహిళలే...

అతివల 'అభయ విద్యానిధి'





కొంతమంది బాలికలు... పాఠశాలకు వెళ్లకుండా ఇళ్లలో పాచి పనులకు వెళ్తుంటే చూసి స్కూలుకి ఎందుకు వెళ్లలేదని ఆరా తీశారు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు సత్రసాల వసుంధర. 'మాకు చదువుకోవాలన్న ఆశ ఉన్నా... చదివించే స్థోమత మా అమ్మానాన్నలకు లేద'ని సమాధానమిచ్చారట వాళ్లు. దానికామె చలించిపోయారు. అప్పటి నుంచి నిరుపేద బాలికల చదువు గురించి ఆలోచించడం మొదలుపెట్టారు. 'ఇలాంటి అమ్మాయిల్ని ఆదుకోవాలి అనుకున్నా. నాకు తెలిసిన వాళ్లతో చర్చించా. నా ఆలోచన చెప్పిన వెంటనే, వాళ్లూ సానుకూలంగా స్పందించారు. తమ వంతు సహాయం అందిస్తామన్నారు. అలా ఏర్పాటైనదే ఈ 'అభయ విద్యానిధి సొసైటీ' దీన్ని 2015లో ప్రారంభించా' అని గుర్తుచేసుకుంటారు వసుంధర. ప్రస్తుతం దేవరశెట్టి మాధవీలత అధ్యక్షురాలిగా వందమంది సభ్యులతో ఈ సొసైటీ నడుస్తోంది.

విరాళాల కోసం హుండీలు...

'వంద మంది సభ్యుల విరాళాలే అయితే సహాయం తక్కువ సంఖ్యలో అందుతుంది. అలాకాకుండా దీని పరిధి విస్తరించాలనుకున్నా. అందుకే విరాళాల కోసం హుండీలు ఏర్పాటు చేశాం. వీటిలో ఎవరికి నచ్చిన మొత్తం వాళ్లు వేసేవారు. తరవాత హుండీల అవసరం లేకుండానే దాతలు నెలకు రూ.వెయ్యి చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయడం మొదలుపెట్టారు. దీన్ని పిల్లల చదువులకి కేటాయిస్తున్నాం. సాయం పొందిన వారిలో ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఈడీ, నర్సింగ్... వంటివి చదువుకున్న అమ్మాయిలూ ఉన్నారు. నిరుపేద మహిళలు ఆర్థిక స్థోమతలేక చదువును ఆపేయకూడదు. ఆ లక్ష్యంతోనే సొసైటీ నడుపుతున్నాం' అంటారు వ్యవస్థాపకులు.

– నబీరసూల్, గుంతకల్లు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా...

– ఉదయాంజలి, గుంతకల్లు



మాది నిరుపేద కుటుంబం. చదువుకోవడానికి ఆర్థిక స్థోమత లేదు. నాలాంటి వాళ్లకి అభయ విద్యా నిధి సొసైటీ సాయం చేస్తుందని తెలుసుకుని సభ్యుల్ని కలిసి సహాయం కోరాను. వారు మా కుటుంబ పరిస్థితిని గుర్తించారు. వాళ్లిచ్చిన నిధులతోనే ఇంటర్, ఇంజినీరింగ్ పూర్తిచేశా. ప్రస్తుతం చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.

పేదలకు ఉచిత వైద్యం అందిస్తా...

– అమృత, కొప్పళ్



నాన్న పాలు అమ్మగా వచ్చిన మొత్తమే మాకు జీవనాధారం. డాక్టర్ అవ్వాలనేది నా కల. కానీ, నాన్నకు అంత స్థోమత లేదు. ఇదే విషయం అభయ విద్యానిధి సొసైటీని సంప్రదించి చెప్పాను. బెంగళూరులో నేను డాక్టరు చదివేందుకు అన్ని ఖర్చులనూ వాళ్లు భరిస్తున్నారు. డాక్టర్ అయ్యాక నిరుపేదలకు ఉచిత సేవలు అందిస్తా.

ప్రమోషన్ కావాలా?

మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లు పదోన్నతుల విషయంలో వెనకబడుతుంటారు. అలాగని పనిచేయరనా? కాదు... తమ పని గురించి చెప్పుకోరు. అదే తప్పంటారు నిపుణులు. అందుకే, కొన్ని అంశాలపై తప్పక దృష్టిపెట్టాలంటారు.

- 'పైవాళ్లతో ఏం మాట్లాడతాం?' చాలామంది ఉద్యోగినుల ఆలోచన ఇదే! కాబట్టే తమ ప్రణాళికలు, కొత్త వ్యూహాల గురించి పైకి చెప్పరు. ఇలాంటప్పుడు మీ పనితనం ఎలా తెలుస్తుంది? ఈ తీరే వద్దు. అందరి ముందూ మాట్లాడటానికి భయమైతే మెసేజ్, రిపోర్టు ద్వారా అయినా ఆలోచనలను పంచుకోవచ్చు. ఇది మీపై సానుకూల ముద్ర వేయడానికి సాయపడుతుంది.
- కష్టపడి పనిచేయడం... దీనిపైనే దృష్టిపెట్టొద్దు. కొత్త ప్రాజెక్టులను తీసుకోండి. సమస్యలేమైనా ఉంటే పరిష్కారాలను సూచించండి. తోటివారికి అవసరమైతే సాయం చేయండి. ఇవన్నీ నాయకత్వ లక్షణాలే. నడిపించేవారిని పదోన్నతులు తప్పక అనుసరిస్తాయి.
- నిన్నలా నేడు ఉండట్లేదు. సాంకేతికత సైలెంట్‌గా పనిలోకి చొచ్చుకొని వస్తోంది. ఆ వేగాన్ని అందుకోవాలంటే మనల్ని మనం తీర్చిదిద్దుకోక తప్పదు. పనికి సంబంధించి అలాంటి అవసరమైన టూల్స్ ఏవైనా ఉన్నాయా చెక్ చేసుకుంటూ ఉండండి. వాటిని నేర్చుకుంటూ ఉండండి. ఇవీ మిమ్మల్ని ప్రత్యేకంగా నిలిపేవే.
- బాగా పని చేస్తున్నాం అని మనం అనుకోగానే సరిపోదు. ఇతరులూ అనుకోవాలి. మీ పనితీరు, చేసుకోవాల్సిన మార్పులు ఈ రెండింటి గురించి తప్పక తెలుసుకోండి. ఇందుకోసం పైవాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్ ఎప్పటికప్పుడు తీసుకుని, తగ్గట్టుగా మిమ్మల్ని మార్చుకోండి. తమని తాము మెరుగుపరచుకోవాలి అనుకునేవారిని ఏ సంస్థ మాత్రం వదిలేస్తుంది?
- నిన్న కాదు... నేడే ముఖ్యం అన్నది ఇంకెక్కడైనా పనికొస్తుందేమో కానీ ఉద్యోగం విషయంలో కాదు. గత విజయాలు రాసిపెట్టుకోండి. అవసరమైన సందర్భాల్లో వాటిని ఉదహరించండి. ఇది సొంత డప్పు కాదు... మీ విలువ తెలియజేసే మార్గం. విలువ తెలిసినప్పుడే దానికి తగ్గ అందలం దక్కేది. కాబట్టి పనిచేస్తున్నాం చాలన్న భావనొద్దు. దానికి కావాల్సిన అదనపు విలువల్నీ జోడించుకోవాలి. అప్పుడే కెరియర్‌లో ముందుకు సాగుతారు మరి.





ప్రతిరోజూ మల్టీ టాస్కింగ్ చేయడమంటే సాధారణ విషయం కాదు. మహిళ ఉద్యోగినిగానే కాదు, కూతురిగా, కోడలిగా, అమ్మగా, అత్తగా ఎన్నో పాత్రలు పోషించాలి. ఆడవాళ్ల సమస్యల్ని మగవాళ్లకంటే మహిళలే బాగా అర్థం చేసుకుంటారు. ప్రతి మహిళా సోదరిభావంతో ఉండి మరో పది మందికి సాయపడాలి.

– ఐశ్వర్య డీకేఎస్ హెగ్డే, ఆంత్రప్రెన్యూర్, ట్రస్టీ సెక్రటరీ నేషనల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్



బంగారం - వెండి 10న ముగింపు	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,26,830	1,13,350	1,56,587
విజయవాడ	1,21,980	1,12,950	1,54,100
ప్రొద్దుటూరు	1,22,600	1,12,790	1,54,500
రాజమహేంద్రవరం	1,23,220	1,12,950	1,67,000
విశాఖపట్నం	1,22,780	1,12,950	1,58,000
తమిళనాడు	-----	1,14,800	1,69,000

కోడలు ఖర్చులకి ఇస్తుందా?

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

నాకు 75 ఏళ్లు. నా భర్త చాలా ఏళ్లక్రితమే చనిపోవడంతో... ఒక్కగానొక్క కొడుకుతోనే ఉంటున్నా. ఈ మధ్య వాడూ మరణించాడు. అప్పటి నుంచి వాడి భార్య నన్ను ఇంట్లోకి రానివ్వడం లేదు. అది నా కొడుకు సంపాదించుకున్న ఆస్తి. అందులో నాకు హక్కు లేదా? నేనెలా పోరాడాలి?

– ఓ సోదరి

ఆ ఆస్తి ఎవరి పేరు మీద ఉంది? మీ అబ్బాయి సంపాదించినా... అది ఎవరి పేరు మీద ఉందన్న విషయమూ ముఖ్యమే. హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్-8 ప్రకారం ఒక హిందూ వ్యక్తి వీలునామా రాయకుండా చనిపోతే అతని ఆస్తి... భార్యకూ, పిల్లలకూ, తల్లికీ చెందుతుంది. ఆస్తి మీ అబ్బాయి సంపాదించినా... దాన్ని మీ కోడలి పేరు మీద పెడితే మాత్రం అది ఆమెకే చెందుతుంది. ఇలాగే జరిగితే అప్పుడు మీరు, మీ కోడలు అనుభవిస్తున్న ఆస్తి... మీ కొడుకు సంపాదన అనీ, దాన్ని ఆవిడ ఇప్పుడు అనుభవిస్తోందనీ చెప్పి బీఎన్ఎస్ఎస్ యాక్ట్‌లోని సెక్షన్ - 144 ప్రకారం మీరు మెయింటెనెన్స్‌కు అర్హులు అని చెబుతూ కోర్టులో పిటిషన్ వేయవచ్చు. లేదా గృహహింస చట్టం ద్వారా కోడలి దగ్గర్నుంచి కూడా మెయింటెనెన్స్ కోరవచ్చు. ఇవి కాకుండా సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద మీ కోడలు మీ బాధ్యత తీసుకోవడం లేదని సంబంధిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేస్తే సరి... వాళ్లు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తారు. మీకు నెలసరి భత్యం కూడా ఇప్పిస్తారు. ఆస్తి మీ అబ్బాయి పేరు మీద ఉంటే... మీ వాటా కోరుతూ పార్టిషన్ దావా వేయొచ్చు. దేనికైనా ఆలస్యం చేయకుండా ప్రయత్నించండి.

నేనున్నా... పరీక్ష రాయమ్మా!



మానవత్వం, అమ్మతనం... ఏకమైన సంఘటనకు ఒడిశాలోని మల్కన్‌గిరి వేదికైంది. కానిస్టేబుల్ రజనీ మాఝీ చూపిన చొరవ అక్కడున్నవాళ్ల మనసుల్ని కదిలించింది. మల్కన్‌గిరిలోని ఓ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్/అమీన్ పరీక్షకు హాజరయ్యారు భైరవీ మండల్. తనతోపాటు నెలన్నర బిడ్డను తీసుకుని పరీక్ష హాల్లో కూర్చున్నారు. అంతలోనే బిడ్డ ఏడవడం మొదలుపెట్టింది. దాంతో భైరవి ఏకాగ్రతను కోల్పోవడమేకాదు, ఆందోళనకు గురయ్యారు. పక్కవాళ్లకు ఇబ్బంది కలగకూడదని కాసేపటికే బిడ్డను తీసుకుని బయటకు వచ్చారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న రజని... విషయం తెలుసుకున్నారు. ఆమెకూ నెలల బిడ్డ ఉంది. వెంటనే భైరవి బిడ్డను తన ఒళ్లోకి తీసుకుని లాలించి, పాలిచ్చి నిద్రపుచ్చారు. 'ఆమె మానసిక ఆందోళన నాకు అర్థమైంది. బిడ్డను చూసుకుంటా, జాగ్రత్తగా పరీక్ష రాయమని భరోసా ఇచ్చా' అని చెబుతారు రజని. ఈమె చూపిన చొరవను మానవత్వానికీ, మాతృత్వానికీ చిహ్నంగా కొనియాడుతున్నారు స్థానికులు.



అమ్మాయికి... అందాల అరవంకీ!

అరవంకీ... ఆ పేరే ఎంతో అందంగా వినిపిస్తుంది. ఇక, దాన్ని ముద్దులొలికే చిన్నారి భుజాలకి తొడిగినా, పడచుపిల్లకి అలంకరించినా... ఆ అందం చూడతరమా!

అవునండీ, ఒంటినిండుగా ఎన్ని నగలైనా పెట్టండి... సాదా డిజైన్‌లో చేసినదైనా సరే అరవంకీ పెట్టగానే అమ్మాయి అందం రెట్టింపైనట్లే ఉంటుంది మరి. అందుకే బాజూబంద్ పేరుతో ఉత్తరాది డిజైన్లు ఎన్ని వస్తున్నా... మనదైన సంప్రదాయ వంకీ అందమే వేరు. కాబట్టే రాళ్లూ కుందన్లూ రత్నాల్ని అద్దుకుని టెంపుల్, నక్షీ... వంటి డిజైన్లతో వంకీ ముద్దుగుమ్మల్ని మురిపిస్తోంది. పైగా బంగారంలోనే కాదు, వన్‌గ్రామ్, సిల్వర్ జ్యువెలరీలోనూ వంకీ డిజైన్లు బోలెడు.

అయినా వంకీలోని 'వి' ఆకారానికో ప్రత్యేకత ఉంది. పెళ్లి గుర్తుగా అమ్మాయి వేలికి పెట్టే వంకీ ఉంగరమైనా భుజానికి పెట్టే అరవంకీ అయినా రెండూ నాగుపాము తలకి సంకేతం. ధైర్యాన్నీ దృఢత్వాన్నీ అందించే దైవికశక్తిగా భావించి పూర్వం నుంచీ ఈ వంకీ ఆకారంలోని ఆభరణాల్ని ధరించే ఆచారం వచ్చిందని చెబుతారు. పైగా అరవంకీ అనగానే అదేదో అమ్మాయిలకు మాత్రమే పరిమితమైన ఆభరణం అనుకునేరు... చిన్ని కృష్ణుడు నుంచి విష్ణుమూర్తి వరకూ దేవీదేవతలందరి చేతులకీ వంకీ లేదా బాజూబంద్ కనిపిస్తూనే ఉంటుంది. చరిత్రలోకి వెళ్లినా రాజులూ యోధులూ వీరత్వం, దృఢత్వం, కీర్తి... వంటివాటికి చిహ్నంగా బాజూబంద్‌ని ధరించేవారు. కాలక్రమేణా అది అమ్మాయిల ఆభరణంగా స్థిరపడి వాళ్లకి మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఇంకెందుకు ఆలస్యం... పెళ్లీ పేరంటాలకి వంకీ నగతో ముస్తాబుకండి మరి!

నైపుణ్యాలెప్పుడూ వృథా కావని..!



ఓ వ్యాపకంగా ఉంటుందని దుస్తులు కుట్టడం నేర్చుకున్నారు అర్చనా దేవి. కానీ, కష్టకాలంలో ఆ నైపుణ్యమే ఆమెను ఆదుకుంది. దీన్నే సాధనంగా చేసుకుని పదివేల మంది మహిళల్ని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించారీమె.

అర్చన... రాంచీ శివారు ప్రాంతమైన హటియాలో పుట్టిపెరిగారు. చిన్నప్పుడు కాలక్షేపం కోసం టైలరింగ్ శిక్షణకు వెళ్లారట. 'పెళ్లై, పిల్లలు పుట్టాక అదే నాకు ఆర్థికంగా సహాయపడుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఓ దశలో పిల్లల చదువులకు ఫీజులు చెల్లించలేక చాలా కష్టాలు పడ్డాం. అప్పుడే కుట్టుపని నాకు చేయూతగా మారింది. ఎప్పుడో చిన్నప్పుడు నేర్చుకుంది కదా... మరచిపోయానేమో అనుకున్నా. మొదట్లో కాస్త తడబడ్డాను, కానీ తర్వాత పుంజుకున్నా. శిక్షకురాలిగా మారి ఇంటింటికి వెళ్లి నేర్పించడం మొదలుపెట్టా. కుటుంబ ఆర్థిక పరిస్థితులు నెమ్మదిగా మెరుగయ్యాయి. అప్పుడే నైపుణ్యాలకూ, మహిళా సాధికారతకూ ఉన్న విలువ నాకు అర్థమైంది. ఎన్జీవోలతో కలిసి మరింత మందికి ఈ విద్య చేరువ చేయాలి అనిపించింది. దాంతో స్థానికంగా ఉన్న సంస్థల్ని కలిసి నా ఆలోచనను చెప్పా. మహిళల్ని బృందాలుగా ఏర్పాటుచేసి టైలరింగ్ నేర్పించడం మొదలుపెట్టా' అనే అర్చన కొన్నేళ్లుగా ఈ పనిని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. 'నేనో సాధారణ గృహిణిని. నా ఆర్థిక కష్టాలు అర్చన మేడమ్‌కు చెప్పాను. ఆమె తరగతుల్లో చేర్చుకున్నారు. దుస్తులు కుట్టడం నేర్చుకుని, ఇప్పుడో టైలరింగ్ సెంటర్‌ను నడుపుతున్నా' అంటారు నిషాదేవి. 'పదో తరగతితో నన్ను చదవడం ఆపేయమన్నారు. ఆర్థిక కష్టాలే కారణం. అప్పుడు ఈ కేంద్రం కోసం తెలుసుకున్నా. ఇక్కడ చేరి పని నేర్చుకున్నా. టైలరింగ్ చేస్తూ డిగ్రీ చదువుతున్నా' అంటారు జ్యోతి సోని. వీళ్లిద్దరే కాదు ఇలాంటి ఎంతో మంది అమ్మాయిలూ, మహిళలూ తమ కాళ్లపై తాము నిలబడే ధైర్యాన్ని ఇచ్చారు అర్చన. 'మా కేంద్రం టైలరింగ్ శిక్షణకే పరిమితం కాలేదు... షాండ్లియర్లు, కొవ్వొత్తులు, కృత్రిమ పూల తయారీ, పూసల దండలు... వంటివన్నీ నేర్పుతున్నాం. ఎవరికి ఏది ఆసక్తి ఉంటే దానిలో చేరొచ్చు. 'ఇక్కడ చేరాక ఆర్థికంగా మా పరిస్థితుల చాలా మెరుగయ్యాయని' మహిళలు చెబుతుంటే సంతోషంగా అనిపిస్తుంది. నా కష్టం ఫలించిందని గర్వంగానూ ఉంటుంది. ఈ పరిధిని ఇంకా విస్తరించాలనేదే నా కోరిక' అంటారు అర్చన.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

చాంపియన్స్

13 నుంచి జాతీయ పికిల్‌బాల్



ఈనాడు, బెంగళూరు: సస్యర, ఆరోగ్యకర జీవన శైలి ఉత్పత్తుల తయారీ సంస్థ ప్రియా ఫుడ్స్ 'సబల మిల్లెట్స్' టైటిల్ భాగస్వామిగా దక్షిణ భారత రాష్ట్రాల్లో తొలిసారిగా జాతీయ పికిల్‌బాల్ పోటీలకు వేదిక సిద్ధమైంది. కర్ణాటక రాజధాని బెంగళూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 13 నుంచి 16 వరకు నిర్వహించే ఈ పోటీల్లో 20 రాష్ట్రాలకు చెందిన 1400 మంది క్రీడాకారులు పాల్గొంటారు. 12 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసున్న క్రీడాకారులకు ఆయా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అత్యధికంగా తెలంగాణ నుంచి 55 మంది పోటీ పడనున్నారు. విజేతలకు రూ.12 లక్షల విలువైన నగదు బహుమతి అందజేస్తామని కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు శ్రీహర్ష సోమవారం ఇక్కడ వెల్లడించారు.

ప్రతి ఇంట్లో చిరుధాన్యాల ఆహారాన్ని రోజువారీ ఎంపికగా మార్చాలన్నది మా ధ్యేయం. ఈ ఉత్పత్తులతో కొత్త తరానికి రుచితో పాటు పోషకాహారాన్ని అందిస్తూ ఆరోగ్య ప్రమాణాలను పెంచే అవకాశం లభిస్తోంది. జాతీయ పికిల్‌బాల్ పోటీలకు భాగస్వామిగా మారటం అంటే అన్ని వయసుల వారి జీవన ప్రమాణాలకు భరోసా ఇవ్వటమే.

– సహరి చెరుకూరి, డైరెక్టర్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్



జాతీయ పికిల్‌బాల్ జెర్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఫైనల్లో జ్యోతి బృందం



జ్యోతి సురేఖ

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, దీప్షిక, ప్రతీక ప్రదీప్‌లతో కూడిన భారత బృందం ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో భారత్ 234-227తో బంగ్లాదేశ్‌ను ఓడించింది. తుది పోరులో కొరియాతో భారత్ తలపడనుంది. పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలోనూ భారత్ తుదిపోరుకు అర్హత సాధించింది. అతాను దాస్, యశ్‌దీప్ భోగే, రాహుల్‌తో కూడిన బృందం సెమీస్‌లో 5-3తో కజకిస్థాన్‌పై నెగ్గింది. ఫైనల్లో కొరియాను భారత్ ఢీకొంటుంది. మరో సెమీస్‌లో కొరియా 6-2తో ఉజ్బెకిస్థాన్‌పై విజయం సాధించింది.

సామ్రాట్ పసిడి గురి

- ఇషా బృందానికి రజతం
- ప్రపంచ షూటింగ్



సామ్రాట్



ఇషా సింగ్

కైరో: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సామ్రాట్ రాణా అదరగొట్టాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. సోమవారం జరిగిన ఫైనల్లో సామ్రాట్ 243.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. హు కయ్ (చైనా, 243.3) నుంచి గట్టి పోటీ ఎదురైనా.. కొద్దిలో అతడిని వెనక్కి నెట్టి సామ్రాట్ స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. ఇదే విభాగంలో భారత షూటర్ వరుణ్ తోమర్ (221.7) కాంస్యం సొంతం చేసుకున్నాడు. మరోవైపు భారత మహిళల జట్టు మెరిసింది. 10మీ ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో రజత పతకంతో సత్తాచాటింది. ఆసియా క్రీడల విజేత, హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ (583).. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ (580), ప్రపంచ నంబర్‌వన్ సురుచి ఇందర్ సింగ్ (577) త్రయం 1740 స్కోరుతో రెండో స్థానం సాధించింది. చైనా జట్టు (1752) స్వర్ణం గెలిచింది. కొరియా (1729) బృందానికి కాంస్యం లభించింది. వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పతకాలు గెలవడంలో ఇషా, మను విఫలమయ్యారు. ఎనిమిది మంది క్రీడాకారిణులు బరిలో నిలిచిన ఫైనల్లో ఇషా ఆరు, మను ఏడో స్థానాలతో సరిపెట్టుకున్నారు. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, మూడు రజతాలు, రెండు కాంస్యాలతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది.

లక్ష్య సాధించేనా?

నేటి నుంచే జపాన్ మాస్టర్స్



లక్ష్యసేన్

కుమమోటో (జపాన్): జపాన్ మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, హెచ్.ఎస్.ప్రణయ్ గురిపెట్టారు. మంగళవారం ప్రారంభం కానున్న ఈ టోర్నీలో టైటిల్ సాధించాలని లక్ష్య ప్రణయ్ పట్టుదలగా ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో కొకి వతనబె (జపాన్)తో పోటీతో ఏడో సీడ్ లక్ష్య తన టైటిల్ వేటను ఆరంభిస్తాడు. లియాంగ్ జున్ (మలేసియా)ను ప్రణయ్ తొలి రౌండ్లో ఢీకొంటాడు. కొడయ్ నరవొక (జపాన్)తో ఆయుష్ శెట్టి, జియోన్ హియోక్ (కొరియా)తో తరుణ్ మన్నెపల్లి, క్వాలిఫయర్‌తో కిరణ్ జార్జ్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో ప్రెస్లీ స్మిత్- జెనీ గాయ్ (అమెరికా) జంటతో రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని జోడీ పోటీపడనుంది.

నేడు లెకోతో అర్జున్ పోరు

చెస్ ప్రపంచకప్



అర్జున్

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో జోరు మీదున్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి మరో పోరుకు సిద్ధమయ్యాడు. మంగళవారం నాలుగో రౌండ్లో పీటర్ లెకో (హంగేరి)తో అతడు తలపడనున్నాడు. వెటరన్ లెకోతో పోరులో అర్జునే ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నాడు. మార్టిన్ పెట్రోవ్ (బల్గేరియా), షంషుద్దీన్ (ఉజ్బెకిస్థాన్)తో గత రౌండ్లలో నాలుగు గేమ్‌లో మూడింటిని గెలిచిన అర్జున్.. మంచి ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు డానియల్ దబోవ్ (రష్యా)ను ప్రజ్ఞానంద ఢీకొంటున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటిదాకా స్థాయికి తగ్గట్టు ఆడపోయినా.. ప్రజ్ఞానంద నాలుగో రౌండ్ వరకు వచ్చాడు. ఇకపై తన శైలిలో రాణించపోతే ముందుకెళ్లడం కష్టం కావొచ్చు. క్లిష్టమైన ఓపెనింగ్‌లు ఆడే దబోవ్‌తో ప్రజ్ఞానంద జాగ్రత్తగా ఉండక తప్పదు. చాలారోజుల తర్వాత స్థిరంగా రాణిస్తున్న పెంటేల హరికృష్ణ.. నాలుగో రౌండ్లో నాల్ గ్రాండిలిస్ (స్వీడన్)తో తలపడనున్నాడు. నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్)తో ప్రణవ్, క్వాంగ్ లిమ్ (వియత్నాం)తో వెంకటరామన్ కార్తీక్ పోటీపడనున్నారు. ఇతర గేముల్లో విన్సెంట్ కీమర్ (జర్మనీ)-మాగ్‌సూడ్‌లో (ఇరాన్), లెవోన్ అరోనియన్ (అమెరికా)-రదస్లోవ్ వొటాస్‌జెక్ (పోలెండ్)తో ఆడతారు.


షమి అన్ని ఫార్మాట్లూ ఆడాలి



గంగూలీ

కోల్‌కతా: పేసర్ మహ్మద్ షమి భారత్‌కు అన్ని ఫార్మాట్లలోనూ ఆడాలని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. యూకేకి చెందిన ఏఐ క్రీడా శిక్షణ వేదికకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ గంగూలీ ఇలా వ్యాఖ్యానించాడు. "రంజీ ట్రోఫీలో షమి బౌలింగ్ చూశా. అతడు ఎంతో ఫిట్‌గా ఉన్నాడు. అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. ఒంటిచేత్తో బెంగాల్‌ను గెలిపించాడు. రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనను సెలక్టర్లు చూశారనే అనుకుంటున్నా. వాళ్లు షమితో మాట్లాడుతూనే ఉంటారని భావిస్తున్నా. ప్రస్తుతం అతడు ఉన్న ఫామ్, ఫిట్‌నెస్ చూస్తే భారత్‌కు అన్ని ఫార్మాట్లలో ఆడగలడు. ముఖ్యంగా షమిని టెస్టుల్లో ఎందుకు తీసుకోవట్లేదో అర్థం కావట్లేదు" అని సౌరభ్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ధ్రువ్ జురెల్ తుది జట్టులో ఉండాలని దాదా అన్నాడు. "జురెల్ మెరుగ్గా ఆడుతున్నాడు. గాయం నుంచి కోలుకున్న రిషబ్ పంత్ కూడా పునరాగమనానికి సిద్ధమయ్యాడు. అతడు దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆడడం ఖాయం. ఫామ్‌లో ఉన్న జురెల్‌కు కూడా అవకాశాన్ని కల్పించాలి. సాయి సుదర్శన్‌ను తప్పించి ఆ స్థానంలో జురెల్‌ను ఆడించడమే మార్గంగా కనిపిస్తోంది" అని గంగూలీ అన్నాడు. తాజాగా దక్షిణాఫ్రికా-ఎతో రెండో అనధికార టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో జురెల్ ఫామ్ చాటుకున్నాడు.

ఫిట్‌నెస్ ఇంకా మెరుగవ్వాలి



గంభీర్

దిల్లీ

వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఇప్పటికే సన్నాహకాలు మొదలుపెట్టింది. అందుబాటులో ఉన్న ఆటగాళ్లను పరీక్షిస్తూ కూర్పుపై ఒక అవగాహనకు వచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని.. కప్ నిలబెట్టుకోవాలంటే ఫిట్‌గా ఉండడం ఎంతో కీలకమని జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ చెప్పాడు. ఫిట్‌నెస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నాడు. టీ20ల్లో పవర్‌ప్లేలో బుమ్రా బౌలింగ్, పెరుగుతున్న బౌలింగ్ ప్రత్యామ్నాయాలు, ఆస్ట్రేలియాతో సిరీస్ గురించి కూడా అతడు మాట్లాడాడు. గంభీర్ ఏమన్నాడంటే..

ఫీల్డింగ్ కోసం..

2026 టీ20 ప్రపంచ కప్‌నకు జట్టు సిద్ధమవుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ చాలా కీలకం. అది మెరుగు కావాలంటే ఫిట్‌గా ఉండాలి. శరీరాన్ని బలంగా తయారు చేసుకోవాలి. కుర్రాళ్లకు ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పాం. మైదానంలో అందరూ చురుగ్గా కదలాలి. వేగంగా పరుగులు తీయగలగాలి. ఎంత ఫిట్‌గా ఉంటే అంత బలమైన జట్టుగా ఉంటాం. ఒత్తిడి ఉండే మ్యాచ్‌ల్లో ఫిట్‌గా ఉండేవాళ్లు మానసికంగా కూడా బలంగా ఉంటారు. మా లక్ష్యాన్ని అందుకోవడానికి మూడు నెలల సమయాన్ని నిర్దేశించుకున్నాం.

అది దూకుడైన నిర్ణయం

అందరూ భారత టీ20 బ్యాటింగ్ లైనప్‌ను దూకుడైన లైనప్ అంటున్నారు. నావరకైతే ఈ ఫార్మాట్లో పవర్‌ప్లేలో బుమ్రాతో మూడు ఓవర్లు వేయించడం దూకుడైన నిర్ణయం. అతడితో బౌలింగ్ చేయించడం వల్ల ఆరంభంలోనే ప్రత్యర్థిపై పైచేయి సాధించొచ్చు. ఈ వ్యూహం ఆసియాకప్‌లో పని చేసింది. ముమ్మందు ఎలాంటి ఫలితాలను ఇస్తుందో చూడాలి. మిడిల్ ఓవర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ రూపంలో వికెట్లు పడగొట్టగల బౌలర్లు భారత్‌కు ఉన్నారు.

ఆల్‌రౌండర్లే బలం

గతంలో తుది జట్టులో ఆరుగురు బౌలర్లు ఉండాలని కోరుకునేవాళ్లం. ఇప్పుడు టీ20 జట్టులో ఏడెనిమిది మంది బౌలర్లు ఉంటున్నారు. ఇది జట్టుకు మేలు చేసే అంశం. టీ20లతో పాటు 50 ఓవర్ల ఫార్మాట్లో బౌలింగ్ చేసి.. బ్యాట్‌తోనూ రాణించగల ఆటగాళ్ల కోసం చూస్తున్నాం. వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ కేవలం ఉపఖండ పరిస్థితుల్లోనే కాదు విదేశీ పిచ్‌లపైనా రాణిస్తున్నారు. వీళ్లిద్దరూ అవసరమైతే బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వచ్చి కూడా ఆడగలరు. ఛాంపియన్స్ ట్రోఫీలో అక్షర్ అయిదో స్థానంలో దిగి రాణించాడు. మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టుగా జట్టు కూర్పు ఉంటుంది. టీమ్ ఎంపికపై చాలామంది నన్ను విమర్శించారు. అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్ లాంటి నాణ్యమైన బౌలర్లు రిజర్వ్ బెంచ్‌పై కూర్చోవడం నాకూ బాధ కలిగిస్తుంది. కానీ కొన్నిసార్లు తప్పదు. అలాంటి నిర్ణయాలు తీసుకోవడం కోచ్‌గా నాకు పెద్ద సవాల్. పరిస్థితులను బట్టి జట్టును ఎంపిక చేయడం మాత్రమే మా పని.

నిరాశ కలిగింది

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో వ్యక్తిగతంగా కొంతమంది ప్లేయర్లు రాణించారు. కానీ జట్టు సిరీస్ కోల్పోయింది. కోచ్‌గా నాకు నిరాశ కలిగించే విషయమది. వ్యక్తిగతంగా రాణించిన ప్లేయర్లను అభినందిస్తా. కానీ జట్టు ప్రదర్శన కూడా ముఖ్యం. టీ20ల్లో భారత్ మెరుగ్గా ఆడింది. రెండో మ్యాచ్‌లో ఓడినా గొప్పగా పుంజుకుని సిరీస్ గెలిచింది. ఈ సిరీస్‌లో టీమ్ఇండియాకు ఎన్నో సానుకూలాంశాలు ఉన్నాయి. ఆటగాళ్లు నేర్చుకునే పాఠాలూ ఉన్నాయి.

జూనియర్ హాకీ సారథిగా జ్యోతి

దిల్లీ: ఎఫ్ఐహెచ్ మహిళల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టుకు జ్యోతి సింగ్ సారథ్యం వహించనుంది. ఈనెల 25 నుంచి డిసెంబరు 13 వరకు చిలీలోని శాంటియాగోలో జరుగనున్న టోర్నీ కోసం 20 మంది క్రీడాకారులతో భారత జట్టును సోమవారం ప్రకటించారు. భారత మాజీ ఆటగాడు తుషార్ ఖండ్కర్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఈ టోర్నీలో పూల్-సిలో చోటు దక్కించుకున్న భారత్.. డిసెంబరు 1న నమీబియాతో, 3న జర్మనీతో, 5న ఐర్లాండ్‌తో తలపడనుంది. గ్రూపులో విజేతగా నిలిచిన జట్లు నాకౌట్‌కు అర్హత సాధిస్తాయి. డిసెంబరు 7 నుంచి 13 వరకు నాకౌట్ మ్యాచ్‌లు ఉంటాయి.

భారత జూనియర్ మహిళల జట్టు: గోల్ కీపర్లు: నిధి, ఎంజిల్ హర్షరాణి మింజ్, **డిఫెండర్లు:** మనీషా, లల్తాన్‌లౌలాంగి, సాక్షి శుక్లా, పూజ సాహూ, నందిని, **మిడ్ ఫీల్డర్లు:** సాక్షి రాణా, ఇషిక, సునెలిత తోప్పో, జ్యోతి సింగ్, ఖైదెమ్ శైలిమ చాను, బినిమ ధన్, **ఫార్వర్డ్‌లు:** సోనమ్, పూర్ణిమ యాదవ్, కనిక సివాచ్, హీనా బానో, సుఖ్‌వీర్ కౌర్, **స్టాండ్‌బైస్:** ప్రియాంక యాదవ్, పార్వతి తోప్పో.

అమ్మాయిలూ.. మీకో హెచ్చరిక!



గావస్కర్

దిల్లీ: మహిళల వన్డే ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టు కొందరు స్వార్థపూరిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ హెచ్చరించాడు. నగదు బహుమతులు ఇస్తామంటూ కొందరు హామీలు గుప్పిస్తారని.. ఈ వాగ్దానాలలో కొన్ని ఎప్పటికీ నెరవేరకపోవచ్చని గావస్కర్ తెలిపాడు. "భారత అమ్మాయిలకు ఒక హెచ్చరిక. వాగ్దానం చేసిన కొన్ని రివార్డులు మీకు అందకపోతే దయచేసి నిరాశ చెందకండి. భారత్‌లో బ్రాండ్లతో పాటు కొందరు ప్రకటనదారులు, వ్యక్తులు విజేతలను తమ భుజాలపై మోస్తూ త్వరగా ఉచిత ప్రచారం చేసుకోడానికి ప్రయత్నిస్తారు. జట్టును అభినందిస్తూ పూర్తి పేజీ ప్రకటనలు, హోర్డింగ్‌లను చూడండి. వాళ్లలో జట్టు లేదా క్రికెటర్ల వ్యక్తిగత స్పాన్సర్లు తప్ప మిగతా వారు భారత క్రికెట్‌కు కీర్తి తెచ్చిన అమ్మాయిలకు ఏమీ ఇవ్వరు. 1983 జట్టుకు కూడా అప్పట్లో మీడియాలో చాలా హామీ ఇచ్చారు. దాదాపుగా ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. మీడియాను నిందించలేం. కొందరు సిగ్గులేని వ్యక్తులు తమను కూడా ఉపయోగించుకుంటున్నారన్న వాస్తవాన్ని వాళ్లు కూడా గ్రహించరు. కాబట్టి అమ్మాయిలూ.. ఈ సిగ్గులేని వాళ్లు మీ విజయాన్ని తమ ప్రచారం కోసం వాడుకుంటుంటే బాధపడకండి" అని గావస్కర్ పేర్కొన్నాడు.

హైదరాబాద్‌కు ఆధిక్యం

రాజస్థాన్‌తో రంజీ



మిలింద్

ఈనాడు, హైదరాబాద్: రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూపు-డి మ్యాచ్‌లో హైదరాబాద్ పైచేయి సాధించింది. బౌలర్లు సమష్టిగా సత్తాచాటడంతో హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 221/5తో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 94.4 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. కునాల్‌సింగ్ రాథోడ్ (83; 156 బంతుల్లో 8×4, 1×6), కుక్నా అజయ్‌సింగ్ (58; 128 బంతుల్లో 6×4, 1×6) ఆరో వికెట్‌కు 125 పరుగులు జోడించి రాజస్థాన్ శిబిరంలో ఆశలు రేపినా.. హైదరాబాద్ బౌలర్లు సరైన సమయంలో విజృంభించి ప్రత్యర్థి ఆటకట్టించారు. సి.వి.మిలింద్ (3/44), తనయ్ త్యాగరాజన్ (3/64), పున్నయ్య (2/39), అనికేత్‌రెడ్డి (2/59) పదునైన బౌలింగ్‌తో రాజస్థాన్‌ను కట్టడి చేయడంతో హైదరాబాద్‌కు 95 పరుగుల ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 7 వికెట్లకు 198 పరుగులు సాధించింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (59; 66 బంతుల్లో 8×4), కొడిమెల హిమతేజ (41; 70 బంతుల్లో 3×4) రాణించారు. మంగళవారం మ్యాచ్‌కు చివరి రోజు కాగా ప్రస్తుతం.. హైదరాబాద్ 293 పరుగుల ఆధిక్యంతో ఉంది.


తమిళనాడుపై ఆంధ్ర విజయం

విశాఖపట్నం: తమిళనాడుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలీట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర అదరగొట్టింది. ప్రత్యర్థికి ఆధిక్యం లభించినా.. గొప్పగా పుంజుకున్న ఆంధ్ర అద్భుత విజయాన్ని నమోదు చేసింది. సోమవారం ముగిసిన మ్యాచ్‌లో ఆంధ్ర నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. ఓవర్‌నైట్ స్కోరు 102/3తో మూడో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు 195 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు సౌరభ్ కుమార్ (4/46), పృథ్వీరాజ్ (2/31), త్రిపురణ విజయ్ (2/16) విజృంభించి తమిళనాడును తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. అనంతరం 201 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్‌రెడ్డి (70; 75 బంతుల్లో 11×4), కరణ్ షిండే (51; 64 బంతుల్లో 8×4) అర్ధ సెంచరీలతో మెరిశారు. అశ్విన్ హెబ్బర్ (21 నాటౌట్; 32 బంతుల్లో 2×4), కలిదిండి రాజు (20 నాటౌట్; 34 బంతుల్లో 2×4, 1×6) చివరి వరకు క్రీజులో నిలిచి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఆంధ్రకు ఆరు పాయింట్లు లభించాయి.

దక్షిణాఫ్రికా జట్టుతో చేరిన బవుమా

కోల్‌కతా: కెప్టెన్ టెంబా బవుమా దక్షిణాఫ్రికా జట్టుతో చేరాడు. శుక్రవారం భారత్‌తో కోల్‌కతాలో తొలి టెస్టు ఆరంభం కానున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా జట్టు విడతల వారీగా భారత్‌కు చేరుకుంది. భారత్-ఎతో నాలుగు రోజుల అనధికారిక టెస్టులో తలపడిన దక్షిణాఫ్రికా-ఎ జట్టులో సభ్యుడిగా ఉన్న బవుమా.. సోమవారం జట్టును కలిశాడు. పాకిస్థాన్‌తో వన్డే సిరీస్‌ను ముగించిన తర్వాత కాగిసో రబాడ, మార్కో యాన్సెన్‌తో పాటు కొంత మంది సఫారీ ఆటగాళ్లు భారత్‌లో అడుగుపెట్టారు. బవుమా సహా మిగిలిన ప్లేయర్లందరూ సోమవారం కోల్‌కతా చేరుకున్నారు. మంగళవారం సఫారీ జట్టు తొలి ప్రాక్టీస్ సెషన్లో పాల్గొనే అవకాశం ఉంది. పిక్క గాయంతో బాధపడిన బవుమా.. పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్నాక.. భారత్-ఎతో సిరీస్ ద్వారా పునరాగమనం చేశాడు. రెండో అనధికార టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన బవుమా.. రెండో ఇన్నింగ్స్‌లో ఓపిగ్గా ఆడి 101 బంతుల్లో 59 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

స్పోర్ట్స్ సిటీగా జేఎల్ఎన్ స్టేడియం



దిల్లీ: ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ (జేఎల్ఎన్) స్టేడియం నేలమట్టం కానుంది. స్టేడియం స్థానంలో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ సిటీని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. 102 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణాన్ని ప్రధాన క్రీడాంశాలకు కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో అథ్లెట్లకు వసతి సదుపాయాలు కూడా ఉంటాయి. ప్రస్తుతం ఇది ప్రతిపాదన దశలోనే ఉన్నట్లు క్రీడా శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఆసియా క్రీడల కోసం 1982లో జేఎల్ఎన్ స్టేడియాన్ని నిర్మించారు. 2010 కామన్వెల్త్ క్రీడల కోసం రూ.900 కోట్లతో స్టేడియాన్ని పునరుద్ధరించారు. ఇటీవల ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు జేఎల్ఎన్ స్టేడియం వేదికగా నిలిచింది.

అర్షికి జాతీయ కార్టింగ్ టైటిల్

దిల్లీ: కార్టింగ్‌లో అర్షి గుప్తా సత్తా చాటింది. తొమ్మిదేళ్ల ఈ ఫరీదాబాద్ బాలిక జాతీయ ఛాంపియన్‌షిప్‌లో టైటిల్‌ను సొంతం చేసుకుంది. బెంగళూరులో జరిగిన జాతీయ పోటీల్లో మైక్రో మ్యాక్స్ క్లాస్‌లో మిక్స్‌డ్ గ్రిడ్ విభాగంలో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. జాతీయ ఛాంపియన్‌షిప్ సాధించిన తొలి మహిళా రేసర్ అర్షినే. ఈ ఆగస్టులో మద్రాస్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్ రౌండ్-3 పోటీల్లో అర్షి టైటిల్ కైవసం చేసుకుంది. తర్వాత కొయంబత్తూర్ రేసులోనూ గెలిచింది. 2024లో అర్షి జాతీయ కార్టింగ్‌లో అరంగేట్రం చేసింది.

320 మంది సహాయక కోచ్‌ల నియామకం

దిల్లీ: ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలే లక్ష్యంగా 25 క్రీడాంశాల్లో 320 మంది సహాయక కోచ్‌ల నియామకానికి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సోమవారం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్)లలో ఈ సహాయక కోచ్‌లు శిక్షణ ఇవ్వనున్నారు. "సాయ్ కేంద్రాల్లోని ప్రధాన క్రీడాంశాల్లో ఈ కోచ్‌లు సేవలు అందిస్తారు. ఎంపిక ప్రక్రియ ప్రతిభ ఆధారంగా పూర్తి పారదర్శకంగా ఉంటుంది. దేశంలో క్రీడా సంస్కృతిని పెంపొందించే ఆటలకు ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. టెన్నిస్, కయాకింగ్, కనోయింగ్ లాంటి క్రీడలు కొన్నిసార్లు అందరి దృష్టిని ఆకర్షించలేకపోవచ్చు. కాని అపారమైన అవకాశాలు ఉన్నాయి" అని కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.



ప్రపంచకప్ మస్కట్ ఆవిష్కరణ, ట్రోఫీ యాత్ర ప్రారంభ కార్యక్రమంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు

ప్రపంచకప్ మస్కట్ ఆవిష్కరణ

చెన్నై: జూనియర్ హాకీ ప్రపంచకప్ మస్కట్‌ను సోమవారం ఆవిష్కరించారు. చెన్నైలోని రాధాకృష్ణన్ స్టేడియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రోఫీ టూర్‌ను కూడా ప్రారంభించారు. నవంబర్ 28న ఆరంభం కానున్న ఈ మెగా టోర్నీకి చెన్నై, మధురై ఆతిథ్యం ఇవ్వనున్నాయి.




క్యాబినెట్ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎస్ విజయానంద్, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర

రూ.లక్ష కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ అంగీకారం.

■ విశాఖలో 10.29 ఎకరాల్లో గ్లోబల్ కేపబులిటి సెంటర్ (జీసీసీ) ఏర్పాటుకు ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌తో గతంలో 33 ఏళ్లకు కుదుర్చుకున్న లీజు ఒప్పందాన్ని.. 99 ఏళ్లకు పొడిగించేందుకు అంగీకారం.

■ క్వార్క్స్ టెక్నో సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ రూ.115 కోట్ల పెట్టుబడితో విశాఖలో ఏఐ/ఎంఎల్ క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ క్యాంపస్ ఏర్పాటుకు రాయితీ ధరకు 4 ఎకరాల భూమి కేటాయింపు. 2 వేల మందికి ఉపాధి.

■ ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్ రూ.150 కోట్ల పెట్టుబడితో కాపులుప్పాడ దగ్గర ఏఐ, ఐవోటీ, ఆర్‌అండ్‌డీ కోసం అడ్వాన్స్‌డ్ ఐటీ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు రాయితీ ధరకు 3.3 ఎకరాల కేటాయింపు. 2 వేల మందికి ఉపాధి.

■ మదర్స్ నెక్స్ట్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ రూ.109.73 కోట్ల పెట్టుబడితో ఐటీ ఆర్ అండ్ డి సెంటర్, జీసీసీ ఏర్పాటుకు 3.55 ఎకరాలు.. ఎకరా 99 పైసల నామమాత్ర ధరకు కేటాయింపు. 700 మందికి ఉపాధి.

■ ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.119.18 కోట్ల పెట్టుబడితో.. విశాఖలో 4.59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ క్యాంపస్ అభివృద్ధి. ఎకరా రూ.4 కోట్ల చొప్పున రాయితీ ధరకు 2 ఎకరాలు కేటాయింపు. 2 వేల మందికి ఉపాధి.

■ ఎస్‌సీఐసీ వెంచర్స్ ఎల్ఎల్‌పీ రూ.550 కోట్ల పెట్టుబడితో ఏసీల్లో వినియోగించే పీసీబీఏ, బీఎల్‌డీసీ మోటార్ల తయారీ యూనిట్ శ్రీసిటీలో ఏర్పాటు. భారీ పరిశ్రమ కేటగిరీ కింద ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు అనుమతి. 1,130 మందికి ఉపాధి.



మంత్రివర్గ నిర్ణయాలను వివరిస్తున్న మంత్రి పార్థసారథి

■ క్రయో నెక్స్ట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,079 కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో ఐటీ ఎన్‌క్లోజర్లు, పీసీబీ బేర్ బోర్డుల తయారీ పరిశ్రమ ఏర్పాటు, ఏపీ ఎలక్ట్రానిక్స్ తయారీ పాలసీలో ఎర్లీబర్డ్ కేటగిరీ కింద ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు అనుమతి. 1,500 మందికి ఉపాధి.

■ ఎన్‌పీఎస్‌సీఎల్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రూ.2,081 కోట్ల పెట్టుబడితో కుప్పంలో యూనిట్ ఏర్పాటు. ఆ సంస్థకు 60 శాతం మూలధన రాయితీ, విద్యుత్ ఛార్జీల రీయింబర్స్‌మెంట్, ఎర్లీబర్డ్ కేటగిరీ కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతి. 600 మందికి ఉపాధి.

■ ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.700 కోట్ల పెట్టుబడితో నాయుడుపేటలో పీసీబీలు, ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీ యూనిట్ ఏర్పాటు. ఆ సంస్థకు 75 శాతం రాయితీతో భూములు కేటాయించేందుకు నిర్ణయం. ఎర్లీబర్డ్ కేటగిరీ కింద ప్రోత్సాహకాలు. 1,000 మందికి ఉపాధి.

■ ఇండిచిప్ సెమీ కండక్టర్స్ లిమిటెడ్ రూ.22,976 కోట్ల పెట్టుబడితో ఓర్వకల్లు నోడ్‌లో సిలికాన్ కార్బైడ్ డివైజెస్, మాడ్యూల్స్, ప్యాకేజింగ్ తయారీ యూనిట్ ఏర్పాటు. రాయితీ ధరకు 150 ఎకరాలు కేటాయింపు.

■ టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు. 1,241 మందికి ఉపాధి.

■ ఓర్వకల్లులో డ్రోన్ పారిశ్రామిక కారిడార్ తయారీ కేంద్రం ఏర్పాటు. డ్రోన్ల పరీక్ష, ఆర్ అండ్ డి సౌకర్యం.

■ బిర్లా లిమిటెడ్ రూ.240 కోట్ల పెట్టుబడితో నెల్లూరులో ఫైబర్ సిమెంట్ బోర్డు తయారీ యూనిట్ ఏర్పాటుకు 48.47 ఎకరాల కేటాయింపు. 588 మందికి ఉపాధి.

■ సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,090 కోట్ల పెట్టుబడితో కర్నూలు జిల్లాలో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు 100 ఎకరాలు కేటాయింపు. 1,200 మందికి ఉపాధి.

■ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రూ.489 కోట్ల పెట్టుబడితో అనకాపల్లిలో ఆయుధాలు, రక్షణ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటుకు 160 ఎకరాలు కేటాయింపు. 500 మందికి ఉపాధి.

■ డాజ్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,234 కోట్ల పెట్టుబడితో అనకాపల్లిలో భారీ భూమి తవ్వే పరికరాలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటుకు 150 ఎకరాలు కేటాయింపు. 1,454 మందికి ఉపాధి.

■ శ్రీ వేద ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా, బయోటెక్, ఆహార శుద్ధి పరిశ్రమల కోసం కృష్ణా జిల్లాలో 40 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు. 1,500 మందికి ఉపాధి.

■ సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,247 కోట్ల పెట్టుబడితో.. అనంతపురం జిల్లాలో టీఎంటీ యూనిట్ ఏర్పాటుకు 308 ఎకరాలు కేటాయింపు. 1,100 మందికి ఉపాధి.

■ సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ విజయనగరంలో రూ.8,570 కోట్ల పెట్టుబడితో సమీకృత ఉక్కు ప్లాంట్ ఏర్పాటుకు 1,085 ఎకరాలు కేటాయింపు. 1,000 మందికి ఉపాధి.

■ వాసంగ్ ఫుట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.898 కోట్ల పెట్టుబడితో కుప్పంలో ఫుట్‌వేర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు 103.19 ఎకరాలు కేటాయింపు. 17,645 మందికి ఉపాధి.

■ వాల్టన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,743 కోట్ల పెట్టుబడితో నాయుడుపేట సెజ్‌లో 4 గిగావాట్ల సోలార్ సెల్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు 40 ఎకరాలు కేటాయింపు. 415 మందికి ఉపాధి.

■ బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ (యాక్షన్ టీసా) రెండు దశల్లో రూ.1,174 కోట్ల పెట్టుబడితో పార్టికల్ బోర్డు తయారీ యూనిట్ ఏర్పాటుకు 18.70 ఎకరాలు కేటాయింపు. 1,500 మందికి ఉపాధి.

■ గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్ రూ.595 కోట్లతో నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో పార్టికల్ బోర్డు, లామినేటెడ్ యూనిట్ ఏర్పాటు.. 850 మందికి ఉపాధి.

■ సెంచరీ ప్యానెల్స్ రూ.956 కోట్ల పెట్టుబడితో గోపవరం ఇండస్ట్రియల్ పార్కులో పార్టికల్‌బోర్డు తయారీ యూనిట్ ఏర్పాటు.. 2,266 మందికి ఉపాధి.

■ ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రెండు దశల్లో రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ యూనిట్ ఏర్పాటు.. అల్ట్రా మెగా ప్రాజెక్టు కింద రూ.37,150 కోట్లు స్థిర మూలధన పెట్టుబడిగా పరిగణించి ప్రోత్సాహకాలు. 3 వేల మందికి ఉపాధి.

■ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రూ.784 కోట్ల పెట్టుబడితో కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్‌లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్ ఏర్పాటుకు రాయితీ ధరకు 40 ఎకరాలు కేటాయింపు. 500 మందికి ఉపాధి.

ఉండవల్లిలో రూ.595 కోట్లతో రెండో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్

● అమరావతిలోని ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2 డిజైన్, నిర్మాణం, పరీక్ష, కమిషనింగ్‌తోపాటు 15 ఏళ్ల నిర్వహణ కోసం రూ.595.01 కోట్లకు పరిపాలన ఆమోదం. పనులకు ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా నిధులు సమకూర్చి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు అనుమతి.

● రాజధానిలో ప్యాకేజీలు 46, 47, 48కి సంబంధించిన పనులకు ఎల్-1 బిడ్లు ఆమోదించి.. బిడ్డర్‌కు వాటిని అప్పగించేందుకు సీఆర్డీఏ ఆమోదించిన తీర్మానాల అమలుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఏండీకి అధికారం.

క్వాంటమ్ కంప్యూటింగ్, నైబర్ హుడ్ వర్క్ సిస్టం పాలసీలకు ఓకే

1. ఏపీని క్వాంటమ్ టెక్నాలజీలో ప్రపంచానికి కేంద్రంగా నిలపాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు 'ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం- 2025-30'కి ఆమోదం. దీని ద్వారా బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

- అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు. ◆ స్టార్టప్‌లు
- విద్యాసంస్థలు, తయారీదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు.
- క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటు.
- 5 వేల మందిని నిపుణులుగా తయారు చేయడంతో పాటు.. 100కు పైగా స్టార్టప్‌ల ఏర్పాటు లక్ష్యం.

2. ప్రతి మండలంలో డిజిటల్ అనుసంధాన వర్క్ స్పేస్‌లు ఏర్పాటుకు వీలుగా 'ఏపీ నైబర్‌హుడ్ వర్క్ సిస్టం విధానం- 2025-30'కు ఆమోదం. దీనివల్ల గిగ్‌వర్కర్లు, మారుమూల ప్రాంతాల్లోని ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది.

- డెవలపర్లకు మూలధన, అద్దె రాయితీలు.
- నైపుణ్య శిక్షణకు ప్రోత్సాహకాలు.
- కనీసం లక్ష మందికి శిక్షణ.. 70 శాతం హబ్‌లు స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం పాలసీ లక్ష్యం.

రాజధాని భూ సమీకరణ ప్రాంతాల్లో రూ.1,863 కోట్లతో మౌలిక వసతులు

▼ రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రాంతాలు కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లిల్లోని లేఅవుట్లలో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్తు, యుటిలిటీ డక్టులు, రీయూజ్ వాటర్ లైన్, ఎస్‌టీపీ, అవెన్యూ ప్లాంటేషన్ కోసం రూ.1,863 కోట్లకు టెండర్లు పిలిచేందుకు సీఆర్డీఏకి పరిపాలన అనుమతులిచ్చే ప్రతిపాదనలకు ఆమోదం.

▼ సీఆర్డీఏ పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై సమీక్షకు సంబంధించి మంత్రుల కమిటీ చేసిన సిఫార్సులపై అమరావతి భూ కేటాయింపు నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోడానికి సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతి.

రూ.7,500 కోట్ల బ్యాంకు రుణంతో ఎల్‌పీఎస్ జోన్లలో అభివృద్ధి పనులు

✦ రాజధాని అమరావతిలో ఎల్‌పీఎస్ జోన్ 4, 9, 12 అభివృద్ధి కోసం జాతీయ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.7,500 కోట్ల రుణం పొందేందుకు సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతి

✦ రాజధానిలో ముఖ్యమైన మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయడానికి అమరావతి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.1,500 కోట్ల రుణం పొందేలా సీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ నిర్ణయం.

రాజ్యాంగ నిపుణులతో చర్చించా.. వైకాపాకు ప్రతిపక్ష హోదా కుదరదు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య



బీటీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అయ్యన్నపాత్రుడు. చిత్రంలో రామకృష్ణారెడ్డి తదితరులు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని వైకాపా అధ్యక్షుడు జగన్ కోరుతున్నారని, అందుకు అవసరమైన ఎమ్మెల్యేలు ఆ పార్టీకి లేరని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాల స్పీకర్లు, రాజ్యాంగ నిపుణులతో చర్చించానని, నిర్ణీత సంఖ్య కన్నా తక్కువ సీట్లున్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశం లేదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అందువల్ల వైకాపాకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం, అనపర్తిలో బీటీరోడ్డును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. "జగన్ బయట మైకులు పట్టుకుని మాట్లాడడం కాదు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. ఆయనకు అక్కడ తగినంత సమయం ఇస్తాం. వైకాపా హయాంలో నన్ను అరెస్టు చేయించారు. ఆ కారణంగా అసెంబ్లీలో అధ్యక్షా అని నన్ను సంబోధించడానికి నోరురాక జగన్ వెనక్కి జంకుతున్నారు. అసెంబ్లీ ఓ దేవాలయం. అందులో నేను పూజారిని మాత్రమే" అని తెలిపారు. వయసు రీత్యా వచ్చే ఎన్నికల్లో పోటీకి తాను విరమించుకుంటున్నట్లు అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

కమిటీల ప్రమాణస్వీకారాల్ని పండుగ వాతావరణంలో నిర్వహించండి

తెదేపా నేతలకు పల్లా శ్రీనివాసరావు పిలుపు

ఈనాడు, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న తెదేపా మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాల్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తొలుత జెండా ఆవిష్కరణ, ప్రమాణ స్వీకారం, కేక్ కటింగ్, సన్మానం, గ్రూప్ ఫొటో సెషన్‌లు అన్ని చోట్లా ఏకరూపంగా ఉండాలన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో నేతలకు మార్గదర్శనం చేశారు. ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని, ఈ వేడుకల్ని కమిటీ సెలబ్రేషన్స్-2025 టీడీపీ హ్యాష్‌ట్యాగ్‌తో ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో అబుల్‌కలాం ఆజాద్ జయంతిని పార్టీ తరఫున నిర్వహించాలని ఆదేశించారు.

న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు రూ.46 కోట్లు విడుదల చేయడంపై హర్షం

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన బార్ కౌన్సిల్

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునే నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున ప్రభుత్వం (మ్యాచింగ్ గ్రాంట్) రూ.46 కోట్లు విడుదల చేయడంపై బార్ కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "న్యాయవాదుల సంక్షేమం విషయంలో నిబద్ధతతో ఉన్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ ఇప్పటికే రూ.50 కోట్లు చెల్లించింది. దరఖాస్తులేవీ పెండింగ్‌లో లేవు" అని పేర్కొన్నారు.

పలు కార్పొరేషన్లు, బోర్డులకు డైరెక్టర్ల నియామకం

ఈనాడు, అమరావతి: పలు కార్పొరేషన్లు, బోర్డులకు 122 మంది డైరెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం జాబితా విడుదల చేసింది. తెదేపాతో పాటు జనసేన, భాజపా నేతలకు ఇందులో ప్రాధాన్యతనిచ్చింది. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డుకు 13 మంది, లేబర్ వెల్ఫేర్ బోర్డుకు 11 మంది, కాపు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్‌కు 15, కళింగ కోమటి/కళింగ వైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు 15, దాసరి సంక్షేమ, అభివృద్ధి సొసైటీకి 15, ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు 15, నాగవంశం అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్‌కు 15 మంది, సగర, ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు 15 మందితో పాటు మరి కొన్ని సంస్థల్లో డైరెక్టర్లను నియమించింది.

తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సీనియర్లతో శిక్షణ

తెదేపా మంత్రులతో అల్పాహార విందు భేటీలో లోకేశ్

ఈనాడు, అమరావతి: తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేల్లో కొందరు పార్టీ లైన్‌ను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని, కొన్ని పొరపాట్లు చేస్తున్నారని తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం ఉదయం మంత్రివర్గ సమావేశానికి ముందు.. ఆయన ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తెదేపాకు చెందిన మంత్రులతో అల్పాహార విందు భేటీ నిర్వహించారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు.. సీనియర్ ఎమ్మెల్యేలు, నాయకులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిద్దామన్నారు. 'సీనియర్ ఎమ్మెల్యేలు వారు తొలిసారి గెలిచినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో, ఎలాంటి సమస్యలు అధిగమించి ఈ స్థాయికి వచ్చారో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తెలుసుకుంటే మంచిది. వారు వరుస విజయాలు కొనసాగించాలంటే సీనియర్ల అనుభవాల నుంచి నేర్చుకోవాలి' అని పేర్కొన్నారు. మంత్రులు నెలలో ఒక్కసారైనా విధిగా పార్టీ కార్యాలయానికి రావాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి శుక్రవారం అర్జీలు స్వీకరించాలని ఆయన సూచించారు. ఆర్థికేతర సమస్యల్ని వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని, ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని లోకేశ్ తెలిపారు. మంత్రులంతా వారి శాఖల పరిధిలో జరిగే ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరించా లన్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రులు విధిగా పాల్గొనాలని ఆయన సూచించారు.

ప్రజల ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్న ఎమ్మెల్యేలు

- వారు రాజీ పడతామన్నా.. వీరు ససేమిరా అంటున్నారు
- ఒక ఎమ్మెల్యే విషయం తెలిసి.. గట్టిగా హెచ్చరించా
- ఏ పార్టీ ఎమ్మెల్యేలైనా తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించండి
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరిన పవన్ కల్యాణ్

● తప్పు చేస్తున్న ఎమ్మెల్యేల్ని ఇన్‌ఛార్జి మంత్రులు దారిలో పెట్టాలన్న సీఎం

ఈనాడు, అమరావతి: కొందరు ఎమ్మెల్యేలు ప్రజల వ్యక్తిగత, ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్నారని, బెదిరిస్తున్నారని, తప్పులు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించారు. ఏదైనా వివాదంలో ఇరుపక్షాలు రాజీకి సిద్ధమైనా.. ఎమ్మెల్యేలు వారిని రాజీ పడనివ్వడం లేదని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యే వ్యవహారం తన దృష్టికి వస్తే, తీరుమారాలని హెచ్చరించానని చెప్పారు. కూటమిలోని ఏ పార్టీ ఎమ్మెల్యేలు తప్పుచేసినా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినప్పుడు.. పవన్ కల్యాణ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఉపేక్షించవద్దని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేయాలని ఆయన సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులూ చొరవ తీసుకోవట్లేదని, తనకు వస్తున్న అర్జీల్లోనూ 60-70% అవేనని తెలిపారు. ప్రజల ఆస్తుల వ్యవహారాల్లో ప్రభుత్వం స్పందించకపోతే చులకనవుతామని పవన్ పేర్కొన్నారు. దానిపై సీఎం స్పందిస్తూ... ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే వారిని గాడిలో పెట్టాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తెలిపారు. "ఎమ్మెల్యేల పనితీరు మారాలి. లేకపోతే గత ఎన్నికల్లో 50 వేలకుపైగా మెజార్టీలు వచ్చిన వారికి వచ్చే ఎన్నికల్లో 10వేల మెజార్టీ కూడా రాకపోవచ్చు" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకుని రెవెన్యూ సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అనంతపురం జిల్లాలో కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసీల్దారులంతా కూర్చుని, ఒకేసారి 400 సమస్యల్ని పరిష్కరించారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడంతో అలాంటి మంచి అలవాట్లను అనుసరించేలా రాష్ట్రమంతా ఆదేశాలు జారీచేద్దామని సీసీఎల్ఏకు సీఎం సూచించారు.

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

ఈ నెల 23న శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రమంత్రులు వస్తున్నందున ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుట్టపర్తిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

పొలిటికల్ గవర్నెన్స్ అర్థం మార్చేశారు

పొలిటికల్ గవర్నెన్స్‌కి ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఒక విస్తృతార్థంలో చెబుతుంటే.. కొందరు అధికారులు దాన్ని వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. ప్రజలు ఏ చిన్నపని కోసం వారివద్దకు వెళ్లినా.. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు చెబితేనే చేస్తామంటున్నారని, దాంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని ఆయన పేర్కొన్నారు.

పెద్దిరెడ్డి ఆక్రమించిన భూముల వీడియో తీశానన్న పవన్

పవన్ కల్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అటవీ ప్రాంతాల్లో పర్యటించి, ఎర్రచందనం నిల్వల్ని పరిశీలించడంపై ముఖ్యమంత్రి ఆయనకు అభినందనలు తెలియజేశారు. తన పర్యటన అనుభవాల్ని పవన్ కల్యాణ్ వివరించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన అటవీ భూముల వీడియోలు తీశానని, వాటిని త్వరలో విడుదల చేస్తానని పవన్ పేర్కొన్నారు. గోడౌన్లలో ఎర్రచందనం దుంగల్ని జాగ్రత్తగా కాపాడుతున్నారని, లోపలికి వెళుతుంటే.. ఏదో బ్యాంకులోకి వెళుతున్న అనుభూతి కలిగిందని ఆయన తెలిపారు. ఆ దుంగలతో అలంకరణ వస్తువుల్లాంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి, విక్రయించేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

ఎంత కష్టపడుతున్నామో యువతకు తెలియాలి

రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంతగా కష్టపడుతోందో వారికీ తెలియాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న పెట్టుబడిదారుల సదస్సుపై యువతకు అవగాహన కల్పించాలని, అక్కడ జరిగే కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాల్ని పాఠశాలల్లోనూ అందుబాటులోకి తెద్దామని తెలిపారు. ఈ సదస్సు వల్ల ఎంత పెట్టుబడులు, ఎన్ని ఉద్యోగాలు వస్తాయన్న అంశం యువతకు తెలియాలని, ఈ విషయంలో మంత్రులు చొరవ తీసుకోవాలని సూచించారు.

జనసేన కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని కోరిన దుర్గేష్

జిల్లాల్లో జనసేన పార్టీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. దానిపై సీఎం స్పందిస్తూ 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా తెదేపాకు అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకోలేకపోయామన్నారు. జనసేన పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో భాజపా నాయకుల్ని అభినందించాలని, వారు పార్టీ కార్యాలయాల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెడతారని ఆయన పేర్కొన్నారు.

చదువు అబ్బలేదని.. కారడవిలోకి పారిపోయారు

4 రోజులు గుహలోనే తలదాచుకున్న ఇద్దరు బాలికలు



కొండ గుహలో తలదాచుకున్న విద్యార్థినులు

పెదబయలు, న్యూస్‌టుడే: చదువులో వెనకబడ్డామని పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు కారడవిలోకి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాలుగు రోజుల పాటు దుంపలు తింటూ అక్కడి నీరే తాగుతూ గుహలో దాక్కున్నారు. డ్రోన్ల సహాయంతో పోలీసులు గాలించగా సోమవారం దొరికారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ కించూరు గ్రామానికి చెందిన బాలికలు పెదబయలు ఆశ్రమ బాలికల పాఠశాల-1లో ఆరు, ఐదో తరగతులు చదువుతున్నారు. ఈ నెల 6న వీరిద్దరూ పాఠశాల నుంచి పరారయ్యారు. 8న పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఎస్సై కొల్లి రమణ ఆధ్వర్యంలో మూడు బృందాలు వీరికోసం గాలిస్తున్నాయి. సోమవారం డ్రోన్ల సహాయంతో గాలింపు చేపట్టగా కొంచూరు కొండల్లోని గుహలో వీరు తలదాచుకున్నట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్థుల సహకారంతో ఇద్దరినీ పట్టుకుని సాయంత్రం తల్లిదండ్రులకు అప్పగించారు.

ముందు అవగాహన.. తర్వాతే చలానా

- రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాల నివారణకు ఎస్‌వోపీలు సిద్ధం చేయండి
- రహదారులపై గుంతలు కనిపించకూడదు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు



ఆర్టీజీఎస్‌పై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: నిబంధనలు పాటించని వాహనదారులు, హెల్మెట్లు, సీటు బెల్ట్‌లు ధరించకుండా వాహనాలు నడిపేవారికి తొలుత అవగాహన కల్పించాలని, తర్వాత కూడా ఉల్లంఘనకు పాల్పడితేనే చలానాలు వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉల్లంఘనలపై భారీఎత్తున చలానాలు వేయాలన్న అధికారుల ప్రతిపాదనను సీఎం సున్నితంగా తిరస్కరించారు. చలానాలు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై సోమవారం ఆయన సమీక్షించారు. మొదట ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు అవగాహన కల్పించడంతోపాటు ఆ విషయాన్ని వారి ఫోన్లకు మెసేజ్ పంపాలని సూచించారు. తర్వాత కూడా ఉల్లంఘనలకు పాల్పడినప్పుడు చలానా వేసినా, తాను తప్పు చేసినందు వల్లే జరిమానా పడిందన్న భావన వారిలో కలుగుతుందని చెప్పారు. ఈ విషయంలో కేరళను ఆదర్శంగా తీసుకోవాలని సీఎం సూచించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి: రోడ్డు ప్రమాదాల నివారణపై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు చంద్రబాబు ఆదేశించారు. ఇటీవలి రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్ని ప్రమాదాలు వంటివి చోటుచేసుకోకుండా పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నిర్మాణాత్మక ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు. వారంలో ప్రామాణిక కార్యాచరణ అమలు విధానం(ఎస్‌వోపీ) సిద్ధం చేసి, అందజేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా రోడ్డు ప్రమాదాలను ఎలా నియంత్రించవచ్చనేది పరిశీలించాలని సూచించారు. జన సమూహాల్లో తొక్కిసలాటలు జరగకుండా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికీ కొన్నిచోట్ల రోడ్లు సరిగా లేవనే ఫీడ్‌బ్యాక్ వస్తోందని, అలా జరగకుండా చూసుకోవాలని చంద్రబాబు నిర్దేశించారు. రాష్ట్రమంతటా జాబ్‌మేళాలు నిర్వహించాలని, వీటి గురించి నిరుద్యోగ యువతకు తెలిసేలా పెద్దఎత్తున ప్రచారం చేయాలని సీఎం పేర్కొన్నారు.

రెండున్నర నెలల్లో మార్పు కనిపించాలి: గతంతో పోల్చుకుంటే రిజిస్ట్రేషన్ల సేవల విషయంలో పనితీరు కొంత మెరుగైందని, అయితే పలుచోట్ల అధికారుల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని సీఎం అన్నారు. దీనిని సరిచేసుకునేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. రెండున్నర నెలల్లో రిజిస్ట్రేషన్ సేవల్లో తాను ఆశించిన మార్పులు కనిపించాలని చెప్పారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, రేషన్ పంపిణీ, దీపం-2 వంటి పథకాల పనితీరుపై సీఎం సమీక్షించారు.

ఈ మూడు తప్పులు చేయకండి



1. అందరూ వెళ్లేదారిని గుడ్డిగా అనుసరించకండి. మీ ఇష్టాయిష్టాలకు, శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోండి. అప్పుడే కెరీర్‌లోనూ, వ్యక్తిగత జీవితంలోనూ సంతృప్తితో ఉంటారు.
2. మీకు అసౌకర్యంగా అనిపించే విషయాల నుంచి పారిపోవద్దు. అలాంటి వాతావరణంలోనే మీలో మానసిక స్థైర్యం పెరుగుతుంది. భవిష్యత్తులో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొగల సామర్థ్యం సొంతమవుతుంది.
3. ఏ విషయం గురించీ అతిగా ఆలోచించకండి. అప్పుడే మీకు మానసిక ప్రశాంతత దొరుకుతుంది.

– ర్యాన్ హాలిడే, రచయిత




ఎర్రకోట సమీపంలో పేలుడు ధాటికి చెలరేగిన మంటలు.. ధ్వంసమైన వాహనాలు



పేలుడు తీవ్రతకు పూర్తిగా ఛిద్రమైన ఓ వ్యక్తి మృతదేహాన్ని తరలిస్తున్న సహాయక సిబ్బంది

హృదయ విదారకం: రాహుల్



దిల్లీ, కోల్‌కతా: కారు పేలుడు ఘటనలో పలువురు చనిపోవడం హృదయ విదారకమైనదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటన తనను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. చాలామంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర బాధాకరమని 'ఎక్స్‌'లో వ్యాఖ్యానించారు. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఈ ఘటనపై సమగ్ర, వేగవంతమైన దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా కోరారు.

కుట్ర కోణం ఉందా: కేజ్రీవాల్

దిల్లీలో పేలుడు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమంటూ ఆయన 'ఎక్స్‌'లో పోస్టు పెట్టారు. ఈ పేలుడు ఎలా జరిగింది, దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే దానిపై పోలీసులు, ప్రభుత్వం వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు.

షాక్‌కు గురి చేసింది: మమత



దిల్లీలో పేలుడు ఘటన తనను షాక్‌కు గురిచేసిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. 'మరణించిన వారి బంధువుల రోదనలతో నా హృదయం బరువెక్కిపోయింది. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి' అని ఆమె తెలిపారు.

దేశంలో భారీ పేలుళ్లలో కొన్ని..

11.7.2006 ముంబయి లోకల్ రైళ్లలో వరుస పేలుళ్లు. 189 మంది మృతి, 824 మందికి గాయాలు.

13.9.2008 దిల్లీలోని కరోల్ బాగ్, కన్నాట్ ప్లేస్, గ్రేటర్ కైలాశ్‌లో వరుస పేలుళ్లు. 26 మంది మృతి, 135 మందికి గాయాలు. పలు ఆస్తుల ధ్వంసం.

13.7.2011 ముంబయిలోని దాదర్, జవేరీ బజార్, ఒపేరా హౌస్‌ వద్ద 3 పేలుళ్లు. 27 మంది మృతి, 100 మందికిపైగా గాయాలు.

21.2.2013 హైదరాబాద్‌లో జంట పేలుళ్లు. 18 మంది మృతి, 131 మందికి గాయాలు.

7.7.2013 బిహార్‌లోని బోధ్ గయాలో వరుస పేలుళ్లు. ఇద్దరు బౌద్ధ భిక్షువులకు గాయాలు.

మార్చి 2017 మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లాలో జబ్డీ స్టేషన్ వద్ద భోపాల్-ఉజ్జయిని రైలులో పేలుడు. ఎవరికీ గాయాలు కాలేదు.

1.3.2024 కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉన్న రామేశ్వరం కేఫ్‌లో పేలుడు. 10 మందికి గాయాలు.

10.11.2025 దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు. 9 మంది మృతి, 20 మందికి గాయాలు.



ఎర్రకోట సమీపంలో పేలుడు తీవ్రతకు చెల్లాచెదురుగా పడిన వస్తువులు

చెల్లాచెదురుగా శరీర భాగాలు

- కార్లు, రోడ్లపై మృతదేహాలు
- క్షణాల్లో భారీ మంటలు
- దిల్లీ పేలుడుపై ప్రత్యక్ష సాక్షుల కథనం

దిల్లీ: 'మృతదేహాలు కార్లపై, రోడ్లపై పడ్డాయి. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. భారీ మంటలు ఆకాశమంత ఎత్తున ఎగిశాయి' అని దిల్లీ పేలుడును ప్రత్యక్షంగా చూసిన సాక్షులు తెలిపారు. ఎర్రకోట మెట్రో స్టేషన్‌వైపు మెల్లగా కదులుతున్న కారు అతి భారీ శబ్దంతో పేలిపోయిందని వెల్లడించారు.

■ 'నేను అక్కడే నిల్చుని మరొకరితో మాట్లాడుతుండగా.. చనిపోయిన ఓ వ్యక్తి చేయి భాగం వచ్చి నా కుడిపక్కన పడిపోయింది. చొక్కా భాగం దానికే ఉంది' అని అమిత్ ముద్గల్ అనే ప్రత్యక్ష సాక్షి వివరించారు. 'అనూహ్యంగా భారీగా పేలుడు సంభవించింది. సెకన్లలో ఎర్రని పొగ ఆకాశాన్ని కమ్మింది' అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ పెద్దగా అరుచుకుంటూ సురక్షిత ప్రాంతానికి పరుగులు తీశారని పేర్కొన్నారు. తీవ్రత చాలా ఎక్కువగా ఉందని, మృతుల శరీర భాగాలు వీధంతా పడిపోయాయని వివరించారు. మంటల వద్దకు తాను పరుగెత్తుకు వెళ్లి గాయపడిన వారిని అంబులెన్సుల్లో ఎక్కించానని తెలిపారు.

■ పార్కు చేసిన కారులో భారీ పేలుడు సంభవించిందని ఈ ఘటనలో తలకు గాయమైన ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. 'నేను ఆటోరిక్షా డ్రైవరును. నా ఆటో ముందు ఒక కారు ఉంది. ఏం జరిగిందో నాకు అర్థం కాలేదు. కానీ అకస్మాత్తుగా కారు పేలిపోయింది' అని ఆయన వివరించారు.

చుట్టుపక్కల విధ్వంసం

పేలుడు ధాటికి పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. దుకాణాల అద్దాలు పగిలాయి. మెట్రో స్టేషన్‌లోని అద్దాలూ పగుళ్లిచ్చాయి.

■ తాము గురుద్వారాలో ఉండగా భారీ శబ్దం వినిపించిందని, బయటకు రాలేకపోయామని మరో స్థానికుడు తెలిపారు.

■ 'భవనాలు కదిలిపోయేంతగా ఈ ప్రాంతం కంపించింది. నేను వచ్చిన దుకాణం పూర్తిగా ప్రకంపనలకు గురైంది' అని ఓ కొనుగోలుదారు చెప్పారు.

■ బాంబు పేలుడు శబ్దం కిలోమీటరు దూరం వినిపించిందని జామా మసీదు ప్రాంతంలో పానీపూరీ బండి నడిపే మనోజ్ తెలిపారు. 'నేను తింటుండగా.. మా గుండెల్లో దడ పుట్టించేంత శబ్దం వినిపించింది. వెంటనే అక్కడికి పరుగెత్తుకుంటూ వచ్చా. జనం అరుపులు, కేకలతో హాహాకారాలు చేస్తున్నారు. కొంత మంది కదలిక లేకుండా పడి ఉన్నారు. ఆటో రిక్షా డ్రైవరు తీవ్రంగా గాయపడ్డారు' అని ఆయన వివరించారు.

■ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద బాంబు పేలిందని భూపీందర్ సింగ్ అనే ప్రత్యక్ష సాక్షి తెలిపారు. బాంబు పేలేటప్పుడు మేం నెమ్మదిగా కదులుతున్నాం. మా వాహనం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పేలుడు సమయంలో అక్కడ బాగా రద్దీ ఉంది. అసలేం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు' అని ఆయన వివరించారు. ఇద్దరు ముగ్గురి శరీర భాగాలు ముక్కలుగా పడిపోవడాన్ని చూశామని వెల్లడించారు.

■ 'పలువురి చేతులు, వేళ్లు పైకి లేచి పడటాన్ని చూశాం. కొన్ని కార్ల స్టీరింగ్ రాడ్లు ఎగిరిపడ్డాయి. తోపుడు బళ్లవారు, ట్యాక్సీ డ్రైవర్లు పేలుడులో చిక్కుకున్నారు. వారిలో పలువురు మృతి చెందారు. చాలా మంది గాయపడ్డారు' అని ఇర్ఫాన్ అనే ప్రత్యక్ష సాక్షి తెలిపారు.



వీడియోల్లో హాహాకారాలు

ఘటన అనంతరం సోషల్ మీడియాలో పలు వీడియోలు ప్రసారమయ్యాయి. స్థానికులు భయంతో పెద్దగా అరుస్తూ పారిపోతున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. 'బాంబు పేలింది. చేతులు ఎగిరిపడ్డాయి, వాహనాలు కాలిపోతున్నాయి' అని అరుచుకుంటూ జనం పరుగెత్తుతున్న దృశ్యాలు వాటిలో ఉన్నాయి.

దిల్లీలో పేలుడు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం: అమెరికా

న్యూయార్క్; వాషింగ్టన్: దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారుబాంబు పేలుడు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు అమెరికా సోమవారం ప్రకటించింది. భారత్‌కు అవసరమైన సహాయ, సహకారాలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అమెరికా విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడు సంగతి మాకు తెలిసింది. ఆ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాం. భారత్‌కు దౌత్యపరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని అన్నారు.

భారత్ చుట్టూ ఉగ్ర స్థావరాలు, శిక్షణ కేంద్రాలు

- నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఏర్పాటుకు పాకిస్థాన్ కుట్రలు

ఇంటర్నెట్ డెస్క్: ఉగ్రవాదులను మన దేశంపైకి ఎగదోస్తున్న పాకిస్థాన్ సరికొత్త కుట్రలు పన్నుతోందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇవి మరింత వేగవంతమైనట్లు సమాచారం. మన దేశంతో నేపాల్, బంగ్లాదేశ్‌లకు ఉన్న సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు భారత నిఘా వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సరిహద్దు రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన పలువురు కార్యకర్తల అరెస్టు అనంతర దర్యాప్తులో ఈ విషయాలు గుర్తించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్.. నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి పావులు కదుపుతున్నాయి. అల్-ఖైదా, ఐసిస్‌లు ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాల విస్తరణను ముమ్మరం చేశాయి. దీనిలో భాగంగానే పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్, నేపాల్‌కు నిరంతరం వలసలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిబిరాలకు కావాల్సిన నిధులను తుర్కియే అందిస్తున్నట్లు సమాచారం.



'ఎస్1' సంకేత నామంతో...

పాకిస్థాన్ గత 25ఏళ్లకు పైగా 'ఎస్1' అనే రహస్య సంకేత నామంతో భారత్‌లో ఉగ్ర కార్యకలాపాలను విస్తరించడానికి భారీ కుట్రను అమలుచేస్తోందని నిఘా వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఇప్పటివరకు అరకొరగా ఉన్న సమాచారంపై ఇటీవల లభించిన వివరాలతో పూర్తి స్పష్టత వచ్చిందని పేర్కొన్నాయి. ఉగ్ర ముఠాలకు వివిధ రకాల ఆయుధాలు, బాంబుల తయారీలోనూ పాక్ శిక్షణ ఇస్తోందని వెల్లడించాయి. 'గాజీ1', 'గాజీ2' అనే అనుబంధ సంకేత నామాలతోనూ రహస్య నెట్‌వర్క్‌ను భారత్‌లో తయారు చేస్తున్నట్లు గుర్తించాయి. ఇస్లామాబాద్ కేంద్రంగా ఐఎస్ఐ దీనిని పర్యవేక్షిస్తోంది. పాక్ సైన్యంలోని కర్నల్ స్థాయి అధికారులతో పాటు ఇద్దరు సీనియర్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించింది.

దీర్ఘకాల అలసట వల్ల శ్వాసలో ఇబ్బందులు

జ్ఞాన నేత్రం

దిల్లీ: దీర్ఘకాల అలసట సిండ్రోమ్ ఉన్నవారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ రుగ్మతకు చికిత్స చేయడానికి ఒక లక్ష్యం దొరికినట్లేనని వారు తెలిపారు. ఈ లక్షణాల నుంచి ఉపశమనం పొందడానికి ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీర్ఘకాల అలసట సిండ్రోమ్ ఉన్నవారు ఎప్పుడూ నిసత్తువతో ఉంటారు. ఇలాంటివారిలో విషయగ్రహణ సామర్థ్యంలో సమస్యలు, ఏకాగ్రత లోపించడం, అయోమయ పరిస్థితి వంటివి ఉంటాయి. తాజాగా అమెరికాలోని ఇకాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు దీనిపై పరిశోధన చేశారు. శారీరక శ్రమ చేస్తున్న సమయంలో.. దీర్ఘకాల అలసట సిండ్రోమ్ ఉన్నవారిని పరిశీలించారు. వీరిలో శ్వాస తీరులో లోపాలు ఉన్నట్లు గుర్తించారు.

పుణెలో దృశ్యం!

దృశ్యం సినిమాలో శవాన్ని మాయం చేసి ఏమీ తెలియనట్లు ఓ కుటుంబం నటించిన విషయం గుర్తుంది కదా.. సరిగ్గా అలాంటి ఘటనే పుణెలో చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన భార్యను చంపేసి శవాన్ని కాల్చి బూడిద చేసి ఏమీ తెలియనట్లు ఆమె కనిపించడం లేదంటూ అతడే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్యను హత్య చేయడానికి ముందు అతడు దృశ్యం సినిమాను నాలుగు సార్లు చూశాడు.

ఈటీవీ భారత్

వర్జే పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే సమీర్ పంజాబ్‌రావ్ జాదవ్‌కు (42) తన భార్య అంజలిపై అనుమానముండేది. దీంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక గోదామును ముందుగా అద్దెకు తీసుకున్నాడు. అక్కడికి ఒక ఇనుప పెట్టెను, కట్టెలను చేర్చాడు. అనంతరం అక్టోబరు 26వ తేదీన తన భార్యను గోదాము ప్రాంతానికి వాకింగ్‌కు తీసుకెళ్లాడు. తిరిగివచ్చే క్రమంలో వాష్ రూమ్‌కు వెళ్తానంటూ ఒక హోటల్ దగ్గర ఆగాడు. అక్కడి నుంచి ఆమెను అద్దెకు తీసుకున్న గోదాము వద్దకు తీసుకెళ్లాడు. లోపలికి తీసుకెళ్లి గొంతు నులిమి చంపాడు. అనంతరం మృతదేహాన్ని ఇనుప పెట్టెలో పెట్టి కట్టెలు పేర్చి.. పెట్రోలు పోసి నిప్పంటించాడు. బూడిదను సమీపంలోని నదిలో వేశాడు. మళ్లీ ఏమీ తెలియనట్లుగా అక్టోబరు 28వ తేదీన పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన భార్య కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశాడు. పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా.. అసలు నిజం చెప్పాడు.



సమీర్, అంజలి

కేరళలో కూలిపోయిన ఫీడర్ ట్యాంక్

జనావాసాలపైకి 1.38 కోట్ల లీటర్ల నీరు

కొచ్చిన్: కేరళ వాటర్ అథారిటీ(కేడబ్ల్యూఏ) ఫీడర్ ట్యాంక్ కూలిపోవడంతో ఓ గ్రామంలో నీరు వరదలా పోటెత్తింది. 1.38 కోట్ల లీటర్ల నీరు ఒక్కసారిగా జనావాసాలపై గుమ్మరించినట్లయ్యింది. అనేక ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఈ హఠాత్ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమ్మనం అనే ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నీరు ఉద్ధృతంగా రావడంతో పలు ఇళ్ల పైభాగాలు కూలిపోయాయని.. అనేక వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయని అధికారులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్లలోకి భారీగా నీరు చేరడంతో అనేక ఎలక్ట్రిక్ పరికరాలు, ఫర్నిచర్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందులు, వైద్య పరికరాలు పాడైనట్లు అధికారులు తెలిపారు. ఈ ట్యాంక్‌ను 50 ఏళ్ల క్రితం నిర్మించారని.. దీని నుంచి కొచ్చిన్, త్రిపునితుర ప్రాంతాలకు నీరు సరఫరా అవుతుందని ఎర్నాకుళం ఎమ్మెల్యే వినోద్ వెల్లడించారు. వరద వల్ల ప్రభావితమైన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కేడబ్ల్యూఏను కోరారు.

లక్ష్యాన్ని ప్రక్రియలుగా విభజించుకోండి




ఒకేసారి 20 కిలోల బరువు తగ్గాలని ప్రయత్నిస్తే, అది సాధ్యం కాదు. కానీ ఒక కిలో చొప్పున బరువు తగ్గడంపై దృష్టిపెట్టి, అలా 20 సార్లు ప్రయత్నిస్తే దాన్ని సులువుగా సాధించొచ్చు. అదే విధంగా మీ లక్ష్యాన్ని చిన్న చిన్న ప్రక్రియలుగా విభజించుకొని కృషి చేస్తే, మీరు విజయం సాధించే అవకాశాలెక్కువ.

– జూలీ గుర్నెర్, పెర్ఫార్మన్స్ కోచ్

న్యాయవాదుల వస్త్రధారణతో కరడుగట్టిన నేరగాళ్లు వస్తున్నారు!

- న్యాయస్థానాల ప్రాంగణాల్లో హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: న్యాయస్థానాల ప్రాంగణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయవాదుల వస్త్రధారణలో కరడుగట్టిన నేరగాళ్లు కోర్టుల వద్దకు వస్తున్నారని పేర్కొంది. దేశంలోని పలు ట్రయల్ కోర్టుల వద్ద పోలీసులు, కక్షిదారులతో న్యాయవాదుల ఆహార్యంలో ఉన్న వ్యక్తులు ఘర్షణలకు దిగిన ఘటనలను ప్రస్తావిస్తూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. 'పంజాబ్, హరియాణా, దిల్లీల్లోని కోర్టుల వద్దకు నేరగాళ్లు.. న్యాయవాదుల మాదిరిగా నల్ల కోట్లు ధరించి వచ్చి పోలీసులు, ఇతర కక్షిదారులపై దాడులకు పాల్పడ్డారు. ఆ నేరగాళ్లను ముందే గుర్తించే యంత్రాంగమేదీ పోలీసులకు లేదు. పిటిషనర్లు, పోలీసులు, న్యాయవాదుల మధ్య కూడా ఇటీవల ఘర్షణలు జరుగుతున్నాయి' అని ధర్మాసనం తెలిపింది. ఈ తరహా ఘటనలను నివారించేలా, ట్రయల్ కోర్టుల వద్ద భద్రతను పెంపొందించేలా దేశమంతటికీ మార్గదర్శకాలు రూపొందిస్తామని వెల్లడించింది. కోర్టు పనివేళల్లో, కోర్టు ప్రాంగణంలో ఎవరినైనా అరెస్టు చేయడం/నిర్బంధించడం, అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలను పోలీసులు సంబంధిత జడ్జి అనుమతితోనే తీసుకోవాల్సి ఉంటుందన్న కేరళ హైకోర్టు ఆదేశాలను ఆ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. అలాంటి గంపగుత్త ఉత్తర్వు వివిధ సందర్భాల్లో పోలీసుల విధులను అడ్డుకుంటుందని అధికారుల సంఘం పేర్కొంది. ఈ వివాదానికి చాలా విస్తృత పరిధి ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్త మార్గదర్శకాలు అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను జనవరి నెలకు వాయిదా వేసింది.



అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాల్సిందే

- ఔషధ తయారీ సంస్థలకు కేంద్రం అల్టిమేటం

ఇంటర్నెట్ డెస్క్: కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తాగి పలు రాష్ట్రాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీ సంస్థలు అంతర్జాతీయ ఔషధ ఉత్పాదక ప్రమాణాలు పాటించాలని, లేకపోతే కంపెనీలు మూతపడతాయని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) ఆదేశాలు వెలువరించింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీ సంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (జీఎంపీ)కు అనుగుణంగా ఔషధ తయారీ పద్ధతులను మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండబోవని తేల్చిచెప్పింది. భారత్‌లో తయారైన కొన్ని దగ్గుమందుల వల్ల ఇటీవల మన దేశంతో పాటు, విదేశాల్లోనూ పసిపిల్లల మరణాలు సంభవించాయి. భారత్ నుంచి ఎగుమతి అయిన ఈ మందుల వల్ల గాంబియా, ఉజ్బెకిస్థాన్, కామెరూన్ వంటి దేశాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటనలు వెలుగుచూశాయి. చిన్నారుల మృతితో భారత్ నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని.. పాత తయారీ పద్ధతులు అనుసరిస్తోందని అంతర్జాతీయంగా విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఔషధతయారీ సంస్థలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఔషధ తయారీ సంస్థలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించుకోవాలని స్పష్టం చేసింది. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఢాకాలో వరుస బాంబు పేలుళ్లు

యూనస్ గ్రామీణ బ్యాంకుపై కూడా..

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరంలో సోమవారం వరుస నాటు బాంబు పేలుళ్లు సంచలనం సృష్టించాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు మొహమ్మద్ యూనస్ మీర్‌పుర్ ప్రాంతంలో స్థాపించిన గ్రామీణ బ్యాంకుపై కూడా బాంబుదాడి జరిగింది. ఈ దాడులకు సంబంధించి ఒక 28 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేసినట్టు మొహమ్మద్ యూనస్ కార్యాలయ అధికారి ఒకరు వెల్లడించారు. రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ హింసాత్మక ఘటనలు జరగడం గమనార్హం. "తెల్లవారుజామున 3.45 గంటలకు ఇద్దరు ఆగంతకులు మోటార్ సైకిల్‌పై వచ్చి గ్రామీణ బ్యాంకు ముందు నాటు బాంబు విసిరి వెళ్లిపోయారు" అని మీర్‌పుర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు మొహమ్మద్‌పుర్ ప్రాంతంలో ప్రొబర్తన అనే ఆహార ఉత్పత్తుల కార్యాలయం ముందు రెండు నాటు బాబులు పేలాయి. ఈ కార్యాలయం మత్స్య, పశుసంవర్థక వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఫరీదా అఖ్తర్‌కు చెందినది. గ్రామీణ బ్యాంకు వద్ద జరిగిన బాంబు దాడికి సంబంధించి అరెస్టయిన వ్యక్తిని మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీలీగ్ అనుబంధ సంస్థ ఛాత్ర లీగ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తున్న యూనస్ 1983లో గ్రామీణ బ్యాంకును స్థాపించారు.

2026లో దేశ హజ్ కోటా 1,75,025

దిల్లీ: వచ్చే సంవత్సరం 1,75,025 మంది భారతీయ యాత్రికులు హజ్ యాత్రలో పాల్గొనబోతున్నారు. ఈ మేరకు సౌదీ అరేబియా ప్రభుత్వంతో కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంపై కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జెడ్డాలో సంతకాలు చేశారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ సౌదీ అరేబియాలో పర్యటించిన రిజిజు.. ఆ దేశ హజ్, ఉమ్రాల శాఖ మంత్రి తౌఫిక్ బిన్ ఫౌజాన్ అల్ రాబియాతో ఆదివారం సంప్రదింపులు జరిపారు.

బూటు విసిరినట్లు వీడియో సృష్టించారు

- ఏఐతో హాని గురించి తెలుసు
- న్యాయవ్యవస్థలో వాడుకపై వాదనలు వింటాం: సీజేఐ



దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల హాని కూడా ఉంటుందని, తన కోర్టు రూంలో షూ విసిరినట్లు కల్పించిన వీడియో గురించి తెలుసునని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. న్యాయవ్యవస్థలో ఏఐ సాధనాల వాడుకను నియంత్రించడానికి మార్గదర్శకాలు రూపొందించేలా చూడాలని కోరుతూ దాఖలైన అభ్యర్థనపై రెండువారాల తర్వాత వాదనలు వినడానికి ఆయన నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం అంగీకరించింది. ఎలాంటి తనిఖీలేని ఏఐ సాధనాలను కోర్టు వ్యవహారాల్లో వాడుతున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది అభినవ్ శ్రీవాస్తవ తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం ఇవి పక్షపాతంతో వ్యవహరిస్తాయని, దాని తార్కికత గురించి వాటిని సృష్టించినవారికీ అర్థంకానంత అపారదర్శకత ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. వాడుకదారు ఉద్దేశించని పదాలు, చిత్రాలను కూడా చూపించేలా సంక్లిష్ట ప్రక్రియ ఉంటుందని, అది అనేక సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. న్యాయవ్యవస్థలో వాడే ఏఐలో డేటా నిష్పక్షపాతంగా ఉండాలని, దానిలో భాగస్వాములైనవారికి జవాబుదారీతనం నిర్ణయించాలని తెలిపారు. లేనిపక్షంలో సైబర్‌దాడుల ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. ఎలాంటి విపరిణామాలు ఉంటున్నాయంటే.. అని ఆయన వాదన కొనసాగించబోతుండగా సీజేఐ జోక్యం చేసుకున్నారు. '..దాని గురించి మాకు తెలుసు. మాపైనా ఎలాంటి వీడియోను కల్పించారో చూశాం' అని చెప్పారు. సాధారణ ఏఐకి, జనరేటివ్ ఏఐకి మధ్య చాలా వ్యత్యాసముందని న్యాయవాది కార్తికేయ రావల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జెన్ ఏఐని న్యాయవ్యవస్థలోకి తీసుకువస్తే అది ఉనికిలో లేని చట్టాలను కూడా రూపొందిస్తుందన్నారు. దీనిని నియంత్రించే మార్గదర్శకాలు రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

ట్రంప్ ప్రసంగాన్ని మార్చేసిన బీబీసీ ఉన్నతాధికారుల రాజీనామా

- క్షమాపణ చెప్పిన ఛైర్మన్ షా



డెబోరా టర్నెస్

లండన్: అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా 2021లో ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చేసిన బీబీసీ చిక్కుల్లో పడింది. దానికి బాధ్యత వహిస్తూ సోమవారం ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా రాజీనామా చేశారు. ఛైర్మన్ సమీర్ షా క్షమాపణలు చెప్పారు. 'జడ్జిమెంటల్ ఎర్రర్' అని అంగీకరించారు. ఉన్నతాధికారుల రాజీనామాను ట్రంప్ స్వాగతించారు. ప్రసంగాన్ని మార్చడం ద్వారా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బీబీసీ కుట్ర పన్నిందని ఆరోపించారు.

2021 జనవరి 6వ తేదీన వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్‌పై తన మద్దతుదారులు దాడులు చేసిన సందర్భంగా ట్రంప్ సుమారు గంటపాటు ప్రసంగించారు. దీనిని తన పనోరమ డాక్యుమెంటరీలో బీబీసీ తప్పుగా ఎడిట్ చేసి ప్రసారం చేసింది. అందులో ఒక భాగంలో 'క్యాపిటల్ హిల్‌కు వెళ్తున్నాం. మీతోపాటు నేను అక్కడికి వస్తున్నా. మనం పోరాడదాం. ఘోరంగా పోరాడదాం' అన్నట్లుగా ఉంది. కానీ కత్తిరించిన భాగంలో శాంతియుతంగా ఆందోళనకారులు పోరాడాలని చెప్పినట్లుగా ఉంది. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. అటు ట్రంప్ రాజకీయంగా ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వ నిధులతో నడిచే బీబీసీ నుంచి డైరెక్టర్ జనరల్, న్యూస్ చీఫ్ వైదొలగాల్సి వచ్చింది.

...ఓ కన్నేసి ఉంచండి!



పిల్లల్ని ఇంట్లో వదిలి వచ్చేశాం... ఎలా ఉన్నారో ఏంటో? ఉద్యోగాలు చేసే ప్రతి తల్లీతండ్రీ ఆలోచన ఇది. ఒక గది నుంచి ఇంకో గదికి రెప్పపాటులో మాయమవుతుంటారు చిచ్చర పిడుగులు. కంటికిరెప్పలా కాపాడుతున్నా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు. వారికోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే...

మండే వస్తువులకు దూరంగా...

- బయటకు వెళ్లేటప్పుడు గ్యాస్ రెగ్యులేటర్ తప్పనిసరిగా ఆపాలి.
- వండిన ఆహార పదార్థాలు వేడిగా ఉంటే.. వాటిని పిల్లలకు అందేలా ఉంచకూడదు. వేడి పదార్థాలు మీద పడినా, పిల్లలు వాటిలో చేతులు పెట్టినా కాలి గాయాలవుతాయి.
- పిల్లలు తినేందుకు సిద్ధంచేసిన పదార్థాలను కిచెన్ గట్టుపై కాకుండా హాల్, వాళ్లు ఆడుకునే గదికి దగ్గరగా అందుబాటులో ఉంచితే వారు తీసుకొని తినేందుకు వీలుంటుంది. లేకపోతే వంటగదిలోకి వెళ్లి ఆ పదార్థాలు తీసుకునే క్రమంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.
- బాత్రూమ్‌లో వాటర్ హీటర్ ప్లగ్‌ను తొలగించాలి.

విద్యుత్తు ఉపకరణాలు...

- పిల్లలు విద్యుత్తు ప్రమాదాల బారినపడకుండా సురక్షితమైన చర్యలు తీసుకోవాలి.
- ఇంట్లో సరిగాలేని వైరింగ్‌ను అలానే వదిలేయకుండా సరిచేయాలి. వైర్లు వేలాడకుండా టేపుతో చుట్టి పిల్లలకు అందకుండా చూడాలి.
- స్విచ్‌బోర్డులు కింద ఉంటే పిల్లలు వాటిలో చేతులు పెట్టే అవకాశం ఉంది. ప్లగ్‌లోకి ఏవైనా ఆట వస్తువులు పెడుతుంటారు. వీలుంటే స్విచ్‌బోర్డులను పైకి మార్పించాలి. కుదరకపోతే కింద ఉన్న స్విచ్‌బోర్డు వారికి అందకుండా జాగ్రత్తపడాలి.
- హైవోల్టేజ్ విద్యుత్తు ఉపకరణాలకు సంబంధించిన స్విచ్‌లు తప్పనిసరిగా ఆఫ్ చేయాలి.
- కొందరు ఐరన్ బాక్స్ ప్లగ్‌ను... స్విచ్ బోర్డుకు అలాగే వదిలేస్తారు. పిల్లలున్న ఇంట్లో ఇది ప్రమాదకరం. బట్టల ఐరన్ పూర్తయిన వెంటనే ప్లగ్ తొలగించాలి. విద్యుత్తు పరికరాల విషయంలో జాగ్రత్తగా ఎలా ఉండాలనేది పిల్లలకు నేర్పాలి.

స్మోక్ అలారం ఉందా?

ఇంట్లో తల్లిదండ్రులు, పెద్దలు లేకుండా.. పిల్లలు మాత్రమే ఉన్నప్పుడు అగ్నిప్రమాదాలు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుంది. పిల్లలు ప్రమాదాలను వెంటనే గుర్తించలేరు. తీరా గుర్తించాక తప్పించుకోవడం తెలియక ఆందోళన చెందుతారు. అందుకే ఇంటిలో స్మోక్ అలారాన్ని ఏర్పాటుచేసి, దానిని తరచూ పరీక్షిస్తుండాలి.

రసాయనాలు.. టానిక్‌లు....

సాధారణంగా ఏ వస్తువునైనా నోటిలో పెట్టుకోవడం ఎక్కువ మంది పిల్లలకు అలవాటుగా ఉంటుంది. అందుకే డిటర్జంట్లు, రసాయన ద్రావణాలు పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు. మందులు, సిరప్‌లు కూడా పిల్లలకు అందుబాటులో ఉంచొద్దు. పొరపాటున ఆ మందులు వేసుకున్నా, సిరప్‌లు తాగేసినా అనారోగ్యానికి గురవుతారు.

చిన్న వస్తువులే కదా అని...

- పిల్లలు తిరిగే ప్రదేశంలో పదునైనవి ఏమీ లేకుండా చూడాలి. వాళ్లు పరుగులుపెట్టి ఆడుకునే సమయంలో పదునైన వస్తువులుంటే అవి తగిలి ప్రమాదం బారినపడే అవకాశం ఉంటుంది.
- కిటికీల తలుపులు ఇంటి లోపలివైపు ఉంటే.. వాటిని మూసేయాలి. పిల్లలు ఆడుకొని పైకి లేచినప్పుడు కిటికీ తలుపు తగిలి తలకు దెబ్బతగులుతుంది.
- పిల్లలు ఆడుకునే బొమ్మల్లో అతి చిన్నవి, నాణేలు అందుబాటులో ఉంచకూడదు. వాటిని మింగితే ప్రమాదం కోరితెచ్చుకున్నట్లు అవుతుంది.

నిరంతర పర్యవేక్షణ

ఇంటిలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండొచ్చు. హాల్, పిల్లలు ఆడుకునే గది, కిచెన్, ఇంటి ముందు, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, వాటిని సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే పిల్లలు ఏం చేస్తున్నారనేది ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు.

పెంపుడు జంతువులతో జాగ్రత్తలు...

ఇంట్లో పెంపుడు జంతువులను.. పిల్లలు తమ తోటి స్నేహితుల్లా భావించి వాటితో సరదాగా ఉంటారు. అయితే కొన్ని సందర్భాల్లో వాటితో అప్రమత్తంగా ఉండాలని పిల్లలకు నేర్పించాలి. పెంపుడు జంతువులు తినే సమయంలో, అవి నిద్రిస్తున్నవేళ, వాటి పిల్లలతో ఉన్నప్పుడు.. చిన్నారులు వాటి వద్దకు వెళితే దాడిచేసే అవకాశం ఉంటుంది. ఈ విషయాల్లో పిల్లలకు ముందే జాగ్రత్తలు తెలియజేయాలి.

- ఈనాడు, అమరావతి



మేఘవాసం

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ సమీప ఫెల్డ్‌బెర్గ్ పర్వతాలపై దృశ్యమిది. ఈ ప్రాంతం తరచూ దట్టమైన పొగమంచు, మేఘాలతో నిండి కనువిందు చేస్తుంది. దానిపై భవనాలు, ఇతర నిర్మాణాలు పొగమంచులో సోమవారం ఇలా దర్శనమిచ్చాయి. సాధారణంగా వర్షాకాలంలో నేలపై సూరీడు కనిపించని సమయం లోనూ.. విమానంలో ప్రయాణించే వారు అద్దంలో నుంచి చూస్తే దిగువన దట్టంగా మేఘాలు.. ఎగువన సూరీడు కనిపిస్తూ మరో ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఫెల్డ్‌బెర్గ్ పర్వతాలపై నివసించే వారికి మాత్రం వారి ఇంటినుంచే అలాంటి దృశ్యాలు.. నిత్యం కనువిందు చేస్తాయన్నట్లుగా ఉందీ చిత్రం.

జలవాసం






ఈ చిత్రాలు చూస్తుంటే వరద ముంపు బాధితులు పడవల్లో ఒడ్డుకు చేరుతున్నట్లుంది కదూ! కానీ, వీరందరూ నీటిలో ఇలా పడవల్లోనే జీవనం సాగిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది. అదే నిజం! చేపల వేట ప్రధాన వృత్తిగా సాగే జాలర్ల జీవన పోరు ఇది. గోదావరి తీరంలోని ఏ రేవులో చూసినా ఇలాంటి గూటి పడవల్లో నివసించే వారు ఎక్కువగా కనిపిస్తారు. ప్రధానంగా భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం వరకు ఈ మత్స్యకార కుటుంబాలు రాత్రివేళ వలలు వేసి, అందులో పడిన చేపలను ఉదయం తీసి సమీప గ్రామాల్లో అమ్ముతుంటారు. అలా వచ్చిన ఆదాయంతోనే వీరి జీవనం సాగిస్తుంటారు. రాజమహేంద్రవరం, ధవళేశ్వరంలలో వీరందరికీ శాశ్వత గృహాలున్నా.. కేవలం గోదావరికి వరదల సమయం 2-3 నెలలు మాత్రమే అక్కడ ఉంటారు. మిగిలిన 9 నెలలు ఇలా గూటి పడవల్లోనే నీటిపైనే జీవనం సాగిస్తారు. అందుకు పడవల్లోనే సకల ఏర్పాట్లు చేసుకుంటారు. వంటకు, నిద్రకూ అందులోనే సౌకర్యాలు ఉంటాయి. పిల్లలు కూడా వీరి వెంటే ఉంటూ, సమీప గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకుంటారు. - న్యూస్‌టుడే, కుక్కునూరు



వనవాసం



హన్మంతరావు

కుమురం భీం జిల్లా కెరమెరి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోని గ్రామం అది. పేరు వాల్‌బండ. ఆ గ్రామంలో 20ఏళ్లుగా ఒకే కుటుంబం నివాసం ఉంటోంది. రేషన్ తెచ్చుకోవాలన్నా పది కి.మీ. వెళ్లాలి. వేరే కుటుంబంతో మాట్లాడాలన్నా 4-5కి.మీ. వెళ్లాలి. అదీ ఓ కొండ ఎక్కి దిగాలి. ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు దూరంలోని గురుకుల హాస్టళ్లలో చదువుతున్నారు. ఇక మిగిలింది హన్మంతరావు, ఆయన భార్య, తల్లి. ఏడాది క్రితం హన్మంతరావు తండ్రి కోరెంగ గోవిందరావు మృతి చెందారు. తడకలతో ఇల్లు, పశువులకు పాక నిర్మించుకున్నారు. పశువులను పెంచుతూ, పత్తి, కంది సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతం కెరమెరి, సిర్పూర్(యు) మండలాల మధ్య ఉంటుంది. ఆ గ్రామాన్ని 'న్యూస్‌టుడే' ప్రతినిధి సందర్శించారు. 20 ఏళ్ల కిందట అక్కడ అయిదు కుటుంబాలు ఉండేవి. అప్పట్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో నాలుగు కుటుంబాలు గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లాయి. అప్పట్లో నిర్మించిన రహదారి ప్రస్తుతం బండరాళ్లు తేలి ఉంది. రెండు వీధి దీపాలు మాత్రం ఇప్పటికీ వెలుగుతున్నాయి. చిన్న బావి ఉంది. కోరెంగ గోవిందరావు బతికున్నప్పుడు మావోయిస్టు సానుభూతిపరుడని పేరుండేదని చెబుతారు. దశాబ్దం క్రితం కుమురంభీం ఆదర్శంతో జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గ్రామాల్లో ఈ ఊరూ ఉంది. దీంతో పోరు గ్రామంగా గుర్తింపు పొందిందని హన్మంతరావు తెలిపారు. - న్యూస్‌టుడే, కెరమెరి



హనుమకు పోలీసులదే ప్రథమ పూజ

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలు, హనుమాన్ జయంతి వేడుకల్లో తొలి పూజ పోలీసులే చేస్తుంటారు. గత 42 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా 1980లో అభయాంజనేయ స్వామి రాతి విగ్రహం ఉండేది. వర్షాకాలంలో విగ్రహం తడుస్తుండటంతో అప్పట్లో పోలీసులు కర్రలతో పందిరి ఏర్పాటు చేశారు. ఓ తుపాను సమయంలో పందిరి పడిపోవడంతో పోలీసులు, పట్టణ ప్రజల సహకారంతో నూతన ఆలయ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. మూడేళ్లకు నిర్మాణం పూర్తయింది. అప్పటి నుంచి ఏటా నిర్వహించే పర్వదినాలకు, ప్రత్యేక కార్యక్రమాలకు పోలీసులే పట్టువస్త్రాలు సమర్పించి మొదటి పూజ చేయడం విశేషం.

– న్యూస్‌టుడే, పోరుమామిళ్ల

కారు కొనాలా.. మణిమజ్రా వెళ్దామా..!

ఉత్తర భారతంలో సంగతి

ఉత్తర భారత దేశంలోనే అతి పెద్ద సెకండ్ హ్యాండ్ కార్ల సంత ప్రతి ఆదివారం చండీగఢ్‌లో జరుగుతోంది. ఇక్కడి మణిమజ్రా ప్రాంతంలో వందల కార్లు కొలువుదీరతాయి. ఇక్కడ కార్లు కొనుక్కోవడానికి పంజాబ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌ల నుంచి వేల మంది వస్తుంటారు. దాదాపు వేయి కార్లు సంతలో ప్రదర్శనకు పెడతారు. ఈ సంతలో అతి చిన్న కారు నుంచి లగ్జరీ కారు వరకూ అన్నీ దొరుకుతాయి. 2018 నుంచి ఈ సంత మణిమజ్రాలో కొనసాగుతోంది. అంతకుముందు సెక్టార్ 7లో ఈ సంత ఉండేది. ఇక్కడ ప్రతి వారం 30 నుంచి 40 కార్లు అమ్ముడవుతాయి. అంతకుముందు 100 దాకా అమ్ముడయ్యేవి. 1984లో నలుగురు కమీషన్ వ్యాపారులతో మొదలైన ఈ సంతలో ఇప్పుడు 80 మంది దాకా వ్యాపారులున్నారు. –ఈటీవీ భారత్


వీటిని విడనాడండి



✦ పశ్చాత్తాపం
✦ మిమ్మల్ని బాధపెట్టినవారిపై పగ
✦ ఇతరుల నుంచి ఆశించడం
✦ ఓటమి భయం
✦ గతంలో చేసిన తప్పుల గురించి ఆలోచించడం ✦ ప్రతికూల ఆలోచనలు
✦ స్వీయసందేహాలు
✦ విషపూరిత బంధాలు
✦ మీ నియంత్రణలో లేని విషయాలపై చింతించడం.

– సోఫియా నెల్సన్, కాలమిస్ట్

ఆ నలుగురు... ఎవరు



ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు కదా...అందుకే ఖాతాదారుల తదనంతరం బ్యాంకులో ఉన్న సొత్తుకు బాధ్యత తీసుకునేందుకు నామినీ పేరు తప్పనిసరి చేస్తూ రిజర్వుబ్యాంకు మార్గదర్శకాలు జారీచేసింది. నామినీలుగా నలుగురిని పెట్టుకునేందుకు అనుమతించింది.

- ఎన్నో ఏళ్ల క్రితం తెరిచిన ఖాతాలు, డిపాజిట్లు, లాకర్లకు నామినీ పేర్లు రాసి లేవని రిజర్వుబ్యాంకు పరిశీలనలో గుర్తించారు. ఇలాంటి ఖాతాదారులను వ్యక్తిగతంగా సంప్రదించి మరీ నామినీ పేరు రికార్డు చేయించడం ఆయా బ్యాంకుల బాధ్యతగా నిర్దేశించారు.
- చిన్నవయసులో ఉన్నవారు కూడా ప్రమాదాలు, విపత్తులు, వ్యాధులతో ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ నేపథ్యంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ తమ ఖాతాల్లో నామినీ పేరు నమోదు చేయించుకోవాలి.
- కొందరు తమ నామినీగా మైనర్ల పేర్లను బ్యాంకుల్లో రికార్డు చేయిస్తున్నారు. ఇక్కడ ఖాతాదారుడికి ఏదైనా జరిగితే అతని సొమ్మును, లాకర్లలో ఉన్న వస్తువులను మైనర్ తరఫున ఒక వ్యక్తికి అందజేస్తారు. ఇలా ఇచ్చే సమయంలో మరో ఇద్దరి సాక్ష్యాలను సేకరిస్తారు.
- ఖాతాదారుడు కన్నుమూస్తే ఆయన రికార్డుల్లో ఉన్న నామినీకి నిబంధనల ప్రకారం అన్నీ అప్పగించాలి. ఇలా ఇవ్వడానికి నామినీ గుర్తింపుకార్డు, వినియోగదారుడి మరణ ధ్రువీకరణ అధికారిక పత్రం, క్లెయిం దరఖాస్తు ఉంటే సరిపోతుంది. ఇవికాకుండా వారసత్వ ధ్రువీకరణ పత్రం, వీలునామా, ష్యూరిటీ బాండు వంటివి ఇవ్వమని నామినీలను బ్యాంకులు సతాయించకూడదు.



- కొందరు తమ బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లు, లాకర్లకు జాయింట్ ఎకౌంట్ తెరుస్తున్నారు. వీరిలో ఒకరు హఠాత్తుగా మరణిస్తే, రెండో ఖాతాదారుడికి ఖాతాలు కొనసాగించే హక్కు ఉంటుంది. రెండో ఖాతాదారుడు బతికి ఉండగానే సొత్తును నామినీలకు అప్పగించే అధికారం బ్యాంకులకు లేదు.
- నామినీలుగా నలుగురు ఉంటే... ఖాతాలోని సొమ్మును, డిపాజిట్లను, లాకర్లలోని వస్తువులను బ్యాంకు అందరికీ సమానంగా పంపిణీచేయాలి.

ఇష్టప్రకారమే మార్పు...

ఇటీవల 72 ఏళ్ల వృద్ధురాలి బ్యాంకు పొదుపు, డిపాజిట్లు, లాకర్ ఖాతాల్లో నామినీ పేరు మార్చాలని కుటుంబ సభ్యులు బ్యాంకుకు తీసుకువచ్చారు. తన గుండె ఆపరేషన్ వారం రోజుల్లో ఉందని, బలవంతంగా పేరు మార్పిస్తున్నారని ఆమె బ్యాంకు సిబ్బంది వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి సమయంలో బ్యాంకులు ఒత్తిళ్లను అంగీకరించవు. ఖాతాదారులు ఇష్టపూర్వకంగా రాసి ఇస్తేనే నామినీ పేర్లలో మార్పులు చేస్తారు.

పేరు చెప్పకుంటే...


కొందరు ఖాతాదారులు నామినీలను తిరస్కరిస్తున్నారు. అయితే సదరు వ్యక్తి 'నేను నామినీగా ఎవరి పేరు కూడా ఇవ్వడం లేదు. నామినీ పేరు రాయడం నాకు ఇష్టం లేదు' అని రాతపూర్వకంగా బ్యాంకుకు లేఖ రాసి ఇవ్వాల్సి ఉంటుంది..

బ్యాంకులకు బాధ్యతలున్నాయ్...

- నామినీల ప్రాధాన్యంపై వినియోగదారులకు బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించాలి. ఇలా చేసే సమయంలో 'సడన్‌గా మీరు మరణిస్తే' అని చెప్పి ఖాతాదారులను భయపెట్టకూడదు. సున్నితంగా అర్థమయ్యేలా వివరించాలి.
- నామినీ పేరు నమోదు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల సమాచారాన్ని పాసు పుస్తకాలు, చెక్ బుక్‌లపై ముద్రించి ప్రచారం చేయాలి.
- నామినీ పేరు నమోదు చేసినట్లుగా ఒక రశీదును ఖాతాదారులకు బ్యాంకు మూడు పని దినాల్లో ఇవ్వాలి.
- ఒకవేళ తొలుత నామినీ పేరు నమోదు చేసిన తరవాత కొంతకాలానికి ఆ పేరును వినియోగదారుడు రద్దుచేసుకుంటే దానికీ రశీదుఇవ్వాలి.
- ఒకవేళ నామినీ పేరు నమోదు చేయకున్నా, నిబంధనల ప్రకారం బ్యాంకు తిరస్కరించినా ఆ సమాచారాన్ని కూడా నోటీసు రూపంలో వినియోగదారులకు బ్యాంకు 3 పనిదినాల్లో తెలియజేయాలి.

- ఈనాడు, హైదరాబాద్

'కొమ్మలు' తిరిగిన బొప్పాయి



సాధారణంగా బొప్పాయి చెట్లు ఒకే కాండంతో నిటారుగా పెరుగుతాయి. కొన్నిచోట్ల ఒకటి లేదా రెండు, దేశవాళీ రకమైతే నాలుగైదు వరకు కొమ్మలు ఉండడం చూడొచ్చు. కానీ, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం తుమ్మికాపల్లి పంచాయతీ శివారు జనార్దన్‌నగర్‌కు చెందిన గుమ్మడి శ్రీనివాసరావు ఇంటి వద్ద పెరిగిన బొప్పాయి చెట్టు 20కి పైగా కొమ్మలతో విస్తరించింది. ప్రతి కొమ్మకూ కాయలు కాసింది.

–న్యూస్‌టుడే, కొత్తవలస



పురాతన నాణేలూ.. డిజిటల్‌గా

దేశంలోనే తొలిసారిగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని మ్యూజియంలో ఉన్న పురాతన నాణేల డిజిటలైజేషన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. మ్యూజియంలో దాదాపు 33,000 నాణేలున్నాయి. 3డీ డాక్యుమెంటేషన్ ద్వారా వాటిని డిజిటల్ రూపంలో భద్రపరచనున్నారు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఎప్పుడైనా వచ్చి వాటిని 360 డిగ్రీల కోణంలో పరిశీలించవచ్చు. ఈ ప్రక్రియలో వాటిని ఎవరూ కాపీ చేయకుండా భద్రతనూ కల్పించవచ్చు. –ఈటీవీ భారత్

ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌లకో యాప్

తక్కువ ఖర్చు.. ఎక్కువ మైలేజీ.. పైగా పర్యావరణహిత ప్రయాణం కావడంతో చాలా మంది ఎలక్ట్రిక్ వాహనా(ఈవీ)ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఈ వాహనదారుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. చాలా మందికి ఈ స్టేషన్లు ఎక్కడున్నాయో తెలియట్లేదు. ఈ క్రమంలో టీజీరెడ్కో(తెలంగాణ స్టేట్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) 'టీజీఈవీ' యాప్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా సమీపంలో ఛార్జింగ్ స్టేషన్ ఎక్కడ ఉందో గుర్తించొచ్చు. వాహన కనెక్టర్ టైప్ ఆధారంగా ఫిల్టర్ చేసి ఛార్జింగ్ స్టేషన్లను ఎంచుకోవచ్చు. ఇప్పటికే 16,000 మందికి పైగా యూజర్లు ఈ యాప్‌లో రిజిస్టర్ అయ్యారు. ఛార్జింగ్ పాయింట్ ఆపరేటర్లు, స్పెషల్ టారిఫ్‌ల వివరాలతోపాటు ఈవీల ధరలు, సబ్సిడీ వివరాలూ తెలుసుకోవచ్చు.

–ఈనాడు, హైదరాబాద్

గూడు కట్టి.. గొంగళిని తెచ్చి.. గుడ్లు పెట్టి!



కందిరీగ సంతానోత్పత్తికి ఎంత కష్టపడుతుందో ఈ చిత్రాలు దర్పణం పడుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో మట్టిని తీసుకొచ్చి.. కిటికీపై ఒద్దికగా గూడు కట్టింది. ఆకుపచ్చని గొంగళి పురుగుల్ని తీసుకొచ్చి గూట్లో పెట్టేందుకు అష్టకష్టాలు పడింది. చివరకు వాటిని గూట్లో పెట్టి, దానిపై గుడ్లు పెట్టి మూతవేసింది. దీనిపై పెదవేగి మండలం విజయరాయిలోని మొక్కజొన్న పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మోహనరావు మాట్లాడుతూ.. గుడ్ల నుంచి వెలువడే పిల్ల కందిరీగలు గొంగళి పురుగుల్ని ఆహారంగా స్వీకరిస్తాయన్నారు. పిల్లలు పెరిగి పెద్దయ్యాక వాటంతట అవే మూతను తొలగించుకొని బయటకొచ్చేస్తాయని చెప్పారు. వీటిని కుమ్మరి కందిరీగ అని కూడా పిలుస్తారన్నారు. ఏలూరులో కనిపించిన చిత్రాలివి. –ఈనాడు, ఏలూరు

పుష్కర్ వెళితే.. 'అమృత్ ఫల్' తెస్తారా..



రాజస్థాన్‌లోని పుష్కర్.. పవిత్ర సరస్సుకు, ఒంటెలకు ప్రసిద్ధి. ఇప్పుడు మరో విషయంలో తన ప్రాశస్త్యాన్ని చాటుతోంది. ఇక్కడి రైతులు భారీగా ఉసిరిని పండించి.. ప్రాసెస్ చేసి 'అమృత్ ఫల్' పేరుతో విక్రయించి లాభాలు గడిస్తున్నారు. వాటితో క్యాండీలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్, మెడిసినల్ పౌడర్ తయారు చేసి విక్రయిస్తున్నారు. రోజుకు 60 నుంచి 80 టన్నుల ఉత్పత్తులను పుష్కర్ నుంచి ఎగుమతి చేస్తున్నట్లు అంచనా. గత 20 ఏళ్లలో ఈ ప్రాంతంలో 20 దాకా ప్రాసెసింగ్ యూనిట్లు వచ్చాయి. ఉసిరిలో 8 రకాలుంటాయని, చకియా రకం నాణ్యమైందని ఇక్కడి రైతులు చెబుతున్నారు. –ఈటీవీ భారత్

3 మునకలు.. కొన్ని జాగ్రత్తలు



ప్రస్తుత కార్తికమాసంలో నదులు, ఆలయాలు కళకళలాడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదుల్లో స్నానాలకు వెళుతున్న భక్తుల సంఖ్య పెరిగింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉన్నందున నదీస్నానాలకు వెళ్లేవారి సంఖ్య బాగా పెరిగింది. ప్రయాణ, స్నానాలు చేసే సమయంలో భక్తజనం పలు జాగ్రత్తలు తీసుకోవాలి.

☛ శీతాకాలం ప్రారంభం కావడంతో ఉదయం పొగమంచు కురుస్తోంది. ఆ సమయంలో రహదారులు కనిపించవు. నదులు, ఆలయాలకు సొంత వాహనాల్లో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలి. తెల్లవారుజామున 4-5 గంటలలోపు ప్రయాణం చేయకుండా ఉండటమే మంచిది.

☛ నది తీరాల్లో కొన్నిచోట్ల ప్రవాహం అధికంగా ఉంటోంది. పిల్లలు, మహిళలు నదీ ఘాట్‌లలో ఉన్న ఇనుప రెయిలింగ్ పట్టుకుని స్నానాలు చేయాలి. కుటుంబసభ్యులు పిల్లలను విడిచిపెట్టకూడదు.

☛ వనభోజనాలకు వెళ్లేవారు సమీపంలోని చెరువులు, వాగులు, జలపాతాల వద్దకు వెళ్లి సరదాగా స్నానాలకు దిగే అవకాశం ఉంది. ఇలాంటిచోట్ల హెచ్చరిక బోర్డులు లేకపోయే అవకాశం ఉంది. కాబట్టి పిల్లలు, యువత తగు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

☛ నదుల్లో అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేయడంతో జలం కలుషితమై ఉంటుంది. కాబట్టి స్నానాలు చేసేవారు నీటిని మింగకుండా జాగ్రత్త పడాలని వైద్యులు చెబుతున్నారు. –ఈనాడు, హైదరాబాద్

రెండో విడతకు రంగం సిద్ధం



- బిహార్‌లో నేడే పోలింగ్
- ఓటేయనున్న 3.7 కోట్ల మంది ఓటర్లు
- తేలనున్న 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం





పట్నా: బిహార్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మంగళవారం జరగనుంది. 20 జిల్లాల్లోని 122 సీట్లలో 3,70,13,556 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1,95,44,041 మంది పురుషులు, 1,74,68,572 మంది మహిళలున్నారు. దాదాపు 4 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధులను నిర్వహించనున్నారు.


- మొత్తం ఓటర్లలో 30 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు 2.28 కోట్ల మంది ఉన్నారు.
- రెండో విడతలో 1,302 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో 1,165 మంది పురుషులు, 136 మంది మహిళలు. ఒక ట్రాన్స్‌జెండర్ పోటీలో ఉన్నారు.
- 45,399 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో 40,073 గ్రామీణ ప్రాంతాల్లో, 5,326 పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి.
- రెండో విడతలో కొత్త ఓటర్లు 5,28,954 మంది.
- సున్నిత ప్రాంతాల్లో ఓటింగ్ సమయాన్ని కుదించారు.
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.
- నేపాల్ సరిహద్దులను ఈ నెల 11వ తేదీ వరకూ మూసివేశారు.
- రెండో విడతలో అతి చిన్న నియోజకవర్గం బాగల్పుర్ (23.887 చదరపు కిలోమీటర్లు).
- అతి పెద్ద నియోజకవర్గం చాయిన్‌పుర్ (1,814.15 చదరపు కిలోమీటర్లు).
- అతి తక్కువ ఓటర్లున్న నియోజకవర్గం మఖ్దుంపుర్. ఇక్కడ 2,47,574 మంది ఓటర్లున్నారు.
- ఎక్కువ మంది ఓటర్లున్న నియోజకవర్గం హిసువా. ఇక్కడ 3,67,667 మంది ఓటర్లున్నారు.
- రెండో విడతలో 595 పోలింగ్ బూత్‌లలో అందరూ మహిళా అధికారులే బాధ్యతలు నిర్వహిస్తారు.
- 316 మోడల్ పోలింగ్ బూత్‌లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.
- సగటున ఒక్కో పోలింగ్ బూత్‌లో 815 మంది ఓటేస్తారు.
- 63,373 మంది ఇంటివద్దే ఓటేయనున్నారు.
- 100 ఏళ్లు దాటిన ఓటర్లు రెండో విడతలో 6,255 మంది ఉన్నారు.
- సాసారం, గయా పట్టణం, చాయిన్‌పుర్ నియోజకవర్గాల్లో అత్యధికంగా 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో ఉన్నారు.
- అతి తక్కువగా ఐదేసి మంది అభ్యర్థులు బరిలో ఉన్న నియోజకవర్గాలు.. లారియా, చాన్‌పటియా, రాక్సౌల్, సుగౌలి, త్రివేణిగంజ్, బాన్‌మంఖీ.

రెండో విడతలో ఏ పార్టీ ఎన్నిచోట్ల..

ఎన్డీయే
భాజపా: 53
జేడీయూ: 44
ఎల్జేపీ: 15
ఆర్‌ఎల్‌ఎం: 4
హెచ్ఏఎం: 6

మహాగఠ్‌బంధన్
ఆర్జేడీ: 71
కాంగ్రెస్: 37
వీఐపీ: 7
సీపీఐ: 4
సీపీఐ (ఎంఎల్): 6
సీపీఐ (ఎం): 1

జన్ సురాజ్ పార్టీ: 120



ఆలయ పుష్కరిణి వద్ద దీపాలు వెలిగించిన భక్తులు

శ్రీశైలానికి దీపోత్సవ శోభ



హారతి ఇస్తున్న అర్చకుడు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మూడో కార్తిక సోమవారం శ్రీశైలం మహాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కనులపండువగా జరిగింది. పుష్కరిణి వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు దశవిధ హారతులు సమర్పించారు. అనంతరం భక్తులు పుష్కరిణి మెట్లపై కార్తికదీపాలు వెలిగించారు. లక్ష దీపాల శోభతో ఆలయ పుష్కరిణి దేదీప్యమానంగా కాంతులీనింది.

దివికేగిన పల్లెపదం

- కవిరేడు అందెశ్రీ అస్తమయం
- ఘట్‌కేసర్‌లో నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: యువతను ఉర్రూతలూగించిన ఉద్యమ గొంతుక మూగబోయింది. పల్లె పదం విశ్రమించింది. "జయ జయహే తెలంగాణ.. జనని జయ కేతనం.." అంటూ తెలంగాణ రాష్ట్రానికి అధికారిక గీతం అందించిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) ఇకలేరు. బడుగుజీవుల వేదనాభరిత జీవిత గాథలను ఎలుగెత్తి చాటిన ఆయన గొంతు మూగబోయింది. సామాజిక దురాచారాలపై అక్షరాలను సంధించడానికి బడికెళ్లనవసరం లేదని చాటిచెప్పిన ఆయన.. ఆకస్మికంగా ఈ లోకాన్ని వదిలివెళ్లారు. హైదరాబాద్ లాలాగూడలో నివసిస్తున్న అందెశ్రీ మరణ వార్త సాహితీప్రియులను విషాదంలో నింపింది. ఆయన సోమవారం ఉదయం 6.20 గంటలకు బాత్రూం బయట కింద పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి.. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఉదయం 7.20 గంటలకు ఆసుపత్రికి చేరిన వెంటనే ఆయనను వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. గాంధీ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. అందెశ్రీ శరీరమంతా బిగుసుకుపోయి ఉందని, గుండెపోటుతో మరణించి ఉంటారని తెలిపారు.

అందెశ్రీ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరపాలని, సంబంధిత ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని సీఎస్ రామకృష్ణారావును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన మహానగరం నుంచి దూరంగా జరగాలనే నిర్ణయంతో అందెశ్రీ ఘట్‌కేసర్‌లోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో సొంతంగా ఇంటి నిర్మాణం చేపట్టారు. అది ఇంకా పూర్తికాలేదు. ఆయన కోరిక నెరవేరకుండానే శాశ్వత నిద్రలోకి వెళ్లారు. అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం ఘట్‌కేసర్‌లోనే అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రముఖులు పాల్గొననున్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఆదివారం ఆర్టీఐ కమిషనర్ బోర్డి అయోధ్యరెడ్డి స్వగృహంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజకు అందెశ్రీ హాజరయ్యారు. అదే ఆయన పాల్గొన్న చివరి కార్యక్రమమైంది.

కష్టాల సుడి దాటి.. సాహితీ శిఖరమై నిలిచి!

అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో... ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్న మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో 1961 జులై 18న జన్మించారు. ఆయనకు భార్య మల్లుబాయి, ముగ్గురు కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు ఉన్నారు. అందెశ్రీ ఒక అనాథగా పెరిగారు. చాలాకాలంపాటు పశువులు, గొర్రెల కాపరిగా పనిచేశారు. 'నాకు జన్మనిచ్చింది ఉమ్మడి వరంగల్ అయినా... అక్షర భిక్ష పెట్టింది మాత్రం ఇందూరు గడ్డ' అని పలుమార్లు వెల్లడించారు. 1978 ప్రాంతంలో బతుకుదెరువు కోసం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. ఆర్మూర్, నందిపేట్ మండలాల్లోని మచ్చర్ల, సిద్దాపూర్, వన్నెల్(కె), ఖుద్వాన్‌పూర్, నందిపేట్, లక్కంపల్లి, తల్వేద గ్రామాల్లో కల్వర్టుల నిర్మాణాలకు తాపీ పనులు చేశారు. అప్పట్లో మాక్లూర్ మండలం అమ్రాద్‌లో ఆశ్రమాన్ని నడిపిన శంకర్ మహరాజ్ దృష్టిలో పడ్డారు. ఆయనే ఎల్లయ్యకు అందెశ్రీగా నామకరణం చేశారు. ఉపనయనం చేసి... వేదాలు, ఉపనిషత్తుల సారాన్ని బోధించారు. పీడిత జన చైతన్యానికి అక్షరాన్నే ఆయుధంగా సంధించాలని ఉపదేశించారు. తాను రాసిన పాటలన్నీ కలిపి 'పాటల పూదోట'గా పుస్తకం రూపంలో వచ్చాక 'అందెశ్రీ' పేరు మారుమోగింది. ఆ తర్వాత 1995లో 'అందెల సందడి' పుస్తకాన్ని హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషాంధ్ర నిలయంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు.

◆ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా మహోన్నత పాత్ర పోషించిన అందెశ్రీ 'నిప్పులవాగు' పేరిట వెయ్యి పేజీలతో బృహత్ గ్రంథం తీసుకొచ్చారు.

◆ ప్రపంచంలోని ఏడు వింతలను చుట్టి వచ్చిన అందెశ్రీ... రష్యాలోని ఓల్గా నది నుంచి అమెజాన్ వరకు అన్ని జీవనదులను సందర్శించి దీర్ఘకవిత రాయాలనుకున్నారు. ఆ కల నెరవేరకుండానే కాలం చేశారు.

ఖమ్మం కోర్టులో 1,556 రోజులపాటు 'జయజయహే' గీతాలాపన

తెలంగాణ ఉద్యమ సమయంలో 'జయజయహే తెలంగాణ' గీతాన్ని ఖమ్మం జిల్లా కోర్టులో న్యాయవాదులు ఏకంగా 1,556 రోజులు ఆలపించారు. ఉదయం 10 గంటలకే కోర్టుకు చేరుకుని ఈ గీతం ఆలపించిన తర్వాతే విధులకు హాజరయ్యేవారు. అందెశ్రీ 2012లో ఖమ్మం కోర్టుకు రాగా... ఘనంగా సన్మానించారు.

ఎన్నెన్నో పురస్కారాలు

◆ ఎర్రసముద్రం చిత్రం కోసం రాసిన 'మాయమైపోతున్నడమ్మో' గీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల్లో తెలుగు పాఠ్యపుస్తకాల్లో ద్వితీయ సంవత్సరం పాఠ్యాంశంగా చేర్చారు.

◆ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినందుకు 2025 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఉత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందెశ్రీని రూ.కోటి నగదు పురస్కారంతో సత్కరించారు.

అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి: ప్రధాని మోదీ

"అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఆయన ప్రజల పోరాటాలు, ఆకాంక్షలు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. ఓం శాంతి."

సాహితీలోకానికి తీరని లోటు సీఎం చంద్రబాబు

ప్రముఖ కవి, రచయిత, తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన అందెశ్రీ మరణంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీలోకానికి ఇది తీరని లోటని ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు.

న్యాయసేవాధికార సంస్థ ఈసీగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



ఈనాడు, అమరావతి: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడి (ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్-ఈసీ)గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని ఈసీగా నామినేట్ చేయడం సంప్రదాయంగా వస్తోంది. హైకోర్టు సీజేను సంప్రదించిన తర్వాత ఈసీని గవర్నర్ నామినేట్ చేస్తారు.

సాంకేతిక సమస్య వల్లే 'మొంథా' మెసేజ్‌లు

విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి

ఈనాడు, అమరావతి: మొంథా తుపానుపై అక్టోబరు 28 నుంచి 30వ తేదీ మధ్య జారీ చేసిన హెచ్చరిక మెసేజ్‌లే ఈ నెల 9న ప్రజల ఫోన్లకు వెళ్లాయని, ఎయిర్‌టెల్ వినియోగదారులకు మాత్రమే అవి చేరాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వర్ లోపంతో ఈ సాంకేతిక సమస్య తలెత్తిందని, తాజాగా ఎలాంటి హెచ్చరికలూ ఇవ్వలేదని వివరించారు. 'మొంథాతో భారీ వర్షాలంటూ భయపెట్టిన మెసేజ్‌లు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. విషయం తెలిసిన తర్వాత టెలికం అధికారులకు సమాచారం అందించి వివరణ కోరామని పేర్కొన్నారు.

పట్టించుకుంటేనే రాష్ట్రోత్సవ 'ప్రభ'!

- జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని కోనసీమ వాసుల ఆకాంక్ష



కోనసీమ జిల్లాలోని జగ్గన్నతోట ప్రభల తీర్థం (పాత చిత్రం)



చంద్రబాబుకు జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతపై నివేదిక అందజేస్తున్న తేజశ్వి

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఏటా కనుమ పండగ రోజున జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్రోత్సవంగా గుర్తించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ ఉత్సవానికి దాదాపు 450 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. భారతదేశం మొత్తమ్మీద ఏకాదశరుద్రులు కొలువైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించే ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా గుర్తిస్తే ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాలని, 2026 జనవరి నుంచి అమలు కావాలని ఎదురు చూస్తున్నారు.

సానుకూలంగా సీఎం చంద్రబాబు..

17వ శతాబ్దం నుంచి కొనసాగుతున్న జగ్గన్నతోట ప్రభల తీర్థానికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. దీన్ని తిలకించడానికి దేశ, విదేశాల నుంచి ఏటా లక్షల మంది భక్తులు వస్తుంటారు. సమాచార, ప్రచార మాధ్యమాల్లోనూ విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజశ్వి పొడపాటి ఈ ఏడాది ఫిబ్రవరి 13న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని కోరారు. గతనెల 16న మళ్లీ కలిసి చర్చించారు. తాజాగా సోమవారం మరోసారి చర్చించి తీర్థం విశిష్టతపై సవివర నివేదిక అందజేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని తేజశ్వి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

చరిత్ర ఎంతో ఘనం

◆ నాలుగు శతాబ్దాలకుపైగా చరిత్ర ఉన్న జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతను అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు రాసిన లేఖల ద్వారా తెలుసుకున్న ప్రధాని నరేంద్రమోదీ 2020లో దీని గురించి తన సందేశాన్ని ప్రత్యేకంగా పంపారు.

◆ 2021లో శృంగేరి పీఠాధిపతి నుంచి లేఖ అందింది. ◆ 2023లో దిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో శకటాన్ని ప్రదర్శించారు.

◆ 2024లో కంచి కామకోటి పీఠాధిపతి ఈ ఉత్సవంపై సందేశాన్ని పంపించారు.

◆ 2025లో పర్యాటకశాఖ ఈవెంట్స్ అండ్ ఫెస్టివల్ వెబ్‌సైట్‌లో చోటు దక్కించుకుంది.

◆ 2025లో పదో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో తీర్థం ప్రాధాన్యం, ప్రాచుర్యం వివరిస్తూ పాఠాన్ని పొందుపరిచారు.

'అగ్రహార'లో ఖైదీల రాజభోగం!

- వైరల్ వీడియోలపై కర్ణాటక హోంమంత్రి ఆగ్రహం

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యంతోనే బెంగళూరు కేంద్ర కారాగారం- 'పరప్పన అగ్రహార'లోకి సెల్‌ఫోన్లు, మద్యం, మాదక ద్రవ్యాలు వెళుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయమై హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు జైలులో సోదాలు విస్మరించారని సోమవారమిక్కడ ఆయన మండిపడ్డారు. ఖైదీలు తమ ఫోన్‌లలో చిత్రీకరించుకున్న పార్టీల వీడియోలు బయటకు రావాలంటే జామర్లను నిలిపివేయాల్సి ఉంటుందని, జామర్లను నిలిపివేయాలంటే అక్కడి సిబ్బంది సహకారం లేకుండా జరగని పేర్కొన్నారు. డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్, పోలీసు ఉన్నతాధికారులతో హోంమంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. ఖైదీల విందులు, విలాసాలపై వైరల్ అవుతున్న వీడియోలు, ఫొటోలను అధికారులకు చూపిస్తూ ఇందుకు ఎవరిని బాధ్యులను చేయాలని ప్రశ్నించారు. ఈ వీడియోలను నటుడు దర్శన్ ఆప్తుడు ధన్వీర్ వైరల్ చేసినట్లు అనుమానిస్తున్నామని, అతన్ని అదుపులోకి తీసుకుని సీసీబీ పోలీసులు విచారిస్తున్నారని డీజీపీ సలీం వివరణ ఇచ్చారు. ఐదు వేల మంది ఖైదీల నియంత్రణ, నిర్వహణకు ప్రత్యేకంగా కమాండ్ సెంటర్ ప్రారంభిస్తామని ఈ సందర్భంగా పరమేశ్వర్ తెలిపారు. పరప్పన అగ్రహార జైలులోని పరిస్థితులను చక్కదిద్దేందుకు ఏడీజీపీ, ఐజీపీలతో ప్రత్యేక కమిటీని ఆయన ఏర్పాటు చేశారు. మరోవైపు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరోపణలపై కారాగారం అధికారులు మ్యాగేరి, అశోక్ భజంత్రిలను సస్పెండ్ చేయడంతోపాటు ప్రధాన జైలర్ కె.సురేశ్‌ను బదిలీ చేస్తూ హోంశాఖ ఆదేశాలిచ్చింది.

◆ మరోపక్క ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి కుమారస్వామి వ్యంగ్యంగా స్పందించారు. అగ్రహార కారాగారంలోని ఉగ్రవాదుల కన్నా, విధానసౌధలోనే వారిని మించిన కరడుగట్టిన నేరగాళ్లు ఉన్నారని దుయ్యబట్టారు.



మీ ఆయన మేము కొడితే కాదమ్మా.. అతనే ఫుల్లుగా మందు కొట్టి పడిపోయాడు.





ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు

విజయవాడ రైల్వే పోలీసుల అదుపులో మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా

మొబైళ్ల దొంగతనం ముసుగులో మహా మోసం

- బాధితుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడమే అసలు లక్ష్యం
- నేరగాళ్ల ముఠాను అరెస్టు చేసిన విజయవాడ పోలీసులు

ఈనాడు, అమరావతి: రైళ్లల్లో ప్రయాణికుల నుంచి మొబైల్ ఫోన్లు కొట్టేస్తారు. ఆ తర్వాత వాటిని స్విచాఫ్ చేయకుండా అలాగే ఉంచుతారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితుడు ఆ నంబరుకు కాల్ చేస్తే.. తమను జీఆర్పీ, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా, అధికారిగా పరిచయం చేసుకుంటారు. "మీ ఫోన్ కొట్టేసిన దొంగను మేం పట్టుకున్నాం. అతని దగ్గర నుంచి ఈ మొబైల్ స్వాధీనం చేసుకున్నాం. జీఆర్పీ, ఆర్పీఎఫ్ స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లండి. అయితే మొబైల్ మీదేనని నిర్ధారించుకునేందుకు మీ లాక్‌కోడ్, ఆధార్ వివరాలివ్వండి" అని నమ్మిస్తారు. అవతలి వైపు నుంచి బాధితుడు ఆ వివరాలు చెప్పిన వెంటనే ఫోన్ లాక్ ఓపెన్ చేస్తారు. ఆయా ఫోన్లలో బాధితులు సేవ్ చేసుకున్న ఆధార్ కార్డులను వేరే ఫోన్‌తో ఫొటోలు తీస్తారు. లాగిన్ క్రెడెన్షియల్స్‌కు సంబంధించిన పిన్ నంబర్లు వంటివి అందులో సేవ్ చేసుకుని ఉంటే వెంటనే తస్కరిస్తారు. ఆ తర్వాత ఆ ఫోన్ నుంచి సిమ్ తీసేసి.. మరో ఫోన్‌లో వేసుకుని గూగుల్ పే, ఫోన్ పే యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకుని కొత్త లాగిన్ పాస్‌వర్డ్ సృష్టిస్తారు. క్షణాల్లో ఆయా ఖాతాలన్నీ ఖాళీ చేసేస్తారు. ఇలా పదుల సంఖ్యలో నేరాలకు పాల్పడి రూ.లక్షల్లో దోచుకున్న ఓ ముఠాను విజయవాడ రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9 లక్షల విలువైన 45 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పైకి కనిపించేది మొబైళ్ల దొంగతనం.. కానీ వాటిని అడ్డం పెట్టుకుని బాధితుల బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయటమే ఈ ముఠా నేర విధానం. విజయవాడ నవజీవన్ బాల భవన్‌లో నివసించే బంగారు రాంబాబు ఈ ముఠా నాయకుడు కాగా.. విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన వంకూరి ప్రకాశ్, కంసాలిపేట వాసి బురదగంటి నవీన్ క్రాంతి సభ్యులు. వీరి ముగ్గురినీ అరెస్టు చేసినట్లు విజయవాడ రైల్వే సీఐ జేవీ రమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్లు పోతే వెంటనే సిమ్ బ్లాక్ చేసుకోవాలని, అపరిచిత వ్యక్తులు.. ఫోన్ల లాగిన్ కోడ్, పాస్‌వర్డ్‌లు వంటివి అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వొద్దని రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు సూచించారు. ఈ ముఠా రాష్ట్రవ్యాప్తంగా ఇంకా ఎక్కడెక్కడ నేరాలకు పాల్పడిందో విచారిస్తున్నామని తెలిపారు.

పాల్.. మీరు చాలా స్మార్ట్

వైద్య కళాశాలల అంశంలో కేఏ పాల్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలలను పీపీపీ కింద అప్పగించడాన్ని సవాలు చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆర్టికల్ 32 కింద దాఖలుచేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిపై హైకోర్టుకు వెళ్లకుండా నేరుగా సుప్రీంకోర్టుకు రావడాన్ని తప్పుబట్టింది. దీన్ని సుప్రీంకోర్టు పరిధిలోకి వచ్చే అంశంగా చెప్పడానికి ఏపీతో పాటు మరికొన్ని రాష్ట్రాలను ప్రతివాదులుగా చేర్చడాన్ని వ్యతిరేకించింది. 'మీరు చాలా స్మార్ట్.. అందుకే కారణాలేవీ లేకుండానే చాలా రాష్ట్రాలను ప్రతివాదుల జాబితాలో చేర్చారు' అని సోమవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కలిసి విచారించిన సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. 'కొన్నిసార్లు సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అధికారాలు హైకోర్టుకే ఉంటాయి. కొన్ని విషయాల్లో ఆర్టికల్ 226 విస్తృతి ఆర్టికల్ 32 కంటే ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో హైకోర్టుకు వెళ్లకుండా నేరుగా సుప్రీంకోర్టుకు రావడం వెనుక కారణమేంటి?' అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టుకే పరిధి ఉందని కేఏ పాల్ పేర్కొనగా, "ఈ విషయంలో తమకు పరిధి లేదని హైకోర్టును చెప్పనివ్వండి. తర్వాత మా ముందుకు రండి" అని సూచించారు. మీకు పేరు రావడానికి ఇలాంటి విలాసవంతమైన కేసులకు సుప్రీంకోర్టు అయితేనే బాగుంటుందని అనుకున్నట్లున్నారని వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్‌లో పేర్కొన్న అంశాలు ఆంధ్రప్రదేశ్‌వేనని, అయితే ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేయడాన్ని సమర్థించుకోవడానికి పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా ఇతర రాష్ట్రాలనూ ప్రతివాదులుగా చేర్చారని, ఇందులో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ విచారణ ముగిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.

చెరుకూరి (గ్రూపు) వ్యవస్థాపక ఛైర్మన్ రామారావు హఠాన్మరణం



చెరుకూరి రామారావు

హైదరాబాద్, న్యూస్‌టుడే: చెరుకూరి (గ్రూపు) సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ చెరుకూరి రామారావు (77) సోమవారం ఉదయం హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. అకస్మాత్తుగా పడిపోయిన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తొలుత బ్యాంక్‌లో ఉద్యోగిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఆయన.. 1994లో తన వ్యాపార సంస్థను వనస్థలిపురంలో స్థాపించారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన వివిధ సంస్థలను ఏర్పాటు చేశారు. ఆయన సాయిదేశం, గాంధీ మార్గం స్వచ్ఛంద సంస్థలను నెలకొల్పారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో గాంధీ, వివేకానందుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ప్రసాద్, గోపీనాథ్ ఉన్నారు. బాటసింగారం సమీపంలోని పీర్లగూడ వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈడ్చుకెళ్లారు.. చంపేశారు!

- నా తల్లి విషయంలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది క్రూరత్వం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



ఆసుపత్రిలో నేలపై లాక్కెళుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన చిత్రం



ఆదెమ్మ కుమార్తె రోజా

ఈనాడు-నెల్లూరు, నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యం కోసం వెళితే తమ తల్లిని నేలపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి బెడ్‌పై పడేశారని నెల్లూరు స్టోన్ హౌస్‌పేటకు చెందిన మేడా రోజా జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తల్లిని నేలపై ఈడ్చుకుంటూ వెళుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వీడియోలు, ఫొటోలను ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ '80 ఏళ్ల వృద్ధురాలైన నా తల్లి పాకం ఆదెమ్మ అనారోగ్యంతో ఉండగా వైద్యం కోసం సెప్టెంబరు 15న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించాం. అత్యవసర వార్డులో నేలపైనే పడుకోబెట్టారు. తర్వాత నేలపై నుంచి ఈడ్చుకుని వెళ్లి పక్కనే ఉన్న బెడ్‌పై పడేసి, సరైన వైద్యం అందించకపోవడంతో 20వ తేదీ చనిపోయిందని ముసుగు కప్పేశారు. నేను చూడగా ఆమె ప్రాణాలతోనే ఉంది. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రాక్షసంగా ప్రవర్తించారు. మా అమ్మ బతికే ఉందని చెప్పడంతో మళ్లీ ఐసీయూకి తీసుకెళ్లి తిరిగి అరగంట తర్వాత మృతిచెందినట్లు తెలియజేశారు. ఎవరో ఫేస్‌బుక్‌లో వీడియోను అప్‌లోడ్ చేయగా చూసి ఎస్పీకి దీనిపై ఫిర్యాదు చేశా. అధికారులు స్పందించి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి' అని కోరారు.


విశాఖ భాగస్వామ్య సదస్సులో.. 37 ప్లీనరీ సెషన్లు

ఈనాడు-అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో చర్చించే అంశాలను ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో 37 ప్లీనరీ సెషన్లు.. 5 కంట్రీ సెషన్లు నిర్వహించనుంది. వివిధ దేశాల ప్రతినిధులు, పలు ప్రముఖ కంపెనీల సీఎక్స్‌వోలు, ఆర్థిక నిపుణులు అందులో పాల్గొననున్నారు. వివిధ దేశాల్లో వాణిజ్యానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. వివిధ విభాగాలకు సంబంధించి 410 ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకోనుంది. వాటి ద్వారా సుమారు రూ.9.76 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని అంచనా.

పూర్తి వివరాలు https://epaper.eenadu.net లో

EENADU Vol: 52, Issue: 91 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

నవంబరు 14న ప్రపంచ మధుమేహ దినం



డా॥ ఎ.అశ్వినీకుమార్
ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ (రిటైర్డ్)
ఆశ్రం మెడికల్ కాలేజ్
ఏలూరు

షుగర్, మధుమేహం, డయాబిటీస్.. ఏ పేరుతో పిలుచుకున్నా ఇదో దీర్ఘకాల సమస్య. ఒకసారి వచ్చిందంటే పూర్తిగా నయం కాదు. నియంత్రణలో ఉంచుకోవటం తప్పించి, చేయగలిగిందేమీ లేదు. ఇది అదుపులో లేకపోతే గుండెజబ్బులు, పక్షవాతం, మానని పుండ్లు.. వేళ్లు, పాదాలు, కాళ్లు తీసేయాల్సిన రావటం.. చూపు పోవటం, కిడ్నీలు దెబ్బతినటం వంటి దుష్ప్రభావాలు సంభవిస్తాయి. మరణం ముప్పూ పెరుగుతుంది. కాబట్టే మధుమేహం మీద సరైన అవగాహన కలిగుండటం అతి ముఖ్యం. కానీ మనదగ్గర దీనిపై అనేక అపోహలు, అనుమానాలు రాజ్యమేలుతున్నాయి. దీంతో చాలామంది సక్రమమైన చికిత్స చేయించుకోవటం లేదు. ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా అపోహలు, అనుమానాలను తొలగించుకోవటం మనందరి విధి.



● కాఫీ, టీలో అసలు చక్కెర వేసుకోకూడదా?

- ఇది అందరూ సామాన్యంగా అనుకునేది, ఆచరించేది. నిజానికి రోజుకు ఒకట్రెండు కప్పుల కాఫీ, టీ తాగేవారికిది పెద్ద ఇబ్బంది కలిగించదు. ఒక చిన్న చెంచా చక్కెరను కప్పు కాఫీలో వేసుకుంటే రక్తంలో అంత ఎక్కువగా గ్లూకోజేమీ పెరగదు. ప్రమాదభరితమూ కాదు. అయితే రోజుకి 10 కప్పులు, అంతకన్నా ఎక్కువగా కాఫీ, టీ తాగేవారికి మాత్రం మంచిది కాదని తెలుసుకోవాలి.

అవగాహనే ఆయుధం

● **అసలు మధుమేహం నాకెందుకు వస్తుంది? చక్కగా తిని తిరుగుతున్నాను. మా ఇంట్లో ఎవరికీ లేదు అని చాలామంది భావిస్తుంటారు.**

- మధుమేహం ఎవరికైనా రావొచ్చు. చిన్నా పెద్దా, ఆడా మగా తేడా లేదు. వయసులో ఉన్నవారికీ వృద్ధులకూ ఎవరికైనా రావొచ్చు. కొందరిలో వంశపారంపర్యంగానూ వస్తుంది. కొన్ని కుటుంబాల్లో మొదటిసారి కనిపించొచ్చు. ఈరోజుల్లో అంతా రక్తపరీక్ష చేసుకొని, షుగర్ ఉందో లేదో తెలుసుకుంటున్నారు. మరి మన తాత, ముత్తాతల్లో ఎవరికైనా ఉందో లేదో ఎవరికైనా తెలుసా? కాబట్టి మా వంశంలో ఎవరికీ షుగర్ జబ్బు లేదు అన్నది ఎంతవరకు కరెక్ట్. దీని గురించి ఆలోచించాలి. కాబట్టి అందరమూ తప్పకుండా రక్త పరీక్ష చేసుకొని, మధుమేహం ఉందో లేదో తెలుసుకోవాలి.

● **నాకు షుగర్ ఏంటి? నేను నమ్మను. దెబ్బతగిలితే మందు వేసుకోకుండా ఇట్టే మానిపోతుంది. నాకు అతి ఆకలి, అతి దాహం లేవు. అంతెందుకు రాత్రి ఒక్కసారి కూడా మూత్ర విసర్జనకు లేవను. పగలు కూడా మామూలుగానే మూత్రం పోస్తాను. అని చాలామంది చెబుతుంటారు.**

- మధుమేహం అనగానే అందరికీ గుర్తుకొచ్చేది ఆకలి, దాహం ఎక్కువగా వేయటం. మూత్రం అతిగా రావటం. అలాగే దెబ్బలు ఎంతకీ మానకపోవటం, చీము పట్టటం. ఇవేవీ లేవు కాబట్టి నాకు షుగర్ వ్యాధి ఏంటని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. ఇలాంటి లక్షణాలు అందరిలో ఉండనవసరం లేదు. ఇవి ఉంటే మధుమేహం ఉందేమోనని అనుమానించి, తప్పక పరీక్షలు చేయించాలి. ఈ లక్షణాలు లేనంత మాత్రాన జబ్బు ఉండదని అనుకోకూడదు కూడా. పరీక్షలు చేసుకొని షుగర్ వ్యాధి ఉందో లేదో నిర్ణయించుకోవాలి.

● **లావుగా ఉన్నవారికే మధుమేహం వస్తుంది. సన్నగా ఉన్నవారికి రాదు. వచ్చినా పెద్ద ఇబ్బంది ఉండదనేది కొందరి అభిప్రాయం.**

- ఇది నిజం కాదు. లావుగా ఉన్నవారిలో మధుమేహం ఎక్కువన్నది నిజమే. ఊబకాయుల్లో 30-40 % మందికి షుగర్ వ్యాధి ఉంటోంది. అలాగని సన్నగా ఉంటే రాదని, వస్తే ఇబ్బంది ఉండదని అనుకోవద్దు. ఎవరికి మధుమేహం వచ్చినా సక్రమంగా చికిత్స తీసుకోకపోతే సమస్యలు తప్పవని తెలుసుకోవాలి.

● **మా అబ్బాయికి ఆరేళ్లు. వాడికి మధుమేహం ఉందని డాక్టర్ చెప్పారు. చిన్నపిల్లలకు షుగర్ వ్యాధి ఏంటండీ? మేం నమ్మలేకుండా ఉన్నాం.**

- ఇది చాలామంది తల్లిదండ్రులు అనే మాట. నిజమే, పిల్లవాడికి మధుమేహం అంటే ఎవరికైనా నమ్మబుద్ధి కాదు. మధుమేహంలో రెండు రకాలు. ఒకటి- చిన్నవయసులో వచ్చేది. దీన్ని ఐడీడీఎం అంటారు. వీరికి ఇన్సులిన్ తీసుకోవటం తప్పనిసరి. లేకపోతే మధుమేహంతో ముడిపడిన సమస్యలు ఎక్కువగా వస్తాయి. ముఖ్యంగా డయాబెటిక్ కోమా చాలా ప్రమాదకరమైంది. ఇది ప్రాణాంతకం కూడా. రెండోది- పెద్దవారిలో వచ్చేది. వీరికి ఆహార నియమాలు, మాత్రలు పనిచేస్తాయి. కాబట్టి చిన్న పిల్లల్లోనూ మధుమేహం రావొచ్చని గుర్తించాలి.

● **మందులు లేకుండా నడక, ఆహార నియమాలతో మధుమేహన్ని నియంత్రించొచ్చు. పూర్తిగా నయం చేయొచ్చు కూడా అని కొందరు అంటుంటారు.**

- ఇది పెద్ద అపోహ. మధుమేహం జీవితాంతం ఉండే జబ్బు. ఆహార నియమాలు, నడక, ఇతర వ్యాయామాలతో రక్తంలో గ్లూకోజును అదుపులోకి రావొచ్చు. కొంతకాలం నియంత్రణలో ఉండొచ్చు. కానీ ఎల్లకాలమూ అలా ఉండదు. కొద్దికాలం తర్వాత తప్పకుండా మందులు వాడాల్సి వస్తుంది. మధుమేహం పూర్తిగా నయం కావడటమనేది ఈరోజు దాకా లేదు. దీన్ని అదుపులో ఉంచగల మందులున్నాయి గానీ పూర్తిగా నయం చేసేవి లేవు.

● **మధుమేహం గలవారికి దాంపత్య జీవితంలో లైంగిక సమస్యలు ఎదురవుతాయి. సంతానం కలగదనేది కొందరి భావన.**

- ఇది పెద్ద అపోహ. చాలామందిని మానసికంగా వేధిస్తున్న సమస్య. మధుమేహం ఉందనగానే ఒక విధమైన భయం. ఎవరితోనైనా చెప్పుకోవటానికి సిగ్గు. డాక్టర్‌తో చెప్పాలంటే మొహమాటం. ఏమంటారో అని తెగ ఆందోళనతో సతమతమవుతుంటారు. నిజానికి మధుమేహం ఉన్నా కూడా అందరిలాగే సంసార జీవితం గడపొచ్చు. మధుమేహం మూలంగా సంతానం కలిగే అవకాశాలు తగ్గి, అంగవైకల్యం గలవారు పుడతారన్నది నిజం కాదు. అన్నింటికన్నా ముఖ్య విషయం ఏంటంటే- గ్లూకోజును అదుపులో ఉంచుకోవటం. దీర్ఘకాలంగా రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉంటుంటే మగవారిలో అంగస్తంభన లోపం, ఆడవారిలో జననాంగ సమస్యలు రావొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం. గర్భధారణ సమయంలో ఆడవారు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

● **మధుమేహం ఉన్నా కూడా అన్నీ తింటున్నా. మందులు వేసుకోకపోయినా నాకు ఎలాంటి బాధలు లేవు. ఎందుకీ నియంత్రణలు, నియమాలు?**

- ఇలాంటి అభిప్రాయం సరికాదు. మధుమేహం అదుపులో లేకపోతే ఈరోజు కాకపోతే రేపైనా తీవ్ర పరిణామాలు తెచ్చి పెడుతుంది. ఏమీకాదులే అన్నది నిజం కాదు. అపోహ మాత్రమే.

అపోహలు

అనుమానాలు

● **పండ్లు తినకూడదా? తింటే ఏం పండ్లు తినొచ్చు.**

- పండ్లు శరీర ఆరోగ్యానికి ముఖ్యం. అయితే మధుమేహం గలవారు తీపి ఎక్కువగా ఉన్న పండ్ల విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి. యాపిల్, బత్తాయి, మామిడి, సపోటా, అరటి, జామ, ద్రాక్ష పండ్లలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. వీటితో రక్తంలో గ్లూకోజు శాతం పెరుగుతుంది. మధుమేహం నియంత్రణ తప్పుతుంది. అలాగని మొత్తంగా మానేయాల్సిన పనిలేదు. మితంగా తప్పకుండా తినొచ్చు. పుచ్చకాయ, కర్బూజాలో చక్కెర శాతం తక్కువ. వీటిని ఎక్కువగా తినొచ్చు. పచ్చిగా ఉన్న జామకాయ కూడా తినొచ్చు. ఏదేమైనా గ్లూకోజును అదుపులో ఉంచుకొని, ఏ పండు అయినా అందరిలాగే తినొచ్చు. ఏదేమైనా మితంగా తినాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

● **మాంసాహారులు ఏ మాంసం తినొచ్చు?**

- మాంసం ఎలాంటిదైనా వండేటప్పుడు నూనె ఎక్కువగా వాడతారు. దీంతో శరీరంలో కొవ్వు శాతం పెరుగుతుంది. కాబట్టి మాంసాహారం చాలా తక్కువసార్లు.. అదీ మితంగా తినటం మంచిది.

● **మిఠాయిలు ఎలాగూ వద్దంటారు. పోనీ కారం పదార్థాలు, కారప్పూస, కారం బూంది, చేగోడీలు, మిక్చర్, పకోడీలు, సమోసాల వంటివైనా తినొచ్చు కదా.**

- వీటన్నింటినీ నూనెతోనే చేస్తారు కాబట్టి ఒంట్లో కొవ్వు మోతాదు పెరుగుతుంది. అందువల్ల వీటి విషయంలో మితం ముఖ్యం.

● **ఇటీవల డైట్ కంట్రోల్ డ్రింక్స్, డయాబిటిస్ స్వీట్స్ అని వస్తున్నాయి. ఇవి తీసుకోవచ్చా?**

- అవి అంత మంచివి కావు. వీటిల్లో తీపి కోసం వాడేవి ఆరోగ్యానికి హానికరం. అలాగే అన్ని మిఠాయిలు మాదిరిగానే వీటినీ నూనె, నెయ్యితో చేస్తారు. ఇవి తింటే ఒంట్లో కొవ్వు శాతం పెరుగుతుంది.

● **షుగర్ మందులు చాలాకాలం వాడితే దుష్ప్రభావాలు రావా? అవి ప్రమాదకరం కాదా?**

- మెట్‌ఫార్మిన్ మందు ఒంట్లో కొవ్వును తగ్గిస్తుంది. ఇన్సులిన్‌తో బరువు పెరగొచ్చు. ఈ మందులతో ఒనగూరే ప్రయోజనాలతో పోలిస్తే ఇలాంటి దుష్ప్రభావాలు అంత ప్రమాదభరితాలు కావు.

● **ఇన్సులిన్ ఒకసారి వాడితే జీవితకాలం వాడాలా? తప్పదా?**

- చిన్నవయసులో వచ్చే మధుమేహానికి తప్ప మిగతావారిలో అవసరమున్నప్పుడు.. అంటే గ్లూకోజు నియంత్రణలో లేనప్పుడు, మధుమేహ సంబంధ సమస్యలు తలెత్తినప్పుడు ఇన్సులిన్ వాడాల్సి వస్తుంది. అలాగే శస్త్రచికిత్సలకు ముందు, తర్వాత అన్నీ బాగుంటే మాత్రలే వాడుకోవచ్చు. వీటి విషయంలో డాక్టర్ల నిర్ణయమే ముఖ్యం.

● **షుగర్ వ్యాధి వచ్చిందనగానే ఇంట్లో వాళ్లు, బయటివాళ్లు వరి అన్నం మానేసి గోధుమ అన్నం, పుల్కాలు, రొట్టెలు లేదా జొన్న అన్నం తినమంటారు. అవి అంత మంచివా?**

- గోధుమలు, జొన్నల్లోనూ దాదాపు బియ్యంతో సమానంగానే చక్కెర ఉంటుంది. వరి అన్నం మార్చేసి గోధుమ, జొన్న అన్నం తింటే పెద్ద లాభమేమీ లేదు. కానీ చిన్నప్పటి నుంచి అలవాటు అయినందున వరి అన్నం రెండు ముద్దలు ఎక్కువ తింటాం. అలవాటు లేని గోధుమ అన్నం, జొన్న అన్నం కాస్త తక్కువ తింటాం. అంతకన్నా ప్రయోజనమేమీ ఉండదు.

● **మాటిమాటికీ రక్త పరీక్ష అవసరమా? మూత్ర పరీక్ష సరిపోదా?**

- రక్తంలో గ్లూకోజు 180 ఎంజీ దాటితే గానీ మూత్రంలో అది కనిపించదు. రక్తంలో 200 ఎంజీ ఉన్నా మూత్రంలో అంత ఎక్కువగా కనిపించదు. కాబట్టి మందు పనితీరు, గ్లూకోజు నియంత్రణలో ఉంటోందా? లేదా? తెలుసుకోవటానికి, మందు మోతాదు మార్చటానికి రక్తంలో గ్లూకోజు పరీక్ష అవసరం. కాబట్టి డాక్టర్లు రక్త పరీక్ష అవసరమని చెబితే తాత్సారం చేయొద్దు.

● **వ్యాయామం చేయటం కుదరని రోజున మానేసి, వీలున్న నాడు ఎక్కువగా చేయొచ్చా? వ్యాయామం సాయంత్రం చేయకూడదా?**

- వ్యాయాయం పద్ధతిగా చేయాలి. రెండు, మూడు రోజులు చేయలేదని ఒకేరోజు ఎక్కువగా చేస్తే తీవ్ర అలసట రావొచ్చు. రక్తంలో గ్లూకోజు బాగా తగ్గిపోవచ్చు. అందువల్ల క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయాలి. ఉదయం వీలు కాకపోతే సాయంత్రమైనా చేయొచ్చు.

● **జీవితాంతం మందులు వేసుకోవాల్సిందేనా?**

- చాలామందికి వచ్చే సందేహం ఇది. అసలు సంగతి ఏంటంటే- జీవితాంతమని కాదు, జీవితం అంతం కాకుండా ఉండటానికి మందులు అవసరం. మందులు సక్రమంగా వేసుకుంటే గ్లూకోజు అదుపులో ఉంటుంది. దుష్ప్రభావాలు రావటం తగ్గుతుంది. ఫలితంగా జీవనకాలమూ పెరుగుతుంది.

వారికి వ్యాయామ దన్ను



రొమ్ముక్యాన్సర్ బాగా ముదిరిన మహిళలకు వ్యాయామం ఎంతో మేలు చేస్తున్నట్టు.. చికిత్సలను, క్యాన్సర్ దుష్ప్రభావాలను తట్టుకోవటానికిది తోడ్పడుతున్నట్టు నెదర్లాండ్స్‌లో చేపట్టిన తాజా ప్రయోగ పరీక్షల్లో బయటపడింది. ఇతర అవయవాలకు క్యాన్సర్ విస్తరించినవారికి తొమ్మిది నెలల పాటు నిపుణుల పర్యవేక్షణలో గుండె, ఊపిరితిత్తులను వేగంగా పనిచేయించే ఏరోబిక్.. కండరాలను బలోపేతం చేసే రెసిస్టెంట్ వ్యాయామ తరగతులను నిర్వహించారు. ఇందులో పాల్గొన్నవారిలో కండర మోతాదు.. ముఖ్యంగా కాళ్లు చేతుల్లో బలం పెంపొందినట్టు గుర్తించారు. వ్యాయామ తరగతుల్లో పాల్గొనని వారితో పోలిస్తే వీరిలో తొలి మూడు నెలల్లో అదనంగా సుమారు కిలో వరకూ కండర మోతాదు పెరగటం గమనార్హం. ఇది క్రమంగా తగ్గుతూ వచ్చినప్పటికీ వీరిలో ఆరు నెలల తర్వాత కూడా అరకిలో వరకూ కండర మోతాదు ఎక్కువగానే ఉండటం విశేషం. కండరాలు, ఎముకల వంటి వాటి మోతాదు ఎక్కువగా ఉన్నవారు క్యాన్సర్ చికిత్సలను బాగా తట్టుకోగలరు. ఫలితాలూ మెరుగ్గా ఉంటాయి. ఈ నేపథ్యంలో తమ అధ్యయన ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. రొమ్ముక్యాన్సర్ ఇతర అవయవాలకు విస్తరించినవారి చికిత్సలో నిపుణుల పర్యవేక్షణలో వ్యాయామాలను చేయాటాన్ని చేర్చాలనీ సూచిస్తున్నారు.

బరువు అలా తగ్గితేనే సంతాన అవకాశాలు



సంతానలేమికి మగవారి ఊబకాయం కూడా కారణమే. వీళ్ల బరువు తగ్గితే సంతానం కలిగే అవకాశాలూ పెరుగుతాయి. అయితే బరువు ఎలా తగ్గారన్నదీ ముఖ్యమే. ఆహార, వ్యాయామ నియమాలతో బరువు తగ్గిన మగవారిలో.. అదీ కొద్దిగా బరువు తగ్గినా కూడా వీర్యం నాణ్యత మెరుగవుతున్నట్టు హ్యూమన్ రిప్రొడక్షన్ అప్‌డేట్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం చెబుతోంది మరి. బేరియాట్రిక్ శస్త్రచికిత్సలతో త్వరగా.. అదీ పెద్దమొత్తంలో బరువు తగ్గినా పెద్దగా సానుకూల మార్పులేవీ కనిపించలేదు. శస్త్రచికిత్సలతో పోలిస్తే జీవనశైలి మార్పులతో కొద్దిగా బరువు తగ్గినా శుక్ర కణాల కదలిక, ఆకారం మెరుగవుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ఊబకాయం మూలంగా సంతానం కలగక ఇబ్బంది పడుతున్న మగవారు పోషకాహారం, వ్యాయామం మీద దృష్టి పెట్టటం మంచిదని సూచిస్తున్నారు.

శృంగారానికి కెగెల్

కెగెల్ వ్యాయామాలు అనగానే ముందుగా మహిళలే గుర్తుకొస్తారు. వయసు మీద పడటం, గర్భధారణ, ప్రసవం మూలంగా బలహీనమయ్యే కటి కండరాలను తిరిగి బలోపేతం చేసుకోవటానికి డాక్టర్లు వీటిని సూచిస్తుంటారు. అయితే ఇవి కేవలం ఆడవారికే కాదు, మగవారికీ ఉపయుక్తమే. వీటితో మూత్రాశయం, పేగులు, ప్రోస్టేట్ గ్రంథి, అంగానికి దన్నుగా నిలిచే కటి కండరాలు దృఢంగా అవుతాయి. మల, మూత్ర విసర్జన మీద పట్టు కోల్పోకుండా ఉండటానికి తోడ్పడతాయి. అలాగే అంగానికి రక్తం సరఫరా, స్ఖలనాన్ని నియంత్రించటానికి దోహదం చేస్తాయి. స్తంభనను ప్రేరేపించటానికీ ఉపయోగపడతాయి.

ఇలా మేలు

● మల, మూత్ర విసర్జన మీద పట్టు సాధించటానికి ● మామూలు ప్రోస్టేట్‌గ్రంథి ఉబ్బుతో తలెత్తే నొప్పి తగ్గటానికి ● శీఘ్ర స్ఖలనం కాకుండా చూడటం, భావప్రాప్తిని మెరుగుపరచటం ద్వారా శృంగారానందం పెరగటానికి.

ఎలా చేయాలి?





కెగెల్ వ్యాయామాలను చేయటానికి ముందు సరైన కండరాలను గుర్తించటం ముఖ్యం. మూత్రం పోస్తున్నప్పుడు లేదా మలద్వారం నుంచి గ్యాస్ వస్తున్నప్పుడు ఓసారి వాటిని ఆపటానికి ప్రయత్నించి చూడండి. వాటిని బిగపట్టటానికి తోడ్పడేవే కటి కండరాలని చెప్పుకోవచ్చు. ఒకసారి వీటిని సరిగ్గా గుర్తిస్తే చాలు. అనంతరం..

● కుర్చీలో స్థిరంగా కూర్చొని ఆ కండరాలను పైకి, లోపలి వైపునకు లాగటానికి ప్రయత్నించాలి. ● వాటిని 5 సెకండ్ల పాటు పట్టి బిగించాలి. అయితే శ్వాసను బంధించొద్దు. తర్వాత 5 సెకండ్ల పాటు వదులుగా చేయాలి. (పట్టు సాధించిన తర్వాత సమయాన్ని 10 సెకండ్ల వరకూ పొడిగించుకోవచ్చు)

● దీంతో ఒక కెగెల్ వ్యాయామం పూర్తవుతుంది. ఇలా 10 సార్లు చేయాలి. ఇలా ఉదయం, సాయంత్రం 10 సార్ల చొప్పున చేయాలి.

- ఈ వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పి కలగరాదు. ఒకవేళ నొప్పి పుడుతున్నట్టయితే సరిగా చేయటం లేదనే అర్థం. డాక్టర్‌ను సంప్రదించి, దీన్ని ఎలా చేయాలో నేర్చుకుంటే మంచిది.

కుంగుబాటు మందులకు మద్యం దెబ్బ



కుంగుబాటును తగ్గించే యాంటీడిప్రెసెంట్ మందులు మెదడులో నెమ్మదిగా, స్థిరంగా మార్పులను కలగజేయటం ద్వారా దిగులు, నిరాశ తగ్గటానికి తోడ్పడతాయి. మద్యం ఈ మార్పులన్నింటినీ చెరిపేస్తుంది. సాధారణంగా మద్యం మెదడులో పెద్దఎత్తున మార్పులకు దారితీస్తుంది. దీన్ని పెద్ద అల వంటిదని చెప్పుకోవచ్చు. పెద్ద అల చిన్న అలల గుర్తులను చెరిపేస్తుంది కదా. అలాగే మద్యం కుంగుబాటు మందుల సానుకూల మార్పులను వెనక్కి నెట్టేస్తుందన్నమాట. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

కుంగుబాటు (డిప్రెషన్) తగ్గటానికి మందులు వాడుతున్నారా? అయితే మద్యం జోలికి వెళ్లొద్దనీ డాక్టర్లు చెప్పి ఉంటారు. దీన్ని తప్పకుండా పాటించండి. మద్యంతో మందుల ప్రభావం తగ్గటమే కాదు, నిద్ర సైతం దెబ్బతింటుంది. ఫలితంగా సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదమూ ఉంటుందని గుర్తుంచుకోండి.

మందు ప్రభావం తగ్గుముఖం

మద్యంతో మెదడు, శరీరంలో పనుల వేగం మందగిస్తుంది. అందుకే మద్యం తాగినప్పుడు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. సమన్వయం లోపిస్తుంది. మగత ఆవహిస్తుంది. కుంగుబాటులోనూ దాదాపు ఇలాంటివే కనిపిస్తుంటాయి. యాంటీ డిప్రెసెంట్ మందులు ఈ ప్రభావాలను తగ్గించి, జబ్బు నయం కావటానికి తోడ్పడతాయి. అయితే మద్యం మందులకు వ్యతిరేకంగా పనిచేస్తుంది. దీంతో మందుల పనితీరు కుంటుపడుతుంది. పైగా ఇది ఎక్కువ కాలం కొనసాగొచ్చు. ఎంత తాగారనేదాన్ని బట్టి మద్యం ప్రభావాలు కొద్ది రోజుల వరకూ కొనసాగుతూ వస్తాయి. మెదడులో మార్పులను కలగజేస్తూనే ఉంటాయి.

నిద్ర అస్తవ్యస్తం

మద్యంతో నిద్రమత్తు ముంచుకొస్తుండటం నిజమే కావొచ్చు. కానీ ఇది కంటి నిండా నిద్ర పట్టకుండా చేస్తుంది. కుంగుబాటు తగ్గటానికి ప్రయత్నించేటప్పుడు తగినంత నిద్ర పోవటం చాలా కీలకమన్న విషయం మరవరాదు. ఎందుకంటే కుంగుబాటుతో నిద్ర సమస్యలూ ముడిపడి ఉండటం చూస్తుంటాం. నిద్ర, మెలకువల చక్రాన్ని మద్యం అస్తవ్యస్తం చేసేస్తుంది. మూడ్ నియంత్రణలో ఉండటానికి, జ్ఞాపకశక్తికి, మెదడు సరిగా పనిచేయటానికి తోడ్పడే గాఢ నిద్రను మద్యం అణచివేస్తుంది. ఫలితంగా కుంగుబాటు మందుల ప్రభావమూ తగ్గుతుంది.

ప్రమాదకర పరిణామాలు

కుంగుబాటుకు వాడే మందులు.. ముఖ్యంగా మోనోఅమైన్ ఆక్సిడేజ్ ఇన్‌హిబిటార్ (ఎంఏఓఐ) రకానికి చెందినవి వేసుకునేవారిలో మద్యం తీవ్ర దుష్ప్రభావాలకు దారితీస్తుంది. ఇవి మద్యంతో చర్య జరపటం వల్ల ఉన్నట్టుండి రక్తపోటు బాగా పెరిగిపోవచ్చు. కాబట్టి ఎంఏఓఐ రకం మందులు వేసుకుంటుంటే మద్యానికి దూరంగా ఉండటమే ఉత్తమం. సెలెక్టివ్ సెరటోనిన్ రీఅప్‌టేక్ ఇన్‌హిబిటార్ (ఎస్ఎస్ఆర్) రకాలకు చెందినటువంటి మందులు మద్యంతో అంత తీవ్రంగా చర్య జరపవు. అయినా కూడా వీటిని మద్యంతో కలవకుండా చూసుకోవటమే మంచిది.

అధిక కొలెస్ట్రాల్‌కు వినూత్న జన్యుచికిత్స

కొలెస్ట్రాల్ ఎక్కువైతే గుండెజబ్బు ముప్పు పెరుగుతుంది. అందుకే ఆహార, వ్యాయామ నియమాలు పాటించాలని డాక్టర్లు సూచిస్తుంటారు. అవసరమైతే స్టాటిన్ల వంటి మందులనూ సిఫారసు చేస్తుంటారు. కానీ కొందరికి మందులు కూడా పనిచేయవు. ఇలాంటివారికి జన్యు చికిత్సతో మంచి ఫలితం కనిపిస్తున్నట్టు క్లీవ్‌లాండ్ క్లినిక్ తాజాగా నిర్వహించిన ఒక చిన్న ప్రయోగ పరీక్షలో బయటపడింది. దీన్ని ఒకసారి చేయించుకుంటే చాలు. జీవితాంతం మందులతో అవసరం లేకుండా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటం విశేషం. ఈ ప్రయోగ పరీక్షకు 15 మందిని ఎంచుకున్నారు. అంతా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల మోతాదులు ఎక్కువగా ఉన్నవారే. వీరికి క్రిస్పర్ ఆధారిత జన్యు సవరణ చికిత్స చేశారు. ఎక్కువ మోతాదులో జన్యు చికిత్స తీసుకున్నవారికి ఆరు నెలల తర్వాత చెడ్డ కొలెస్ట్రాల్ 50 %, ట్రైగ్లిజరైడ్లు 55 % వరకు తగ్గినట్టు తేలింది. కొలెస్ట్రాల్ జీవక్రియతో ముడిపడిన జన్యువును సవరించటం ఇదే తొలిసారని పరిశోధకులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు తక్కువగా ఉన్నవారిలో ఏఎన్‌జీపీటీఎల్3 అనే జన్యువులో మార్పులు ఉంటున్నట్టు ఇంతకుముందే బయటపడింది. వీరికి గుండెజబ్బు ముప్పూ తక్కువగా ఉంటుండటం గమనార్హం. మరి ఈ జన్యువును సవరిస్తే కొలెస్ట్రాల్ మోతాదులూ తగ్గుతుండొచ్చు కదా. పరిశోధకులు ఇలాగే ఆలోచించి, చికిత్స అందించారు. సాధారణంగా ఈ జన్యులోపం గలవారికి శరీరంలోని ప్రతికణంలోనూ ఇది పనిచేయటం మానేస్తుంది. తాజా అధ్యయనంలో కేవలం కాలేయ కణాల మీదే పనిచేసేలా క్రిస్పర్ మందును ఇవ్వటం గమనార్హం. కొందరికి ఎక్కువ మోతాదులో, కొందరికి తక్కువ మోతాదులో ఇచ్చి పరిశీలించారు. ఎక్కువ మోతాదులో మందు ఇచ్చినవారిలో మరింత అధికంగా ప్రయోజనం కనిపించింది. ప్రస్తుతం ఒకే సమయంలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లను తగ్గించే మందులు లేకపోవటం వల్ల అధ్యయన ఫలితాలు ఆసక్తి కలిగిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.



కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారికి క్రిస్పర్ ఆధారిత మందును వేర్వేరు మోతాదుల్లో రక్తనాళం ద్వారా ఇచ్చారు. ఇందులోని జన్యు సూచనలు కాలేయంలోకి చేరుకొని, అక్కడ కొలెస్ట్రాల్‌ను తయారుచేసే ఏఎన్‌జీపీటీఎల్3 జన్యువును సవరించటంలో విజయం సాధించాయి.

సిరల ఉబ్బుతో జాగ్రత్త!

పిక్కల మీద మందంగా, నీలం రంగులో ఉబ్బినట్టుగా కనిపిస్తోందా? సాయంత్రం అయ్యేసరికి దురద, నొప్పి పుడుతున్నాయా? అయితే కాలి సిరల ఉబ్బు సమస్యతో బాధపడుతున్నారేమో చూసుకోండి. మనం ఎక్కువసేపు నిలబడితే గురుత్వాకర్షణ ప్రభావంతో కాళ్లలోని సిరలు గుండెకు తిరిగి రక్తాన్ని పంపించటంలో ఇబ్బంది పడతాయి. సాధారణంగా సిరల్లో రక్తం కిందికి జారిపోకుండా చూడటానికి కవాటాలుంటాయి. ఇవి బలహీనమైతే రక్తం పోగుపడి, ఉబ్బుగా తయారవుతుంది. దీన్నే వెరికోజ్ వీన్స్ అంటారు. ఇది నొప్పి, వాపు, మంట, దురదకు దారితీస్తుంది. దీన్ని నివారించుకోలేకపోవచ్చు గానీ వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు.



● ఎక్కువసేపు ఒకేచోట నిల్చోవద్దు. తరచూ విరామం తీసుకోవాలి. కాసేపు అటూఇటూ నడవాలి. పిక్క కండరాలను సాగదీయాలి. దీంతో రక్త ప్రసరణ పుంజుకుంటుంది. ఎక్కువసేపు నిల్చొనే ట్రాఫిక్ కానిస్టేబుళ్ల వంటివారికిది మరింత ముఖ్యం.

● నడుం కన్నా పాదాలు కాస్త ఎత్తుగా పెట్టుకొని పడుకుంటే గుండెకు తేలికగా రక్తం ప్రసరిస్తుంది.

● అధిక బరువుంటే తగ్గించుకోవాలి. బరువు తగ్గితే కాలి రక్తనాళాల లోపల పీడనం తగ్గుతుంది.

● పొగ తాగటం రక్తనాళాలను దెబ్బతీస్తుంది. రక్త ప్రసరణను తగ్గిస్తుంది. కాబట్టి సిగరెట్లు తాగే అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.


● చురుకుగా ఉండాలి. ఎక్కువసేపు ఒకేచోట కదలకుండా కూర్చోవటం తగ్గించుకోవాలి.

● కాళ్లను బిగుతుగా పట్టుకొనే సాక్స్ ధరిస్తే రక్తం పైకి వెళ్లటానికి అవకాశముంటుంది. సిరల ఉబ్బు తీవ్రం కాకుండా ఉండటానికీ ఇది తోడ్పడుతుంది.

● బెల్టు మరీ బిగుతుగా లేకుండా చూసుకోవాలి. బెల్టు బిగుతుగా ఉంటే రక్త ప్రసారానికి ఇబ్బంది కలగొచ్చు.

మనసుకు చలి

చలికాలం కేవలం శరీరం మీదే కాదు, మనసు మీదా ప్రభావం చూపుతుంది. నిరాశ, ఆందోళన, ఆసక్తి చూపకపోవటం వంటివి ఇబ్బంది పెడుతుంటాయి. ముఖ్యంగా వృద్ధుల్లో వీటిని ఎక్కువగా చూస్తుంటాం. దీన్ని మూడ్ మారటంగా చాలామంది భావిస్తుంటారు గానీ ప్రత్యేకంగా ఇదొక సమస్య. దీన్నే సీజనల్ అఫెక్టివ్ డిజార్డర్ (ఎస్ఏడీ) అని పిలుస్తుంటారు. అంటే కాలం మార్పు ప్రభావంతో వచ్చే జబ్బన్నమాట. చలికాలంలో ఎండ కాయటం తక్కువ కదా. దీంతో ఉత్సాహాన్ని కలగజేసే సెరటోనిన్ అనే రసాయనం మోతాదులూ పడిపోతాయి. ఇది మూడ్‌నూ ప్రభావితం చేస్తుంది. నిరాశకు దారితీస్తుంది. ఎండ తగ్గటం వల్ల శరీరంలోని జీవగడియారమూ అస్తవ్యస్తమవుతుంది. ఇది దిగులుకు కారణమవుతుంది. అందువల్ల వృద్ధులను చలికాలంలో ఎండ తగిలేలా కిటికీ పక్కన కూర్చునేలా, వీలైతే ఉదయం పూట ఆరుబయట నడిచేలా, ఇంట్లో కుటుంబసభ్యులతో కలివిడిగా మెలిగేలా చూడటం మంచిది. ఆకలి తగ్గటం, మాట్లాడటానికి విముఖత చూపటం, చిరాకు వంటివి గమనిస్తే వారికి తగిన దన్ను అవసరమని గుర్తించాలి. ఏదో చాదస్తం కొద్దీ అలా చేస్తున్నారని అనుకోవద్దు. హుషారు కలిగించటానికి ప్రయత్నించాలి. అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవాలి.



ఇళ్ల విక్రయాలు రూ.6.65 లక్షల కోట్లకు!



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై అనరాక్

దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 1.93 లక్షల ఇళ్లు/ఫ్లాట్లు విక్రయమయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.2.98 లక్షల కోట్లుగా ఉందని స్థిరాస్తి సేవల సంస్థ అనరాక్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో జరిగిన 2.27 లక్షల ఇళ్ల విక్రయాల విలువ రూ.2.79 లక్షల కోట్లుగా ఉందని పేర్కొంది. ఏడాది క్రితంతో పోలిస్తే, ఈసారి విక్రయమైన ఇళ్ల విలువ 7% పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద ఇళ్ల అమ్మకాల విలువ 19% వృద్ధితో రూ.6.65 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా వేసింది. 2024-25లో ఈ 7 నగరాల్లో విక్రయమైన 4,22,765 ఇళ్లు/ఫ్లాట్ల విలువ రూ.5.59 లక్షల కోట్లుగా నమోదైంది.

✦ ముంబయి మెట్రోపాలిటన్ (ఎంఎంఆర్), పుణె, బెంగళూరు, దిల్లీ (ఎన్సీఆర్), హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాల్లో ఇళ్ల అమ్మకాలను అనరాక్ విశ్లేషించింది. అధిక విలువ ఉండే విలాస గృహాలకు గిరాకీ పెరుగుతోందని పేర్కొంది. మొత్తం ఇళ్ల అమ్మకాల్లో 42% వాటా వీటికే ఉందని తెలిపింది. ఇందువల్లే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంమీద జరిగే ఇళ్ల విక్రయాల విలువ బాగా పెరిగే అవకాశం ఉందని అనరాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ అన్నారు. అదనపు సౌకర్యాలుండే విలాసవంత ఇళ్లు/ఫ్లాట్లవైపు కొనుగోలుదారు మొగ్గు చూపుతున్నారని వివరించారు.

✦ ఇళ్ల సగటు విలువ పెరుగుతున్న ప్రాంతాల్లో, ప్రీమియం నివాసాలున్న చోట్ల అమ్మకాలు బాగున్నాయి. నిర్మాణదారులు కూడా అధిక సంఖ్యలో యూనిట్లు చేపట్టడం కంటే, నాణ్యత-చెప్పిన సమయానికి అప్పగింతపై దృష్టి సారిస్తున్నారని నివేదిక తెలిపింది.

ఈనాడు బిజినెస్

ఇతర నెట్‌వర్క్‌లతో శాట్‌కామ్ అనుసంధానం!

విధివిధానాలకు ట్రాయ్ ముసాయిదా పత్రం

దిల్లీ: ప్రస్తుతం అమల్లో ఉన్న తొమ్మిది అంతర అనుసంధాన నియంత్రణలను టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సమీక్షిస్తోంది. అన్ని వర్గాల అభిప్రాయాలను కోరుతోంది. ఇందులో శాటిలైట్ ఆధారిత టెలికాం నెట్‌వర్క్‌లు, ఇతర టెలికాం నెట్‌వర్క్‌లతో అంతర్ అనుసంధానంపైనా స్పందనలను కోరింది. మొత్తం మీద టెలికాం రంగంలో సాంకేతికత పరిణామాలు, మార్పులను పరిగణనలోకి తీసుకునేలా నియంత్రణ వ్యవస్థను సిద్ధం చేయడం కోసం ఈ సమీక్ష చేపట్టింది.

ఇవి పరిశీలిస్తుంది: ప్రస్తుతం ఒక నెట్‌వర్క్ నుంచి మరొక నెట్‌వర్క్‌కు కాల్ వెళ్తే (అంతర్ అనుసంధానం) సమయాల్లో సర్వీసు ప్రొవైడర్ల మధ్య వర్తించే ఇంటర్‌కనెక్షన్ ఛార్జీలు, ఇంటర్‌కనెక్షన్ వినియోగ ఛార్జీలు (ఆరిజినేషన్, ట్రాన్సిట్, కారేజ్, ట్రాన్సిట్ కారేజ్, టర్మినేషన్, ఇంటర్నేషనల్ టర్మినేషన్‌కు సంబంధించిన ఛార్జీలు), రెఫరెన్స్ ఇంటర్ కనెక్ట్ ఆఫర్(ఆర్ఐఓ) వ్యవస్థలనూ ఈ ముసాయిదా పత్రం ద్వారా పరిశీలించనుంది. త్వరలో రాబోయే వర్ధమాన ప్లాట్‌ఫారాలైన శాటిలైట్ ఆధారిత టెలికాం నెట్‌వర్క్‌లకు సంబంధించిన కీలక అంశాలనూ పరిశీలించడమూ ఈ సమీక్ష లక్ష్యంగా ఉంది. ఎమ్ఎస్ఎస్ (మొబైల్ శాటిలైట్ సర్వీస్), ఎఫ్ఎస్ఎస్ (ఫిక్స్‌డ్ శాటిల్ సర్వీస్) శాటిలైట్ ఆధారిత టెలికాం నెట్‌వర్క్‌లకు సంబంధించిన ఇంటర్‌కనెక్షన్ వ్యవస్థలను వేరుగా తీసుకురావాలా, వద్దా అన్న అంశాన్నీ సమీక్షించనుంది.

ఎమ్‌క్యూర్ ఫార్మాతో నోవో నార్డిస్క్ ఒప్పందం

దేశీయ మార్కెట్లో పొవిజ్‌ట్రా ఇంజెక్షన్ విడుదల

ఈనాడు, హైదరాబాద్: నోవో నార్డిస్క్ ఇండియా, బరువు తగ్గించే ఔషధమైన పొవిజ్‌ట్రా 2.4 ఎంజీ ఇంజెక్షన్లను (సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధం) మనదేశంలో విడుదల చేయడానికి ఎమ్‌క్యూర్ ఫార్మాతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల ఈ మందు పంపిణీ, విక్రయాలు సులభతరం అవుతాయని నోవో నార్డిస్క్ పేర్కొంది. ఈ ఔషధ పంపిణీ హక్కులను పొందిన తొలి కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాయే. పొవిజ్‌ట్రా 2.4 ఎంజీ ఇంజెక్షన్లను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్‌క్యూర్ ఫార్మా ఎండీ, సీఈఓ సతీశ్ మెహతా తెలిపారు.

లోరియల్‌తో అపోలో 24/7 భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: చర్మ సంరక్షణ ఉత్పత్తుల సంస్థ అయిన లోరియల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూపునకు చెందిన అపోలో 24/7 తెలిపింది. ఈ ఒప్పందం ఫలితంగా ఎంతో పేరున్న లా రోచె-పోసే బ్రాండ్ చర్మ సంరక్షణ ఉత్పత్తులను మనదేశంలో ఆన్‌లైన్ ఆర్డర్లపై, విక్రయశాలలకు అపోలో 24/7 పంపిణీ చేస్తుంది. అపోలో ఫార్మసీకి 6,900 మందుల విక్రయ దుకాణాలున్నాయి. ప్రపంచ స్థాయి వైద్య, చర్మ సంరక్షణ ఉత్పత్తులను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవాలనే తమ లక్ష్యానికి అనుగుణంగా లోరియల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అపోలో హెల్త్‌కో సీఈఓ బాలక్రిష్ణన్ తెలిపారు.

నెఫ్రోప్లస్ ఐపీఓకు సెబీ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: డయాలసిస్ సేవలు అందించే నెఫ్రోప్లస్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి లభించింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న నెఫ్రోప్లస్, ఆసియా ఖండంలోనే అతిపెద్ద డయాలసిస్ సేవల సంస్థగా ఉంది. ఈ సంస్థ ప్రమోటర్లు, ఇతర వాటాదార్లు ఐపీఓలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ కింద 1.27 కోట్ల షేర్లు విక్రయించాలని ప్రతిపాదించారు. దీంతో పాటు కంపెనీ కొత్తగా రూ.353.4 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు జారీ చేస్తుంది. సమీకరించే నిధులను సంస్థ విస్తరణ కార్యకలాపాలకు, కొంత అప్పు తీర్చటానికి, ఇతర అవసరాలకు కేటాయిస్తారు.

క్యాప్‌స్టన్ సర్వీసెస్ లాభం రూ.7 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మానవ వనరుల సేవలు అందించే క్యాప్‌స్టన్ సర్వీసెస్, ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికానికి రూ.211.27 కోట్ల ఆదాయంపై రూ.7.06 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.168.34 కోట్లు, నికరలాభం రూ.3.93 కోట్లే ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం 25.5%, నికరలాభం 79.64% పెరిగాయి. ఇప్పుడు 700 మంది క్లయింట్లు ఉండగా, సమీక్షా త్రైమాసికంలో పలువురు కొత్త క్లయింట్లను సంపాదించుకున్నట్లు క్యాప్‌స్టన్ సర్వీసెస్ ఎండీ శ్రీకాంత్ కొడాలి అన్నారు.

2026 చివరికి నిఫ్టీ 29000కు!

భారత ఈక్విటీల రేటింగ్ పెంచిన గోల్డ్‌మన్ శాక్స్



వచ్చే ఏడాది చివరి కల్లా నిఫ్టీ 50 సూచీ 29,000 పాయింట్లను తాకే అవకాశం ఉందని అంతర్జాతీయ పెట్టుబడుల బ్యాంకు గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ప్రస్తుత స్థాయి (25,574)తో పోలిస్తే ఇది 14% ఎక్కువ. భారత ఈక్విటీల రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్'కు గోల్డ్‌మన్ శాక్స్ పెంచింది. 2025లో ఇప్పటివరకు చూస్తే, వర్ధమాన దేశాల స్టాక్‌మార్కెట్ల కంటే కాస్త వెనకబడిన భారత్.. అత్యంత వేగంగా పుంజుకున్న స్టాక్ మార్కెట్‌గా తిరిగి అవతరించే అవకాశం ఉందని వివరించింది. 2024 అక్టోబరులో భారత ఈక్విటీల రేటింగ్‌ను గోల్డ్‌మన్ శాక్స్ తగ్గించింది. రెండు దశాబ్దాల్లోనే పేలవ పనితీరును భారత స్టాక్ మార్కెట్లు కనబరుస్తున్నాయని అప్పుడు అభిప్రాయపడింది. ఈక్విటీ మార్కెట్ల నుంచి ఈ ఏడాదిలో ఇప్పటివరకు 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2,60,000 కోట్లు) మొత్తాన్ని విదేశీ మదుపర్లు ఉపసంహరించుకున్నారు. మ్యూచువల్ ఫండ్ కేటాయింపులు కూడా దాదాపు రెండు దశాబ్దాల కనిష్ఠానికి దిగివచ్చాయని సంస్థ తెలిపింది. ఇలాంటి తరుణంలో భారత ఈక్విటీల రేటింగ్‌ను గోల్డ్‌మన్ శాక్స్ పెంచడం గమనార్హం.

ఈ రంగాలపై సానుకూలం..

కొన్ని రంగాల భవిష్యత్తు బాగుంటుందని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది.

ఆర్థిక సేవలు: రుణ వృద్ధి పుంజుకునే అవకాశం ఉండటం, ఆస్తుల నాణ్యతలో స్థిరత్వం కారణంగా.. ఈ రంగ కంపెనీల 2025-26 లాభాల్లో 15% వృద్ధి ఉండొచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది.

వినియోగ ఆధారిత రంగాలు: పన్ను కోతలకు తోడు, గ్రామీణ ఆదాయాలు పుంజుకోవడం, ప్రభుత్వ వ్యయాల వల్ల వాహన, మన్నికైన వినియోగ వస్తువుల రంగాల రేటింగ్‌ను ఓవర్‌వెయిట్‌కు మార్చింది.

రక్షణ: ఆర్డర్లు పెరగడం, రక్షణ ఉత్పత్తుల తయారీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ రంగ రేటింగ్‌ను పెంచినట్లు తెలిపింది.

చమురు, టెలికాం: మార్జిన్లలో బలమైన వృద్ధి, డిజిటల్ వినియోగం మరింత పెరగనుండటంతో చమురు మార్కెటింగ్, టెలికాం కంపెనీలపై సానుకూల ధోరణితో ఉన్నట్లు గోల్డ్‌మన్ శాక్స్ తెలిపింది.

వీటిపై ప్రతికూలం..: ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడే ఐటీ సేవలు, ఔషధాలు, ఇండస్ట్రియల్స్, రసాయన రంగాలపై ప్రతికూల ధోరణితో (అండర్‌వెయిట్) ఉన్నట్లు వెల్లడించింది.

టయోటా సరికొత్త హైలక్స్



టయోటా మోటార్ కార్పొరేషన్ సరికొత్త హైలక్స్ కారును సోమవారం ఆవిష్కరించింది. డీజిల్, ఫ్యూయల్ సెల్ వేరియంట్లతో పాటు మొదటిసారిగా ఈ మోడల్‌లో బ్యాటరీ విద్యుత్ వాహనం (బీఈవీ) వెర్షన్ తీసుకొస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. కొత్త హైలక్స్ (బీఈవీ)లో అమర్చిన 59.2 కిలోవాట్అవర్ లిథియం అయాన్ బ్యాటరీని ఒకసారి ఛార్జి చేస్తే, 300 కి.మీ.కు పైగా ప్రయాణించొచ్చని సంస్థ చెబుతోంది. 2026లో ఈ మోడల్‌ను ఆసియా మార్కెట్లలో కంపెనీ విడుదల చేయనుంది. 2028లో హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెర్షన్‌ను ఐరోపా, ఏషియానాల్లో విడుదల చేయాలని భావిస్తోంది.

తగ్గిన వొడాఫోన్ ఐడియా నష్టం

టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో రూ.5,524 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాలంలో నమోదు చేసిన రూ.7,175.9 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది తక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.10,932.2 కోట్ల నుంచి 2.4% పెరిగి రూ.11,195 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆర్జన (ఆర్పు) రూ.166 నుంచి 8.7% పెరిగి రూ.180కు చేరింది. టారిఫ్‌ల పెంపు, కస్టమర్ల అప్‌గ్రేడ్‌లతో ఆర్పు పెరిగిందని కంపెనీ తెలిపింది. 2025 సెప్టెంబరు ముగిసే నాటికి కంపెనీ మొత్తం అప్పు రూ.2,02,951 కోట్లుగా ఉంది.


కోడి గుడ్లు

11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	590
వరంగల్	592
విజయవాడ	600
తూ/ప గోదావరి	600
విశాఖపట్నం	585
చిత్తూరు	623

త్వరలో భారత్‌కు జిమ్మీ జాన్స్ బ్రాండ్!

ఇన్‌స్పైర్ బ్రాండ్స్‌తో హల్దీరామ్ చర్చలు



అమెరికాకు చెందిన శాండ్‌విచ్ బ్రాండ్ జిమ్మీ జాన్స్ మన దేశంలోకి ప్రవేశించనుంది. పాశ్చాత్య దేశాల క్విక్ సర్వీస్ రెస్టారెంట్ల (క్యూఎస్ఆర్) రంగంలోకి అడుగు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న దేశీయ స్నాక్స్ సంస్థ హల్దీరామ్ గ్రూప్, ఈ అమెరికా బ్రాండ్‌ను మన దేశంలోకి తేవాలని చూస్తున్నట్లు ఆంగ్ల పత్రికలు తెలిపాయి. జిమ్మీ జాన్స్ శాండ్‌విచ్ ఫ్రాంఛైజీని దేశీయంగా ప్రారంభించడానికి, అమెరికాకు చెందిన సంస్థ ఇన్‌స్పైర్ బ్రాండ్స్‌తో హల్దీరామ్ చివరి దశ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇన్‌స్పైర్ బ్రాండ్స్ ఆధీనంలో జిమ్మీ జాన్స్‌తో పాటు, డంకిన్, బాస్కిన్-రాబిన్స్ బ్రాండ్లున్నాయి. మనదేశంలో డంకిన్‌ను జుబిలెంట్ ఫుడ్ వర్క్స్, బాస్కిన్-రాబిన్స్‌ను గ్రావిస్ గ్రూప్ నిర్వహిస్తున్నాయి. శాండ్‌విచ్‌ల్లో పేరున్న అంతర్జాతీయ బ్రాండ్‌లు సబ్‌వే, టిమ్ హోర్టన్స్ బ్రాండ్స్‌తో పోటీ పడాలని హల్దీరామ్ గ్రూప్ ఆలోచనగా చెబుతున్నారు. హల్దీరామ్ రెస్టారెంట్ విభాగం కింద శాండ్‌విచ్ విక్రయాలు జరిపే వీలుంది. దేశ వ్యాప్తంగా 150కి పైగా విక్రయ కేంద్రాలను నడుపుతున్న హల్దీరామ్ రెస్టారెంట్ విలువ రూ.2,000 కోట్లుగా సమాచారం.

✦ 1983లో స్థాపితమైన జిమ్మీజాన్స్ విక్రయశాలలు అమెరికా, కెనడా, దక్షిణకొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ల్లో 2,600కు పైగా ఉన్నాయి. ఈ సంస్థ మొత్తం వ్యాపారం 2.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.23,000 కోట్లు).

జేకే టైర్ రూ.5000 కోట్ల పెట్టుబడులు

ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించేందుకు వచ్చే 5-6 ఏళ్లలో మరో రూ.5000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ సిద్ధమవుతోంది. ఎగుమతి మార్కెట్ల కోసం కొన్ని ప్రత్యేక తయారీ లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ఛైర్మన్, ఎండీ రఘుపతి సింఘానియా తెలిపారు. ప్రయాణికుల వాహనాల కోసం దేశంలోనే మొదటి ఎంబెడ్డెడ్ స్మార్ట్ టైర్లను కంపెనీ సోమవారం విడుదల చేసింది. తయారీ మౌలిక సదుపాయాల కోసం రూ.4000 కోట్ల పెట్టుబడులను పెట్టే ప్రక్రియలో ప్రస్తుతం ఉన్నట్లు కంపెనీ తెలిపింది. 4 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పెట్టుబడుల ప్రక్రియ, వచ్చే త్రైమాసికంలో ముగిసే అవకాశం ఉంది.

రూ.500 కోట్లతో యూపీలో భూఅయస్కాంతాల ఉత్పత్తి ప్లాంటు

దిల్లీ: అరుదైన భూఅయస్కాంత లోహాల ఉత్పత్తి కోసం ఉత్తరప్రదేశ్‌లో రూ.500 కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యర్థాలను పునర్వినియోగం చేసే సంస్థ లోహమ్ తెలిపింది. ఈ ప్లాంటు సామర్థ్యం 2,000 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని వెల్లడించింది. భూఅయస్కాంతాలు, కీలక ఖనిజాల విభాగంలో మనదేశం స్వయంసమృద్ధిని సాధించే దిశగా, ఈ ప్లాంటు ఒక కీలక అడుగు అని కంపెనీ తెలిపింది. ఆధునిక సాంకేతికత, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక విద్యుత్, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ సహా పలు రంగాల్లో ఉపయోగించే తేలిక, భారీ భూఅయస్కాంత లోహాల శుద్ధి, ఉత్పత్తి ఈ ప్లాంటులో జరుగుతుందని వివరించింది. అరుదైన భూఅయస్కాంతాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పలు చర్యలకు అనుగుణంగా ఈ పెట్టుబడి పెడుతున్నట్లు లోహమ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రజత్ వర్మ తెలిపారు. దేశీయంగా ఈ తరహా లోహాల అవసరాలను తీర్చేందుకే కాకుండా.. దిగుమతులపై ఆధారపడటం తగ్గేందుకూ ఈ ప్లాంటు దోహదపడుతుందని అన్నారు.

మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు: ఆకాశ ఎయిర్

దిల్లీ: బోయింగ్ నుంచి కొత్త విమానాలు త్వరలో చేరే అవకాశం ఉన్నందున.. దిల్లీ నుంచి మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించాలనే యోచనలో ఆకాశ ఎయిర్ ఉంది. కొత్త గమ్యస్థానాల్లో సింగపూర్, ఉజ్బెకిస్థాన్, ఇండొనేషియా, వియత్నాం, తాష్కెంట్ దేశాలుంటాయని ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ తెలిపారు. ప్రస్తుతం దిల్లీ నుంచి రోజుకు 24 విమాన సర్వీసులను సంస్థ నిర్వహిస్తోంది. సంస్థ వద్ద 30 విమానాలుండగా, 24 దేశీయ మార్గాల్లో.. 6 అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్నాయి. సంస్థ మొత్తం 226 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలకు ఆర్డర్ పెట్టింది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జిందాల్ స్టెయిన్‌లెస్	808.00	609.00	10982.46	9823.88
బజాజ్ కన్జూమర్ కేర్	42.30	31.85	265.27	233.98
వీ-మార్ట్ రిటైల్	(8.87)	(56.51)	806.87	660.97
వ్యుయ్ వర్క్ ఇండియా	6.40	203.74	585.54	499.47
ఎస్‌జేవీఎన్	307.80	439.90	1078.29	1108.43
హిందుస్థాన్ మీడియా వెంచర్స్	10.08	13.87	196.87	171.99
బజాజ్ ఫైనాన్స్	4,948	4,015	20,181	17,095
కేపీఐటీ టెక్నాలజీస్	169.08	203.70	1,587.71	1,471.41
హడ్కో	710	689	3,251	2,526
ఏథర్ ఎనర్జీ	(154.10)	(197.20)	898.90	583.50
రెన్యూ	467.50	493.90	4,675	4,939
త్రివేణి టర్బైన్స్	91.40	91	506.20	501.10

క్రిప్టో కరెన్సీ.. మీ దగ్గరుందా?



- అవి కూడా ఆస్తులే
- ఎక్స్ఛేంజీలు ఇక కస్టోడియన్లే
- మదుపర్లే అసలు యజమానులు
- మద్రాస్ హైకోర్టు తీర్పు నేపథ్యం

ఆన్‌లైన్‌లో మాత్రమే ఉండే క్రిప్టో కరెన్సీలపై, దేశంలో ఎటువంటి నియంత్రణ సంస్థా లేదు. అలాగని వీటిపై నిషేధమూ లేదు. మరి వీటిని కొంటున్న మదుపర్ల పరిస్థితి ఏమిటి? సైబర్ దాడుల వంటివి జరిగితే, క్రిప్టోల ట్రేడింగ్ నిర్వహిస్తున్న ఆయా ఎక్స్ఛేంజీలు చేతులు దులిపేసుకుంటాయా? ఆ డిజిటల్ ఆస్తిపై పెట్టుబడి పెట్టినవారికి హక్కులుండవా? ఎక్స్ఛేంజీల్లో క్రిప్టో కరెన్సీ కొంటున్న క్రిప్టో మదుపర్లకే కాదు.. ఇతరులకూ ఉన్న అనుమానాలివి. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు ఇటీవలి ఆదేశాల్లో స్పష్టతనిచ్చిందనే చెప్పాలి. మనదేశంలో ఈ తరహా డిజిటల్ ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టే వారికి ఊరటనిచ్చేలా ఒక చరిత్రాత్మక తీర్పు వెలువడింది. భారత చట్టాల కింద క్రిప్టో కరెన్సీని ఒక ఆస్తిగా మద్రాస్ కోర్టు గుర్తించింది. క్రిప్టో ఎక్స్ఛేంజీ అయిన 'వజీర్‌ఎక్స్'లో ఎక్స్ఆర్‌పీ టోకెన్లు ఉన్న ఒక మదుపరికి సంబంధించిన కేసులో ఈ తీర్పు వచ్చింది. ఇతర చర ఆస్తుల తరహాలోనే, వీటికీ సివిల్ ప్రొటెక్షన్ వర్తిస్తుందని చెప్పింది.

ఏమిటి ప్రయోజనం: తాజా పరిణామంతో సైబర్ హ్యాకింగ్‌లు, ఎక్స్ఛేంజీలు మూతపడడం, మోసాలు జరగడం వంటి సందర్భాల్లో సరికొత్త న్యాయ పరిష్కారాలకు అవకాశం కలిగినట్లయింది. క్రిప్టో మదుపర్ల హక్కులకు ఈ మధ్యంతర తీర్పు అవకాశం కల్పిస్తుంది.

నియంత్రణ వ్యవస్థ లేదు కదా: ప్రస్తుతం క్రిప్టో కరెన్సీలకు సంబంధించి విడిగా ఏ విధమైన నియంత్రణ వ్యవస్థా లేదు. అయితే కోర్టు గుర్తింపుతో ప్రోపర్టీ చట్టం వర్తించి, సంబంధిత ఆస్తులకు రక్షణ లభించగలదని నిపుణులు అంటున్నారు. తమిళనాడులోని కింది స్థాయి కోర్టుల్లో ఈ ఆదేశాలు నేరుగా ప్రభావం చూపనుండగా.. ఇతర హైకోర్టులపైనా ఈ తీర్పు పరోక్ష ప్రభావం చూపొచ్చు. క్రిప్టోపై ఆర్‌బీఐ విధించిన బ్యాంకింగ్ నిషేధాన్ని ఎత్తివేస్తూ సుప్రీం కోర్టు 2020లో జారీ చేసిన తీర్పునకు అనుగుణంగానే ఇది ఉంది.

మదుపర్లు ఏం చేయొచ్చు?

కోర్టు గుర్తింపు నేపథ్యంలో క్రిప్టో మదుపర్లను కేవలం ప్లాట్‌ఫాం వినియోగదార్లుగా కాకుండా, వారిని క్రిప్టో ఆస్తులకు యజమానులుగా చూడాల్సి ఉంటుంది. సరళంగా చెప్పాలంటే.. ఎక్స్ఛేంజీల్లో క్రిప్టోలను మదుపర్లు కలిగి ఉండొచ్చు. సదరు ఎక్స్ఛేంజీ ఒక కస్టోడియన్‌గా లేదా ట్రస్టీగా మాత్రమే ఉండాలి. యజమానిలా కాదు. మదుపర్లు సైతం మోసపూరిత జప్తులపై కానీ, ఆస్తుల పునః పంపిణీపై కానీ సవాలు చేయొచ్చు. ఉదాహరణకు వజీర్‌ఎక్స్ కేసునే చూసుకుంటే నష్టాలకు పరిహారంగా హ్యాకింగ్‌కు గురికాని ఎక్స్ఆర్‌పీ టోకెన్లను తిరిగి పంపిణీ చేయడాన్ని కోర్టు నిలువరించింది. అంటే వినియోగదారు హోల్డింగ్స్‌ను ఎక్స్ఛేంజీలు తమ ఆస్తిలా భావించి, రీ అలొకేట్ చేయడం కానీ, వాటి బదులు వీటిని ఇవ్వడం కానీ చేయరాదని గట్టిగా చెప్పినట్లయింది.

ఫిర్యాదులకు వీలు

మొత్తం మీద క్రిప్టో మదుపర్లు ఇకపై తమ సమస్యలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి వెళ్లొచ్చు. సైబర్ దొంగతనం విషయాల్లో ఎఫ్ఐఆర్ కూడా ఫైల్ చేయొచ్చు. అయితే విదేశాల్లో సర్వర్లు, ఎక్స్ఛేంజీలు ఉన్న పక్షంలో చట్టబద్ధంగా ముందుకెళ్లడం సంక్లిష్టమే. కానీ, ఎక్స్ఛేంజీలు కేవలం కస్టోడియన్లుగా/ట్రస్టీలుగానే ఉండాలని, యజమానులుగా వ్యవహరించరాదన్న ఈ తీర్పు క్రిప్టో మదుపర్లకు గొప్ప ఊరటనిచ్చే అంశం.

12 దేశాల్లోని ప్రవాసులూ పేటీఎం యాప్ వినియోగించుకోవచ్చు


వినియోగదార్ల చెల్లింపుల అనుభూతిని మరింతగా పెంచేందుకు, సరికొత్తగా పేటీఎం యాప్‌ను తీర్చిదిద్దినట్లు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. రోజు వారీ లావాదేవీల ప్రక్రియను సులభతరం చేసేందుకు, కృత్రిమ మేధ ప్రత్యేకతలను ఈ యాప్‌నకు జోడించింది. నవీకరించిన యాప్‌లో 15కి పైగా కొత్త సదుపాయాలను చేర్చింది. 12 దేశాల్లోని ప్రవాస భారతీయులు సహా దేశవ్యాప్తంగా వినియోగదార్లు తమ చెల్లింపులను వేగంగా చేసేందుకు ఇవి దోహదం చేస్తాయని వివరించింది. ప్రతి చెల్లింపుపై వినియోగదారులకు డిజిటల్ గోల్డ్ రూపేణా రివార్డులు ఇచ్చే సదుపాయాన్ని పేటీఎం తీసుకొచ్చింది. కృత్రిమ మేధను అనుసంధానం చేయడం వల్ల, వినియోగదార్ల చెల్లింపుల ధోరణులను అర్థం చేసుకోవడంతో పాటు, విడివిడిగా బ్యాంకు ఖాతాలను నమోదు చేసుకునే అవసరం లేకుండా.. యూపీఐ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోని మొత్తం నిల్వ వివరాలను వేగంగా వినియోగదార్లు తెలుసుకోవచ్చని పేటీఎం వివరించింది. మ్యాజిక్ పేస్ట్ సదుపాయం ద్వారా వాట్సప్ మెసేజ్‌లు, ఫేవరేట్ కాంటాక్టుల జాబితా నుంచి బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి వివరాలను ఆటోమేటిక్‌గా నింపుకోవచ్చని.. తద్వారా వేగంగా చెల్లింపులు చేసే వీలుంటుందని తెలిపింది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ లాభం రూ.12 కోట్లు

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.11.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.11.2 కోట్లతో పోలిస్తే ఈసారి స్వల్పంగా పెరిగింది. ఆదాయం 19.4% పెరిగి రూ.804 కోట్లకు చేరింది. తొలిసారిగా బ్యాంక్ త్రైమాసిక ఆదాయం రూ.800 కోట్ల మైలురాయిని అధిగమించింది. 'వార్షిక స్థూల మర్కండైజ్ విలువ (జీఎంవీ) రూ.4,56,000 కోట్లకు చేరింది. వినియోగదార్ల సంఖ్యా పరంగా అతి పెద్ద మూడో మొబైల్ బ్యాంక్ ఇదేన'ని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అనుబ్రత బిశ్వాస్ వెల్లడించారు. బ్యాంక్ ఖాతాదార్ల బ్యాలెన్స్ 35% పెరిగి రూ.3,987 కోట్లకు చేరింది.

3 రోజుల తర్వాత మళ్లీ లాభాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,115 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.5,805 కోట్లు



సెన్సెక్స్ ▲ 319 85535 | నిఫ్టీ ▲ 82 25574

దేశీయ సూచీలు, మూడు రోజుల వరుస నష్టాల నుంచి తేరుకున్నాయి. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగియవచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు పరుగులు తీయగా, మన సూచీలూ అదే బాటలో నడిచాయి. ఐటీ, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 88.73 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.5% లాభంతో 64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.1.89 లక్షల కోట్లు పెరిగి రూ.468.20 లక్షల కోట్లు (5.28 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 18 పాయింట్ల (క్రితం ముగింపు 83,216.28) నష్టంతో 83,198.20 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో బలంగా పుంజుకున్న సూచీ, ఇంట్రాడేలో 83,754.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 319.07 పాయింట్ల లాభంతో 83,535.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 82.05 పాయింట్లు పెరిగి 25,574.35 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,503.50-25,653.45 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభాలు నమోదుచేశాయి. ఇన్ఫోసిస్ 2.52%, హెచ్‌సీఎల్ టెక్ 1.88%, బజాజ్ ఫైనాన్స్ 1.76%, టాటా మోటార్స్ 1.22%, ఏషియన్ పెయింట్స్ 1.21%, టీసీఎస్ 1.12%, ఎయిర్‌టెల్ 1% లాభపడ్డాయి. ట్రెంట్ 7.41%, ఎటర్నల్ 1.49%, పవర్‌గ్రిడ్ 1.36% నష్టపోయాయి.

✦ సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటంతో, నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఇ-కామర్స్ షేరు 5.98% లాభపడి రూ.260.65 దగ్గర స్థిరపడింది.

✦ బ్రిటానియా ఇండస్ట్రీస్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఉన్న వరుణ్ బెర్రీ తన పదవులకు రాజీనామా చేశారు. ఆయన స్థానంలో రక్షిత్ హర్గావేను ఎండీ, సీఈఓగా నియమించినట్లు, ఈ నియామకం వచ్చే నెల 15 నుంచి అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది.

✦ నవీ ముంబయి విమానాశ్రయం సమీపంలో 350 గదులతో రాడిసన్ కలెక్షన్ హోటల్ నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు **రాడిసన్ హోటల్** గ్రూపు తెలిపింది.

✦ భవన నిర్మాణ ఉత్పత్తుల తయారీ సంస్థ **బిర్లాను**, నిర్మాణరంగంలో వినియోగించే ప్రత్యేక రసాయనాల సంస్థ క్లీన్ కోట్స్‌ను రూ.120 కోట్లకు స్వాధీనం చేసుకుంది.

✦ అక్టోబరులో వచ్చిన మొత్తం టోల్ ఆదాయంలో హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వాటా రూ.73.8 కోట్లని **ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా** తెలిపింది.

✦ **స్తబ్దుగా ముగిసిన లెన్స్‌కార్ట్ షేరు:** కళ్లజోళ్ల విక్రయసంస్థ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ షేర్లు, స్టాక్‌మార్కెట్ అరంగేట్రంలో నిరాశపరిచాయి. ఇష్యూ ధర రూ.402తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ షేరు 2.98% నష్టంతో రూ.390 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 11.52% కుదేలై రూ.355.70 వద్ద కనిష్ఠానికి పడింది. తదుపరి నష్టాల నుంచి కోలుకుని, రూ.413.80 వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 0.32% పెరిగి రూ.403.30 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.70,184.17 కోట్లుగా నమోదైంది.

13 నుంచి ఫుజియామా పవర్ ఐపీఓ


✦ ఇంటిపైకప్పు సౌర విద్యుదుత్పత్తి కంపెనీలకు సొల్యూషన్స్ అందించే ఫుజియామా పవర్ సిస్టమ్స్ ఐపీఓ ఈ నెల 13న ప్రారంభమై 17న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.216-228ను నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.828 కోట్లు సమీకరించనుంది. యాంకర్ మదుపర్లకు 12న షేర్లు కేటాయిస్తారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 65 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి.

✦ వర్క్‌మేట్స్ కోర్2క్లౌడ్ రూ.69.8 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 11న ప్రారంభమై 13న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.200-204 నిర్ణయించారు.

✦ పైన్ ల్యాబ్స్ ఐపీఓ రెండో రోజుకు 54% స్పందన లభించింది.

✦ పునరుత్పాదక ఇంధన సరఫరాదారు క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్, ఐపీఓ ద్వారా రూ.5200 కోట్లు సమీకరించేందుకు సెబీ అనుమతించింది.

భర్త మహాశయులకు.. రామసత్యనారాయణ విజ్ఞప్తి!


రవితేజ

పెళ్లైన వాళ్లకి తనలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటా అంటున్నారు రవితేజ. మరి ఆయనెందుకు ఇలా అన్నారు? పెళ్లి విషయంలో తనకెదురైన పరిస్థితులేంటి? తెలియాలంటే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమా చూడాల్సిందే. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ప్రచారంలో ఉన్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. "భర్త మహాశయులకు విజ్ఞప్తి" అంటూ ఓ గుడిలో నుంచి వినిపించే అనౌన్స్‌మెంట్‌తో మొదలైన ఈ ప్రచార చిత్రం.. ఆ తర్వాత రవితేజ వాయిస్ ఓవర్‌తో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. "నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ, చాట్ జీపీటీ, జెమినీ అన్నింటినీ అడిగాను. వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్లని.. ముఖ్యంగా మొగుళ్లని అడిగాను. ఆశ్చర్యపోయారే తప్ప ఆన్సర్ ఇవ్వలేకపోయారు. ఇలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని కోరుకుంటూ.. మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏంటంటే" అంటూ టైటిల్ గ్లింప్స్ సారాంశాన్ని వినిపించారు. వినోదాత్మకంగా సాగే ఈ కుటుంబ కథా చిత్రంలో రవితేజ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నట్లు గ్లింప్స్‌ను బట్టి అర్థమవుతోంది. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తుండగా.. ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఈనాడు సినిమా

సంచారి సంచారి.. నినదించే రణభేరి


శ్రుతి హాసన్

సినీప్రియులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మహేశ్‌బాబు - రాజమౌళిల కొత్త సినిమా 'గ్లోబ్ ట్రాటర్' (వర్కింగ్ టైటిల్) తొలి ప్రచార వేడుకకు రంగం సిద్ధమవుతోంది. ఇది ఈనెల 15న రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర విశేషాల్ని ఒక్కొక్కటిగా పంచుకుంటోంది చిత్ర బృందం. ఈక్రమంలోనే నటి శ్రుతిహాసన్ గాయనిగా ఈ సినిమాలో భాగమైనట్లు సామాజిక మాధ్యమాల వేదికగా తెలియజేసింది. తాను ఆలపించిన ఈ చిత్ర గీతాన్ని అందరితో పంచుకుంది. "సంచారి సంచారి.. నినదించే రణభేరి.. సంహారి సంహారి.. మృత్యువుపై తన స్వారీ" అంటూ సినిమాలో మహేశ్ పాత్ర వ్యక్తిత్వాన్ని.. తన ప్రయాణాన్ని వర్ణిస్తూ సాగిన ఈ పాటకు ఎంఎం కీరవాణి స్వరాలు సమకూర్చగా.. చైతన్య ప్రసాద్ సాహిత్యమందించారు. శ్రుతి, కాలభైరవ కలిసి ఆలపించారు. "కాలాన్నే శాసిస్తూ.. ప్రతిరోజూ పరుగేలే.. వేగాన్నే శ్వాసిస్తూ.. పెను గాలై తిరిగేలే.. ఖండాలే దాటేస్తూ.. ఖగరాజై వాలే.. రారా రారా ధీర.. ధ్రువతార" అంటూ పాటలో వినిపించిన సాహిత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథతో ఈ సినిమా రూపొందనుంది. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్ నారాయణ నిర్మిస్తున్నారు.

తెరపైనా అందెశ్రీ జయకేతనం



పల్లె ఊసునూ... ప్రకృతి ఆత్మనూ... మనిషి స్థితిగతినీ అక్షరాలుగా పేర్చి కవిత్వంగా మలిచిన శిల్పి అందెశ్రీ. ఆయన సాహిత్యం సినిమానీ విశేషంగా ఆకర్షించింది. వెండితెర ముందు సాగిన జన జాతరలో జయకేతనమై ఎగిరింది. మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడూ... అంటూ సమకాలీన సమాజానికి దర్పణం పట్టి సజీవ శిల్పమై సాక్షాత్కరించింది. అప్పటివరకూ ప్రజావేదికలపైనే వినిపించిన అందెశ్రీ పాట... 'గంగ' సినిమాతో వెండితెరకు పరిచయమైంది. సీనియర్ నిర్మాత, దర్శకుడు యలమంచిలి శేఖర్ రూపొందించిన 'గంగ' సినిమాలోని 'ఎల్లిపోతున్నావ తల్లీ...' పాటతోనే ఆయన గీత రచయితగా చిత్ర పరిశ్రమకు పరిచయం అయ్యారు. ఆ పాటతోనే ఆయన ఉత్తమ గీత రచయితగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఆ తర్వాత ప్రముఖ దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి సినిమాలతో అందె శ్రీ పాటలు మరింత విస్తృతంగా వినిపించాయి. 'ఊరు మనదిరా' సినిమాలో చూడచక్కని తల్లీ..., 'ఎర్రసముద్రం' సినిమాలో 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడూ...' పాట ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. 'వేగుచుక్కలు' సినిమాలోనూ అందెశ్రీ పాట రాశారు. 'పల్లెనీకు వందనములమ్మో...', 'గల గల గజ్జెల బండి', 'కొమ్మచెక్కితే బొమ్మరా...' తదితర పాటలు అందెశ్రీ ప్రతిభకి అద్దం పడతాయి. 'జై బోలో తెలంగాణ' సినిమాలో జైబోలో తెలంగాణ.. గళ గర్జనల జడివాన... అంటూ అందెశ్రీ కలం పాటతో నినదించింది. 2008లో వచ్చిన 'బతుకమ్మ' సినిమాకి మాటలతోపాటు, రండి కదలిరండి... సినుకమ్మ... అంటూ సాగే పాటల్నీ రచించారు. అందెశ్రీ మరణంపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు. "ప్రజాకవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికే కాదు, యావత్ తెలుగు ప్రపంచానికి తీరని లోటు. ఆయన రాసిన అమోఘమైన పాటలు నా సినిమా విజయాలకు ఎంతో దోహదం చేశాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి" అంటూ అందెశ్రీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు ప్రముఖ దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి. ప్రజల గొంతుల్లో ఎప్పటికీ వినిపించే సాహిత్యాన్ని అందించి, సమాజాన్ని జాగృతం చేసిన గొప్ప రచయిత అందెశ్రీ అనీ, ఆయన మరణం సమాజానికి తీరని లోటు అన్నారు దర్శకుడు ఎన్.శంకర్.

క్రిస్మస్‌కి దండోరా


బిందు మాధవి


శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కించిన చిత్రం 'దండోరా'. రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మాత. రవికృష్ణ, అనూష, మణిక తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. "సామాజిక స్పృహను కలిగించే అంశంతో రూపొందిన చిత్రమిది. ఇది తెలంగాణ నేపథ్యంలోని పురాతన ఆచారాలు, సంప్రదాయాల్ని ఆవిష్కరించేలా ఉంటుంది. వ్యంగ్యం, వినోదం, బలమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: మార్క్ కె రాబిన్, ఛాయాగ్రహణం: వెంకట్ ఆర్.శాఖమూరి.

నిలకడగానే ధర్మేంద్ర ఆరోగ్యం



బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర ఆరోగ్యం విషమంగా ఉందని, ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ఆరోగ్యంపై వస్తున్న వార్తలను ఆయన టీమ్ ఖండించింది. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని తెలిపింది. ధర్మేంద్ర త్వరగా కోలుకోవాలని, కుటుంబ గోప్యతను అందరూ గౌరవించాలని టీమ్ వెల్లడించింది. ఎన్నో హిట్ చిత్రాల్ని పరిశ్రమకు అందించిన ఆయన.. వచ్చే నెల 8న 90వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ వయసులోనూ ధర్మేంద్ర త్వరలో విడుదల కానున్న 'ఇక్కీస్'లో ఓ కీలక పాత్రలో నటించడం విశేషం. "వైద్యులు నిరంతరం ధర్మేంద్ర ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించండి" అని ఆయన భార్య, సీనియర్ నటి హేమామాలిని ఎక్స్ ద్వారా కోరారు.

లైక్.. షేర్.. డై


అనురాగ్ కశ్యప్

దర్శకుడిగా, నటుడిగా తన ప్రతిభను నిరూపించుకున్న అనురాగ్ కశ్యప్.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అన్‌కిల్ 123'. సామ్ ఆంటోన్ తెరకెక్కిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. ఈ లుక్‌లో మునుపెన్నడూ చూడని అవతారంలో కనిపిస్తున్నారు అనురాగ్. పోస్టర్‌పై ఉన్న 'లైక్.. షేర్.. డై' అనే వ్యాఖ్యతో ఈ చిత్రంలో డిజిటల్ ప్రపంచంలోని ప్రమాదాన్ని చూపించబోతున్నట్లు స్పష్టమవుతోంది.

ఇంతటి ప్రేక్షకాదరణను ఊహించలేదు : నాగార్జున



'శివ' చిత్రీకరణ రోజుల్ని.. ఈ సినిమా అందించిన జ్ఞాపకాల్ని తానెప్పటికీ మర్చిపోలే"న్నారు కథానాయకుడు అక్కినేని నాగార్జున. "ఈ సినిమా విడుదలై 36ఏళ్లైనా ఇంతటి ప్రేక్షకాదరణ దక్కుతుందని ఎప్పుడూ అనుకోలేద"న్నారు. నాగార్జున - రామ్‌గోపాల్ వర్మ కలయికలో రూపొందిన ఈ విజయవంతమైన చిత్రం ఈనెల 14న 4కే డాల్బీ ఆట్మాస్ వెర్షన్‌లో తిరిగి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో నాగార్జున మాట్లాడుతూ.. "ఇప్పుడీ చిత్రాన్ని 4కే ఆట్మాస్ వెర్షన్‌లో చూసి అందరూ ఎంత షాక్ అయ్యారో.. మొన్న తొలిసారి దీన్ని చూసినప్పుడు నేనూ అంతే ఆశ్చర్యపోయా. నాకు ఓ కొత్త సినిమా చూస్తున్న అనుభూతి కలిగింది. ఈ చిత్రం విడుదలైన రెండు రోజుల తర్వాత మా నాన్న 'ఇది చాలా పెద్ద హిట్ రా. చాలా బాగా చేశావు. ఈ సినిమా ఎక్కడికి వెళ్లి ఆగుతుందో నాకే తెలియదు' అని ప్రశంసించారు. ఈ సినిమాలో నేను చేసిన ఛేజింగ్ సీన్స్‌ని మళ్లీ చూసినప్పుడు.. తలచుకున్నప్పుడు అప్పుడప్పుడు నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేస్తుంటా. ఇవన్నీ నేనే చేశానా అని షాక్ అవుతుంటా" అన్నారు. "ఈ చిత్ర విషయంలో సాంకేతికంగా సవాల్ అనిపించిన అంశం సౌండ్ డిజైనింగే. ఒరిజినల్ వెర్షన్‌లోని ఫ్లేవర్ పోకుండా దాన్ని అంతే ప్రభావవంతంగా 4కె ఆట్మాస్ వెర్షన్‌లో చూపించగలిగాం" అన్నారు దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ.

ఓటీటీలో ఈ వారం

వారం మొదలైపోయింది. బోలెడన్ని కొత్త ముచ్చట్లతో ఓటీటీలూ సిద్ధంగా ఉన్నాయి. ఎప్పటిలాగే ఈ వారాంతం కూడా వినోదాలు పంచడానికి అదిరిపోయే సిరీస్‌లు, సీటు అంచున కూర్చోబెట్టే సినిమాల్ని ప్రేక్షకులకు అందించబోతున్నాయి.

ఎ మెరీ లిటిల్ ఎక్స్-మాస్(సినిమా)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
డైనమైట్ కిస్ (సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
ఎక్కా(సినిమా)	గురువారం	సన్‌నెక్ట్స్
దిల్లీ క్రైమ్ సీజన్ 3(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
లాస్ట్ సమురాయ్ స్టాండింగ్(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ది బీస్ట్ ఇన్ మీ(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
అవిహితమ్ (సినిమా)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
మాలిస్ (సిరీస్)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
కె.ర్యాంప్(సినిమా)	శనివారం	ఆహా

ఘటికాచలం పెళ్లి



కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్న ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్.. ఇప్పుడు 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమాతో మరోసారి నవ్వులు పంచడానికి సిద్ధమైంది. రవిబాబు దర్శకత్వం వహించారు. వీకే నరేశ్, వర్షిణి, రఘుబాబు, అలీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం గురువారం నుంచి ఈటీవీ విన్‌లో రాబోతుంది. ఇందులో ఘటికాచలం అనే వృద్ధుడి పాత్రలో కనిపించనున్నారు నరేశ్. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌లో ఆయన వయసు మీద పడినా కూడా మళ్లీ పెళ్లి చేసుకోవడం, కుటుంబ సభ్యులు కంగారు పడడం లాంటి సన్నివేశాల్ని వినోదాత్మకంగా చూపించారు. మరి ఈ ఘటికాచలం పెళ్లి కథేంటో తెలియాలంటే సినిమాపై ఓ లుక్కేయ్యాల్సిందే.

శుక్రవారం.. తెలుసు కదా



"ఎవరిని ప్రేమించాలి.. ఎంత ప్రేమించాలి.. ఎలా ప్రేమించాలి అనేది మన కంట్రోల్‌లోనే ఉండాలి" అంటూ ఇటీవలే 'తెలుసు కదా' చిత్రంతో తెరపై సందడి చేశారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన ప్రధాన పాత్రలో నీరజ కోన తెరకెక్కించిన చిత్రమిది. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. రొమాంటిక్ డ్రామాగా థియేటర్లలో మెప్పించిన ఈ సినిమా ఇప్పుడు శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ ముక్కోణపు ప్రేమకథలో వరుణ్ పాత్రలో మెప్పించారు సిద్ధు. 'ఇది మ్యాజికల్ ప్రేమకథ కాదు.. రాడికల్ లవ్‌స్టోరీ" అంటూ ఊరిస్తున్న ఈ వరుణ్ కథేంటో మీరూ తెలుసుకోండి.

డ్యూడ్ వచ్చేస్తున్నాడు




ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మమితా బైజు కథానాయిక. కీర్తిశ్వరన్ తెరకెక్కించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఇటీవలే థియేటర్లలోకి వచ్చి యువతను ఆకట్టుకుందీ సినిమా. ఇందులో గగన్ పాత్రలో 'సింగారి చిన్నదాన..' అంటూ పాటలు పాడుతూ కుర్రకారుని విశేషంగా అలరించారు ప్రదీప్. ఇప్పుడీ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా శుక్రవారం నుంచి సందడి చేయడానికి సిద్ధమైంది.

స్వచ్ఛమైన వినోదమే ఈ సినిమా బలం



మధుర శ్రీధర్, హరిప్రసాద్

'సామజవరగమన' తర్వాత స్వచ్ఛమైన కుటుంబ వినోదంతో రూపొందిన చిత్రంగా తమ 'సంతాన ప్రాప్తిరస్తు' నిలుస్తుందని చెబుతున్నారు మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి. ఈ ఇద్దరూ కలిసి నిర్మించిన చిత్రమే 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించారు. సంజీవ్ రెడ్డి దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా నిర్మాత మధుర శ్రీధర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. "అత్యధిక జనాభా ఉన్న మన దేశంలో అత్యధిక సంతాన సాఫల్య కేంద్రాలు కూడా ఉన్నాయి. సంతానం కలగకపోవడం వెనకున్న కారణాలపై చాలా మందిలో చాలా అపోహలు ఉన్నాయి. సంతానానికి సంబంధించిన సమస్య అనగానే అదొక రహస్యంలా భావిస్తుంటారు. ఇలాంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని, బహిరంగంగానూ చర్చించుకునే విషయాలివని చాటే కథే మా 'సంతాన ప్రాప్తిరస్తు'. వీర్య కణాలు తక్కువగా ఉన్న కథానాయకుడి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సినిమా చూశాక ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నవాళ్లలో కూడా ఓ ధైర్యం వస్తుంది. మంచి ప్రేమకథ, కుటుంబ భావోద్వేగాలు, మంచి సందేశంతోపాటు, నేటి ట్రెండ్‌కి తగ్గ హాస్యం ఈ సినిమాకి ప్రధానబలం. మొదట ఈ కథని పేరున్న కొద్దిమంది హీరోలకు చెప్పాం. వీర్యకణాలు తక్కువగా ఉన్నవాడిలా హీరో కనిపించాలి, దాంతో తమ ఇమేజ్‌కి ఇబ్బంది అవుతుందని ముందుకు రాలేదు. బాలీవుడ్‌లో ఆయుష్మాన్ ఖురానా ఇలాంటి విభిన్నమైన కథలతోనే స్టార్‌గా ఎదిగాడు. మనవాళ్లూ అలా ప్రయత్నించవచ్చు. కానీ అది జరగలేదు. దాంతో ఓ కొత్త హీరోతో చేద్దామని విక్రాంత్‌ని ఎంచుకున్నాం. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తే నకిలీ సంతాన సాఫల్య కేంద్రాల నేపథ్యంలో 'సంతాన ప్రాప్తిరస్తు 2' చేస్తాం" అన్నారు. "సంతానలేమి సమస్యని ఇందులో స్పృశించిన తీరు, అది కూడా ఎక్కడా అసభ్యతకి చోటు లేకుండా, ఏ విషయంలోనూ హద్దులు దాటకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. స్వచ్ఛమైన వినోదమే ఈ సినిమా బలం" అని చెప్పారు హరిప్రసాద్.

నా మేకప్‌మ్యాన్ ఆశీర్వాదం తీసుకున్నాకే సెట్లోకి


అభిషేక్ బచ్చన్, అశోక్

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ తన దగ్గర 27ఏళ్లకు పైగా పనిచేస్తున్న మేకప్ ఆర్టిస్ట్ అశోక్ మరణించారంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో కలిసి దిగిన ఫొటోను ఇన్‌స్టా వేదికగా పంచుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు అభిషేక్. ''అశోక్ దాదా.. నేను 27ఏళ్లకు పైగా కలిసి పనిచేశాం. నా మొదటి సినిమా నుంచి ఆయన నాకు మేకప్ చేస్తున్నారు. ఆయన నా టీమ్‌లో ఒక వ్యక్తి మాత్రమే కాదు.. మా కుటుంబంలో ఒక సభ్యుడు కూడా. తన సోదరుడు దీపక్ దాదాపు 50 సంవత్సరాలుగా మా నాన్నకు మేకప్ మ్యాన్‌గా పనిచేస్తున్నారు. గత రెండేళ్లుగా ఆయన ఆరోగ్యం బాగుండటం లేదు. దాంతో కొన్ని సార్లు నాతో పాటు సెట్‌కు రావడం లేదు. కానీ అంతకు ముందు ఆయన లేకుండా నేను షూటింగ్‌కు వెళ్లిందే లేదు. నిన్న రాత్రి మేము ఆయనను కోల్పోయాం. నేను కొత్త సినిమాను ప్రారంభించినప్పుడల్లా నా తొలి షాట్‌కి ముందు ఆయన పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకునేవాణ్ని. ఇక నుంచి నేను ఆకాశం వైపు చూడాలి. మీరు కిందకి చూస్తూ నన్ను ఆశీర్వదిస్తారని నాకు తెలుసు. మీ ప్రేమాభిమానాలకు, ప్రతిభకు, చిరునవ్వుకు కృతజ్ఞతలు. ఇకపై మీరు లేకుండానే సెట్‌కు వెళ్లాలని తల్చుకుంటేనే బాధగా ఉంది. మీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా'' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



సందీప్ కిషన్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఓ సినిమా నిర్మిస్తోంది. తమిళ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే దీనికి 'సిగ్మా' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రానికి తమన్ సంగీతమందిస్తున్నారు.

నవ్వించే క్రైమ్ థ్రిల్లర్


'పాంచ్ మినార్'

రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల తెరకెక్కించిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సోమవారం ప్రకటించారు. "ఆద్యంతం వినోదాత్మకంగా సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అని చిత్ర బృందం తెలిపింది.

రివాల్వర్ బేబీ రెడీ



వరుస అవకాశాలు అందుకుంటూ జోరుమీదున్న కీర్తి సురేశ్.. 'రివాల్వర్ రీటా'గా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి కె.చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. "మీ రివాల్వర్ బేబీ ఈ నెల 28న థియేటర్లలోకి అడుగుపెట్టడానికి రెడీగా ఉంద"నే వ్యాఖ్యను జోడించింది. ఇందులో మధ్యతరగతికి చెందిన రీటా అనే అమ్మాయి పాత్రలో కనిపించనుంది కీర్తి. అనుకోని పరిస్థితుల్లో తుపాకీ చేతపట్టిన ఆమె ఎలాంటి సవాళ్లు ఎదుర్కొందనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించనున్నారు. కామెడీ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

■ 2025, సెప్టెంబరు 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సును ఏ నగరంలో నిర్వహించారు?
జ: తిరుపతి (లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సదస్సును ప్రారంభించారు.)

■ ప్రపంచంలోనే మొదటి కృత్రిమ మేధస్సు (ఏఐ)తో పనిచేసే క్యాబినెట్ మంత్రి 'డీయెల్లా'ను నియమించడం ద్వారా ఇటీవల ఏ దేశం చరిత్ర సృష్టించింది? జ: అల్బేనియా (ప్రధాని ఎడి రామా ప్రారంభించిన డీయెల్లా అవినీతిపై పోరాడుతూ ప్రజాభిప్రాయ సేకరణను పర్యవేక్షిస్తుంది.)

■ ఇటీవల భారత్ ఏ యూరోపియన్ దేశాన్ని ఓడించడం ద్వారా 2026 డేవిస్ కప్‌నకు అర్హత సాధించింది? (భారత్ టెన్నిస్ జట్టు 1993 తర్వాత యూరోపియన్ జట్టుపై విజయం సాధించడం ఇదే తొలిసారి.) జ: స్విట్జర్లాండ్

■ ఇటీవల మరణించిన మేఘాలయ మాజీ ముఖ్యమంత్రి డిడి లపాంగ్ ఎన్నిసార్లు ఆ రాష్ట్ర సీఎంగా పనిచేశారు? జ: నాలుగు సార్లు

■ 2025, సెప్టెంబరు 13న భారత్ ఏ దేశంతో కలిసి తన మొదటి సముద్ర భద్రత, నిరాయుధీకరణ, అణ్వాస్త్ర వ్యాప్తి నిరోధక సంభాషణను నిర్వహించింది? జ: నార్వే

■ దక్షిణ కొరియాలోని జెజు ద్వీపం సమీపంలో ఇటీవల ఏ మూడు దేశాలు 'ఫ్రీడమ్ ఎడ్జ్' పేరిట ఉమ్మడి సైనిక, వైమానిక, నావికా విన్యాసాలను నిర్వహించాయి?
జ: అమెరికా, దక్షిణ కొరియా, జపాన్.

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?


☛ ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సు
చివరి తేదీ: 13-11-2025.

☛ సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లో 141 టెక్నీషియన్ ఖాళీలు
చివరి తేదీ: 2025, నవంబరు 14.

నిర్మాణానికి.. రక్షణకు.. రవాణాకు!

జనరల్ స్టడీస్ — బయాలజీ

సంక్లిష్ట యంత్రం లాంటి శరీరంలో ముఖ్యమైన, నిర్మాణాత్మక అనుఘటకాలు ప్రోటీన్‌లు. మానవుడితో సహా ఉన్నతస్థాయి జంతువులన్నింట్లో మాంసం, కండరాలు మొదలైనవన్నీ ప్రోటీన్లతోనే తయారవుతాయి. కణంలో అనేక రకాల జీవక్రియలకూ ఎంజైమ్‌ల రూపంలో ఉండే ప్రోటీన్‌లు తప్పనిసరి. అందుకే రోజూ తినే ఆహారంలో కచ్చితంగా ఉండాల్సిన పోషక పదార్థాలుగా ఇవి చేరాయి. మాంసం, గుడ్డు, పప్పులు, పాలలో పుష్కలంగా ఉండే ఈ స్థూల పోషకాల గురించి అభ్యర్థులు పోటీపరీక్షల కోణంలో చదువుకోవాలి. వాటిలో రకాలు, విభిన్న ఉపయోగాలు, స్వరూప స్వభావాలు, రసాయన నిర్మాణంతోపాటు అవి లభించే ఆహారపదార్థాలు, శరీరంలోనే తయారయ్యే ప్రోటీన్‌ల వివరాలనూ తెలుసుకోవాలి.



ప్రోటీన్‌లు
(మాంసకృత్తులు)

స్థూలపోషక పదార్థాలైన ప్రోటీన్‌లు శరీర నిర్మాణానికి అవసరం. వాటి నిర్మాణాత్మక ప్రమాణాలు అమైనో ఆమ్లాలు. రెండు అమైనో ఆమ్లాల మధ్య ఉన్న బంధాన్ని 'పెప్టైడ్ బంధం' అంటారు. అనేక అమైనో ఆమ్లాలు పెప్టైడ్ బంధాలతో కలిసి పాలిపెప్టైడ్ గొలుసును ఏర్పరుస్తాయి. ఈ గొలుసు ముడుతలు పడి ప్రోటీన్ ఏర్పడుతుంది. ఒక ప్రోటీన్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పాలిపెప్టైడ్ గొలుసులు ఉండవచ్చు. అవి సాధారణంగా కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్ మూలకాల పరమాణువులతో ఏర్పడతాయి. వీటితో పాటుగా సల్ఫర్, జింక్, ఇనుము, రాగి, అయోడిన్, మాంగనీస్ లాంటివి కూడా ఉండవచ్చు.

ఉపయోగాలు: ప్రోటీన్‌లు శరీరానికి అనేక విధాలుగా ఉపయోగపడతాయి.

1) శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, గాయాలు మానడానికి కావాలి. శరీర మరమ్మతుకు ఇవి అవసరం. 2) ఎంజైమ్ రూపంలో ఉండే ప్రోటీన్‌లు కణంలో వివిధ జీవక్రియలను నిర్వహిస్తాయి. అయితే ఎంజైమ్‌లన్నీ రసాయనికంగా ప్రోటీన్‌లుగా ఉంటాయి. కానీ ప్రోటీన్‌లన్నీ ఎంజైమ్‌లుగా వ్యవహరించవు. 3) జీవుల బాహ్య అస్థిపంజరాలైన గోళ్లు, వెంట్రుకలు, పొలుసులు మొదలైన వాటిలో ఉంటూ రక్షణ కల్పిస్తాయి. 4) ప్రోటీన్లను ఆహారంగా తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. 5) కార్బోహైడ్రేట్‌లు, కొవ్వుల తర్వాత ప్రోటీన్‌లు శక్తి జనకాలుగా ఉపయోగపడతాయి. 6) హిమోగ్లోబిన్ లాంటి ప్రోటీన్‌లు ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్ రవాణాకు ఉపయోగపడతాయి. రక్తంలో ఉండే అనేక రకాల ప్రోటీన్‌లు వివిధ పదార్థాల రవాణాకు సాయపడతాయి. 7) శరీరంలో నియంత్రణ, సమన్వయానికి ఉపయోగపడే హార్మోన్లలో కొన్ని ప్రోటీన్‌లుగా ఉంటాయి. 8) త్రాంబిన్, ఫైబ్రినోజెన్ లాంటివి రక్తస్కంధనానికి ఉపయోగపడతాయి. 9) కణాలు, కణజాలాలు, అవయవాలను కలిపే సిమెంటు లాంటి పదార్థాల్లో ఇవి ఉంటాయి.

లభించే ఆహార పదార్థాలు: ప్రోటీన్‌లు.. మొక్కలు, జంతువుల నుంచి లభిస్తాయి. మాంసం, పాలు, పెరుగు, పనీర్, గుడ్డు తెల్లసొన లాంటి జంతుసంబంధ ఆహార పదార్థాల్లో ఇవి సమృద్ధిగా ఉంటాయి. చిక్కుడుజాతి మొక్కల నుంచి లభించే పెసర్లు, కందులు, మినుములు, వేరుశనగ, శనగలు; ఎండిన పండ్లు, బాదం, పిస్తా, జీడిపప్పు తదితరాల్లో కూడా ఉంటాయి.

మొక్కల నుంచి లభించే ప్రోటీన్ల కంటే జంతువుల నుంచి లభించే ప్రోటీన్‌లు ఎక్కువ పోషక విలువలతో ఉంటాయి. జంతు సంబంధ ప్రోటీన్లలో అన్ని ఆవశ్యక అమైనో ఆమ్లాలు ఉంటాయి. అందుకే వీటిని 'జీవశాస్త్రీయ పరిపూర్ణ ప్రోటీన్‌లు' అంటారు.

జీవక్రియల ఆధారంగా ప్రోటీన్లను అనేక రకాలుగా విభజించారు. అవి..

1) ఎంజైమ్‌లుగా పనిచేసేవి

ఎ) డీఎన్ఏ – పాలిమరేజ్: ఇది డీఎన్ఏను ద్విగుణీకరణం చేయడానికి మరమ్మతుకు ఉపయోగపడుతుంది.

బి) సైటోక్రోమ్ – సి: ఇది ఎలక్ట్రాన్ల బదిలీకి ఉపయోగపడుతుంది.



2) నిల్వ ప్రోటీన్‌లు


ఎ) ఓవాల్బుమిన్ – గుడ్డు తెల్లసొనలో ఉండే ప్రోటీన్.

బి) కేసిన్ – పాలలో ఉంటుంది.

సి) ఫెర్రిటిన్ - ప్లీహంలో ఇనుము నిల్వకు ఉండే ప్రోటీన్.

డి) గ్లియడిన్ – గోధుమ గింజల్లో ఉంటుంది.

ఇ) జియిన్ - మొక్కజొన్న గింజల్లో కనిపిస్తుంది.



3) రవాణాకు ఉపయోగపడే ప్రోటీన్‌లు

ఎ) హిమోగ్లోబిన్ – సకశేరుకాల్లో ఆక్సిజన్ రవాణాకు ఉపయోగపడతుంది.

బి) హీమోసయనిన్ – కొన్ని మొలస్కా వర్గపు జంతువుల్లో ఆక్సిజన్ రవాణాకు దోహదపడుతుంది.

సి) మయోగ్లోబిన్ – కండర కణాల్లో ఆక్సిజన్ రవాణాకు సాయపడుతుంది.

డి) సీరం ఆల్బుమిన్ – రక్తంలో కొవ్వు ఆమ్లాలను రవాణా చేస్తుంది.

ఇ) సిరులో ప్లాస్మిన్ – రక్తంలో రాగి రవాణాకు ఉపయోగపడుతుంది.

4) సంకోచానికి ఉపయోగపడే ప్రోటీన్‌లు

ఎ) మయోసిన్ - కండరంలోని దళసరి తంతువులో ఉండే ప్రోటీన్.

బి) ఆక్టిన్ – కండరంలోని పలుచని తంతువులో ఉండే ప్రోటీన్.

సి) డైనిన్ – వివిధ జీవుల్లో ఉండే కశాభం, శైలికల్లో కనిపించే ప్రోటీన్.

సకశేరుకాల రక్తంలో ఉండే రక్షణ ప్రోటీన్‌లు

1) యాంటీబాడీలు (ప్రతిరక్షక దేహాలు): ఇవి వివిధ రకాల యాంటిజెన్‌ల (ప్రతిరక్షక జనకాల)తో కలిసి వాటిని తటస్థం చేసి రక్షణ కల్పిస్తాయి.

2) ఫైబ్రినోజెన్: రక్త స్కంధనానికి ఉపయోగపడే ఫైబ్రిన్ అనే ప్రోటీన్‌కు పూర్వగామిగా ఉంటుంది.

3) త్రాంబిన్: రక్తం గడ్డ కట్టడంలో ఉపయోగపడుతుంది.

విషపదార్థాలుగా ఉండే ప్రోటీన్‌లు

1) బొట్యులినమ్: దీనిని క్లాస్ట్రీడియం బొట్యులినమ్ అనే బ్యాక్టీరియా స్రవిస్తుంది. ఇది ఆహారాన్ని విష పూరితంగా మారుస్తుంది.

2) డిఫ్తీరియా టాక్సిన్: దీనిని కార్ని బ్యాక్టీరియమ్ డిఫ్తీరియే అనే బ్యాక్టీరియా స్రవిస్తుంది. దీనివల్ల ధనుర్వాతం(టెటనస్) వ్యాధి వస్తుంది.

3) రిసిన్: ఆముదపు విత్తనాల్లో ఉంటుంది. ఇది అత్యంత విషపూరితం

4) గాసిపిన్: పత్తి విత్తనాల్లో ఉంటుంది.



హార్మోన్లుగా పని చేసే ప్రోటీన్‌లు

1) ఇన్సులిన్: దీనిని క్లోమం స్రవిస్తుంది. ఇది గ్లూకోజ్ జీవక్రియలను నియంత్రిస్తుంది. లోపిస్తే డయాబెటిస్ మిల్లిటస్ (మధుమేహ వ్యాధి) కలుగుతుంది.

2) అడ్రినో కార్టికో ట్రోపిక్ హార్మోన్: ఇది మూత్రపిండాలపై ఉండే అడ్రినల్ గ్రంథుల వల్కలం స్రవించే కార్టికో స్టీరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది.

3) పెరుగుదల హార్మోన్: ఇది శరీరం, ఎముకల పెరుగుదలకు తోడ్పడుతుంది. చిన్నపిల్లల్లో దీని లోపం వల్ల మరుగుజ్జుతనం కలుగుతుంది.

నిర్మాణాత్మక ప్రోటీన్‌లు: ఇవి వివిధ జీవుల్లో శరీర నిర్మాణాల్లో భాగంగా ఉంటాయి.

1) వైరల్ తొడుగు ప్రోటీన్‌లు - వివిధ వైరస్‌ల కేంద్రకామ్లం చుట్టూ ఉండే తొడుగులో ఉంటాయి.

2) కెరాటిన్ (ఆల్ఫా కెరాటిన్) - ఇవి జీవుల్లో ఉండే గోళ్లు, వెంట్రుకలు, ఉన్ని, పొలుసులు, గిట్టలు, కొమ్ములు, ఈకల్లో ఉంటుంది.

3) స్క్లీరోటిన్ – ఇది కీటకాల బాహ్య అస్థిపంజరంలో ఉంటుంది.

4) ఫైబ్రోయిన్ – ఇది పట్టుపురుగులు స్రవించే పట్టు దారంలో, సాలీడు స్రవించే దారంలో ఉంటుంది.

5) కొల్లాజన్ – ఇది మృదులాస్థి, ఎముకల్లో ఉండే తంతుయుత సంధాయక కణజాలంలో, చర్మంలో ఉండే తంతువుల్లో ఉంటుంది.

6) ఎలాస్టిన్ – లిగ్‌మెంట్స్‌లో ఉండే స్థితిస్థాపక సంధాయక కణజాలంలో ఉంటుంది.

7) మ్యూకో ప్రోటీన్‌లు - కీళ్ల మధ్య ఉండే సైనోవియల్ ద్రవంలో ఉంటాయి.

మూడు రకాలు: ప్రోటీన్లలో అమైనో ఆమ్లాలతో పాటు ఉండే ఇతర పదార్థాలు, ఏర్పడే విధానం ఆధారంగా ఇటీవల మూడు రకాలుగా విభజించారు. అవి 1) సరళ ప్రోటీన్‌లు 2) సంయుక్త ప్రోటీన్‌లు 3) ఉత్పన్న ప్రోటీన్‌లు

సరళ ప్రోటీన్‌లు: వీటిని 'హోమో ప్రోటీన్‌లు' అంటారు. అమైనో ఆమ్లాలతో మాత్రమే ఏర్పడతాయి. వీటిని పలు రకాలుగా విభజించారు. అవి.. 1) ఆల్బుమిన్‌లు 2) గ్లోబ్యులిన్స్ 3) గ్లూటిలిన్స్ 4) ప్రొలామిన్స్ 5) ఆల్బుమినాయిడ్స్ 6) హిస్టోన్స్

సంయుక్త ప్రోటీన్‌లు: వీటిలో సరళ ప్రోటీన్‌లతో పాటుగా ప్రోటీన్ కాని పదార్థం కలిసి ఉంటుంది.

ఇవి తిరిగి పలు రకాలుగా ఉంటాయి. 1) న్యూక్లియో ప్రోటీన్స్ 2) మ్యూకో ప్రోటీన్స్ లేదా మ్యూకాయిడ్స్ 3) గ్లైకో ప్రోటీన్స్ 4) క్రోమో ప్రోటీన్స్ 5) ఫాస్ఫో ప్రోటీన్స్ 6) లిపోప్రోటీన్స్

ఉత్పన్న ప్రోటీన్‌లు: ఇవి సరళ, సంయుక్త ప్రోటీన్‌ల నుంచి ఏర్పడతాయి. వీటిని ప్రాథమిక ఉత్పన్న ప్రోటీన్‌లు, ద్వితీయ ఉత్పన్న ప్రోటీన్‌లుగా విభజించారు.

ముఖ్యాంశాలు: ■ ప్రోటీన్ సంశ్లేషణ రైబోజోమ్ ఉపరితలంపై జరుగుతుంది. ■ రంగుతో ఉండే ప్రోటీన్‌లను 'క్రోమో ప్రోటీన్‌లు' అంటారు. ■ ప్రోటీన్‌లు ప్రాథమిక, ద్వితీయ, తృతీయ, చతుర్థ నిర్మాణాలను చూపిస్తాయి. ■ అనేక రకాల అమైనో ఆమ్లాలు ఉన్నప్పటికీ 20 రకాలే ఎక్కువ ప్రోటీన్లలో నిర్మాణాత్మకంగా ఉంటాయి.



రచయిత: డాక్టర్ బి.నరేష్

ఒత్తిడిని ఓడించాలంటే..! — స్టడీ స్కిల్స్



ఏదైనా ఒక సవాలు సమయంలో లేదా ఒక పని చేసేటప్పుడు వ్యక్తమయ్యే శారీరక, మానసిక ప్రతిస్పందనే 'ఒత్తిడి'. మానవ జీవితంలో ఇదొక సర్వసాధారణ అంశం. నిజానికి ఒత్తిడి అనేది ప్రేరణగా పనిచేస్తుంది. కానీ అది మితిమీరితేనే సమస్యగా మారుతుంది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఒత్తిడి ఎక్కువైతే చదువు, పని సామర్థ్యం క్షీణిస్తాయి. సొంత శక్తిని తెలుసుకోవడం, పనిని సానుకూల ధోరణిలో చేయడం, ఫలితంపై అతిగా ఆలోచనలు పెట్టుకోకపోవడం తదితరాలన్నీ ఒత్తిడిని ఓడించే మార్గాలు. విపరీతమైన ఒత్తిడికి దారి తీసే పరిస్థితులు ఏమిటి? వాటిని ఎలా గుర్తించాలి, ఏ విధంగా తగ్గించుకోవాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


నైతిక నియమావళిని బోధించే ధర్మమహామాత్ర!

దేశ మత, సాంస్కృతిక, సామాజిక వ్యవస్థల పునాదులన్నీ ప్రాచీన భారతచరిత్రలో ఉన్నాయి. వేదకాలం అనంతరం మహాజనపదాల నుంచి అవతరించిన మౌర్య సామ్రాజ్యం దేశాన్ని రాజకీయంగా ఏకం చేసింది. గుప్త సామ్రాజ్యం శాస్త్రాల అభివృద్ధికి సోపానమై స్వర్ణయుగాన్ని ఆవిష్కరించింది. మౌర్య, గుప్త, శుంగ, శాతవాహనుల పాలనాకాలాల్లో విజ్ఞానం, కళలు, సంస్కృతిపరంగా ఎంతో పురోగతి కనిపించింది. నాటి సామ్రాజ్యాల విస్తరణ, పాలనా వ్యవస్థలు, ప్రసిద్ధ చక్రవర్తులైన చంద్రగుప్త మౌర్యుడు, అశోకుడు, సముద్రగుప్తుడు, కనిష్కుడు, హర్షుడు తదితరుల విజయాలు, విశేషాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. అప్పటి నిర్మాణాలు, ఆలయాలు, శిలాశాసనాలు, పండితులు, ప్రముఖ వ్యక్తులు, వారి రచనలు, ఆనాటి విషయాలను గ్రంథస్థం చేసిన విదేశీ యాత్రికుల గురించి తెలుసుకోవాలి.

ప్రాచీన భారతదేశ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో మౌర్య చరిత్రకు ఆధారం కానిదాన్ని గుర్తించండి.
 1) మెగస్తనీస్ రాసిన ఇండికా
 2) కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రం
 3) విశాఖదత్తుని దేవీచంద్రగుప్తం
 4) బౌద్ధమత గ్రంథమైన మహావంశం
2. కింది వాటిలో 'అమిత్రఘేట్స్' బిరుదు ఉన్న పాలకుడు?
 1) చంద్రగుప్త మౌర్యుడు 2) బిందుసారుడు
 3) అశోకుడు 4) కనిష్కుడు
3. కింది ఏ గ్రంథం చంద్రగుప్తుడిని 'వృషల' అని పిలిచింది?
 1) దేవీచంద్రగుప్తం 2) రాజతరంగిణి
 3) ముద్రారాక్షసం 4) సారిపుత్ర ప్రకరణం
4. "అశోకుడి జీవితంలో కళింగ యుద్ధం ఒక మలుపు" అని అన్న చరిత్రకారుడు?
 1) మజుందార్ 2) వి.ఎ.స్మిత్
 3) రాయ్‌చౌదరి 4) రోమిలా థాపర్
5. యజమానులు సేవకుల పట్ల దయార్థభావంతో ఉండాలని ఎన్నో అశోక శాసనం తెలుపుతుంది?
 1) 3వ 2) 4వ
 3) 12వ 4) 5వ
6. 'సత్యమేవ జయతే' అనే పదాన్ని ఏ ఉపనిషత్తు నుంచి గ్రహించారు?
 1) మాండ్యూక ఉపనిషత్తు 2) కేనోపనిషత్తు
 3) ముండక ఉపనిషత్తు
 4) బృహదారణ్య కోపనిషత్తు
7. మెగస్తనీస్ తెలిపిన ఏడు వర్గాల్లో లేనివారు?
 1) తత్త్వవేత్తలు 2) వ్యవసాయదారులు
 3) గూఢచారులు 4) సైనిక వర్గాలు
8. మౌర్యుల కళలకు సంబంధించి సరైంది?
 1) అశోకుడి స్తంభ శాసనాలకు మధుర, చునార్ ఇసుకరాళ్లను వాడారు.
 2) మౌర్యులు భవనాలకు చెక్కను ఉపయోగించారు.
 3) మౌర్యుల గుహల లోపలిభాగం నునుపుగా ఉంటుంది.
 4) పైవన్నీ
9. మౌర్యుల కాలంలో సంతక్, సంచార అంటే?
 1) గూఢచారులు 2) స్వదేశీ మార్కెట్లు
 3) నగర పాలకుడు
 4) మౌర్యుల కాలం నాటి చెరువులు
10. కౌటిల్యుడి అర్థ శాస్త్రానికి సంబంధించి సరికానిది?
 1) అర్థ శాస్త్రం మౌర్యుల వంశక్రమాన్ని తెలుపుతుంది.
 2) దీన్ని సంస్కృత భాషలో రచించారు.
 3) అర్థ శాస్త్రం రాజు, రాజ్య లక్షణాలను వివరిస్తుంది
 4) ఇది మౌర్యుల పరిపాలనా గ్రంథం.



11. కింది బిరుదుల్లో ఒకటి సరికాదు?
 1) ఇండియన్ నెపోలియన్ - సముద్రగుప్తుడు
 2) అమిత్రఖేట్స్ - చంద్రగుప్త మౌర్యుడు
 3) శకారి - రెండో చంద్రగుప్తుడు
 4) మహారాజాధిరాజ - మొదటి చంద్రగుప్తుడు
12. మౌర్యుల కాలంలో న్యాయవ్యవస్థకు సంబంధించి సరైంది?
 1) అత్యున్నత న్యాయాధికారి - రాజు
 2) కంఠక శోధన - క్రిమినల్ కోర్టు
 3) ధర్మస్తేయ - సివిల్ కోర్టు
 4) పైవన్నీ
13. కింది వారిలో నవరత్నాలు అనే గొప్ప పండితులు ఎవరి ఆస్థానానికి చెందిన వారు?
 1) చంద్రగుప్తమౌర్యుడు
 2) సముద్రగుప్తుడు
 3) రెండో చంద్రగుప్తుడు
 4) అశోకుడు


రెండో చంద్రగుప్తుడు

14. కింది వారిలో శకయుగ స్థాపకుడు ఎవరు?
 1) కనిష్కుడు 2) హర్షవర్ధనుడు
 3) సముద్రగుప్తుడు 4) అశోకుడు
15. కింది వాటిలో ధర్మమహామాత్రుల విధి ఏమిటి?
 1) బౌద్ధమతం వ్యాప్తి
 2) నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడం
 3) శాసనాలు రచించడం
 4) నైతిక నియమావళిని బోధించడం
16. భారతదేశాన్ని సందర్శించిన మొదటి చైనా యాత్రికుడు?
 1) హుయాన్‌త్సాంగ్
 2) ఫాహియాన్
 3) ఇత్సింగ్
 4) మెగస్తనీస్


ఫాహియాన్

17. మౌర్యుల కాలంలో నగరపాలన నిర్వహించే ఆరు శాఖల్లో లేనిది?
 1) జనాభా వివరాలు
 2) తూనికలు, కొలమానాలు
 3) పన్నుల నిర్వహణ 4) సైనిక విభాగం
18. గుప్తుల్లో చివరి గొప్ప పాలకుడు ఎవరు?
 1) కుమారగుప్తుడు 2) రెండో చంద్రగుప్తుడు
 3) స్కంధగుప్తుడు 4) విష్ణుగుప్తుడు
19. అశోకుడి శిలాశాసనాలు చదివిన వ్యక్తి?
 1) సర్ జాన్ మార్షల్
 2) అలెగ్జాండర్ కన్నింగ్‌హాం
 3) జేమ్స్ ప్రిన్సెప్
 4) దయారాం సాహ్ని


జేమ్స్ ప్రిన్సెప్

20. సముద్రగుప్తుడి విజయాలను గురించి తెలియజేసే శాసనం?
 1) అలహాబాద్ శాసనం
 2) మెహ్రౌలి శాసనం
 3) ఐహోలు శాసనం
 4) పైవన్నీ
21. కళింగ యుద్ధం గురించి అశోకుడి ఎన్నో శిలాశాసనం తెలియజేస్తుంది?
 1) 10వ 2) 13వ 3) 14వ 4) 9వ
22. కింది వాటిలో 'వాణిజ్య యుగం' గా ఏ కాలాన్ని పిలుస్తారు?
 1) క్రీ.పూ.2వ శతాబ్దం - క్రీ.శ.3వ శతాబ్దం
 2) క్రీ.పూ.5వ శతాబ్దం - క్రీ.శ.4వ శతాబ్దం
 3) క్రీ.పూ.1వ శతాబ్దం - క్రీ.శ.6వ శతాబ్దం
 4) క్రీ.పూ.2వ శతాబ్దం - క్రీ.పూ.3వ శతాబ్దం
23. సముద్రగుప్తుడి అనంతరం గుప్త సింహాసనాన్ని అధిష్ఠించింది ఎవరు?
 1) రెండో చంద్రగుప్తుడు 2) కుమారగుప్తుడు
 3) రామగుప్తుడు 4) స్కందగుప్తుడు
24. కనిష్కుడి కాలానికి చెందిన గొప్ప పండితుడు?
 1) ఆచార్య నాగార్జునుడు 2) వసుమిత్రుడు
 3) చరకుడు 4) పైవారందరూ
25. కింది రచనలు – రచయితల్లో సరికానిది ఏది?
 1) అశ్వఘోషుడు - బుద్ధ చరితం
 2) నాగార్జునుడు - సుహ్రుల్లేఖ
 3) వసుమిత్రుడు - సౌందర్యనందనం
 4) చరకుడు - చరక సంహిత
26. కింది వాటిలో గుప్తుల కాలం నాటి దేవాలయాలకు సంబంధించి సరికానిది?
 1) గుప్తుల దేవాలయాలు మొదట చతురస్ర ఆకారంలో ఉన్నాయి.
 2) గుప్తుల దేవాలయాలు నగారా శైలిలో ఉన్నాయి.
 3) గుప్తులు నిర్మించిన దేవాలయాల్లో దశావతార ఆలయం ఒకటి.
 4) గుప్తుల కాలంనాటి వరాహ శిల్పం కాంస్యంతో నిర్మించారు.
27. 'హూణహరిణకేసరి' అనే బిరుదున్న రాజు?
 1) హర్షవర్ధనుడు 2) రాజ్యవర్ధనుడు
 3) ప్రభాకరవర్ధనుడు 4) పుష్యభూతి
28. 'మహాబలాధీకృత' అనే వ్యక్తి?
 1) ప్రధాన న్యాయమూర్తి 2) ప్రధాన సైన్యాధిపతి
 3) ప్రభుత్వ ఖజానాధికారి 4) ప్రధాన గూఢచారి
29. 'మహామోక్ష పరిషత్'ను హర్షవర్ధనుడు ఎన్నేళ్లకోసారి నిర్వహించేవాడు?
 1) 5 2) 3 3) 10 4) 20
30. గుప్తుల కాలం నాటి పార్వతీ ఆలయం ఏ ప్రాంతంలో ఉంది?
 1) దేవగఢ్ 2) నామ్చాకుఠారా
 3) భూమ్రా 4) ఎరాన్
31. గుప్తుల కాలంలో భుక్తికి అధిపతి ఎవరు?
 1) విషయపతి 2) ఉపరిక
 3) పురపాలక 4) గ్రామికుడు
32. గుప్తుల కాలం నాటి మందుల తయారీ గురించి తెలియజేసే గ్రంథం?
 1) హస్తాయుర్వేదం 2) సూర్య సిద్ధాంతిక
 3) నవనీతకం 4) బృహత్ సంహిత
33. గుప్తుల కాలానికి సంబంధించి కింది వాటిలో సరైంది.
 1) గుప్తుల కాలంలో ప్రధాన వృత్తి వ్యవసాయం.
 2) ఈ కాలంలో బ్రాహ్మణులకు భూదానాలు చేసేవారు.
 3) సేద్యపు బానిసత్వం ఈ కాలంలో ఉండేది.
 4) పైవన్నీ
34. కింది వాటిలో నవరత్నాల్లో ఒకరైన ఖగోళ శాస్త్రవేత్త?
 1) ఆర్యభట్ట
 2) బ్రహ్మగుప్తుడు
 3) వరాహమిహిరుడు
 4) పైవారందరూ


వరాహమిహిరుడు

35. కింది వారిలో హర్షుడికి సమకాలీకుడైన చైనా యాత్రికుడు?
 1) ఫాహియాన్ 2) హుయాన్‌త్సాంగ్
 3) ఇత్సింగ్ 4) మెగస్తనీస్
36. శకులు, కుషాణులు పోషించిన శిల్పకళ?
 1) గాంధార శిల్పకళ 2) మధుర శిల్పకళ
 3) అమరావతి శిల్పకళ 4) ఏదీకాదు
37. కింది వాటిలో హర్షుడి కాలంలో మంత్రిమండలికి సంబంధించి సరికానిది?
 1) కాటుక - గజ బలాధ్యక్షుడు
 2) ఉపరిక - రాజ్య ప్రతినిధి
 3) మహాసంధి విగ్రహ - యుద్ధం, శాంతిభద్రతలు
 4) బృహదాశ్వవర - రథ బలాధిపతి
38. కింది వాటిలో ఒకటి హర్షుడి రచన కాదు?
 1) హర్షచరిత్ర 2) నాగానంద
 3) ప్రియదర్శిని 4) రత్నావళి
39. గుప్తుల కాలంనాటి నిల్చున్న బుద్ధుడి రాతి విగ్రహం ఏ ప్రాంతంలో ఉంది?
 1) సారనాథ్
 2) మధుర
 3) సుల్తాన్‌గంజ్
 4) మెహ్రౌలి



40. ఏ సంవత్సరంలో స్వదేశీ పరిజ్ఞానంతో ఆర్యభట్ట – 1 అనే ఉపగ్రహం తయారుచేశారు?
 1) 1965 2) 1970 3) 1975 4) 1980
41. కింది వాటిలో ఐహోలు శాసనం ఎవరి విజయాల గురించి తెలుపుతుంది?
 1) హర్షవర్ధనుడు 2) రాజ్యవర్ధనుడు
 3) చంద్రగుప్తుడు 4) రెండో పులకేశి
42. నలందా విశ్వవిద్యాలయానికి సంబంధించి సరికానిది?
 1) ఈ విశ్వవిద్యాలయాన్ని కుమారగుప్తుడు స్థాపించాడు.
 2) హర్షుడు దీని పోషణ కోసం 100 గ్రామాలు దానం చేశాడు.
 3) ఫాహియాన్ అనే చైనా యాత్రికుడు దీనిలో విద్యార్థి.
 4) శీలభద్రుడు విశ్వవిద్యాలయ అధ్యక్షుడు (ఛాన్సెలర్).



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-3, 2-2, 3-3, 4-3, 5-4, 6-3, 7-3, 8-4, 9-1, 10-1, 11-2, 12-4, 13-3, 14-1, 15-4, 16-2, 17-4, 18-3, 19-3, 20-1, 21-2, 22-1, 23-3, 24-4, 25-3, 26-4, 27-3, 28-2, 29-1, 30-2, 31-2, 32-3, 33-4, 34-3, 35-2, 36-1, 37-4, 38-1, 39-2, 40-3, 41-4, 42-3.



ఒక వస్తువు స్థానంలో కాలంతోపాటు మార్పు సంభవించినట్లయితే దాన్ని చలనంగా భావించవచ్చు. వీటిని ప్రధానంగా స్థానాంతర, భ్రమణ, డోలన చలనం అని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒక వస్తువు స్థానభ్రంశానికి అనులోమానుపాతంలో ఉండి, సమతాస్థితి స్థానం వైపు పనిచేసే పునరుద్ధరణ బలం వల్ల కలిగే ఆవర్తన చలనాన్ని సరళ హరాత్మక చలనం అంటారు. సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువు సరళరేఖలో కదులుతూ దాని విరామ స్థానానికి అటుఇటుగా చలిస్తూ ఉంటుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

విరామ స్థానంలో అత్యల్పం.. అంత్య బిందువుల్లో అత్యధికం!

డోలన చలనం

సరళ హరాత్మక చలనం - ఆవర్తన కాలం

సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక కణం విరామ స్థానం నుంచి ముందుకి, వెనక్కి కదిలి ఒక డోలనం పూర్తి చేయడానికి పట్టే కాలాన్ని ఆవర్తన కాలం అంటారు. దీన్ని T తో సూచిస్తారు. ప్రమాణం సెకన్.

ఆవర్తన కాలం (T), కోణీయ ద్రవ్యవేగం (ω) మధ్య సంబంధం:

$$T = \frac{2\pi}{\omega}$$

$$T = 2\pi\sqrt{\frac{\text{స్థానభ్రంశం}}{\text{త్వరణం}}}$$

స.హ.చ, ఆవర్తన చలనాల మధ్య భేదాలు: భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడం - ఇది కేవలం ఆవర్తన చలనం మాత్రమే. ఒక బిందువును ప్రామాణికంగా ఎంచుకుని ముందుకి, వెనక్కి కదలడం లేదు. కాబట్టి ఇది సరళ హరాత్మక చలనం కాదు.

- U ఆకారపు గొట్టంలో పాదరసాన్ని కొంతమేర నింపి కదిలిస్తే పాదరస మట్టం చేసే చలనం - సరళ హరాత్మక చలనం.
- ఒక నునుపైన వంపు ఉన్న పాత్రలో చిన్న గోలీ గుండును మెల్లిగా వదిలితే అది చేసే చలనం కూడా సరళ హరాత్మక చలనమే.
- లోలక గడియారంలో డోలనాలు చేసే లోలకం.

పౌనఃపున్యం, కోణీయ పౌనఃపున్యం

ఒక ప్రమాణ కాలంలో చేసే డోలనాల సంఖ్యను పౌనఃపున్యం అంటారు. దీన్ని f లేదా υ సంకేతంతో సూచిస్తారు. SI ప్రమాణం s^{-1} లేదా హెర్ట్జ్ (Hz).

పౌనఃపున్యం, ఆవర్తన కాలానికి మధ్య సంబంధం: $f = \frac{1}{T}$

పౌనఃపున్యం, కోణీయ పౌనఃపున్యానికి మధ్య సంబంధం: $\omega = 2\pi f$

కోణీయ పౌనఃపున్యం ప్రమాణాలు: రేడియన్/సెకన్

ఆవర్తన కాలం, కోణీయ పౌనఃపున్యానికి మధ్య సంబంధం: $T = \frac{2\pi}{\omega}$

వేగం

సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువుకు గరిష్ఠ వేగం విరామ స్థానం వద్ద ఉంటుంది. $V_{max} = A\omega$

కనిష్ఠ వేగం అంత్య బిందువుల వద్ద ఉంటుంది. దాని విలువ $V_{min} = 0$

త్వరణం

సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువుకు దాని స్థానభ్రంశం కంపన పరిమితి (A)కి సమానంగా ఉన్నప్పుడు త్వరణం గరిష్ఠంగా, విరామ స్థానంలో ఉన్నప్పుడు దాని త్వరణం సున్నాగా ఉంటుంది.

దశ

సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక కణం దశ అంటే ఒక నిర్దిష్ట క్షణంలో ఆ కణం స్థానం, కదలిక దిశను సూచించే కోణీయ పదం.

దశ $\theta = (\omega t + \pi)$

❖ ఆవర్తన కాలం T ముగిసిన వెంటనే కణం 2π దశ ముగించి అదే దశలోకి తిరిగి చేరుతుంది. ❖ కంపించే రెండు కణాల దశ 2π పూర్ణాంక గుణిజమైతే ఆ రెండు కణాలు ఒకే దశలో ఉన్నట్లుగా చెప్పవచ్చు. అంటే ఆ రెండు కణాలు ఒకేరకమైన కంపన స్థితిని కలిగి ఉన్నట్లు అర్థం. ❖ సరళ హరాత్మక చలనంలో ఉన్న రెండు కణాల మధ్య దశ విలువలో ఉన్న భేదాన్ని దశ భేదం అంటారు.

ఉదా: ఒక కణం విరామ స్థానంలో ఉన్నప్పుడు మరో కణం గరిష్ఠ బిందువు దగ్గర ఉంటే ఆ రెండింటి మధ్య దశ భేదం $\frac{\pi}{2}$

☛ సరళ హరాత్మక చలనంలో ఉన్న రెండు కణాలు విరామ స్థానాన్ని ఒకే సమయంలో వ్యతిరేక దిశలో దాటితే వాటి మధ్య దశ భేదం πకు సమానం, అవి వ్యతిరేక దశలో ఉన్నట్లుగా చెప్పవచ్చు.

స.హ.చ.లోని కణం - దశ భేదాలు:

- వేగానికి, స్థానభ్రంశానికి మధ్య దశ భేదం $= \pi/2$
- త్వరణానికి, వేగానికి మధ్య దశ భేదం $= \pi/2$
- త్వరణానికి, స్థానభ్రంశానికి మధ్య దశ భేదం $= \pi$

యుగం

సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక కణం $t = 0$ కలిగి ఉన్న దశను యుగం అంటారు. ఆవర్తన కాలం T తర్వాత కణం దశ పునరావృతమవుతుంది. కాబట్టి డోలనాలను లెక్కించేటప్పుడు ఏ బిందువు వద్ద నుంచి అయినా మొదలుపెట్టవచ్చు.

- ఒకవేళ సరళ హరాత్మక చలనాన్ని విరామ స్థానం $t = 0$ నుంచి మొదలు పెడితే, యుగం 0 అవుతుంది.
- డోలనాలను కుడివైపు ఉన్న గరిష్ఠ బిందువు నుంచి మొదలుపెడితే అపాక్ విలువ $\frac{\pi}{2}$ అవుతుంది.
- ఒకవేళ డోలనాలను ఎడమ చేతి వైపు ఉన్న గరిష్ఠ బిందువు నుంచి మొదలుపెడితే అపాక్ విలువ $\frac{-\pi}{2}$ అవుతుంది.


సరళ హరాత్మక డోలకం

ఒక కణం విరామ స్థానం నుంచి x స్థానభ్రంశం చేస్తూ, k ఒక ధన స్థిరాంకం అయితే $F(x) = -kx$ అనే బలంతో ఏకమితిలో డోలనం చేస్తే ఆ కణాన్ని సరళ హరాత్మక డోలకంగా పరిగణించవచ్చు.

F బలానికి సంబంధించి స్థితి శక్తికి సూత్రం

$$P.E. = U(x) = \frac{1}{2}kx^2$$

m కణం ద్రవ్యరాశి, ω కోణీయ ద్రవ్యవేగం అయితే $k = m\omega^2$ ఒక స్థిరాంకం




m ద్రవ్యరాశి ఉన్న ఒక వస్తువును బలస్థిరాంకం kగా ఉన్న తేలికైన స్ప్రింగ్‌కు అమర్చి, నునుపైన క్షితిజ సమాంతర తలంపై పటంలో చూపిన విధంగా ఉంచితే సరళ హరాత్మక డోలకంలా పని చేస్తుంది. సరళ హరాత్మక డోలక పౌనఃపున్యం దాని డోలన పరిమితి (A)పై ఆధారపడదు.

గతిశక్తి

m ద్రవ్యరాశి ఉన్న ఒక కణం సరళ హరాత్మక చలనంలో ఉన్నట్లయితే దాని స్థానభ్రంశం $x = A\sin\omega t$ ద్వారా తెలుసుకోవచ్చు.

- సాధారణంగా గతిశక్తికి సూత్రం: $KE = \frac{1}{2}mv^2$
- సరళ హరాత్మక చలనంలో ఉన్న కణానికి గతిశక్తికి సూత్రం: $KE = \frac{1}{2}k(A^2 - x^2)$
- సరళ హరాత్మక డోలకం స్థానభ్రంశానికి, గతిశక్తికి ఒక గ్రాఫ్ గీస్తే కింది విధంగా ఉంటుంది.



- విరామ స్థానం వద్ద డోలకానికి గతిశక్తి అత్యధికంగా, అంత్య బిందువుల వద్ద అత్యల్పంగా ఉంటుంది.

అత్యధిక గతిశక్తికి సూత్రం: $KE_{max} = \frac{1}{2}m\omega^2A^2$

☛ అత్యల్ప గతిశక్తి సున్నా.


పునరుద్ధరణ బలం

ఒక కణం తన విరామ స్థానాన్ని వదిలినప్పుడు దాన్ని తిరిగి విరామ స్థానానికి తీసుకువచ్చేందుకు పనిచేసే బలాన్ని 'పునరుద్ధరణ బలం' అంటారు. $F = -m\omega^2 y$

✦ స.హ.చలోని కణంపై పనిచేసే పునరుద్ధరణ బలం ఆ కణం పొందిన స్థానభ్రంశానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

✦ $k = m\omega^2$ను పునరుద్ధరణ బల స్థిరరాశి అంటారు. దీని నుంచి ఆవర్తన కాలానికి సూత్రం..

$$T = 2\pi\sqrt{\frac{m}{k}}$$



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day

827 ***Reciprocate***

Telugu meaning: ప్రతిస్పందన, తిరిగి ఇవ్వడం

English meaning: The word reciprocate (రెసిప్రొకేట్) is a verb that means to give or feel something in return; to respond to an action or emotion with a similar one.

Synonyms: Respond, Repay

Antonyms: Ignore, Disregard

Usage: **1.** She smiled warmly, hoping he would reciprocate her gesture of kindness.

2. True friendship thrives when both people reciprocate respect and understanding.

Current Affairs



Raahul VS became India's 91st Grandmaster after he won the 6th ASEAN Individual Championship with a round to spare on 8 November 2025. He is also an Asian junior champion, had attained the title of International Master in 2021, when he secured his fourth and fifth IM norms before crossing the 2400 mark in live ratings.



Non-profit organisation Educate Girls has won the Ramon Magsaysay Award, one of Asia's most respected honours. The Ramon Magsaysay Foundation praised Educate Girls for breaking gender stereotypes and empowering girls through education, helping them gain confidence, skills, and independence. The award was announced on August 31, and the ceremony took place on 8 November 2025 in Manila, Philippines.

✦ Founded in 2007, Educate Girls works to close India's gender gap in education by encouraging families and communities to send girls to school.

India will join the Brazil-led Tropical Forests Forever Facility (TFFF) as an observer. India's ambassador to Brazil, Dinesh Bhatia, announced this on the second day of the Belém Leaders' Summit on 8 November 2025. ✦ Brazil, the COP30 host, has announced a $1 billion contribution; Colombia has pitched in with $250 million; Indonesia is contributing $1 billion; the Netherlands $5 million; Norway $3 billion over a decade; and Portugal 1 million euros.

India and Saudi Arabia signed the bilateral Haj Agreement for 2026, confirming a quota of 175,025 Indian pilgrims for the annual pilgrimage on 9 November 2025. The agreement was inked following Rijiju's bilateral meeting with Dr. Tawfiq bin Fawzan Al-Rabiah, Saudi Arabia's Minister of Hajj and Umrah, in Jeddah.

For more Current Affairs: Scan QR code

జాతీయ విద్యా దినోత్సవం



దేశ భవిష్యత్తును రూపొందించడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య భూమిక పోషిస్తుంది. నైపుణ్యంతో కూడిన చదువుల ద్వారానే మానవాభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వాలు చదువుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అందరూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నాయి. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చాలా కాలం పనిచేశారు. దేశంలో విద్యాభివృద్ధికి ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారు. అబుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మన దేశంలో ఏటా నవంబరు 11న 'జాతీయ విద్యా దినోత్సవం'గా (National Education Day) నిర్వహిస్తారు. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం; దేశ ప్రగతి, వ్యక్తిగత శ్రేయస్సులో చదువు పోషించే పాత్ర గురించి అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

భారతదేశంలో విద్య

పేదరికం, అసమానతలను తొలగించే అత్యంత శక్తిమంతమైన సాధనాల్లో విద్య ఒకటి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ పోటీతత్వాన్ని పెంపొందించడంలో ఇది కీలకంగా ఉంది. అందుకే అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి.

- భారతదేశంలో విద్యా వ్యవస్థలో ప్రధానంగా ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ, ఎలిమెంటరీ, సెకండరీ విద్య, ఉన్నత విద్యా వ్యవస్థలు ఉంటాయి.
- జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ); రాష్ట్ర పరిధిలో ఆయా విభాగాలు, విద్యా మంత్రిత్వ శాఖలు దేశంలో విద్యా వ్యవస్థను పర్యవేక్షిస్తాయి.

నవంబరు 11
చరిత్రలో ఈనాడు

గణాంకాలు

1951లో మనదేశంలో మొత్తం అక్షరాస్యత రేటు 18.3%. ఇందులో స్త్రీల అక్షరాస్యత 8.9% కాగా పురుషుల అక్షరాస్యత 27.2%.

❖ 2011 గణాంకాల ప్రకారం మనదేశ మొత్తం అక్షరాస్యత రేటు 73%. ఇందులో స్త్రీల అక్షరాస్యత రేటు 64.6%, పురుషుల అక్షరాస్యత 80.9%గా ఉంది.

అబుల్ కలాం ఆజాద్

1888, నవంబరు 11న సౌదీ అరేబియాలోని మక్కాలో జన్మించారు. 1940-45 వరకు కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

◆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1958, ఫిబ్రవరి 22న దిల్లీలో మరణించారు.

చారిత్రక నేపథ్యం

దేశ మొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తుంచుకునే ఉద్దేశంతో ఏటా ఆయన జన్మదినాన్ని 'జాతీయ విద్యా దినోత్సవం'గా నిర్వహించాలని భారత ప్రభుత్వం 2008, సెప్టెంబరులో తీర్మానించింది.

● అదే ఏడాది నవంబరు 11 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు.

విద్యాభివృద్ధి కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్స్, భారతదేశంలో అక్షరాస్యత రేటు తీరుతెన్నులు మొదలైన అంశాలతో పాటు ఇలాంటి మరిన్ని ఇంట్రెస్టింగ్ టాపిక్స్ గురించి తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత

వాతావరణ కాలుష్యం

వాతావరణ కాలుష్యంతో కలిగే దుష్ప్రభావాల్లో ప్రధానమైనవి:


1. గ్లోబల్ వార్మింగ్
2. ఆమ్ల వర్షాలు
3. ఓజోన్ పొర క్షీణత

హరితగృహ వాయువులు

వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు, వాటి ఫలితంగా ఏర్పడే సహజ హరితగృహ ప్రభావం లేనట్లయితే భూమి సగటు ఉపరితల ఉష్ణోగ్రత 15°C కాకుండా -18°C నుంచి -20°C మధ్య ఉండేది. ఇది జీవుల మనుగడకు ఎంతమాత్రం అనుకూలం కాదు.

ఓజోన్ పొర క్షీణత - కారణాలు

ఓజోన్ పొర క్షీణించడం వల్ల అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరతాయి. రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్, కోల్డ్‌స్టోరేజ్ ప్లాంట్‌లలో శీతలీకరణ వాయువులుగా ఉపయోగించే క్లోరోఫ్లోరో కార్బన్‌లు లేదా ఫ్రియాన్ల వల్ల ఈ పొర క్షీణిస్తుంది.



గ్లోబల్ వార్మింగ్ - దుష్ఫలితాలు - నియంత్రణ చర్యలు, ఓజోన్ పొర క్షీణత - దుష్ప్రభావాలు, ఓజోన్ పొర క్షీణతను తగ్గించేందుకు అంతర్జాతీయ చొరవ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in Digital India Corporation

Digital India Corporation in Delhi is inviting applications for the Business Analyst, Senior Full Stack Developer, Designer, etc posts on a contractual basis. The total no. of posts is 31. Eligible candidates can apply online before 20 November 2025.

Internship Jobs

Digital India Corporation in Delhi is inviting applications for filling up the Program Management, Capital and Building, and Technology Management posts in various departments. The total no. of posts is 12. The last date for online applications is 21 November 2025.

Ph.D Program

The Indian Institute of Space Science and Technology (IISST), Thiruvananthapuram, invites online applications for Ph.D admissions. Eligible candidates can apply online before 20 November 2025.

Did You Apply..?

Today (November 11) is the last date for the following Jobs.

☛ 176 Professor Jobs in NSUT Delhi.
Eligibility: BE/BTech, BS, ME/MTech/MS, PhD.

☛ Multi-Tasking Staff Posts in the Indian Coast Guard.
Eligibility: Matriculation, Driving License.

☛ Senior Programmer Jobs in AIIMS Mangalagiri.
Eligibility: Diploma, BE/BTech, MCA/BSc, LLB.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Cone

1. The slant height of a conical mountain is 3.9 km and the area of its base is $7\frac{1}{14}$ km². The height of the mountain is:
A) 3.19 km B) 3.6 km C) 2.75 km
D) 2.9 km E) 4.11 km

2. If the radius of the base of a new cone is 2.5 times of the radius of the base of the original cone, and the volume of the new cone is 3.5 times of the volume of the original cone. Then what will be the ratio of the height of the original cone to of the new cone?
A) 25 : 16 B) 14 : 25 C) 16 : 25
D) 25 : 14 E) 27 : 13

3. If the ratio of the volumes of two cones is 21 : 25 and the ratio of the radii of their bases is 3 : 5. Then the ratio of their heights will be:
A) 7 : 3 B) 7 : 5 C) 3 : 7
D) 5 : 7 E) None of the above

4. A conical tent is required to accommodate 5 persons and each person needs 42 m² of space on the ground and 294m³ of air to breath. Find the vertical height of the tent.
A) 23 m B) 22 m C) 21 m
D) 24 m E) 25 m

5. In a right circular cone, the radius of the base is $16\frac{1}{2}$ cm and the height is 56 cm. A cross section is made through the mid point of the height, parallel to the base. The volume of the upper portion is:
A) $1996\frac{1}{2}$ cm² B) $1969\frac{3}{4}$ cm²
C) $1699\frac{1}{2}$ cm² D) $1996\frac{2}{3}$ cm²
E) None of the above

6. The curved surface area of a right circular cone is four times the area of its base and its height is 63 cm. What is the volume of the cone?
A) 16,743.6 cm³ B) 17634.6 cm³
C) 17463.6 cm³ D) 17643.6 cm³
E) None of the above

7. The height of a cone is 36 cm and radius of its base is 15 cm. Find out its total surface area.
A) $2545\frac{4}{7}$ cm² B) $2545\frac{5}{7}$ cm²
C) $2545\frac{2}{7}$ cm² D) $2545\frac{3}{7}$ cm²
E) None of the above

8. Two right circular cones of equal curved surface areas have their slant heights in the ratio of 7 : 5. Find out the ratio of their radii.
A) 3 : 2 B) 7 : 5 C) 2 : 3
D) 5 : 7 E) None of the above

9. Two right circular cones of equal volumes have their heights in the ratio of 25 : 16. Find out the ratio of their radii.
A) 4 : 5 B) 16 : 25 C) 5 : 4
D) 3 : 5 E) 7 : 9

10. The volumes of two cones are in the ratio 3 : 7 and their diameters are in the ratio 2 : 3. Find out the ratio of their heights.
A) 28 : 27 B) 9 : 14 C) 27 : 28
D) 14 : 9 E) 7 : 11

11. The radius of a right circular cone is increased by $23\frac{1}{3}$% and slant height is decreased by $33\frac{1}{3}$%. Find out the percentage change in curved surface area of the cone.
A) Increased by $17\frac{5}{9}$%
B) Decreased by $17\frac{7}{9}$%
C) Decreased by $17\frac{5}{9}$%
D) Increased by $17\frac{7}{9}$%
E) None of the above

12. If a solid cone of copper height 7 cm is melted and a solid sphere of radius 7 cm is made. What is the diameter of the base of the cone?
A) 21 cm B) 14 cm C) 49 cm
D) 28 cm E) 17 cm

13. The volumes of two cones are in the ratio 7 : 4 and their heights are in the ratio 7 : 9. Find out the ratio of their radii.
A) 49 : 36 B) 2 : 3 C) 3 : 2
D) 36 : 49 E) None of the above

14. The perpendicular height of a conical tent is $4\frac{1}{5}$ m and the diameter of its base is 10 m. If 10 persons can sleep in this tent. Find how many average cu.m. of air each persons gets?
A) 11 m³ B) 10 m³
C) 42 m³ D) 22 m³
E) 37 m³

Scan the QR code for Key

These model questions were prepared by ***Dr.Vangala Srinivas, Subject Expert***

ఎంబీఏతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి..

ఎంబీఏ 2015లో పూర్తిచేసి, ప్రైవేటు జాబ్ చేస్తున్నాను. జావా, వర్డ్‌ప్రెస్, బూట్‌స్ట్రాప్, ఎస్‌క్యూఎల్, సెలీనియం కోర్సులు ఆన్‌లైన్‌లో నేర్చుకున్నాను. ఇంకా వేటిని నేర్చుకుంటే సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడొచ్చు? - రోహిత్

■ మీరు ఎంబీఏ 2015లో పూర్తి చేశాను అని మాత్రమే చెప్పారు. ఏ స్పెషలైజేషన్ చదివారు? ఎంబీఏకు ముందు గ్రాడ్యుయేషన్‌లో ఏ సబ్జెక్టులు చదివారు? ఎన్ని సంవత్సరాలుగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు? ప్రస్తుతం ఏ రంగంలో పని చేస్తున్నారు? లాంటి సమాచారం కూడా చెప్పాల్సింది. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే.. జావా, వర్డ్‌ప్రెస్, బూట్ స్ట్రాప్, ఎస్‌క్యూఎల్, సెలీనియం వంటి కోర్సులు ఆన్‌లైన్‌లో నేర్చుకోవడం వల్ల మీరు సాఫ్ట్‌వేర్ రంగంలోకి వెళ్లడానికి అవసరమైన అర్హత ఉంది. మీరు నేర్చుకున్న జావా, సెలీనియంలకు ప్రస్తుత ఐటీ మార్కెట్‌లో డిమాండ్ బాగుంది. ఈ కలయిక ప్రత్యేకంగా ఆటోమేషన్ టెస్టింగ్ రంగంలో చాలా అవకాశాలను కల్పిస్తుంది. సెలీనియం ఆటోమేషన్ టూల్‌తో కూడిన ఆటోమేషన్ టెస్టర్లు ప్రస్తుత మార్కెట్‌కు చాలా అవసరం. అందువల్ల మీరు తక్కువ సమయంలో, స్థిరమైన ఉద్యోగాన్ని పొందాలంటే సెలీనియం ఆటోమేషన్ టెస్టింగ్ అనేది మంచి అవకాశం. మూడు నెలల ప్రణాళికతో టెస్ట్ ఎన్‌జీ, కుకుంబర్, పేజ్ ఆబ్జెక్ట్ మోడల్ వంటి ఫ్రేమ్‌వర్క్‌లు నేర్చుకుని, కనీసం రెండు ప్రాక్టికల్ ప్రాజెక్టులు చేస్తే, మీ ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి.



మీరు నేర్చుకున్న వర్డ్‌ప్రెస్, బూట్ స్ట్రాప్ వంటి వెబ్ టెక్నాలజీలు కూడా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రవేశించడానికి ఉపయోగకరమే. ఇవి మీకు వెబ్ డెవలప్‌మెంట్ వైపు అవకాశాన్ని కల్పిస్తాయి. అయితే దీనికి అదనంగా జావా స్క్రిప్ట్, రియాక్ట్, యాంగ్యులర్ వంటి ఆధునిక టూల్స్ కూడా నేర్చుకోవాలి. వెబ్ డెవలప్‌మెంట్ రంగంలో కెరియర్ ముందుకు సాగాలంటే.. క్రమబద్ధ సాధన, ప్రాజెక్టుల తయారీ కోసం ఎక్కువ సమయం కేటాయించడం తప్పనిసరి.

కోడింగ్‌లో ఆసక్తి ఉంటే.. జావా డెవలపర్ గానూ రాణించవచ్చు. దీని కోసం స్ప్రింగ్‌బూట్, రెస్ట్ ఏపీఐ డెవలప్‌మెంట్, మైక్రో సర్వీసెస్ ఆర్కిటెక్చర్ వంటి ఆధునిక అంశాలను కూడా నేర్చుకుంటే, భవిష్యత్తులో మంచి వేతనంతో ఉద్యోగాలు పొందడానికి వీలవుతుంది.

–ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

అద్భుత కెరియర్‌కు.. ఐదు టెక్నిక్‌లు

విద్యార్థులూ, ఉద్యోగార్థులూ, ఇప్పటికే కొలువుల్లో ఉన్నవారూ.. అందరికీ సమయ నిర్వహణ అనేది అత్యంత కీలకం. మార్కెట్‌లో విలువను పెంచుకోవాలంటే కష్టపడి పనిచేస్తేనే సరిపోదు. తెలివిగా బాధ్యతలు నిర్వర్తించడం నేర్చుకోవాలి. మీ విద్య, ఉద్యోగ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు, ఒత్తిడిని తగ్గించుకునేందుకు.. ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు ఆచరిస్తోన్న ఐదు అధునాతన ఉత్పాదకత టెక్నిక్‌లు ఎంతో ఉపయోగపడతాయి.

1. పొమడారో టెక్నిక్

విద్యార్థులు, ఉద్యోగులు సాధారణంగా ఎక్కువ సేపు కూర్చుని చదవడానికి, పనిచేయడానికి ప్రయత్నిస్తారు. కానీ కొద్దిసేపటికే దృష్టి మళ్లుతుంది. పొమడారో టెక్నిక్ ఈ సమస్యకు పరిష్కారం చూపుతుంది. మీ పనిని 25 నిమిషాల ఏకాగ్రత గల సెషన్‌లుగా విభజించండి. ఆపై ఒక్కో సెషన్ తర్వాత 5 నిమిషాల విరామం తీసుకోండి. మీరు చేయాలనుకున్న పని మీద ఏకాగ్రత పెరుగుతుంది. విరామం తీసుకోవడం వల్ల విసుగు లేదా అలసట ఉండవు. మీ పని పూర్తవడానికి ఎన్ని 25 నిమిషాల సెషన్లు కావాలో అన్ని తీసుకోండి. ఒక్కో సెషన్ అయ్యాక కచ్చితంగా 5 నిమిషాల విరామం తప్పనిసరి. నాలుగు సెషన్ల తర్వాత ఎక్కువసేపు 15 నిమిషాలు లేదా అరగంట విరామం తీసుకోండి. ఈ 25 నిమిషాలను గమనించేందుకు ఒక స్టాప్‌వాచ్ లేదా అలారం వాడుకోవచ్చు. మనం నిర్ణయించిన టైమ్‌కి గంట మోగే పొమోడోరో పరికరాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.



కోడింగ్/ రిసెర్చ్: ఒక క్లిష్టమైన సమస్యపై 25 నిమిషాలు ఏకాగ్రతతో పనిచేసి, 5 నిమిషాల విరామంతో మెదడుకు విశ్రాంతి ఇవ్వడం ద్వారా బర్న్ అవుట్ కాకుండా ఉంటారు.

ఇంటర్వ్యూ తయారీ: ఒక అంశాన్ని (ఉదా: డేటా స్ట్రక్చర్స్) 25 నిమిషాల స్లాట్‌లో పూర్తిచేసి చిన్న విరామం తీసుకోవాలి. దీనివల్ల ఎక్కువ సమాచారం మెదడులో నిక్షిప్తమవుతుంది. నాలుగు సెషన్ల తర్వాత తీసుకునే సుదీర్ఘ విరామం (15-30 నిమిషాలు) కొత్త శక్తిని ఇస్తుంది.

2. అల్ట్రాడియన్ రిథమ్స్

పొమడారో అనేది కృత్రిమ సమయపాలన. అల్ట్రాడియన్ రిథమ్స్ మన మెదడులోని సహజ శక్తి చక్రాలను అనుసరిస్తాయి. మెదడు సుమారు 90 నుంచి 120 నిమిషాలు చురుకుగా పనిచేసి, ఆ తర్వాత కొద్దిసేపు విశ్రాంతి కోరుకుంటుంది. విశ్రాంతి సమయంలో మనం ఏ పని చేయాలనుకున్నా ఏకాగ్రత లోపిస్తుంది.

కెరియర్, విద్యలో ఉపయోగం:

✦ అత్యంత కష్టమైన, ముఖ్యమైన పనులను (పరీక్షలకు ప్రిపరేషన్, ముఖ్యమైన రిపోర్ట్ రాయడం) మీ గరిష్ఠ శక్తి సమయాల్లో (పీక్ ఎనర్జీ టైమ్) అంటే.. ఉదయం లేదా మధ్యాహ్నం 90 నిమిషాల ఏకాగ్రత ఉన్న బ్లాక్‌లలో కేటాయించండి.

✦ 90 నిమిషాల పని తర్వాత 20-30 నిమిషాల సుదీర్ఘ విరామం తీసుకోండి. ఈ విరామంలో భోజనం చేయడం, నడవడం లేదా ధ్యానం చేయడం మంచిది.

✦ ఈ పద్ధతిని అనుసరించడం వల్ల మీరు అనవసరంగా ఎక్కువ సేపు పనిచేయకుండా మీ అత్యంత చురుకైన సమయాన్ని (ప్రొడక్టివ్ అవర్స్) ఉపయోగించుకోవచ్చు.

3. ఫ్లో టైమ్ టెక్నిక్

పొమడారోలోని కఠినమైన టైమర్ నియమం కొంతమందికి నచ్చదు. అలాంటివారి కోసం ఫ్లోటైమ్ టెక్నిక్ సరైనది.

✦ పని ప్రారంభించే ముందు టైమర్‌ని ఆన్‌చేసి, మీరు ఎంతసేపు ఏకాగ్రతతో పనిచేయాలనుకుంటే అంతసేపు పనిచేయండి. ఫోకస్ కోల్పోయామని అనిపించినప్పుడు లేదా పని పూర్తయినప్పుడు టైమర్‌ను ఆపండి. ✦ తర్వాత మీకు అవసరమైనంత విరామం తీసుకోండి.

✦ మీరు పనిచేసిన సమయాన్ని, తీసుకున్న విరామ సమయాన్ని ఒక నోట్‌బుక్‌లో రికార్డు చేయండి. ఉదా: రిపోర్ట్ రాయడానికి పట్టిన సమయం 47 నిమిషాలు, విరామం 8 నిమిషాలు.

✦ ఈ పద్ధతి ద్వారా మీరు ఏ సమయంలో అత్యంత ఎక్కువ ఏకాగ్రతతో ఉన్నారో తెలుస్తుంది. ఇది ఫ్లోస్టేట్ సాధించడానికి సహాయపడుతుంది. అంటే పనిలో పూర్తిగా లీనమైపోవడం.. అన్నీ మర్చిపోవడం. ఈ ఫ్లో స్టేట్ కెరియర్‌లో కొత్త ఆవిష్కరణలకు, నాణ్యమైన పనికి చాలా ముఖ్యం.

4. గెటింగ్ థింగ్స్ డన్ (జీటీడీ)

డేవిడ్ అలెన్ రూపొందించిన జీటీడీ అనేది మీ మనసులోని అన్ని పనులు, ఆలోచనలు, ప్రాజెక్టులు, చిరాకులు అన్నింటినీ ఒక వ్యవస్థీకృత పద్ధతిలోకి తీసుకురావడం. ఈ మధ్య నోషన్, గూగుల్ డాక్స్ మొదలైన సాఫ్ట్‌వేర్లలో ఈ పట్టిక ఉపయోగించుకోవడానికి అనువుగా అందుబాటులో ఉంది. ఈ పట్టికల ఖాళీ నమూనా మూసను ముద్రించి వాడుకోవచ్చు కూడా.



పట్టుకోవడం (Capture): చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అన్ని to do లను (అసైన్‌మెంట్‌లు, ఈమెయిల్‌లు, మీటింగ్‌ల ఆలోచనలు) ఒకచోట (నోట్‌బుక్ లేదా యాప్‌లో) రాయండి.

స్పష్టం చేయడం (Clarify): ప్రతి అంశాన్నీ చూసి తదుపరి చర్య ఏమిటో నిర్ణయించుకోండి. ఉదాహరణకు రిపోర్ట్ అనేది తదుపరి చర్య కాదు. దాని తదుపరి చర్య రిపోర్ట్ అవుట్‌లైన్ డ్రాఫ్ట్ చేయడం.

నిర్వహించడం (Organize): ఈ తదుపరి చర్యలను అవి ఎప్పుడు చేయాలి (క్యాలెండర్), ఎక్కడ చేయాలి (కంటెక్స్ట్) ఎవరికి అప్పగించాలి (వెయిటింగ్ ఫర్) అనే వాటి ఆధారంగా జాబితాలుగా విభజించండి.

✦ ఈ వ్యవస్థను అనుసరించడం ద్వారా మీ మనసు ప్రశాంతంగా ఉండి, ఏ పనీ మర్చిపోకుండా, ఏ సమయంలో ఏమి చేయాలో స్పష్టంగా తెలుస్తుంది.

5. కాన్‌బాన్ మెథడ్

కాన్‌బాన్ అనేది మీ పని పురోగతిని దృశ్యరూపంలో చూపించే పద్ధతి. ఒక బోర్డు (Trello/Asana లాంటి డిజిటల్ టూల్) తీసుకుని, దాన్ని మూడు ప్రధాన కాలమ్‌లుగా విభజించండి.

1. To Do (చేయవలసినవి): ఇంకా మొదలుపెట్టని పనులన్నీ ఇక్కడ ఉంటాయి.

2. Doing (చేస్తున్నవి): ప్రస్తుతం మీరు ఏకాగ్రతతో చేస్తున్న పనులు. (గమనిక: ఒకసారి ఒకటి లేదా రెండు పనులకు మించి ఈ కాలమ్‌లో ఉండకూడదు).

3 Done (పూర్తిచేసినవి): విజయవంతంగా పూర్తిచేసిన పనులు. కొత్త ప్రాజెక్టులను ప్రారంభించినప్పుడు వాటిని To Do కాలమ్‌లో ఉంచి, పని మొదలు పెట్టినప్పుడు Doing లోకి, పూర్తయిన తర్వాత Done లోకి మారుస్తారు. మీ కెరియర్ లేదా విద్యలో ఒక పెద్ద ప్రాజెక్టు (ఉదా: చివరి సంవత్సరం ప్రాజెక్టు, ఆఫీస్ ప్రజెంటేషన్) తీసుకుంటే, కాన్‌బాన్ పద్ధతిని ఉపయోగించడం వల్ల పని ఏ దశలో ఉందో స్పష్టంగా తెలుస్తుంది. అలాగే పనిలో అడ్డంకులు ఎక్కడ ఉన్నాయో గుర్తించవచ్చు.



రహ్మానుద్దీన్

ఈ ఐదు శక్తిమంతమైన టెక్నిక్‌లు కేవలం సమయాన్ని పాటించడానికి మాత్రమే కాదు.. నాణ్యమైన పనిని తక్కువ ఒత్తిడితో అందించడానికి సహాయపడతాయి. పొమడారో లేదా ఫ్లోటైమ్ ద్వారా మీ ఏకాగ్రతను పెంచుకోండి. జీటీడీ, కాన్‌బాన్ ద్వారా మీ ప్రాజెక్టులను నిర్వహించండి. అల్ట్రాడియన్ రిథమ్స్‌తో మీ సహజ శక్తిని ఉపయోగించుకోండి. ఈ సూత్రాలను అమలు చేసినవారు మిగిలిన వారి కంటే ముందంజలో ఉండి.. విద్య, కెరియర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. మీ భవిష్యత్తు విజయం అనేది.. మీరు తీసుకునే ఉత్పాదకత నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

నోటీస్ బోర్డు

ఏవీఎన్‌ఎల్‌లో.. జూనియర్ టెక్నీషియన్లు

చెన్నై అవడిలోని ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్‌ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి 133 జూనియర్ టెక్నీషియన్ పోస్టులను భర్తీచేయనుంది. డిగ్రీ/ డిప్లొమాతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియమిస్తారు.

జూనియర్ టెక్నీషియన్ 130, జూనియర్ మేనేజర్ 1, డిప్లొమా టెక్నీషియన్ 2 ఖాళీలు ఉన్నాయి. మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వుడ్‌కు 63, ఈడబ్ల్యూఎస్‌కు 10, ఓబీసీకి 34, ఎస్సీకి 17, ఎస్టీకి 9 కేటాయించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఎంపిక చేస్తారు. ఏడాది కాలానికి ఎంపిక చేసినప్పటికీ నాలుగేళ్లు పొడిగించే అవకాశముంది. వచ్చిన దరఖాస్తుల సంఖ్యను బట్టి రాత పరీక్ష/ ఇంటర్వ్యూ లేదా రెండూ నిర్వహిస్తారు. విద్యార్హతల డిగ్రీ/డిప్లొమాలో పొందిన మార్కులతో షార్ట్‌లిస్ట్ చేసి 1:5 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు. దీంట్లో అర్హత పొందిన వారికి ట్రేడ్ టెస్ట్/ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. కాల్ లెటర్లను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి పంపిస్తారు. తుది ఫలితాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. ట్రేడ్/ ప్రాక్టికల్ టెస్ట్/ ఇంటర్వ్యూలను అంబర్‌నాథ్‌లో నిర్వహిస్తారు



ముఖ్యాంశాలు:

అర్హతలు: జూనియర్ మేనేజర్.. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి. డిప్లొమా టెక్నీషియన్.. మెకానికల్ ఇంజినీరింగ్ (టూల్ అండ్ డై) ఉత్తీర్ణత. జూనియర్ టెక్నీషియన్.. టర్నర్/ మెషినిస్ట్/ ఫిట్టర్/ ఎలక్ట్రానిక్స్/ మెకానిక్/ ఎలక్ట్రీషియన్/ పవర్ ఎలక్ట్రీషియన్/ మిల్‌రైట్ మెకానిక్/ మెకానిక్ మెషిన్‌టూల్ మెయింటెనెన్స్ ట్రేడ్‌తో ఎన్‌ఏసీ/ఎన్‌టీసీ. ఉద్యోగానుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు లేదు.

వేతనం: జూనియర్ టెక్నీషియన్‌కు నెలకు రూ.34,227, జూనియర్ మేనేజర్‌కు రూ.47,610, డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.37,201. వసతి/హెచ్‌ఆర్‌ఏ, పీఎఫ్, ఎక్స్‌గ్రేషియా, గ్రాట్యుటీ, వైద్య సదుపాయాలుంటాయి.

పూర్తిచేసిన దరఖాస్తులకు ధ్రువపత్రాల కాపీలను జతచేసి పోస్టులో పంపాలి. **చిరునామా:** చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్, మెషిన్ టూల్ ప్రొటోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్ జిల్లా, థానే, మహారాష్ట్ర-421 502.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.11.2025

వెబ్‌సైట్: https://avnl.co.in/

సీనియర్ రెసిడెంట్లు..

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, భువనేశ్వర్ వివిధ విభాగాల్లో 132 సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, ఎఫ్‌ఎంటీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మైక్రోబయాలజీ, నియోనటాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, ఫార్మకాలజీ .. మొదలైనవి.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 45 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీకి 5 ఏళ్లు, ఓబీసీకి 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీకి 10 ఏళ్లు సడలింపు ఉంటుంది.

మూల వేతనం: నెలకు రూ.67,700.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1770. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు 1416.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 27.

ఎంపిక: ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://aiimsbhubaneswar.nic.in/

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో..

డిజిటల్ ఇండియా కార్పొరేషన్, దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● బిజినెస్ అనలిస్ట్ - 03 ● టెక్నాలజీ హెడ్ - 01 ● సొల్యూషన్ ఆర్కిటెక్ట్ - 01 ● సీనియర్ ఫుల్ స్టాక్ డెవలపర్ -04 ● ఫుల్ స్టాక్ డెవలపర్ - 02 ● ఫ్రంట్-ఎండ్ డెవలపర్ - 02 ● మొబైల్ డెవలపర్ - 01 ● డిజైనర్ - 01 ● డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ -01 ● సీనియర్ డేటా అనలిస్ట్ -01 ● సీనియర్ డేటాబేస్ ఇంజినీర్ - 01 ● డేటా సైంటిస్ట్ - 01 ● సీనియర్ సైబర్ సెక్యూరిటీ మేనేజర్ - 01 ● సీనియర్ క్లౌడ్ కమ్ డెవ్‌ఆప్స్ ఇంజినీర్ -02 ● లెవెల్ 1 ఇంజనీర్ / ఐటీ సపోర్ట్ ఇంజినీర్ - 02 ● హెడ్ - 01 ● డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్ - 01 ● కంటెంట్ రైటర్ - 01 ● గ్రాఫిక్ డిజైనర్ -02 ● హెడ్ సీబీ అండ్ ఆన్‌బోర్డింగ్ - 01 ● బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ - 02 **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 20-11-2025.

ఎంపిక: ఇంటర్వ్యూతో **వెబ్‌సైట్:** https://dic.gov.in/careers/

రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో..

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● టెక్నికల్ అసిస్టెంట్ -02 ● టెక్నీషియన్- 11

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 75 శాతం మార్కులతో ఐటీఐ/ ఎన్‌టీసీ/ ఎన్‌ఏసీ/ డిప్లొమా/ బీటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 30.11.2025 నాటికి 18-35 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.44,900 - రూ.1,42,400. టెక్నీషియన్‌కు రూ.21,700 - రూ.69,100. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30. ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లతో **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in/

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో..

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్ ఒప్పంద ప్రాతిపదికన 17 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● సీనియర్ మేనేజర్: 01 ● జూనియర్ మేనేజర్: 16

విభాగాలు: ఆర్మోర్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్/ఐటీ, ఎలక్ట్రికల్, మెటలర్జీ, సీఏడీ స్పెషలిస్ట్, మెకానికల్

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు; జూనియర్ మేనేజర్‌కు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతనం:** నెలకు సీనియర్ మేనేజర్‌కు రూ.70,000, జూనియర్ మేనేజర్‌కు రూ.30,000. ఎంపిక: విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూతో. **తపాలా ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** 28.11.2025.

చిరునామా: ది డిప్యూటీ జనరల్ మేనేజర్/హెచ్‌ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా

వెబ్‌సైట్: https://ddpdoo.gov.in/career

ఎయిమ్స్ రాయ్‌బరేలీలో..

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రాయ్‌బరేలీ.. రెగ్యులర్, కాంట్రాక్టు/డిప్యుటేషన్ ప్రాతిపదికన ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. ● ప్రొఫెసర్ - 25 ● అడిషనల్ ప్రొఫెసర్ - 21 ● అసోసియేట్ ప్రొఫెసర్ - 25 ● అసిస్టెంట్ ప్రొఫెసర్ - 25

విభాగాలు: అనాటమీ, అనస్థీషియా, బయోకెమిస్ట్, ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్, ఫోరెన్సిక్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, న్యూరోసర్జరీ.. మొదలైనవి. **అర్హత:** పోస్టు ప్రకారం.. ఎండీ/ఎంఎస్, డీఎం/ఎంసీహెచ్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,68,900 - రూ.2,00,000. అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.1,48,200 - రూ.2,00,000. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300 - రూ.1,88,000. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 - రూ.2,09,200.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 21.12.2025.

వెబ్‌సైట్: https://aiimsrbl.edu.in/recruitments

రైట్స్‌లో మేనేజర్లు...

గురుగ్రామ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ (రైట్స్) లిమిటెడ్... 40 మేనేజర్ (సివిల్) పోస్టులను భర్తీచేయనుంది. సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ, నాలుగేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వుడ్‌కు 18, ఈడబ్ల్యూఎస్‌కు 3, ఓబీసీకి 10, ఎస్సీకి 6, ఎస్టీకి 3 కేటాయించారు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 125 ప్రశ్నలతో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. నెగటివ్ మార్కులు లేవు. వ్యవధి రెండున్నర గంటలు.


రాత పరీక్షలో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 45 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి. వీరిని 1:6 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూ తేదీని తర్వాత ప్రకటిస్తారు. రాత పరీక్షకు 60 శాతం, ఇంటర్వ్యూకు 40 శాతం వెయిటేజీ ఇస్తారు. ఇంటర్వ్యూలో టెక్నికల్, ప్రొఫెషనల్ పరిజ్ఞానానికి 30 శాతం, కమ్యూనికేషన్ నైపుణ్యానికి 10 శాతం మార్కులు ఉంటాయి. దీంట్లో హిందీ/ ఇంగ్లిష్ భాషను ఎంచుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత: రాత పరీక్ష సిలబస్‌ను ప్రకటనలో వివరంగా తెలియజేశారు. ఆయా అంశాలను అధ్యయనం చేసి పునశ్చరణ చేసుకోవాలి. రాత పరీక్షకు సుమారుగా నెల రోజుల సమయం ఉంది. కాబట్టి ఇప్పటినుంచీ సన్నద్ధతను మొదలుపెడితే కనీసార్హత మార్కులను సులభంగా సాధించవచ్చు. నెగటివ్ మార్కులు లేవు. ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలి. ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ముఖ్యాంశాలు : అర్హతలు: 60 శాతంతో సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ (ఎన్‌సీఎల్)/ దివ్యాంగులకు 50 శాతం సరిపోతుంది. సంబంధిత రంగంలో నాలుగేళ్ల అనుభవం ఉండాలి. **వయసు:** 40 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ.600. ఈడబ్ల్యూఎస్/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.300. **వేతన శ్రేణి:** నెలకు రూ.50,000-1,60,000. మూలవేతనానికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, టీఏ, డీఏ, పీఎఫ్, గ్రాట్యుటీ, ఇతర సదుపాయాలుంటాయి. **రాత పరీక్ష కేంద్రాలు:** దిల్లీ/గురుగ్రామ్, కోల్‌కతా, బెంగళూరు, ముంబయి, చెన్నై, బిలాయ్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 30.11.2025 **రాత పరీక్ష తేదీ:** 14.12.2025

వెబ్‌సైట్: https://www.rites.com/

ఇంటర్న్‌షిప్స్



వర్క్ ఫ్రమ్ హోమ్

లీడ్ జనరేషన్

సంస్థ: ఎలిట్రా ఎడ్యుఫై టెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: బ్రాండింగ్, లీడ్ జనరేషన్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.13,000-35,000
☛ https://shorturl.at/cIAjq

కాపీరైటింగ్

సంస్థ: ఏ బాక్స్ ఆఫ్ స్టోరీస్
నైపుణ్యాలు: కాపీరైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.6,000-8,000
☛ https://shorturl.at/2s7g9

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: నోటరీ యాప్
నైపుణ్యాలు: ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.11,000-16,500
☛ https://shorturl.at/RjsEl

గ్రోత్ అండ్ స్ట్రాటజీ

సంస్థ: టెక్‌జార్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: లింక్డ్‌ఇన్, సోషల్‌మీడియా మార్కెటింగ్ అండ్ స్ట్రాటజీ, మార్కెటింగ్ క్యాంపైన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీ, మార్కెట్ రిసెర్చ్, స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/B3Phc

ఔట్‌బౌండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ – వర్చువల్ అసిస్టెంట్

సంస్థ: ఆర్చ్‌స్కేల్ గిల్డ్
నైపుణ్యాలు: కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, కంటెంట్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, డేటా ఎక్స్‌ట్రాక్షన్, లీడ్ జనరేషన్
స్టైపెండ్: రూ.7,000-11,000
☛ https://shorturl.at/ov1e8

కంటెంట్ అండ్ సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: జీన్ లిథోస్ అండ్ కంపెనీ ప్రై.లి.
నైపుణ్యం: పోస్టర్ డిజైన్
స్టైపెండ్: రూ.7,000-9,000
☛ https://shorturl.at/hBoZy

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: సబ్‌స్పేస్
నైపుణ్యాలు: ఎంఎస్-ఎక్సెల్, సేల్స్, సేల్స్ సపోర్ట్ స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/m3qlc

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 5

లీడ్ జనరేషన్

సంస్థ: బృహత్ ఇన్ఫోటెక్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, లీడ్ జనరేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ స్టైపెండ్: రూ.9,000-15,000
☛ https://shorturl.at/tPj1z

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: వెబ్‌మోబి
నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ స్టైపెండ్: రూ.5,000-6,000
☛ https://shorturl.at/1Yp0Z

వీటికి దరఖాస్తు గడువు: డిసెంబరు 4

షట్‌డౌన్ ప్రభావం.. 1600కు పైగా విమానాలు రద్దు

వాషింగ్టన్: అమెరికాలో షట్‌డౌన్ ప్రభావం విమాన సర్వీసులపై తీవ్రంగా పడుతోంది. సోమవారం కూడా 1600 విమానాలు రద్దయ్యాయి. 1000కుపైగా విమానాలు ఆలస్యమయ్యాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా వేతనాలు లభించకపోవడంతో దేశవ్యాప్తంగా విధులకు హాజరుకాని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. దీంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రంగంలోకి దిగారు. వెంటనే విధులకు హాజరుకావాలని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లను కోరారు. లేకపోతే వేతనాల్లో కోతలు విధిస్తానని హెచ్చరించారు. షట్‌డౌన్ సమయంలో సెలవులు తీసుకోని కంట్రోలర్లకు 10 వేల డాలర్ల బోనస్ చెల్లిస్తానని కూడా హామీ ఇచ్చారు.

పలువురికి క్షమాభిక్ష ప్రసాదించిన ట్రంప్

వాషింగ్టన్: ఐదేళ్ల క్రితం జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాన్ని తారుమారు చేయడానికి రిపబ్లికన్లు చేసిన ప్రయత్నానికి మద్దతు తెలిపిన పలువురికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించారు. వారిలో అధ్యక్షుడి మాజీ వ్యక్తిగత న్యాయవాది రూడీ గిలియానీ, మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మెడోస్ తదితరులు ఉన్నారని అమెరికా న్యాయశాఖ ప్రకటించింది. ఈ కేసుతో ప్రమేయమున్న వ్యక్తులకు పూర్తిగా, బేషరతుగా క్షమాభిక్ష ప్రసాదిస్తున్నట్టు ప్రభుత్వ క్షమాభిక్షల విభాగం న్యాయవాది ఎడ్ మార్టిన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. సంప్రదాయవాద న్యాయవాదులైన సిడ్నీ పావెల్, జాన్ ఈస్ట్‌మాన్‌లు కూడా క్షమాభిక్ష పొందినవారిలో ఉన్నారు. అయితే ఈ క్షమాభిక్ష అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వర్తించదని అధికారిక ప్రకటన తెలిపింది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌పై డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అధ్యక్షుడు ప్రసాదించిన క్షమాభిక్ష కేవలం ఫెడరల్ నేరాలకు మాత్రమే వర్తిస్తుంది. జాతీయ సయోధ్య సాధనలో భాగంగానే ఈ చర్య తీసుకున్నట్టు అధికారిక ప్రకటన తెలియజేసింది.

బిహార్‌ను నీతీశ్ ప్రభుత్వం నాశనం చేసింది: రాహుల్‌గాంధీ

దిల్లీ: విద్య, ఆరోగ్య రంగాలను నిర్వీర్యం చేసి, నీతీశ్ కుమార్ ప్రభుత్వం బిహార్‌ను నాశనం చేసిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఉపకులపతులు ఉంటున్నారని, అందుకే ఒక దాని తర్వాత మరో పేపర్ లీకవుతుందని విమర్శించారు. ఇటీవల యువతతో సమావేశం అయిన ఆయన.. సంబంధిత వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేశారు. నేటితరం సత్యం, అహింసను నమ్ముతుందని, భారత్‌ను ఉన్నత భవిష్యత్తు వైపు ముందుకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత రాజకీయ రంగంలో అడుగుపెడితే చూడాలని ఉందన్నారు. సమావేశంలో బిహార్ గురించి ప్రస్తావన రాగా ఆయన ఈ వ్యాఖ్యల చేశారు.

పాక్‌లో 20 మంది మిలిటెంట్లు హతం

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంఖ్వాలో రెండు వేర్వేరు ఘటనల్లో 20 మంది తాలిబన్ మిలిటెంట్లను భద్రతా బలగాలు హతమార్చాయి. ఈ విషయాన్ని పాక్ సైన్యం సోమవారం తెలిపింది. దక్షిణ వజీరిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగిందని, అందులో ఆరుగురికి గాయాలయ్యాయని కూడా ప్రకటించింది. ఈ దాడి వెనక తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ ఉందని పేర్కొంది.

ఇంటి పైకప్పు కూలి.. ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి

- బిహార్‌లో ఘటన

సారన్: బిహార్‌లో సోమవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సారన్ జిల్లా మానస్ గ్రామంలో ఓ ఇంటి పైకప్పు కూలడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృత్యువాతపడ్డారు. మృతుల్లో ముగ్గురు పిల్లలున్నారు. ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో వారు నిద్రిస్తుండగా ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికి తీసి.. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు పేర్కొన్నారు.

భవనంలో అగ్నిప్రమాదం.. నలుగురి సజీవదహనం

- మహారాష్ట్రలో ఘటన

ముంబయి: మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ రెండు అంతస్తుల భవంతిలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో దంపతులు, వారి కుమార్తె, మనవరాలు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. వీటా పట్టణం.. సావర్కర్ నగర్‌లోని ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న విద్యుత్ పరికరాల దుకాణంలో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. అవి పై అంతస్తుకు వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వం విఫలం

- కేంద్రాన్ని విమర్శించిన కాంగ్రెస్

దిల్లీ: దేశ రాజధానిలో కాలుష్య తీవ్రతతో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోందని ఇండియా గేట్ వద్ద నిరసనలు వ్యక్తం చేస్తున్న దిల్లీ వాసులను పోలీసులు నిర్బంధించడంపై సోమవారం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజలే తమ కర్తవ్యాలను నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్రాన్ని విమర్శిస్తూ.. గాలి కాలుష్యంపై నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రజలను నేరస్థులుగా ఎందుకు చూస్తున్నారని ఆయన ప్రశ్నించారు? వాయు కాలుష్యం కొట్లాది మంది భారతీయులను ప్రభావితం చేస్తోందన్నారు. ఓటు చోరీ ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించడం లేదన్నారు. తక్షణమే వాయు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమెరికాకు కాస్తంత ఊరట!

- షట్‌డౌన్ ముగింపు దిశగా కీలక అడుగు
- నిధుల విడుదల బిల్లుకు సెనెట్ 60-40 ఓట్లతో ఆమోదం
- మద్దతు తెలిపిన 8 మంది డెమోక్రాట్ సెనెటర్లు

వాషింగ్టన్: అమెరికాను గత కొన్ని వారాలుగా అతలాకుతలం చేస్తున్న ప్రభుత్వ షట్‌డౌన్ త్వరలో ముగిసే అవకాశం ఉంది. ఈ దిశగా కీలక అడుగు పడింది. ప్రభుత్వ శాఖలు, సంక్షేమ పథకాలకు నిధులను విడుదల చేసే బిల్లుకు అమెరికా సెనెట్ ఆమోద ముద్ర వేసింది. దీంతో గత 40 రోజులుగా స్తంభించిన ప్రభుత్వ పాలన త్వరలో గాడిలో పడే అవకాశం ఉంది. ఆదివారం రాత్రి సెనెట్‌లో జరిగిన ప్రొసీజరల్ ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 60 మంది, వ్యతిరేకంగా 40 మంది ఓటేశారు. 8 మంది విపక్ష డెమోక్రాట్ సభ్యులు కూడా బిల్లుకు మద్దతు పలికారు. గత నెల ఒకటో తేదీన వార్షిక నిధుల బిల్లుకు సెనెట్ ఆమోదం తెలపకపోవడంతో ఈ షట్‌డౌన్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. ఫెడరల్ ఉద్యోగులకు వేతనాలు ఆగిపోయాయి. సంక్షేమ పథకాలకు నిధులు కరవయ్యాయి. విమానయానం సహా పలు రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో బిల్లు ఆమోదం పొందడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్లకు భారీ ఊరటే. డెమోక్రాట్లకు, రిపబ్లికన్లకు కుదిరిన ఒప్పందం ప్రకారం.. జనవరి 26 వరకు ప్రభుత్వానికి నిధులు ఇబ్బంది ఉండదు. ఆలోపు వార్షిక నిధుల బిల్లులను కాంగ్రెస్‌లో రిపబ్లికన్లు ఆమోదించుకోవాల్సి ఉంటుంది. అయితే డిసెంబరు 31తో ముగియనున్న 'అఫర్డబుల్ కేర్ యాక్ట్' (ఏసీఏ) రాయితీలపై ఎలాంటి హామీ పొందకుండా, తమ పార్టీకి చెందిన సభ్యులు బిల్లుకు మద్దతు పలకడంపై డెమోక్రటిక్ పార్టీలోనే చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లు సెనెట్ ఆమోదం పొందినా, అదింకా పలు అడ్డంకులను అధిగమించాల్సి ఉంటుంది. సెనెట్‌లోనే మరోసారి దీనిపై ఓటింగ్ జరగనుంది. తర్వాత ప్రతినిధుల సభ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అప్పుడే బిల్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దగ్గరకు వెళుతుంది. ఆయన సంతకం పెట్టిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఇందుకు మరికొన్ని రోజులు పట్టొచ్చు. అయితే ఎంత వీలైతే అంత తొందరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది.

ఒప్పందం కుదిరిందిలా..

షట్‌డౌన్‌పై ప్రతిష్టంభనను తొలగించడానికి గత కొన్ని వారాలుగా తీవ్రస్థాయిలో అధికార రిపబ్లికన్, విపక్ష డెమోక్రాట్ సెనెటర్ల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అఫర్డబుల్ కేర్ యాక్ట్ (ఏసీఏ) రాయితీలపైనే పీటముడి పడుతూ వస్తోంది. ఏసీఏను ఒబామా కేర్ అని కూడా అంటారు. నిధుల బిల్లులోనే రాయితీలనూ చేర్చాలని డెమొక్రాట్లు పట్టుబడుతూ వచ్చారు. దీనికి రిపబ్లికన్లు అంగీకరించకపోవడంతో పలు దఫాలుగా జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మరోవైపు ప్రజలపై



షట్‌డౌన్ తీవ్ర ప్రభావం చూపిస్తుండటంతో సెనెటర్లపైనా ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలోనే సెనెట్ మెజారిటీ నేత జాన్ తూన్, డెమోక్రటిక్ పార్టీ సెనెటర్లు జీన్ షహీన్, మేగీ హాసన్‌ల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలకు వైట్‌హౌస్ కూడా మద్దతిచ్చింది. దీంతో 8 మంది డెమోక్రాట్ సెనెటర్లు అనుకూలంగా ఓటేశారు. రిపబ్లికన్ సెనెటర్ రాండ్ పాల్ మాత్రం బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం గమనార్హం. ఈ బిల్లుతో దేశ అప్పు మరింత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఒబామా కేర్‌పై దక్కని హామీ

బిల్లుకు అనుకూలంగా ఓటేసిన డెమోక్రాట్ సెనెటర్లు కీలకమైన అఫర్డబుల్ కేర్ యాక్ట్ రాయితీల పొడిగింపుపై మాత్రం ట్రంప్ యంత్రాంగం నుంచి హామీ పొందలేకపోయారు. ఈ రాయితీల గడువు డిసెంబరు 31తో ముగియనుంది. అయితే ఆ గడువుకు ముందు (డిసెంబరు మూడో వారంలో) ఈ అంశంపై సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించడానికి మాత్రం రిపబ్లికన్లను ఒప్పించగలిగారు.

స్త్రీ, పురుష ఓటర్ల వివరాలు ఎందుకు వెల్లడించలేదు?

- ఈసీకి తేజస్వీ యాదవ్ ప్రశ్న

పట్నా: ఎన్నికల సంఘంపై ఆర్జేడీ నేత, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బిహార్‌లో మొదటి దశ పోలింగ్ జరిగి 4 రోజులు గడిచినా 'జెండర్-వైజ్(స్త్రీ, పురుషులు, థర్డ్ జెండర్ ఓటర్ల) డేటా'ను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. గతంలో ఈ వివరాల్ని వెంటనే ఇచ్చేవారని గుర్తుచేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ బిహార్‌లో 'ఓట్ల చోరీని, వంచన'ను సహించదని స్పష్టంచేశారు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని తేజస్వీ యాదవ్ విశ్వాసం వ్యక్తంచేశారు. అంతేకాకుండా నవంబర్ 18న తాము ప్రమాణ స్వీకారం చేస్తామని అన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, మహాగఠ్‌బంధన్ బిహార్ ఎన్నికల్లో గెలిస్తే నేరస్థులు, మతతత్వ శక్తులు, అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో ఎన్నికల సంఘం సరిగ్గా పనిచేయడం లేదని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. అమిత్ షాతో ఈసీ కుమ్మక్కై సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే, అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు. కాగా, తేజస్వీ వ్యాఖ్యలపై ఈసీ స్పందించింది. స్త్రీ, పురుష ఓటర్ల వివరాలు సహజంగా తుది పోలింగ్ తర్వాత వెల్లడిస్తామని, ఈసారి అలాగే అందిస్తామని స్పష్టం చేసింది.



పట్నాలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తేజస్వీ యాదవ్. చిత్రంలో ఎంపీ మీసా భారతి

భద్రతా సిబ్బందిగా వారే ఎందుకు?

బిహార్‌లో మోహరించిన పోలీసుల్లో ఏకంగా 68 శాతం మంది భాజపా పాలిత రాష్ట్రాలకు చెందినవారే ఎందుకున్నారని తేజస్వీ ప్రశ్నిచారు. వారిపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. అమిత్ షాతో సహా బయటి వ్యక్తులు బిహార్‌ను నియంత్రించాలని అనుకుంటున్నారని, అయితే దీనిని బిహార్ ప్రజలు అనుమతించరని తేజస్వీ యాదవ్ అన్నారు.

ఆ రోడ్డు ప్రమాదానికి కారణమేమిటి?

- రాజస్థాన్‌లో 15 మంది మృతిపై ఎన్‌హెచ్‌ఏఐకి సుప్రీంకోర్టు నోటీసు

దిల్లీ: రాజస్థాన్‌లోని ఫలోడిలో ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మంది మృతి చెందడంపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ), రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఫలోడి రహదారిపై ఎన్ని దాబాలున్నాయి, ఆ రహదారి పరిస్థితి ఏమిటి, నిర్మాణ సమయంలో నిబంధనలను గుత్తేదారు పాటించారా, రోడ్డు నిర్వహణ ఎలా ఉంది తదితర ప్రశ్నలను సంధించింది. రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం స్పష్టం చేసింది. భక్తులతో వెళ్తోన్న టెంపో ట్రావెలర్ రహదారిపై నిలిచి ఉన్న ట్రక్‌ను ఢీకొనగా 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై విచారణను సుప్రీంకోర్టు సుమోటోగా చేపట్టింది.

కశ్మీర్‌లో రాళ్లు విసరడం సాధారణ చర్యేమీ కాదు

- వేర్పాటువాది షాబీర్ షా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పోలీసులు, సాయుధ బలగాలపై కశ్మీర్‌లో రాళ్లు విసరడాన్ని సాధారణ చర్యగా భావించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. కొన్నేళ్లుగా జైలులో ఉంచిన తనను గృహ నిర్బంధంలోకి మార్చేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ కశ్మీర్ వేర్పాటువాద నేత షాబీర్ షా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌నాథ్ ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. గృహ నిర్బంధానికి సంబంధించిన ఉత్తర్వుల కోసం నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకోవాలని ధర్మాసనం సూచించింది. షాబీర్ షా తాజా అభ్యర్థనపై మూడు వారాల్లోగా సమాధానం తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశించింది. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలకు పాల్పడే సంస్థలతో షాబీర్ షాకు సంబంధాలున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. వివిధ కేసుల్లో బెయిల్ కోరుతూ దాఖలైన పిటిషన్‌లో 'గృహ నిర్బంధానికి మార్పు' విషయాన్ని చేర్చడంపై అభ్యంతరం తెలిపారు. ఉగ్రవాదులకు నిధుల చేరవేత కేసులో మధ్యంతర బెయిల్ కోరిన షాబీర్ షా పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇది వరకు కొట్టివేసింది.

సాధారణ కేసుల్లో డీఎన్ఏ పరీక్షకు ఆదేశాలు వద్దు

- కోర్టులకు సుప్రీం స్పష్టీకరణ


దిల్లీ: ఒక వ్యక్తి పితృత్వాన్ని నిరూపించి తీరాల్సిన అవసరం లేని సాధారణ కేసుల్లో కోర్టులు డీఎన్ఏ పరీక్షకు తేలికగా ఆదేశాలు జారీ చేయరాదని సర్వోన్నత న్యాయస్థానం సోమవారం స్పష్టంచేసింది. డీఎన్ఏ పరీక్ష జరపాలన్న ఆదేశాలను అతి జాగ్రత్తగా అన్ని విషయాలూ పరిగణనలోకి తీసుకున్నాకే జారీ చేయాలని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆ పరీక్షకు ఆదేశించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒక వ్యక్తిని బలవంతంగా డీఎన్ఏ పరీక్షకు గురిచేయడం అతని గోప్యతకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్టేనని న్యాయమూర్తులు పేర్కొన్నారు. చట్టబద్ధత, ప్రభుత్వ సక్రమ లక్ష్యం, అవసరానుగుణ్యత అనే అంశాల ప్రాతిపదికన మాత్రమే ఈ పరీక్షల్ని నిర్వహించవచ్చని స్పష్టం చేశారు. "వైజ్ఞానిక సాక్ష్యాలు సేకరించే సాకుతో కోర్టులు కుటుంబ అనుబంధాలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకూడదు" అని న్యాయమూర్తులు పేర్కొన్నారు. డీఎన్ఏ పరీక్ష జరిపించుకోడానికి రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రి డీన్ సమక్షంలో హాజరు కావల్సిందిగా మద్రాసు హైకోర్టు ఓ వైద్యుడికి జారీ చేసిన ఆదేశాలను పక్కన పెడుతూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ డాక్టరు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. 2001 సంవత్సరంలో ఒక పేద ముస్లిం మహిళ తన ఆర్థిక పరిస్థితుల కారణంగా విడాకులు పొందిన వ్యక్తిని వివాహం చేసుకోవాల్సి రావడం ఈ వ్యాజ్యానికి మూలం. ఆ మహిళను వివాహం చేసుకున్న వ్యక్తి ఒక చర్మ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. ఈ కేసులో అప్పీలుదారుడైన డాక్టరు ఆ వ్యక్తి చర్మ వ్యాధిని నయం చేశాడు. ఆ చొరవతో సదరు వ్యక్తి తనకు పిల్లలు కలగలేదన్న నిజాన్ని డాక్టరుకు తెలియజేశాడు. డాక్టరు భార్య కూడా స్త్రీ వ్యాధి నిపుణురాలు కావడంతో ఆమె చేత తన భార్యకు చికిత్స చేయించాలని వేడుకున్నాడు. చికిత్స చేయించడానికి బదులు డాక్టరు ఆమెతో అక్రమ సంబంధం పెంచుకున్నాడు. ఫలితంగా ఆ మహిళకు ఒక బిడ్డ పుట్టింది. ఆ బిడ్డకు తండ్రిగా వ్యవహరించడానికి వైద్యుడు అంగీకరించకపోవడంతో మహిళ ఒక తమిళ టీవీ ఛానల్ సమక్షంలో వాస్తవం బయట పెట్టింది. దీంతో డాక్టరుపై కేసు నమోదైంది. ఈ కేసులో వైద్యుడు చేసిన నేరాన్ని నిరూపించేందుకు అతనికి డీఎన్ఏ పరీక్ష చేయాల్సిన పనిలేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.



విమాన సర్వీసులకు అంతరాయం వెనుక జీపీఎస్ స్పూఫింగ్!

- రంగంలోకి అజీత్ డోభాల్ కార్యాలయం

ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా 800 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడటానికి రెండు రోజుల ముందు జీపీఎస్ స్పూఫింగ్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించింది. దిల్లీ ఐజీఐ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. నిత్యం 1,500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్ల విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి ముందు తమకు తప్పుడు నావిగేషన్ డేటా అందినట్లు కొందరు పైలట్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. అది కూడా దేశ రాజధానికి 60 నాటికల్ మైళ్ల వ్యాసార్థంలో ఇలాంటి పరిస్థితి తలెత్తినట్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఏ కార్యాలయంలోని నేషనల్ సైబర్ సెక్యూరిటీ కోఆర్డినేటర్ (ఎన్‌సీఎస్‌సీ).. జాతీయ స్థాయిలో సైబర్ భద్రత అంశాలను సమన్వయపరుస్తోంది. ప్రస్తుతం ఎన్‌సీఎస్‌సీకి నవీన్ కుమార్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ స్పూఫింగ్ జరిగి ఉంటే.. ప్రస్తుత దర్యాప్తు ద్వారా దానికి గల కారణం, విస్తృతి అంశాలను పరిశీలించనున్నారు. విమానాల అంతరాయం వెనక సాంకేతిక సమస్య, సైబర్ దాడి, అంతర్జాతీయ జోక్యం వంటి కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు చేయనున్నారు. పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ), ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కూడా దర్యాప్తులో భాగమయ్యాయి.



జీపీఎస్ స్పూఫింగ్ అంటే?

నావిగేషన్ వ్యవస్థను ప్రభావితం చేసి నకిలీ జీపీఎస్ ద్వారా విమానాలను దారి మళ్లించే ప్రక్రియను జీపీఎస్ సిగ్నల్ స్పూఫింగ్‌గా వ్యవహరిస్తారు. నిజమైన శాటిలైట్ సిగ్నల్స్‌ను అడ్డుకొని ఆ స్థానంలో నకిలీ సంకేతాలను పంపి జీపీఎస్ రిసీవర్‌ను తప్పుదోవ పట్టిస్తాయి. ఫలితంగా.. ప్రస్తుతమున్న ప్రదేశం, సమయాన్ని తప్పుగా చూపించేలా చేస్తాయి. పౌర విమానాలే లక్ష్యంగా అంతర్జాతీయ మార్గాలలో ఈ తరహాలో జరిగిన సైబర్ దాడులు తరచూ వెలుగుచూస్తున్నాయి.



ఫిలిప్పీన్స్‌లోని ఆరోరాలో వరదల ఉద్ధృతికి ధ్వంసమైన ఓ రోడ్డు

ఫిలిప్పీన్స్‌లో పెనుతుపాను బీభత్సం

8 మంది మృతి.. తైవాన్ వైపు పయనం

మనీలా: ఫిలిప్పీన్స్‌ను వణికించిన 'ఫంగ్ వాంగ్' పెనుతుపాను ధాటికి వేర్వేరు ఘటనల్లో ఎనిమిది మంది మృతి చెందారు. వరదలు, కొండచరియలు విరిగిపడి.. వీరు ప్రాణాలు కోల్పోయారు. 14 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రధానంగా ఉత్తర భాగం బాగా దెబ్బతింది. 224 మందిని పొట్టనపెట్టుకున్న మొదటి విధ్వంసం నుంచి ఇంకా తేరుకోకముందే ఇది వచ్చిపడింది. సోమవారం ఉదయం ఫిలిప్పీన్స్ వద్ద ఇది తీరం దాటుతుందని తొలుత అంచనావేశారు. వాయవ్య అరోరా ప్రావిన్సును ఆదివారం రాత్రే తాకింది. ఆ సమయంలో గంటకు 230 కి.మీ. వేగంతో ప్రచండ గాలులు వీచాయి. 1,800 కి.మీ. విస్తృతితో ఉన్న తుపాను వివిధ పర్వత ప్రాంతాల మీదుగా వస్తూ బలహీనపడి, దక్షిణ చైనా సముద్రంలో ప్రవేశించింది. ఇది వాయవ్య దిశగా కదిలి తైవాన్ వైపు వెళ్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. టైఫూన్ తీవ్రతకు కనీసం 132 గ్రామాలు వరదనీటిలో మునిగాయి. అనేక నివాసాలు దెబ్బతిన్నాయి. తుపాను తమ తీరం దాటినా వర్షాల ప్రభావం కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

భారత్ సహాయంతో మాల్దీవుల్లో విమానాశ్రయం నిర్మాణం

- ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రామ్మోహన్ నాయుడు

మాలె: భారత ప్రభుత్వం అందించిన లైన్ ఆఫ్ క్రెడిట్ సహకారంతో మాల్దీవుల్లో హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారు. దానిని ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు, భారత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సంయుక్తంగా ప్రారంభించారు. ప్రపంచంతో అనుసంధానం అయ్యేందుకు ఇదొక గేట్‌వే అని ముయిజ్జు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇది ఎయిర్‌పోర్ట్ మాత్రమే కాదని, ఆర్థిక పరివర్తనకు చిహ్నమని అభివర్ణించారు. భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలు 60 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా. . రెండు దేశాల మధ్య స్నేహం మరింత బలోపేతం అవుతుందనేందుకు ఈ ఎయిర్‌పోర్ట్ ఒక చిహ్నమని ముయిజ్జు పేర్కొన్నారు. దీనిపై మాల్దీవుల్లోని భారత హైకమిషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. "పురోగతి, శ్రేయస్సుకు ఇదొక చిహ్నం. పొరుగు వారికి తొలి ప్రాధాన్యం, మహాసాగర్ విజన్‌లో భారతదేశ నిబద్ధతకు నిదర్శనం" అని రాసుకొచ్చింది.



విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహన్ నాయుడు, ముయిజ్జు

సంయుక్త పార్లమెంటరీ సంఘంలో అందరికీ ప్రాతినిధ్యం

- 130వ రాజ్యాంగ సవరణపై స్పీకర్ ఓం బిర్లా

కోహిమా: తీవ్ర నేరారోపణకు గురై 30 రోజుల పాటు జైల్లో ఉంటే ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రుల్ని పదవుల నుంచి తొలగించేందుకు వీలు కల్పించే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును సమీక్షించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) త్వరలో ఏర్పాటు కానుంది. దీనికి ఛైర్మన్‌గా భాజపా నాయకురాలు అపరాజిత సారంగి వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. సభ్యులుగా ఎన్సీపీ(ఎస్పీ) నుంచి సుప్రియా సూలే, అకాలీదల్ నాయకురాలు హర్‌సిమ్రత్ కౌర్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి తదితరులు ఉంటారని భావిస్తున్నారు. అయితే.. ఈ పార్లమెంటరీ సంఘంలో అన్ని రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం లభించేలా కృషి చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. 22వ వార్షిక కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం నాగాలాండ్ రాజధాని కోహిమా వచ్చిన ఓం బిర్లా విలేకరులతో మాట్లాడారు. "ఈ పార్లమెంటరీ కమిటీలు మినీ పార్లమెంటులా వ్యవహరిస్తాయి. రాజకీయాలకు అతీతంగా వివిధ అంశాలను పరిశీలిస్తాయి. అందుకే వీటిని రాజకీయ కోణంలోంచి చూడకూడదు. అన్ని పార్టీలకూ ఈ సంయుక్త పార్లమెంటరీ సంఘంలో స్థానం కల్పించేందుకు కృషి చేస్తున్నాం" అని బిర్లా పేర్కొన్నారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సమీక్ష కోసం ఏర్పాటు చేయబోయే సంయుక్త పార్లమెంటరీ కమిటీలో తాము భాగస్వాములం కాబోమని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. బిజూ జనతాదళ్, బీఆర్ఎస్ పార్టీలు ఈ పార్లమెంటరీ సంఘంలో సభ్యత్వం పొందే అవకాశం లేదు.

దేశవ్యాప్త ఎస్ఐఆర్‌పై నేటి నుంచి సుప్రీం విచారణ

దిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్) చేపట్టాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలుచేస్తూ దాఖలైన వివిధ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ ప్రారంభించనుంది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనం ఈ విచారణను చేపడుతుంది. ఈ విషయంపై సరికొత్త వ్యాజ్యాలేవైనా ఉంటే వాటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ సమక్షంలో ప్రవేశపెట్టాలని ధర్మాసనం పేర్కొంది. "మేం బిహార్ ఎస్ఐఆర్‌పై దృష్టి కేంద్రీకరించాం. ఇతర రాష్ట్రాలకు సంబంధించి తాజా పిటిషన్ ఏదైనా ఉంటే దాన్ని ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో సమర్పించాలి" అని ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ యూనిట్‌తో పాటు రాష్ట్రానికి చెందిన పలు ఇతర పార్టీలు తమ రాష్ట్రంలో ఎస్ఐఆర్ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అంశంపై అత్యవసర ప్రాతిపదికన విచారణ జరపాలని, ఇది దేశ ప్రజాస్వామ్య మూలాల్ని కుదిపేసే అంశమని స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తరఫున వ్యాజ్యం దాఖలు చేసిన ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు.

రిటైర్డ్ హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో బార్ కౌన్సిళ్ల ఎన్నికలు

- సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల ఎన్నికలను రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తుల నేతృత్వంలోని స్వతంత్ర కమిటీలు పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల మధ్య పరస్పర నమ్మకం లేనందున ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం పేర్కొంది. కౌన్సిళ్లకు ఎన్నికల తేదీలను త్వరగా ప్రకటించాలని బీసీఐని ఆదేశించింది. కొన్నిసార్లు కోర్టు ఆదేశాలు కూడా అమలు కావడం లేదని పేర్కొంటూ.. దిల్లీ బార్ కౌన్సిల్ వ్యవహారాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. అక్టోబరు 9న ఆ కౌన్సిల్ ఎన్నికల తేదీలను ప్రకటించగా.. తర్వాతి రోజున కౌన్సిల్‌నే రద్దు చేస్తూ బీసీఐ ప్రకటన విడుదల చేసింది. దీంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని పేర్కొన్న ధర్మాసనం.. స్వతంత్ర కమిటీ ఏర్పాటు అవసరాన్ని నొక్కి చెప్పింది. అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల ఎన్నికలనూ 2026, జనవరి 31 కల్లా పూర్తిచేయాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను మరోసారి గుర్తుచేస్తూ విచారణను ముగించింది.

కార్నియా మార్పిడి నిబంధనల సడలింపు

- కేంద్రం నిర్ణయం

దిల్లీ: కార్నియా మార్పిడి కేంద్రాల్లో తప్పనిసరిగా ఉండాల్సిన సాధనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. తద్వారా మౌలికవసతుల పరంగా ఉన్న సవాళ్లను తగ్గించింది. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లోని నేత్ర వైద్య కేంద్రాలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది. మొత్తంమీద దేశంలో కార్నియా మార్పిడి సేవల లభ్యతను ఇది మెరుగుపరుస్తుందని ప్రభుత్వం పేర్కొంది. అవయవ మార్పిళ్లను ప్రోత్సహించాలన్న ప్రభుత్వ విధానానికి అనుగుణంగా కేంద్ర ఆరోగ్యశాఖ తాజాగా సవరణ నిబంధనలను జారీ చేసింది.

రష్యాలో వేలల్లో భారతీయులకు ఉద్యోగాలు

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబరులో భారతదేశ పర్యటనకు వస్తున్న తరుణంలో రెండు దేశాల మధ్య కార్మికుల మార్పిడి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అభిజ్ఞ వర్గాలు పేర్కొన్నాయి. విస్తరిస్తున్న రష్యా ఆర్థిక వ్యవస్థకు భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. అయితే.. ఈ సంవత్సరాంతానికల్లా 70,000 మంది భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా. రష్యా కార్మిక శాఖ నిర్దేశించే కోటాల ప్రకారం ఆయా పరిశ్రమల్లో భారతీయ కార్మికులను వినియోగిస్తారు. ఈ మేరకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదురుతుంది. గతంలో భారతీయ సిబ్బందిని రష్యాలో ఉద్యోగాల పేరుతో మోసగించిన ఘటనలు జరిగిన దరిమిలా ఈ ఒప్పందంలో అలాంటివి నివారించడానికి జాగ్రత్తలు తీసుకుంటారు. న్యాయంగా, సక్రమంగా నియామకాలు జరిగేట్లు చూడటంతో పాటు భారతీయ కార్మికులకు రష్యన్ భాష నేర్పించేందుకు సహకరిస్తామని మాస్కోలోని ఇండియన్ బిజినెస్ కౌన్సిల్ (ఐబీఏ) అధ్యక్షుడు మనోజ్ కొట్వానీ పేర్కొన్నారు.

స్కాం సెంటర్ నుంచి పారిపోయిన 197 మంది భారత్‌కు..

దిల్లీ: మయన్మార్‌లోని స్కాం సెంటర్ నుంచి పారిపోయి థాయ్‌లాండ్ చేరుకున్న 197 మంది భారతీయులను కేంద్ర ప్రభుత్వం సోమవారం వెనక్కి తీసుకొచ్చింది. రెండు సైనిక విమానాల్లో వారు వచ్చారు. మయన్మార్ సరిహద్దు దాటిన 28 దేశాలకు చెందిన 1,500 మందిలో ఈ 197 మంది ఉన్నారు.

రాష్ట్ర సుస్థిర ఆర్థికాభివృద్ధిపై సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం

- భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకోవడానికి అనుమతి
- మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే భాగస్వామ్య సదస్సులో పర్యావరణ అనుకూల, పట్టణ పరిపాలన, డిజిటల్, రియల్ టైం పరిపాలన, మానవవనరుల అభివృద్ధి, సుస్థిర ఆర్థిక అభివృద్ధి రంగాల్లో సంస్థాగత సామర్థ్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడానికి రాష్ట్ర మంత్రివర్గం అనుమతించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అవి ఇలా ఉన్నాయి...

◆ ఐటీ, హెచ్ఆర్డీ, ఆర్టీజీఎస్ శాఖ మంత్రి, సీఎస్, ఆర్థికశాఖకు రాష్ట్రప్రభుత్వం తరఫున ఒప్పందంపై సంతకం చేసే అధికారం కల్పించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం

◆ టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తికి సాంకేతిక కమిటీ చేసిన సిఫార్సులకు ఆమోదం

◆ క్వాంటమ్ మిషన్ కోసం రూ.99.62 కోట్ల ఆమోదిత ప్రాజెక్టు వ్యయంపై చీఫ్ ఇంజినీర్ల బోర్డు సిఫార్సుల ఆమోదానికి చేసిన ప్రతిపాదనలకు ఆమోదం

◆ కుష్టు వ్యాధిగ్రస్తులకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ చట్ట నిబంధనలకు సవరణలు చేసే బిల్లు ముసాయిదా ఆమోదించే ప్రతిపాదనలకు అంగీకారం.

వెయ్యి ఎకరాల్లో పునరుత్పాదక ఇంధన తయారీ జోన్

◆ బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరంలోని కుందూరు (తూర్పు), సంతమాగులూరు మండలంలోని వెయ్యి ఎకరాల్లో రెన్యువబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు ఆమోదం.

◆ విద్యుత్తు ఉత్పత్తి సంస్థలకు ఎసైన్డ్ భూముల్ని లీజుకు ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తూ 1977 నాటి ఆంధ్రప్రదేశ్ ఎసైన్డ్ భూముల (బదిలీల నిషేధం) చట్టంలోని సెక్షన్2, క్లాజ్(6), సెక్షన్ 3లోని సబ్‌సెక్షన్ ఎసైన్డ్ భూముల (బదిలీల నిషేధం) బిల్లు 2025' సవరణకు సంబంధించి ముసాయిదా బిల్లు ఆమోదం

◆ బొగ్గు, విద్యుత్తు కొనుగోలు తదితర అవసరాల నిమిత్తం ఐటీబీ నుంచి రూ.1,000 కోట్ల రుణం. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు ఆర్థికసంస్థకు ప్రభుత్వ హామీ

◆ 2003 నాటి విద్యుత్తు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం.. కుప్పం రూరల్ ఎలక్ట్రిక్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు లైసెన్సు పొందడం నుంచి 2025-26 సంవత్సరానికి మినహాయింపు, ఏపీఈఆర్సీకి సిఫారసు కోరుతూ సంస్థ ఛైర్మన్ చేసిన అభ్యర్థనకు ఆమోదం

◆ గత సుంకాలపై వసూళ్లను ధ్రువీకరించడం, రేట్లను స్పష్టం చేయడం, పంపిణీ సంస్థల సమ్మతిని నిర్ధారించడం, రాష్ట్ర ఆదాయాన్ని రక్షించే చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ చట్టం 1939కి సవరణ చేసేందుకు ఆర్డినెన్స్ ప్రతిపాదనకు ఆమోదం

◆ సీసీ లిమిట్ల సద్వినియోగానికి విద్యుత్తు పంపిణీ సంస్థలకు (ఏపీఈపీడీసీఎల్ రూ.600 కోట్లు, ఏపీసీపీడీసీఎల్ రూ.100 కోట్లు, ఏపీఎస్‌పీడీసీఎల్ రూ.200 కోట్లు, ఏపీఈపీడీసీఎల్ రూ.250 కోట్లు) రూ.1,150 కోట్ల మొత్తానికి ప్రభుత్వ హామీ

◆ అల్లూరి సీతారామరాజు జిల్లా చిత్తంవలస పంప్డ్‌స్టోరేజి పవర్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 800 మెగావాట్ల నుంచి 1,800 మెగావాట్లకు పెంపు, జలవనరులశాఖ మార్గదర్శకాల ప్రకారం రైవాడ రిజర్వాయర్ నుంచి ఒకసారి నింపేందుకు 26.40 ఎంసీఎం, వార్షిక ఆవిరి నష్టాలకు 1.44 ఎంసీఎం నీరు కేటాయించాలని ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద నవయుగ ఇంజినీరింగ్ లిమిటెడ్ చేసిన అభ్యర్థనల ప్రతిపాదనకు ఆమోదం

◆ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్(బీఈఎస్ఎస్) ద్వారా 600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి శ్రీసత్యసాయి జిల్లా దిమ్మనాయునిపేట, ఇరువరలో 38.10 ఎకరాల ప్రభుత్వభూమి నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌కు కేటాయింపు. ఎకరానికి రూ.31వేల వార్షిక లీజు, రెండేళ్లకు 5% పెంపు చొప్పున 30 ఏళ్లకు కేటాయింపు

◆ కర్నూలు జిల్లా హొళగుంద, ఆలూరు మండలాల్లోని ఎల్లార్తి, ఇతర గ్రామాల్లో 250 మెగావాట్ల సోలార్ పవర్‌ప్రాజెక్టును ఎస్ఏఈఎల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం

◆ అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పులపత్తూరు, గుండ్లూరులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం 150 ఎకరాల భూమి నెడ్‌క్యాప్ ఛైర్మన్‌కు 30 ఏళ్లకు కేటాయింపు. ఎకరాకు ఏడాదికి రూ.15 వేల లీజు.. ప్రతి రెండేళ్లకోసారి 5% పెంపు.

రాజకీయపార్టీల కార్యాలయాలకు 66 ఏళ్ల లీజుపై ప్రభుత్వ భూములు

◆ నియోజకవర్గం/మండలాల్లో భూమి, సొంత భవనం లేని జాతీయ/గుర్తింపు పొందిన రాజకీయపార్టీల కార్యాలయాలకు ఏకరీతిలో లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపు. లీజు కాలం 33 సంవత్సరాల నుంచి 66 సంవత్సరాలకు పెంపు. పార్టీ మనుగడలో ఉంటే 99 ఏళ్లకు పునరుద్ధరణ

◆ కృష్ణా జిల్లా మచిలీపట్నం నార్త్ మండలంలోని మాచవరం ప్రాంతంలో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ.1,000 వార్షిక లీజుపై 33 ఏళ్లకు తెదేపా కార్యాలయ నిర్మాణానికి కేటాయింపు. గతంలో రవాణా శాఖకు జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వుల రద్దు

◆ తిరుపతి గ్రామీణ మండలం అవిలాలలో 2 ఎకరాల ప్రభుత్వ భూమి తెదేపా కార్యాలయ నిర్మాణానికి కేటాయింపు. ఎకరానికి ఏడాదికి రూ.1000 లీజుపై 33 ఏళ్లకు బదిలీ

ధర్మవరంలో మెగా హ్యాండ్ లూమ్ క్లస్టర్

◆ ధర్మవరంలో మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు మార్కెట్ యార్డులో 9.84 ఎకరాల భూమి నెలకు రూ.10వేల స్థిర అద్దెపై చేనేతశాఖకు బదిలీ.. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం నిర్ణయం

ఆర్టీజీఎస్ సిస్టమ్ ఇంటిగ్రేటర్‌గా టీసీఎస్

రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ డేటాలేక్ ప్రాజెక్టు డిజైన్, అభివృద్ధి, అమలు, కార్యకలాపాల నిర్వహణ కోసం సిస్టమ్ ఇంటిగ్రేటర్‌గా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నియామకం. మూడేళ్లకాలానికి రూ.180.99 కోట్లతో వేసిన సింగిల్ బిడ్‌కు ఆమోదం

భవానీ ద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్‌సిటీ.. పోలవరంలో హిల్ రిసార్టులు

◆ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి భవానీద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ అభివృద్ధికి విశ్వనాథ్ స్పోర్ట్స్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశ్వనాథ్ అవెన్యూస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియంకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు అందించాలని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం

◆ కృష్ణా జిల్లా మచిలీపట్నం, తల్లపాలెం వద్ద పెద్ద అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్టుల అభివృద్ధికి మైరా బేవ్యూ రిసార్టుకు భూమి కేటాయింపు, ప్రోత్సాహకాలు అందించేలా ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం

◆ హిల్ రిసార్టులు, టూరిజం ప్రాజెక్టులు, 25 నిర్మాణాలకు ఏలూరు జిల్లా పోలవరంలోని ఆర్ఎస్ నంబరు 825/3లో 15.25 ఎకరాలు టూరిజం అథారిటీకి బదిలీ, భూమి వర్గీకరణ మార్పు

ఈఎస్ఐ డిస్పెన్సరీ, శిక్షణ సంస్థలకు భూములు

◆ పార్వతీపురం మన్యం జిల్లా కొత్తవలసలో ఎకరా భూమి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిర్మాణానికి లీడ్‌బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ పేరిట 30 ఏళ్లకు లీజు.. ఎకరాకు ఏడాదికి రూ.1,000 చొప్పున అప్పగింత ◆ చిత్తూరు జిల్లా ఇరువరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ నిర్మాణానికి 60 సెంట్ల భూమి బీమా, వైద్యసేవల డైరెక్టర్ పేరిట ఉచితంగా బదిలీ

ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

◆ 2025 జూన్ నాటికి అర్హులైన ముగ్గురు జీవిత ఖైదీలు మదిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు (రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్), వడ్డే శ్రీనివాసులు (కడప సెంట్రల్ జైల్) క్షమాభిక్ష కల్పించాలని నిర్ణయం

◆ కేంద్రం ప్రవేశపెట్టిన 'మోడల్ బిల్ టు ప్రొవైడ్ ఫర్ ది మెయింటెనెన్స్ ఆఫ్ ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ ఫర్ ది స్టేట్స్-2019'కి అనుగుణంగా రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ చట్టం-1999లో కొన్ని సవరణలు చేసేందుకు ఆర్డినెన్స్ తేవాలన్న ప్రతిపాదనలకు ఆమోదం

◆ రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధికి హడ్కో నుంచి రుణం తీసుకోవాలని నిర్ణయించారు.

అన్నదాతకు ఆధార్ సేవా రుసుము మినహాయింపు

◆ అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద రైతులు, కౌలు రైతులకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.20వేలు అందించాలని ఆగస్టు 1న జారీ చేసిన ఉత్తర్వుల్ని ధ్రువీకరించే ప్రతిపాదనకు ఆమోదం

◆ అన్నదాతా సుఖీభవ పథకం కింద పట్టాదార్ ఆధార్ సీడింగ్ కోసం ఒకేదఫాగా 5.44 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2.72 కోట్ల సేవారుసుము మినహాయింపు ◆ మద్దతుధరపై ధాన్యం సేకరణ నిమిత్తం.. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థకు ప్రభుత్వ గ్యారంటీ గరిష్ఠ పరిమితి రూ.39వేల కోట్ల నుంచి రూ.44వేల కోట్లకు పెంపు

◆ ఎన్‌సీడీసీ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5వేల కోట్ల రుణం.. ధాన్యం సేకరణ కోసం పౌరసరఫరాల సంస్థకు బదిలీ

◆ వివిధ ప్రభుత్వ శాఖల్లో వివిధ కేటగిరీల కాంట్రాక్టర్లకు.. ద్రవ్య పరిమితులు పెంచడం, రిజిస్ట్రేషన్ రుసుముల పెంపు, దరఖాస్తు సమయంలో సమర్పించాల్సిన సాల్వెన్సీ సర్టిఫికెట్ మొత్తం పెంపు, గత అనుభవ విలువ పెంపు ప్రతిపాదనలకు ఆమోదం

◆ విజయవాడ, విశాఖపట్నంలో కొత్తగా ఏర్పాటైన జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ బెంచ్‌లతో పాటు చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్‌లో 19 పోస్టుల సృష్టికి ఆమోదం

ఎన్టీఆర్ నగర్‌లలో గృహనిర్మాణం.. ఏపీ టిడ్కోకు భూములు

పేదలకు గృహనిర్మాణంలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 (ఎన్టీఆర్ నగర్) అమలు కోసం వివిధ ప్రాంతాల్లో ఏపీ టిడ్కోకు ప్రభుత్వం భూములు కేటాయించింది. చిత్తూరు జిల్లా ఇరువరంలో 100 ఎకరాలు ఎకరా రూ.1.10 కోట్ల చొప్పున, తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం కోవనూరులో 32.21 ఎకరాలు ఎకరా రూ.18.55 లక్షల చొప్పున, అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం మల్లివారిపల్లె సర్వే నంబరు 104లోని 44.22 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎకరా రూ.19.50లక్షల చొప్పున.. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం మొగల్లూరులో 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఎకరా రూ.7.5లక్షల విలువపై వీటిని కేటాయించింది. 2025-26 నుంచి 2029-30 వరకు సమాన వార్షిక వాయిదాల్లో చెల్లించాలని పేర్కొంది.

◆ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం నిదిమామిడిలో 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఎకరాకు రూ.18.92లక్షల లెక్కన ఏపీ టిడ్కోకు అప్పగింత.

◆ విశాఖపట్నం, గుంటూరులో మూడో పార్టీ ఆక్రమణ కింద ఉన్న అదనపు భూముల్ని 30 మందికి క్రమబద్ధీకరించడం.. సంబంధిత మొత్తం రెండు విడతల్లో చెల్లింపు. దరఖాస్తుతో పాటే 50%, మిగిలిన మొత్తాన్ని ఆమోదించిన నెలలోపు చెల్లించాలి.

మంత్రులకు సీఎం అభినందనలు

తుపాను సమయంలో బాగా పని చేశారని కితాబు

ఈనాడు, అమరావతి: మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు మంత్రులను అభినందించారు. మొంథా తుపాను సమయంలో క్షేత్రస్థాయిలో బాగా పని చేశారన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయడంతోనే సహాయక చర్యలు వేగంగా జరిగాయని తెలిపారు. ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షణ, టెక్నాలజీ సహాయంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగామని పేర్కొన్నారు. మంత్రులు, అధికారులు బృందస్ఫూర్తితో పనిచేస్తే ఇలాంటి ఫలితాలే వస్తాయని తెలిపారు.

అందరినీ ఆకట్టుకునేది అందెశ్రీ ప్రస్థానం: పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీ హఠాన్మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "అందెశ్రీ రచనా ప్రస్థానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొంటుంది. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితాన్ని ప్రారంభించి అక్షర యాత్ర చేశారు. తెలంగాణ జానపదాలపై, మాండలికాలపై పట్టుకలిగిన ఆయన పలు సినీ గీతాలు రచించారు. 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు' అనే పాట వింటే సమాజాన్ని ఎంతగా చదివారో అర్థమవుతుంది. 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' అంటూ ఆ రాష్ట్ర గీతాన్ని అందించారు" అని పవన్‌కల్యాణ్ అందెశ్రీ సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అందెశ్రీ సేవలు చిరస్మరణీయం: మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: సాహిత్యానికి అందెశ్రీ సేవలు చిరస్మరణీయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందెశ్రీ మృతిపై ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. "మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు' తో పాటు ఎన్నో సామాజిక, ఉద్యమ చైతన్య గీతాలు రాసిన ప్రజాకవి అందెశ్రీ. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు.

◆ అందెశ్రీ మరణంపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సంతాపం తెలియజేశారు. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు.

అందెశ్రీ ఎంతో మందిని ప్రభావితం చేశారు: సీపీఐ

ఎన్నో ఉద్యమ గీతాలు రాసిన ప్రజాకవి అందెశ్రీ మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. 'ఆయన కలం నుంచి జాలువారిన 'మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు' అనే పాట నేటి సామాజిక స్థితిగతులకు అద్దం పడుతోందని పేర్కొన్నారు.

● ప్రజాకవి అందెశ్రీ మరణ వార్త తెలుగు రాష్ట్రాల ప్రజలను దుఃఖసాగరంలో నింపేసిందని అరణోదయ సాంస్కృతి సమాఖ్య ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చొప్పర జాలన్న, సన్నశెట్టి రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటించారు.

డ్రయ్యర్లు కలిగిన మిల్లులకే ధాన్యం సేకరణలో ప్రాధాన్యం: మంత్రి నాదెండ్ల

ఈనాడు, అమరావతి: డ్రయ్యర్లు కలిగిన మిల్లులకే ధాన్యం సేకరణలో ప్రాధాన్యం ఇవ్వాలని, గోదాముల వద్ద సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. 'ఖరీఫ్‌లో పౌరసరఫరాల శాఖకు 20 లక్షల టన్నులు, భారత ఆహార సంస్థకు 14 లక్షల టన్నులు సీఎంఆర్ కింద సరఫరా చేయాలి. వీటిని నిల్వ చేసేందుకు వీలుగా గోదాములు సిద్ధం చేసుకోవాలి' అని మనోహర్ పేర్కొన్నారు. జిల్లాల వారీగా మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారంటీలు సమర్పించేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, సంస్థ ఎండీ ఢిల్లీరావు, రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

ప్రైవేటుకు అచ్యుతాపురం సీఈటీపీ నిర్వహణ

- టెండరు లేకుండా అప్పగింతకు యత్నం
- వైకాపా ప్రభుత్వంలో ఉన్న వారే చక్రం తిప్పారు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) తీరే వేరు. అచ్యుతాపురం సెజ్‌లోని కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (సీఈటీపీ) నిర్వహణ బాధ్యతలను భాగస్వామిగా ఉన్న అచ్యుతాపురం ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ లిమిటెడ్ (ఏఈటీఎల్)కు కాకుండా.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన హైపర్ ఫిల్ట్రేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టేందుకు ఏపీఐఐసీ సిద్ధమైంది. అది కూడా ఎలాంటి టెండరు ప్రక్రియ లేకుండానే ఒక ప్రైవేటు కంపెనీతో ఒప్పందాన్ని కుదుర్చుకుంటోంది. దీనిపై ఆరోపణలు వస్తున్నా ఏపీఐఐసీ లెక్కపెట్టడం లేదు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు అప్పట్లో ఏపీఐఐసీ రూ.80 కోట్లు ఖర్చు చేసి సీఈటీపీని ఏర్పాటు చేసింది. ఇందులో ఏపీఐఐసీకి 75, ఏఈటీఎల్‌కు 25 శాతం వాటాలు ఉన్నాయి. సెజ్‌లోని సుమారు 80 పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసి.. సముద్రంలోకి వదిలేందుకు సీఈటీపీని ఏర్పాటు చేశారు. దీన్ని 2016లో ఏర్పాటు చేసినప్పటి నుంచి నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసీ.. అకస్మాత్తుగా తప్పుకోవాలని నిర్ణయించింది.

పెట్టుబడి లేకుండా.. సొమ్ము చేసుకోవడమే!

సెజ్‌లోని పరిశ్రమల నుంచి ప్రతినెలా సీఈటీపీ నిర్వహణకు సుమారు రూ.3.5 కోట్లు వసూలవుతుంది. ఆ మొత్తం ఏఈటీఎల్ బ్యాంకు ఖాతాలో జమ చేసి.. అందులో నుంచి ఏపీఐఐసీ వినియోగిస్తుంది. మిగిలిన మొత్తం ఏఈటీఎల్ ఖాతాలో ఉంటుంది. ఇప్పుడు ప్రైవేటు కంపెనీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు వీలుగా కంపెనీలు చెల్లించే మొత్తాన్ని ఎస్క్రో ఖాతాకు మళ్లించాలని అధికారులు నిర్ణయించారు. దీనివల్ల బ్యాంకు ఖాతాలో జమయ్యే మొత్తాన్ని సంస్థ ఇష్టానుసారం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రతినెలా నిర్వహణకు రూ.2.5 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని పారిశ్రామికవర్గాలు తెలిపాయి. ఈ లెక్కన నెలకు రూ.కోటి వరకు కంపెనీకి మిగిలే అవకాశం ఉంటుంది.

వైకాపా హయాంలో వారే.. ఇప్పుడూ వారే!

భారీ ప్రాజెక్టును టెండరు ప్రక్రియ ద్వారానే ప్రైవేటు కంపెనీకి అప్పగించాలి. దీనికి విరుద్ధంగా ఏపీఐఐసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. కనీసం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన కూడా ఇవ్వలేదు. అలాంటప్పుడు గాజియాబాద్‌కు చెందిన కంపెనీని అధికారులు ఎలా ఎంపిక చేశారు? దానికి ఏ ప్రాతిపదికన నిర్వహణ బాధ్యతలు అప్పగించారు? ఆ కంపెనీ నుంచి పైసా ఆదాయం రాకుండా రూ.80 కోట్లతో ఏర్పాటు చేసిన ప్రాజెక్టును ఏపీఐఐసీ అప్పగించడమేంటి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఏపీఐఐసీలో పనిచేస్తున్న ఒక కాంట్రాక్టు ఇంజినీరు.. అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేసే మరో కాంట్రాక్టర్ ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఏపీఐఐసీలోని అధికారులపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చి గాజియాబాద్‌కు చెందిన ఒక ప్రైవేటు కంపెనీకి నిర్వహణ పనులు కట్టబెట్టేలా వ్యూహాన్ని రచించినట్లు సమాచారం. వైకాపా ప్రభుత్వంలోనూ వీరే చక్రం తిప్పి.. సీఈటీపీకి అవసరమైన పరికరాలు, రసాయనాలు సరఫరా చేసి భారీగా సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సీఈటీపీ నిర్వహణకు అవసరమైన ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి..భారీ మొత్తంలో బిల్లులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడూ ఒక ప్రైవేటు కంపెనీ పేరుతో వారే పనులు దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

'మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్లు' సిద్ధం

జిల్లాకొకటి చొప్పున పంపిణీ చేయనున్న పోలీసు శాఖ



మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ వాహనం

ఈనాడు, అమరావతి: నేర ఘటనా స్థలంలోని ఆధారాల సేకరణ, వాటిని భద్రపరచటంలో ఒక్కోసారి దర్యాప్తు అధికారులు చేసే పొరపాట్లు, తప్పిదాల వల్ల అనేక కేసులు వీగిపోతున్నాయి. ఏ నేరానికి సంబంధించి ఏయే ఫోరెన్సిక్ ఆధారాలు సేకరించాలి? ఎలా సేకరించాలి? ఆధారాలు దెబ్బతినకుండా ఎలా భద్రపరచాలి? అనేదానిపై దర్యాప్తు అధికారులకు తగినంత నైపుణ్యం లేకపోవటం వల్ల ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా తీవ్రమైన నేరాల్లో నేర నిరూపణ కష్టతరమవుతోంది. శిక్షల శాతం తగ్గిపోతోంది. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు ఏపీ పోలీసు శాఖ 'మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్లు' సిద్ధం చేసింది. జిల్లాకొకటి చొప్పున మొత్తం 26 మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ వాహనాలను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ చేయనుంది. ఆయా జిల్లాల పరిధిలో ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్షపడే అవకాశమున్న నేరాలు జరిగితే ఈ 'మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్లు' వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చిన్న ఆధారం కూడా వదలకుండా మొత్తం సేకరిస్తాయి. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం ఈ వాహనాలు పరిశీలించి స్వల్ప మార్పులు సూచించారు. ఆ పనులు పూర్తయిన వెంటనే జిల్లాలకు పంపిణీ చేస్తారు.

నేర ఘటనా స్థలం అణువణువూ నిక్షిప్తం...

● మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ వాహనాలకు ముందు, వెనక కెమెరాలుంటాయి. ఘటనా స్థలంలోని అణువణువూ ఆ కెమెరాల్లో రికార్డు చేస్తారు.

● వాహనం లోపల వెనక భాగంలో ఫోరెన్సిక్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో సైబర్, రక్తం, నార్కో, స్పెర్మ్, డీఎన్ఏ, ఎక్స్‌ప్లోజివ్స్, ఫైరింగ్..ఇలా మొత్తం 21 రకాల కిట్లు ఉంటాయి. జరిగిన నేరాన్ని బట్టి ఏయే ఆధారాలు సేకరించాలో ఫోరెన్సిక్ నిపుణులు నిర్ణయిస్తారు.

● వాహనం లోపల మధ్య భాగంలో ఫోరెన్సిక్ నిపుణులు కూర్చొనేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.

ఆధారాలు సేకరించి.. దర్యాప్తు అధికారులకు అప్పగింత

● రాష్ట్రంలో ఏటా లక్షకు పైగా కేసులు నమోదవుతుంటే అందులో 18-20 వేల కేసులు ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశమున్నవే. వీటిల్లో అత్యాచారాలు, హత్యలు, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు వంటివి అధికంగా ఉంటున్నాయి. ఆయా కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉంటోంది. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు సరిగ్గా లేకపోవటమే దీనికి ప్రధాన కారణం.

● ఇకపై దర్యాప్తు అధికారి సమక్షంలో ఫోరెన్సిక్ నిపుణులు ఈ ఆధారాలు సేకరిస్తారు. అవి ఎక్కడా దెబ్బతినకుండా ప్యాకింగ్ చేసి.. దర్యాప్తు అధికారికి అప్పగిస్తారు. అక్కడి నుంచి అవి ఫోరెన్సిక్ ప్రయోగశాలకు చేరుతాయి. విశ్లేషణ పూర్తయిన వెంటనే నివేదికలు ఈ-ఫోరెన్సిక్‌లో అప్‌లోడ్ అవుతాయి. న్యాయస్థానాలు, దర్యాప్తు అధికారులు ఈ నివేదికలను నేరుగా పరిశీలించుకోవచ్చు. ఆయా నేరాలకు సంబంధించిన ఆధారాలు సేకరించిన ఫోరెన్సిక్ నిపుణులు న్యాయస్థానాల్లో సాక్ష్యాలు చెబుతారు. ఇవన్నీ నేర నిరూపణలో కీలకమవుతాయి.

అమెరికాలో ఒడిశా యువతికి చిత్రహింసలు

ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రికి వీడియో సందేశం


పూజ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రానికి చెందిన తనను దత్తత తీసుకున్న అమెరికా దంపతులు చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఓ యువతి సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. ముఖ్యమంత్రి మోహన్ మాఝి ఆదుకోవాలంటూ బాధితురాలు వీడియో సందేశంలో పేర్కొన్నారు. వీడియోలోని వివరాల ప్రకారం.. చిన్నతనంలో రైలు ప్రయాణంలో తప్పిపోయిన పూజ అలియాస్ సెజెల్‌ను చైల్డ్‌లైన్ సిబ్బంది కాపాడి నీలగిరి బాలికల కేంద్రంలో అప్పగించారు. అనంతరం ఆమెను భువనేశ్వర్‌లోని సహర్‌కాంత్ చిన్నారుల హోంకు తరలించారు. అక్కడే ఉంటూ చదువుకుంటున్న ఆమెను 2018లో అమెరికాకు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం 21 ఏళ్ల వయసున్న పూజ పాస్‌పోర్ట్ కాలపరిమితి 2023తో ముగిసిపోయింది. అయినప్పటికీ దత్తత తీసుకున్న వారు పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేయలేదు. స్కూల్ నుంచి రాగానే చాలా ఎక్కువ ఇంటి పని చేయిస్తున్నారని బాధితురాలు వాపోయారు. భువనేశ్వర్‌లో ఉన్నప్పుడే సంతోషంగా ఉండేదాన్నని, స్కూల్ సెలవు దినాల్లో బయట పనికెళ్లి సంపాదించుకున్న రూ.10 లక్షలను తన తల్లి లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతానికి చెందిన తనను మతమార్పిడి చేయించాలని చూస్తున్నారన్నారు. రెండుసార్లు హత్యాయత్నం జరిగిందని, ముఖ్యమంత్రి తనను కాపాడి ఒడిశాకు తిరిగి రప్పించేలా ఏర్పాట్లు చేయాలని వేడుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఒడియా, ఆంగ్ల భాషల్లో పోస్టు చేశారు.

ఆలయాల్లో భక్తులకు మరిన్ని డిజిటల్ సేవలు

- ఈ పోస్ యంత్రాల ద్వారా టికెట్లు జారీ
- ప్రధాన ఆలయాల్లో మనమిత్ర యాప్ కౌంటర్లు

ఈనాడు, అమరావతి: ప్రధాన, ముఖ్య ఆలయాల్లో మరింతలా డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా దేవాదాయశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే భక్తులే నేరుగా స్వయంగా టికెట్లు పొందేలా వివిధ ఆలయాల్లో 100 కియోస్క్‌ల ఏర్పాటుకు అనుమతిచ్చారు. తాజాగా దర్శనాలు, సేవలు, పార్కింగ్ టికెట్ల జారీకి ఈ పోస్ యంత్రాలు వినియోగించేలా కమిషనర్ రామచంద్రమోహన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మార్గశిర మాసంలో విశాఖపట్నంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ భారీగా ఉండనుంది. ఈ సందర్భంగా టికెట్ల జారీకి రోడ్డుపై కౌంటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి బదులుగా ఈ పోస్ యంత్రాలు అందించేందుకు ఎస్‌బీఐ ముందుకొచ్చింది. ఇందులో జెనీ యాప్ ఉంటుంది. ఈ యంత్రాలను దేవాదాయశాఖకు చెందిన టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు అనుసంధానించి ఎక్కడికక్కడ భక్తులకు ఆయా టికెట్లు జారీచేయనున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రధాన, ముఖ్య ఆలయాలు అన్నింటా ఎస్‌బీఐ అందజేసే ఈ పోస్ యంత్రాలు వినియోగించుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

వాట్సప్ కౌంటర్లు

ప్రభుత్వం మనమిత్ర యాప్‌తో అనేక సేవలు అందిస్తుండగా, అందులో వివిధ ఆలయాల దర్శనాలు, సేవలు, వసతుల బుకింగ్ వంటి సదుపాయం కూడా ఉంది. దీనిపై మరింతలా భక్తులకు అవగాహన కల్పించేలా అన్ని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో ప్రత్యేక వాట్సప్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అందులో మనమిత్ర యాప్‌ద్వారా దర్శనం, సేవలు తదితర టికెట్లు ఎలా బుక్ చేసుకోవాలో భక్తులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

రియల్ టైమ్ సమాచారంతో డ్యాష్‌బోర్డ్

ఆలయాలకు చెందిన రియల్‌టైమ్ సమాచారంతో దేవాదాయశాఖ డ్యాష్‌బోర్డ్ సిద్ధంచేసింది. ఆలయాల జాబితా, వాటి భూములు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ట్రస్ట్‌బోర్డులు, ప్రధాన, ముఖ్య ఆలయాలకు ఏరోజు ఎందరు భక్తులు వచ్చారు? తదితర సమాచారమంతా ఇందులో రియల్‌టైమ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ డ్యాష్‌బోర్డును సీఎం కార్యాలయం సహా ఇతర ఉన్నతాధికారులు, కమిషనరేట్ అధికారులు ఎప్పుడైనా చూసేలా ఏర్పాట్లు చేశారు.

వైకాపా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి అనుచరుల భూ ఆక్రమణ

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరుల ప్రోద్బలంతో తన పొలంలోని 20 సెంట్లను సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించినట్లు పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలేనికి చెందిన అంజిరెడ్డి వాపోయారు. తనకు న్యాయం చేయాలని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వైకాపా ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన ఎంపీడీవోపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా తాడికొండ మండలం గరికపాడుకు చెందిన బ్రహ్మేశ్వరరావు కోరారు. తన పొలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరితే.. రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారని, తనకు న్యాయం చేయాలని పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఇనుమెళ్లకు చెందిన వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

అటవీ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం: పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: అడవులను రక్షించేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్క అటవీ ఉద్యోగి, సిబ్బందికి అండగా నిలిచి, వారికి భద్రత కల్పించేందుకు సంజీవని కార్యక్రమం ద్వారా అవసరమైన చర్యలు చేపడతామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. "అటవీ సంపద, వన్యప్రాణులను రక్షించే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరులందరికీ నివాళులు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను పట్టుకునే ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించి ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ ఉన్నతాధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ త్యాగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఇలాంటి అమరవీరుల కుటుంబాల పక్షాన నిలిచి, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు.

తిరుమల పవిత్రతతో ఆటలా?: లోకేశ్ ఆగ్రహం

ఈనాడు, అమరావతి: తిరుమల క్షేత్రం పవిత్రతతో ఆటలాడేవారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. "వైకాపా ప్రభుత్వంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి ఉపయోగించడం.. హిందువుల విశ్వాసాలు, నమ్మకాలు, భారత ఆత్మపై జరిగిన దాడి. ఇప్పటికే సుప్రీంకోర్టు నియమించిన సిట్ తన దర్యాప్తులో నిజాల్ని బయటపెట్టింది. దోషులకు కఠినశిక్ష పడటం ఖాయం" అని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

జయాబచ్చన్ వ్యక్తిగత హక్కులకు కోర్టు రక్షణ



దిల్లీ: సినీనటి, రాజ్యసభ సభ్యురాలు జయాబచ్చన్ వ్యక్తిగత హక్కులను పరిరక్షిస్తూ దిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఆమె పేరును, చిత్రాలను, డైలాగులను, ప్రతిరూపాన్ని ఆమె అనుమతి లేకుండా ఎలాంటి వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించరాదని కోర్టు స్పష్టం చేసింది. తమ వ్యక్తిత్వ హక్కుల్ని పరిరక్షించాలని కోరుతూ ఆమె భర్త అమితాభ్ బచ్చన్, కుమారుడు అభిషేక్ బచ్చన్, కోడలు ఐశ్వర్యరాయ్, మనవరాలు ఆరాధ్య దిల్లీ హైకోర్టును ఆశ్రయించి ఇప్పటికే అనుకూల తీర్పును పొందిన విషయం తెలిసిందే. బచ్చన్ కుటుంబంతో పాటు హృతిక్ రోషన్, కుమార్ సాను, కరణ్ జోహార్ వంటి సినీ ప్రముఖుల వ్యక్తిత్వ హక్కుల్ని కూడా హైకోర్టు పరిరక్షించింది. కొందరు ఆయా ప్రముఖుల చిత్రాలను, గొంతుకను, మాటల్ని ఉపయోగించి వారి అనుమతి లేకుండా ఉపయోగించి వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆన్‌లైన్ కార్యక్రమాలు రూపొందించడం పరిపాటిగా మారిన ఈ రోజుల్లో కోర్టు తీర్పు ద్వారా వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ పొందడం అనివార్యమైంది. పలు సోషల్ మీడియా అకౌంట్లు, యూట్యూబ్ ఛానళ్లు, వెబ్‌సైట్లు అనుమతి లేకుండా జయాబచ్చన్ ఆమె పేరును, వ్యక్తిత్వ లక్షణాలను ఉపయోగించుకొని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని జస్టిస్ మన్‌మీత్ ప్రీతం సింగ్ అరోడా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యాజ్యంలో గూగుల్, అమెజాన్, ఈబే, మెటా సంస్థల్ని కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు.

థాయ్‌లాండ్, కంబోడియా సంధికి గండి

బ్యాంకాక్: కంబోడియాతో కాల్పుల విరమణకు కుదిరిన ఒప్పందం అమలును నిలిపేస్తున్నట్లు థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్ విరకూల్ సోమవారం ప్రకటించారు. రెండు దేశాల సరిహద్దులో సోమవారం మందుపాతర పేలి ఇద్దరు థాయ్ సైనికులు తీవ్రంగా గాయపడిన కొన్ని గంటలకే ఆయన ఈ ప్రకటన చేశారు. థాయ్, కంబోడియాల మధ్య గత జులైలో అయిదు రోజులపాటు సాయుధ సంఘర్షణ జరిగి పదుల సంఖ్యలో సైనికులు మరణించారు. అక్టోబరులో ఆగ్నేయాసియా దేశాల సంఘ శిఖరాగ్ర సమావేశం జరిగినపుడు రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు మలేసియా చొరవ చూపింది. ఆ సభకు హాజరైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒప్పందం కుదుర్చుకోకపోతే థాయ్, కంబోడియాలకు వాణిజ్యపరమైన రాయితీలను నిలిపేస్తానని హెచ్చరించారు. చివరకు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా సోమవారంనాటి మందుపాతర పేలుడుతో పరిస్థితి మొదటికి వచ్చేట్లుంది. కంబోడియా ఒప్పందాన్ని అతిక్రమిస్తూ సరిహద్దులో కొత్త మందుపాతరలను పెట్టిందని థాయ్‌లాండ్ ఆరోపిస్తుంటే, అలాంటి పని తాము చేయలేదని కంబోడియా వాదిస్తోంది.

‘అమ్మో’నియం నైట్రేట్!



హరియాణాలోని ఫరీదాబాద్‌లో పెద్ద మొత్తంలో అమ్మోనియం నైట్రేట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కలకలం సృష్టించింది. తద్వారా వారు ఒక భారీ ఉగ్ర కుట్రను ఛేదించారు. పెద్ద ఎత్తున పేలుళ్లతో మారణహోమం సృష్టించగల ఈ రసాయనం ప్రపంచవ్యాప్తంగా అనేకచోట్ల నెత్తుటేళ్లు పారించింది.

ఏమిటీ పదార్థం?

అమ్మోనియం నైట్రేట్ తెల్లటి, ఎలాంటి వాసన లేని స్ఫటిక పదార్థం. అమ్మోనియాను నైట్రిక్ ఆమ్లంతో చర్య జరిపినప్పుడు ఇది ఉత్పత్తవుతుంది. ఇది నత్రజని పుష్కలంగా ఉన్న లవణం. అందువల్ల నీట్లో కరిగిపోతుంది. వ్యవసాయ రంగంలో దీన్ని విరివిగా ఉపయోగిస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఇది భారీగా ఉత్పత్తవుతోంది. అందువల్ల ఒకింత చౌకలో లభ్యమవుతోంది. వ్యవసాయానికే కాకుండా మైనింగ్, క్వారీల్లో నియంత్రిత పేలుళ్లు కలిగించడానికి కూడా దీన్ని వాడుతుంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో పేలుతుంది..

స్వచ్ఛమైన రూపంలో ఉన్నప్పుడు అమ్మోనియం నైట్రేట్.. రసాయన, ఉష్ణపరంగా స్థిరంగా ఉంటుంది. ఆ స్థితిలో దాన్ని మండించడం చాలా కష్టం. దానిలో విస్ఫోటం కలిగించడానికి వేరే పేలుడును సృష్టించాల్సి వస్తుంది. దాని ఆక్సిడైజర్ లక్షణం నుంచే ప్రమాదం పొంచి ఉంటుంది. అది ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుంది. తద్వారా ఇతర వస్తువులు, పదార్థాలు తీవ్రస్థాయిలో మండిపోయేలా చేస్తుంది. భద్రంగా నిల్వ చేస్తే దానివల్ల పెద్ద ముప్పు ఉండదు. ఇతర పదార్థాలతో కలవడం, అధిక వేడి, సరైన వెంటిలేషన్ లేకపోవడం వంటి కారణాల అది అస్థిరంగా మారొచ్చు. ఆ పదార్థాన్ని ఎంత ఎక్కువ పరిమాణంలో నిల్వ చేస్తే అంత ప్రమాదం పొంచి ఉంటుంది.

మంటలు తాకినప్పుడు అమ్మోనియం నైట్రేట్ పేలుతుంది. దాన్ని ఏదైనా ఇంధనం లేదా పేలుడు పదార్థంతో ఉద్దేశపూర్వకంగా కలిపినప్పుడు కూడా విస్ఫోటం సంభవించొచ్చు. ఇంధనంతో కలిపినప్పుడు అది అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయెల్ ఆయిల్ (ఏఎన్ఎఫ్‌వో)ను ఏర్పరుస్తుంది. ఇది శక్తిమంతమైన, చౌకైన పారిశ్రామిక పేలుడు పదార్థం. మైనింగ్, నిర్మాణ పనుల్లో దీన్ని ఉపయోగిస్తుంటారు. పేలుడు జరిగితే ఈ పదార్థానికున్న ఆక్సిడైజింగ్ లక్షణం.. చర్యను ఎక్కువ కాలం కొనసాగేలా చూస్తుంది. భారీగా శక్తి, వేడి ఉత్పత్తయ్యేలా చేస్తుంది.

పేలినప్పుడు ఏమవుతుంది?

అమ్మోనియం నైట్రేట్ పేలినప్పుడు భారీగా నైట్రోజన్ ఆక్సైడ్, అమ్మోనియా వాయువులు విడుదలవుతాయి. ఇవి ఒక ప్రకంపనను కలిగిస్తాయి. భవనాలనూ నేలమట్టం చేసే శక్తి దీనికి ఉంటుంది.

భారత్‌లో నియంత్రణ ఎలా

పేలుడు పదార్థాల చట్టం-1884 ద్వారా భారత్‌లో అమ్మోనియం నైట్రేట్‌ను ప్రభుత్వం నియంత్రిస్తోంది. దీనికి సంబంధించి నిర్దిష్ట నిబంధనలను 2012లో ప్రవేశపెట్టింది. ఏదైనా పదార్థం బరువులో 45 శాతాన్ని మించి అమ్మోనియం నైట్రేట్ ఉంటే దాన్ని పేలుడు పదార్థంగా పరిగణిస్తోంది. దాని తయారీ, నిల్వ, రవాణా, విక్రయానికి లైసెన్సులు అవసరం.

ప్రమాదాలతో జరిగిన విధ్వంసమిదీ..

దాదాపు శతాబ్ద కాలంలో ప్రపంచంలోనే పెను ప్రమాదాలకు అమ్మోనియం నైట్రేట్ కేంద్రబిందువుగా ఉంది.

1921: జర్మనీలోని ఒక ఎరువుల కర్మాగారంలో జరిగిన పేలుడులో 565 మంది చనిపోయారు.

1947: అమెరికాలోని టెక్సాస్ రేవులో 2,300 టన్నుల అమ్మోనియం నైట్రేట్ కలిగి ఉన్న ఒక నౌక మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. ఇందులో 567 మంది మరణించగా.. 5వేల మందికిపైగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు సాగరంలో ఒక భారీ అల కూడా చెలరేగింది.

2001: ఫ్రాన్స్‌లోని టోలుజ్‌లో అమ్మోనియం నైట్రేట్ డిపో పేలి 31 మంది చనిపోయారు. 2,500 మంది గాయపడ్డారు.

2013: టెక్సాస్‌లో ఒక ఎరువుల కర్మాగారంలో పేలుడు జరిగి 14 మంది చనిపోయారు.

2015: చైనాలోని టియాంజిన్‌లో అమ్మోనియం నైట్రేట్, ఇతర రసాయనాలు నిల్వ చేసిన ఒక గోదాములో పేలుడు జరిగి 116 మంది ప్రాణాలు కోల్పోయారు.

2020: బీరుట్‌లోని ఒక రేవులో ఆరేళ్లుగా నిల్వ ఉంచిన 3వేల టన్నుల అమ్మోనియం నైట్రేట్‌కు మంటలు అంటుకొని పేలుళ్లు సంభవించాయి. ఇందులో 200మందికిపైగా మృత్యువాత పడ్డారు. 6వేల మంది గాయపడ్డారు.

విద్రోహ చర్యల్లో..

భారత్: పుణెలోని జర్మన్ బేకరీ, దిల్లీ జామా మసీదు బాంబు పేలుళ్లలో అమ్మోనియం నైట్రేట్ వాడినట్లు తేలింది. 2011లో ముంబయిలో జరిగిన బాంబు పేలుళ్లలోనూ ఈ రసాయనాన్ని ఉపయోగించినట్లు వెల్లడైంది.

ప్రపంచవ్యాప్తంగా..

1995: అమెరికాలోని ఓక్లహోమా నగరంలో ఫెడరల్ భవనాన్ని 2 టన్నుల అమ్మోనియం నైట్రేట్‌తో పేల్చారు. ఇందులో 168 మంది బలయ్యారు.

2002: ఇండోనేసియాలోని బాలీ నైట్‌క్లబ్‌లో ఈ రసాయనంతోనే ఉగ్రవాదులు పేలుళ్లకు పాల్పడ్డారు. ఇందులో 200మందికిపైగా మృత్యువాత పడ్డారు.

✦ అఫ్గానిస్థాన్‌లో అమెరికా బలగాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు ఈ రసాయనంతోనే ఐఈడీలను తయారుచేశారు.



- ఈనాడు ప్రత్యేక విభాగం

ప్రశాంతతకు భంగం!

- మళ్లీ పేలుళ్ల కలకలం

దేశంలో కొన్నేళ్లుగా బాంబు పేలుళ్ల ఘటనలకు భద్రతా బలగాలు చాలా వరకు చెక్ పెట్టాయి. జమ్మూ కశ్మీర్ మినహా దేశంలో ఎక్కడా ఇటీవలి కాలంలో పేలుళ్లు చోటుచేసుకోలేదు. అంతా ప్రశాంతంగా ఉందనుకుంటున్న తరుణంలో ఇప్పుడు దిల్లీలో పేలుడు జరగడం కలకలం సృష్టిస్తోంది.

దిల్లీలో గతంలో జరిగిన పేలుళ్ల వివరాలివీ..

9.10.1997: దిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం ఎదురుగా పేలుడు. 50 మందికి గాయాలు.

1.10.1997: సదర్ బజార్‌లో ఊరేగింపు సందర్భంగా రెండు పేలుళ్లు. 30 మందికి గాయాలు.

10.10.1997: శాంతివన్, కౌరియా పూల్, కింగ్స్‌వే క్యాంప్‌వద్ద 3 పేలుళ్లు. ఒకరి మృతి, 16 మందికి గాయాలు.

18.10.1997: రాణి బాగ్ మార్కెట్లో జంట పేలుళ్లు. ఒకరి మృతి, 23 మందికి గాయాలు.

26.10.1997: కరోల్‌బాగ్ మార్కెట్లో జంట పేలుళ్లు. ఒకరి మృతి, 34 మందికి గాయాలు.

30.11.1997: ఎర్రకోట ప్రాంతంలో జంట పేలుళ్లు. ముగ్గురి మృతి, 70 మందికి గాయాలు.

30.12.1997: పంజాబీ బాగ్‌లో బస్సులో పేలుడు. నలుగురు ప్రయాణికుల మృతి, 30 మందికి గాయాలు.

26.8.1998: కశ్మీరీ గేట్‌వద్ద పార్కు చేసిన బస్సులో పేలుడు. ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు.

18.6.2000: ఎర్రకోట ప్రాంతంలో రెండు శక్తిమంతమైన పేలుళ్లు. ఇద్దరి మృతి, 12 మందికి గాయాలు.

22.5.2002: రెండు సినిమా హాళ్లలో పేలుళ్లు. ఒకరి మృతి, 60 మందికి గాయాలు.

29.10.2005: సరోజినీ నగర్, పహాడ్‌గంజ్ మార్కెట్లలో 3 పేలుళ్లు. 59 మంది మృతి. 100 మందికిపైగా గాయాలు. మరణించిన వారిలో విదేశీయులూ.

14.4.2006: జామా మసీదు ప్రాంగణం, పాత దిల్లీలో పేలుళ్లు. 14 మందికి గాయాలు.

27.9.2008: మెహ్రౌలీ పూల మార్కెట్‌లో పేలుడు. ముగ్గురి మృతి, 21 మందికి గాయాలు.

7.9.2011: దిల్లీ హైకోర్టు ప్రవేశ ద్వారంవద్ద సూట్‌కేసు బాంబు పేలుడు. 15 మంది మృతి, 67 మందికి గాయాలు.

- నేషనల్ డెస్క్

ఇరుదేశాల ఆర్థిక సహకారానికి విస్తృత అవకాశాలు

- అంగోలా పర్యటనలో రాష్ట్రపతి ముర్ము

లువాండా: అంతర్జాతీయంగా నెలకొన్న ఘర్షణలు, అస్థిరత్వ పరిస్థితులు అల్పాదాయ దేశాలపై ప్రభావం చూపుతున్నప్పటికీ భారత్, అంగోలా దేశాలు తమ మధ్య బలమైన ఆర్థిక సంబంధాలను ఏర్పరచుకోవడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. అంగోలాలో మూడో రోజు పర్యటనలో భాగంగా ఆమె సోమవారం ఆ దేశ పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆఫ్రికా దేశాల శాంతి, పురోభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు భారత్‌తో చేతులు కలపాలని, భారత్-అంగోలా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పార్లమెంటు సభ్యులకు సూచించారు. దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు వ్యాపార, ఆర్థిక సహకారాలు మూలస్తంభాలని తెలిపారు. ఇంధన రంగంలో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

మృతులకు రాష్ట్రపతి సంతాపం

దిల్లీ పేలుడులో మృతి చెందిన వారికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంగోలా పర్యటనలో ఉన్న ఆమె దిల్లీ పేలుడు ఘటనపై స్పందించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మాదక ద్రవ్యాల పడవలపై అమెరికా దాడి

- ఆరుగురి మృతి

వాషింగ్టన్: తూర్పు పసిఫిక్ సముద్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న మరిన్ని పడవలపై తమ బలగాలు దాడిచేసి ధ్వంసం చేశాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సోమవారం ప్రకటించారు. ఆదివారం జరిగిన ఈ దాడిలో ఆరుగురు మరణించగా రెండు పడవలు ధ్వంసమయ్యాయని ఆయన వెల్లడించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న పడవలపై అమెరికా దళాలు దాడి చేయడం ఇది 19వ సారి.

మళ్లీ అదే చట్టాన్ని ఎలా చేస్తారు?

- కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

దిల్లీ: ట్రైబ్యునల్ సంస్కరణ చట్టంలోని అనేక నిబంధనల్ని తాము కొట్టివేసినా కొద్దిపాటి సవరణలతో అదే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగి పార్లమెంటులో ఎలా ప్రవేశ పెడుతుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. ట్రైబ్యునళ్ల సంస్కరణ (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టం, 2021, రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ మద్రాసు బార్ అసోసియేషన్‌తో పాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2021నాటి ఈ సంస్కరణ చట్టం కొన్ని అప్పిల్లేట్ ట్రైబ్యునళ్లను రద్దు చేసింది. ఇందులో ఫిలిం సర్టిఫికేషన్ అప్పిల్లేట్ ట్రైబ్యునల్‌ను కూడా ఉంది. వివిధ ట్రైబ్యునళ్ల జ్యుడీషియల్, నాన్‌జ్యుడీషియల్ సభ్యుల నియామక నిబంధనల్ని, కాల పరిమితిని సవరించింది. “మేం పక్కన పెట్టిన చట్టాన్ని పార్లమెంటు కేవలం కొన్ని సవరణలతో మళ్లీ ఎలా ప్రవేశపెడుతుంది? ఈ విషయంపై కోర్టు వెలువరించిన తీర్పులో పేర్కొన్న విషయాలను పరిష్కరించకుండా మళ్లీ అదే చట్టాన్ని రూపొందించడానికి వీల్లేదు” అని సీజేఐ స్పష్టంచేశారు. పార్లమెంటు తన అనుభవ ప్రాతిపదికన ఒక చట్టాన్ని రూపొందించకుండా ఎవరూ నిరోధించలేరు అంటూ అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి చేసిన వ్యాఖ్యలపై ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. “పార్లమెంటు చట్టాన్ని రూపొందించకూడదని మేము అనడం లేదు. కోర్టు వెలువరించిన తీర్పులో అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అదే అంశంపై మరో చట్టం రూపొందించరాదన్నదే మా వాదన” అని ధర్మాసనం పేర్కొంది. ఈ చట్టంపై దాఖలైన పిటిషన్లపై విచారణను వాయిదా వేయాల్సిందిగా కేంద్రం చేసిన అభ్యర్థన పట్ల సుప్రీంకోర్టు అంతకు ముందు అసంతృప్తి వ్యక్తం చేసింది.

విశాఖ భాగస్వామ్య సదస్సులో.. 37 ప్లీనరీ సెషన్లు

ఈనాడు-అమరావతి: విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో చర్చించే అంశాలను ప్రభుత్వం నిర్ణయించింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో 37 ప్లీనరీ సెషన్లు.. 5 కంట్రీ సెషన్లు నిర్వహించనుంది. వాటి వివరాలివీ...

ప్లీనరీ సెషన్లు.. అందులో చర్చించే అంశాలు

1. అభివృద్ధి: సాంకేతికత.. విశ్వసనీయత.. వాణిజ్యం ద్వారా నూతన ఆర్థిక క్రమాన్ని నిర్దేశించేలా వ్యాపారాలు, విధాన నిర్ణేతలు ఎదుర్కొనే సవాళ్లు.
2. సాంకేతికత.. ఇన్నోవేషన్: ప్రపంచాన్ని ప్రభావితం చేసేలా ఆలోచనలు. దీనికోసం సమ్మిళిత, స్థిరమైన ఆవిష్కరణలు వేగవంతం చేయడం.
3. వికసిత్ భారత్‌లో ఏపీ భాగస్వామ్యం: 8 శాతం స్థిరమైన అభివృద్ధికి రోడ్ మ్యాప్.
4. ఓపెన్ మైక్ సెషన్: పెట్టుబడిదారుల వృద్ధి, అవకాశం, సామర్థ్యాలపై చర్చ.
5. విజన్ 2047: భారతదేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత పాత్ర.
6. అభివృద్ధికి మార్గం: పెట్టుబడి.. వాణిజ్యం ఆవశ్యకత.
7. రక్షణ రంగ పరికరాల తయారీ, అంతరిక్షం, డ్రోన్ల తయారీలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కోసం వ్యూహాత్మక కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దడం.
8. వికసిత్ భారత్‌లో భాగంగా ప్రెసిషన్ మందులలో ఏఐ, జీనోమిక్స్ ఉపయోగించడం.
9. భాగస్వామ్యంలో విశ్వసనీయత, స్థిరమైన అభివృద్ధి.
10. భారతదేశ తూర్పు ముఖద్వారాన్ని పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం: తీరప్రాంతాన్ని వినియోగించుకుని లాజిస్టిక్స్ ఖర్చు తగ్గించడం.
11. ప్రపంచ మార్పులు అందిపుచ్చుకునేలా ఆవిష్కరణలు: అడ్వాన్స్‌డ్ మెటీరియల్, సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌లో ఉన్న అవకాశాలు వినియోగించుకోవడం.
12. ఇండస్ట్రియల్ కారిడార్ 2.0: ఇండస్ట్రీ సెక్టార్ 5.0కు అనుగుణంగా స్మార్ట్, కనెక్టెడ్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయడం.
13. ప్రపంచ అడ్వాన్స్‌డ్ తయారీ కేంద్రంగా భారత్.
14. ప్రతికూల పరిస్థితులు అధిగమించి అవకాశాలు కల్పించుకోవడం: సాంకేతికత, వినూత్న ఆవిష్కరణల ఆధారంగా ఖర్చును నియంత్రించి ఎంఎస్ఎంఈల అభివృద్ధికి అవకాశం కల్పించడం.
15. దేశంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ కేంద్రంగా ఏపీ.
16. పర్యావరణహితంగా ఆరోగ్య సంరక్షణ, వైద్య పరికరాలు, పారిశ్రామిక ఆవిష్కరణలు (బయోడిజైనింగ్).
17. ద్వితీయస్థాయి నగరాల్లో ఐటీ, జీసీసీల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగించడం.

5 దేశాల్లో వాణిజ్య అవకాశాలపై నిర్వహించే సెషన్లు

1. వ్యూహాత్మక పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యం: భవిష్యత్తులో రష్యా-భారత్ మధ్య సహకారం.
2. భారత్‌లో మౌలిక సదుపాయాలు, సాంకేతికత, స్థిర పారిశ్రామికాభివృద్ధిలో జపాన్ భాగస్వామ్యం.
3. యూఏఈ.. వాణిజ్య అవకాశాలు.
4. సౌదీ అరేబియాలో వాణిజ్య అవకాశాలు.
5. సింగపూర్‌లో వాణిజ్య అవకాశాలు.

18. భిన్న ధ్రువాలున్న ప్రపంచంలో ఆర్థిక ప్రయోజనాలు.
19. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన విధానాలు.
20. భారత వ్యాపార రంగంలో ఉన్న అడ్డంకులు.
21. తీర ప్రాంతాన్ని వినియోగించుకుని బ్లూ ఎకానమీ పెంపొందించుకోవడం.
22. ఏఐ, భవిష్యత్తు ఉపాధి అవకాశాలు.
23. పోటీ రంగంలో ఆర్థిక భద్రతను బలోపేతం చేయడం.
24. గ్లోబల్ ఛాంపియన్లుగా తీర్చిదిద్దడం.
25. ఎన్విరాన్‌మెంటల్ సోషల్ గవర్నెన్స్(ఈఎస్‌జీ) ఫ్రేమ్‌వర్క్ ద్వారా దేశం, ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు.
26. ప్రపంచ పోటీ మార్కెట్ స్థాయికి దేశంలోని పరిశ్రమలను తీర్చిదిద్దడం.
27. ఆలోచనలను పెట్టుబడులుగా మార్చడం.
28. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు.
29. రాష్ట్రంలో ఏర్పాటు చేసే క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా దేశానికి గుర్తింపు.
30. గ్లోబల్‌గా ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను అధిగమించేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడం.
31. వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో ఎన్ఆర్ఐల భాగస్వామ్యం.
32. వ్యవసాయానికి సాంకేతికత అనుసంధానం.
33. స్టార్టప్ కంపెనీలు గ్లోబల్ స్థాయికి ఎదిగేలా చేయడంపై ఫైర్‌సైడ్ చాట్.
34. మహిళల్లో స్వయం సమృద్ధి.. ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు సాంకేతికత వినియోగానికి ఉన్న అవకాశాలు.
35. వ్యవసాయ, ఫుడ్‌ప్రాసెసింగ్ రంగాల్లో ఏపీకి ఉన్న ప్రత్యేకత.
36. వివిధ రంగాల్లో కీలకంగా మారనున్న ఏఐ సాంకేతికతలో మార్పులు అందిపుచ్చుకునేందుకు ప్రపంచ భాగస్వామ్యాలను పెంపొందించడం.
37. సాంకేతికతలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా రీస్కిల్లింగ్ కార్యక్రమాలు నిర్వహించడం.

వైద్యారోగ్య శాఖలో.. అధ్వానంగా 4 విభాగాల పనితీరు

పర్యవేక్షణ లేక పడిపోయిన ప్రమాణాలు

ఈనాడు, అమరావతి: ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా వైద్యారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం పెంచినా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, సమన్వయ లోపంతో కొన్ని శాఖలోని విభాగాల తీరు అధ్వానంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 13 విభాగాల పనితీరును అంచనా వేశారు. వీటిలో డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాల విభాగం పనితీరు ఏ ప్లస్ గ్రేడ్‌తో అద్భుతంగా ఉందని తేలితే.. సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పిల్లల ఆరోగ్యం- ఇమ్యునైజేషన్ పనితీరు ఏ-గ్రేడ్‌తో చాలా బాగుందని తేల్చారు. తల్లి ఆరోగ్యం, ఎన్‌యూహెచ్ఎం, క్వాలిటీ ఎష్యూరెన్స్, ఏబీహెచ్‌ఏ-ఎఫ్ఆర్ఎస్, సంచార చికిత్స సేవలు బి-గ్రేడ్‌తో సంతృప్తికరంగా ఉన్నట్లు గుర్తించారు. పీహెచ్‌సీలు, అసాంక్రమిక వ్యాధులు (ఎన్‌సీడీ), కుటుంబ నియంత్రణ- కౌమార ఆరోగ్యం.. ఆర్‌బీఎస్‌కేలు సి-గ్రేడ్‌లో ఉండడంతో పనితీరు సంతృప్తికరంగా లేదని తేల్చారు. వెనుకబాటులో ఉన్న ఈ నాలుగు విభాగాలను గాడిలో పెట్టేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

ప్రాథమిక వైద్యం గాడిన పడితే..

స్కోరు: 36.14/100

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరు అధ్వానంగా ఉందని తాజా సమీక్షలో తేలింది. సిబ్బంది హాజరు సవ్యంగా లేకపోవడం, ఖాళీలు, సేవల లభ్యత పరిమితంగా ఉండడం, వైద్యసేవలు, ఓపీ వేళలు, ఔషధాల లభ్యతలో సమస్యలు ఉన్నాయి. గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలను సిబ్బంది గుర్తించలేకపోవడం విమర్శలకు తావిచ్చింది.

■ పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రభుత్వం డిజిటల్ హాజరు పద్ధతిని ప్రవేశపెట్టి, వారానికో సారి పీహెచ్‌సీ పనితీరుపై సమీక్షించాలని నిర్ణయించింది. పర్యవేక్షణ మరింత పెంచి, మౌలిక సదుపాయాలు కల్పించి పరిస్థితిని చక్కదిద్దాలని భావిస్తోంది.

కుటుంబ నియంత్రణ..

కౌమారదశ ఆరోగ్యం అంతంతే

స్కోరు: 39.13/100

కుటుంబ నియంత్రణ, కౌమార ఆరోగ్య విభాగాల పనితీరు సంతృప్తికరంగా లేదని తేల్చారు. కు.ని. పద్ధతులు, ప్రసవం తర్వాత కాపర్-టీ వాడకం లాంటి గర్భనిరోధక పద్ధతులపై అవగాహన కల్పించడంలో లోపాలు, పురుషులు వాసెక్టమీలకు మొగ్గుచూపేలా అవగాహన కల్పించలేకపోవడం లాంటి సమస్యలున్నాయి. యువత కోసం ఏర్పాటుచేసిన ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అవగాహన కార్యక్రమాలు సరైన ఫలితాలు ఇవ్వకపోవడం లాంటివి గుర్తించారు.

■ గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత తల్లులకు కుటుంబ నియంత్రణపై సూచనలు ఇవ్వడం, గర్భనిరోధక సాధనాల సరఫరా పర్యవేక్షణ, పాఠశాలల్లో యువతకు అవగాహన పెంచడం అవసరం. వ్యవస్థలో సంస్కరణలు, సిబ్బంది ప్రవర్తనలో మార్పు తెచ్చేలా పునశ్చరణ తరగతులు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ భావిస్తోంది.

ఆర్‌బీఎస్‌కే పనితీరు ఇలా..

స్కోరు: 41.19/100

రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) పనితీరు ఆశాజనకంగా లేదని తేలింది. బాలల ఆరోగ్య పరీక్షల ద్వారా సమస్యలు గుర్తించే చర్యలు లేవు. సంచార బృందాలు, జిల్లాల్లో ప్రాథమిక దశలోనే సమస్య గుర్తించేందుకు నిర్దేశించిన డీఈఐసీల మధ్య సమన్వయలోపం లాంటి సమస్యలున్నాయి. క్షేత్ర సందర్శనలు లేకపోవడం, పీడిత పిల్లల ఆరోగ్యంపై సరైన అనుశీలన లేకపోవడం, సిబ్బంది కొరత, సంచార బృందాలకు వాహనాల కొరత లాంటి ఇబ్బందులూ ఉన్నాయి.

■ సంచార బృందాలు షెడ్యూలు ప్రకారం వెళ్లేలా చూడడం, సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు జరిగేలా చూడడంపై దృష్టిసారించారు.

అసాంక్రమిక రోగాలకు కళ్లెం వేసేనా?

స్కోరు: 48.89/100

అసాంక్రమిక రోగాల (ఎన్‌సీడీ) విభాగం పనితీరు సంతృప్తికరంగా లేదని తేలింది. ప్రభుత్వం విస్తృత స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నా.. గుర్తించిన రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు పెద్దాసుపత్రులకు తరలించడంలో క్షేత్రస్థాయిలో వైఫల్యం కనిపిస్తోంది. పలు జిల్లాల్లో రోగుల ట్రాకింగ్ వ్యవస్థలు బలహీనంగా ఉండడం.. అధిక రక్తపోటు, మధుమేహం రోగుల ఫాలోఅప్ వ్యవస్థలు సవ్యంగా లేకపోవడం లాంటి లోపాలు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల వ్యవహారం ప్రైవేటు వ్యక్తులు చెప్పేవరకు వెలుగులోకి రాకపోవడం వివాదాస్పదం అయ్యింది. తాజా ఎన్‌సీడీ 3.0 సర్వేలో క్షేత్రస్థాయి క్యాన్సర్ కేసుల గుర్తింపు సవ్యంగా సాగకపోవడం ఈ విభాగం పనితీరు స్పష్టంచేస్తోంది.

■ లోపాలు అధిగమించేందుకు ప్రభుత్వం ‘స్క్రీన్ టు స్టార్ట్ ఇన్ సెవెన్ డేస్’ అనే కార్యక్రమం ప్రారంభించింది. గుర్తించిన రోగులకు డిజిటల్ రిజిస్టర్ల ద్వారా నిరంతర వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టింది. సమన్వయం, డిజిటల్ పర్యవేక్షణ, ఫాలోఅప్ వ్యవస్థల బలోపేతంపై దృష్టిసారించింది.

వెలిగొండ పనులకు మొంథా గండి!

- రెండు టన్నెళ్లనూ ముంచెత్తిన వాగుల నీరు
- చురుగ్గా సాగుతున్న నీటి ఎత్తిపోత

ఈనాడు,అమరావతి: మొంథా తుపాను ప్రభావం వెలిగొండ రెండు టన్నెళ్ల పనులపైనా పడింది. ఫీడర్ కాలువకు గండి పడి వాగుల నీరు ఈ కాలువలో ఎగువకు ప్రవహించి రెండు టన్నెళ్లనూ ముంచెత్తింది. ఫలితంగా ఇక్కడ పనులకు అంతరాయం ఏర్పడింది. త్వరగా ఆ నీటిని ఎత్తిపోసి పనులను పునరుద్ధరించాలని జలవనరుల శాఖ ప్రయత్నిస్తోంది. పది రోజులుగా నీటి ఎత్తిపోత సాగుతోంది. దీనికి మరో నాలుగు రోజులు పట్టవచ్చని అంచనా. నిజానికి శ్రీశైలం జలాశయం నుంచి ఈ టన్నెళ్ల మీదుగా నీళ్లు ఫీడర్ కాలువలోకి ప్రవహించాలి. అక్కడి నుంచి నల్లమలసాగర్ జలాశయానికి, ఆనక ఆయకట్టుకు చేరాలి. జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసినా ఇందులో చుక్క నీరు పారించింది లేదు. ఏ పనీ పూర్తి చేయకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. దీంతో జలాశయం నుంచి నీళ్లు పారాల్సింది పోయి మొంథా ధాటికి వాగుల్లో నీరు పోటెత్తి ఫీడర్ కాలువకు గండి పడి ఈ టన్నెళ్లను ముంచెత్తింది. ఈ టన్నెళ్లలోకి దిగువ నుంచి నీళ్లు రాకుండా అవసరమైన అడ్డుకట్ట ఏర్పాటు చేసుకోవాలి. అక్కడ ఏర్పాటు చేసిన అడ్డుకట్ట సామర్థ్యం సరిపోక దానిని దాటుకుంటూ నీళ్లు రెండు టన్నెళ్లను ముంచెత్తాయి. ప్రస్తుతం ఆ టన్నెళ్ల నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు.

ఎక్కడి నుంచి వచ్చింది ఇంత నీరు?

■ వై.చెర్లోపల్లి చెరువు నిండి అలుగు నుంచి నీరు తీగలేరు వాగులో చేరుతుంది.

■ దాంతో పాటు దొంగలవాగు ఫీడర్ కాలువ వై.చెర్లోపల్లి చెరువుకు దిగువన తీగలేరు వాగులో కలుస్తుంది.

■ మొంథా తుపాను వల్ల 3,800 క్యూసెక్కులు దొంగలవాగు ఫీడర్ కాలువ ప్రవాహం, వై.చెర్లోపల్లి చెరువు నిండి అలుగు పారిన నీరు 24 వేల క్యూసెక్కులు తీగలేరు వాగులో చేరాయి.

■ ఈ నీరంతా వెలిగొండ టన్నెళ్ల నుంచి ప్రారంభమయ్యే ఫీడర్ కాలువకు సమాంతరంగా ప్రవహించాయి.

■ తీగలేరు సామర్థ్యానికి మించి ప్రవహించడంతో ఫీడర్ కాలువకు గండిపడింది. ఫలితంగా ఫీడర్ కాలువ 250 మీటర్లు.. 50 వేల క్యూబిక్ మీటర్ల మేర పూడిక ఏర్పడింది. దీంతో ఫీడర్ కాలువలో దిగువకు నీటి ప్రవాహం వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది. నీరు ఎగదన్ని వెలిగొండ టన్నెళ్ల వైపు ప్రవహించింది. రెండు టన్నెల్లోకి ఈ నీరు చేరింది.

టన్నెళ్లలో లైనింగ్, బెంచింగ్ పనులపై ప్రభావం

2026 జులై నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రధానంగా టన్నెళ్లలో లైనింగ్, బెంచింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. మొదటి టన్నెల్‌లో 15 మీటర్ల మేర లైనింగ్ చేయాల్సి ఉంది. రెండో టన్నెల్ లైనింగ్ పనులు పూర్తయ్యాకే ఇవి చేపడతామని పేర్కొంటున్నారు. మొదటి టన్నెల్‌లో రోడ్డు కూడా తొలగించాల్సి ఉంది. రెండో టన్నెల్ లైనింగ్ పని పూర్తయ్యాక ఈ రోడ్డు తొలగిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం రెండో టన్నెల్ లైనింగ్, బెంచింగ్ పనులు కీలకం. రెండో టన్నెల్‌లో 6,940 మీటర్లకు 2,702 మీటర్ల మేర మాత్రమే లైనింగ్ పని పూర్తయింది. ప్రతినెలా లక్ష్యం ప్రకారం పనులు పూర్తి చేయాలని యంత్రాంగం నిర్దేశించింది. అక్టోబరు లక్ష్యం 384 మీటర్లు పూర్తి కాలేదు. ఇంతలో మొంథా తుపానుతో ఆ టన్నెల్‌లో నీళ్లు చేరడంతో అసలు పనికే ఇబ్బంది వచ్చింది.